అన్నమయ్య అన్నమాట

౬౦ అన్నమయ్య గీతాలకు వ్యాఖ్యానం

డా॥ తిరుపల్లిపతంజలి

గురుదేవ స్తుతి

శ్రీమత్త్వదీయ చరితామృత మన్నయార్య
పీత్వాపినైవ సుహితా మనుజాభవేయుః
త్వం వేంకటాచలపతే రివ భక్తిసారం
శ్రీ తాళ్ళపాక గురుదేవ నమో నమస్తే

అన్నమయ్య అన్నమాట

(60 అన్నమయ్య గీతాలకు వ్యాఖ్యానం)

సంకల్పం

మోహన్ధర సీతారామ శర్మ,

రుద్రాంగ్ రమేష్

వ్యాఖ్యానం

డా॥ తాడేపల్లి పతంజలి

ప్రచురణ

సుజనరంజని

శాంత వసంత ట్రస్ట్

Annamayya Annamaata

(Commentry for 60 Sankeerthanas)

By

Dr. Tadepalli Patanjali
Ph: 9866691587
e-mail : patanjali1576@gmail.com

First edition : May 2012
Annamayya 604th Jayanthi

© Author

Copies : 1000

Cover Design : **Bapu**

Printing : **Bharat Printers**
307, Vasavi Meadows,
Czech Colony, Sanathnagar,
Hyderabad - 500 018.
Ph. : 040-23818226, Cell : 984980 8489

Published by : **Shantha Vasantha Trust**
Plot No. 822A, Road No. 40,
Jubilee Hills, Hyderabad - 500 033

‘ పదాలు’ నేర్పిన తొలిదైవం అమ్మ సుశీలమ్మకు

‘ పదాలు’ ఇచ్చిన చక్కెర పలుకులయ్య అన్నమయ్యకు

-తాడేపల్లి పతంజలి

అన్నమయ్య అన్నమాట
ప్రచురణలో సహకరించి ప్రోత్సహించిన

శ్రీ బాపు గారికి

డా॥ పప్పు వేణు గోపాల రావు గారికి

'పద్మభూషణ్' డా॥ కె.ఐ. వరప్రసాద్ రెడ్డి గారికి

డా॥ తాడేపల్లి పతంజలి గారు

శ్రీ ఎమ్బియస్ ప్రసాదు గారికి

శ్రీ కపిలవాయి విజయకుమార్ గారికి

శ్రీ రుద్రంగ్ రమేష్ గారికి

శ్రీ గంధం బసవ శంకరరావు గారికి

శ్రీ పుట్టా కోటేశ్వరరావు, శాంతకుమారి గార్లకు

"సుజనరంజని" హృదయ పూర్వక ధన్యవాదములు

Dr. Pappu Venugopala Rao Phone : 044-24953870
Secretary, The Music Academy, Chennai,
Mamber Sangit Natak Academi, New Delhi,
Member Academic Council, Kalakshetra,
Contributing Editor, Sruti,
Visiting Professor, University of Hyderabad,
Co-ordinator, Nadaneerajanam, SVBC, TTD

పదార్థ దర్పణం

'అన్నమయ్య అన్నమాట', అన్నమయ్య పదాలకు పతంజలి గారు చేసిన ఒక అపురూపమైన రూపకల్పన. ఇందులో దాదాపు అన్ని పదాలు ప్రసిద్ధమైనవే. పదార్థాలు కావు.

అన్నమయ్య సాహిత్యాన్ని కూలంకషం గా పరిశోధించిన ప్రాజ్ఞులలో పతంజలి గారొకరు. అన్నమయ్య వాడిన కొన్ని పదాలు విచిత్రం గా ఉంటాయి. కూగూగు, జాజర, రట్టడి, పామిడి ఇలా ఎన్నో. ఇటువంటి పదాలు కొన్ని ఈనాడు వాడుకలో లేవు. ఇవికాక ఆయన కొన్ని పదాలు కొరుకుడు పడవు.

దిబ్బలు వెట్టుచు, అలరులు కురియగ ఇలాంటి వాటిలో ఎన్నో సాంకేతిక పదాలు. అలరులు కురియగ లో అర తెరమరుగున, పూర్వదువాళపుతిరుపులు అని రెండు పదాలు ఉన్నాయి. పతంజలి గారు పూర్వదువాళపుతిరుపులకు ప్రభాకరశాస్త్రి గారు, రజనీకాంత రావు గారు ఇచ్చిన వివరణలు ఇచ్చేరు.

అర తెరమరుగునకు వారిచ్చిన వివరణం తో నేను ఏకీభవించడం లేదు. దానికి రెండు కారణాలు. ఒకటి చారిత్రికంగా కూచిపూడి, సిద్ధేంద్ర యోగి, అన్నమయ్య తరువాతి వారు. రెండవది అర తెర అంటే సగం కనిపించి సగం కనిపించని తెర అంటే ఆంగ్లం లో Translucent అన్నమాట. పలచని తెర, సగం సగం కనిపించేది.

పతంజలి గారు ఈ అన్నమయ్య పదాలకు విద్వజ్జన శ్లాఘాయమానమైన వివరణలు వ్రాసేరు. అన్నమయ్య పదాలు అందరూ అనుకునే అంత సులభమైనవి కావు. కొన్ని కొన్ని పదాలలో ఆయన ఉపనిషద్ రహస్యాలను పొందు పరుస్తాడు. కొన్నిటిలో జానపదుల నానుడులు, కొన్నిట సరస శృంగార రస సించితమైన భావాలు, కొన్ని చోట్ల ఆర్ద్రమైన భక్తి తత్పరత, కొన్నిట నృత్యకళ కొన్నిట అసిధారా సదృశమైన భౌతిక సత్యాలు ఇలా ఎన్నో. వాటిని అర్థం చేసుకోడానికి ఒక్క సాహిత్యంలో విద్వత్ ఉంటే సరిపోదు.

అన్నమయ్య హృదయాన్ని అర్థం చేసుకునే భక్తి పరిపక్వత కావాలి. అది ఉన్న వాళ్లకి మాత్రమే అన్నమయ్య అవగతం ఔతాడు. కొన్ని పదాలకు తలకొట్టుకున్నా సమాధానాలు దొరకవు. అన్నమయ్యనే ఆశ్రయించాలి.

ఆయన పేరు చూడండి ఎంత గొప్పదో ఆయన అన్న, అమ్మ, అయ్య – కలిపితే అన్నమయ్య! పతంజలి గారు ఎన్నో నిద్రపట్టని రాత్రులు, పని తోచని పగళ్ళు అలా అన్నమయ్యని ఆశ్రయిస్తే లభించినవీ అర్థాలు, ఈ వివరణలు.

ఒకానొక పురాకృత శుభాధిక్యం చేతనే ఈ వరివస్య లభిస్తుంది. పతంజలి గారు ధన్యులు. ఆయన వివరణ అన్నమయ్య పదాలకు దర్పణం, పాదాలకు అర్పణం.

పప్పు వేణుగోపాల రావు

వరప్రసాద్ హృదయలేఖిని నుండి...

ఆత్మీయులకు నమస్కారం.

సంతానం భవితవ్యం, బాగోగుల గురించి అహరహమూ శ్రమించే తండ్రికి దక్కవలసినంత గుర్తింపు దక్కడం లేదన్నది వాస్తవం. తల్లి ప్రథమ పూజనీయురాలైతే, తండ్రి కూడా ఆ గౌరవం పొందడంలో 'అద్వితీయుడే'. నా కీ రోజు ఏ కాస్త విద్య అబ్బినా, పదిమందికి ఉపాధి కల్పించే పరిశ్రమ నెలకొల్పగలిగే శక్తి కలిగినా నాలో ఉన్న మా తండ్రి అంశ కూడా కారణమే!

మా నాన్నగారి తృతీయవర్ధంతి సందర్భంగా మీ అందరికీ శ్రీ రాంభట్ల నృసింహశర్మగారి చేయించిన "తండ్రీ నిన్ను దలంచి..." అనే చిన్న పుస్తకాన్ని అందజేశాం. సేవాదులలో తల్లిని దేవత వలె, ఆజ్ఞాపరిపాలనలో తండ్రిని దైవంగా భావించాలన్న వేదనిర్ణయాన్ని శ్రీ రాంభట్ల అద్భుతంగా ఆవిష్కరించారు. ఒక యువకుడు గృహస్థుగా, తండ్రిగా ఎలా పరివర్తన చెందుతాడో, పుత్రుల ప్రేమ చూరగొనాలంటే అతను ఏం చేయాలో, ఆ వాత్సల్యానికి అర్హత సంపాదించుకోవాలంటే కుమారుడు ఏం చేయాలో పలు గ్రంథాలనుండి, వ్యాఖ్యానసహితంగా నిరూపించారు.

నాలుగు సంవత్సరాల అనంతరం పురాణేతిహాసాలలో, ప్రబంధకావ్యాలలో ప్రస్తావన కొచ్చే తండ్రి ప్రశస్తి గురించి మరిన్ని విశేషాలతో మరొక పుస్తకాన్ని వ్రాయించాలన్న తలంపు కలిగి పంచసహస్రావధాని డా॥ మేడసాని మోహన్ గారిని కోరడం జరిగింది. నా కోరికను మన్నించిన డా॥ మోహన్ గారు తండ్రి ప్రస్తావన వున్న పురాణాలను, ఇతిహాసాలను, కావ్యాలను పరామర్శించి సరళమైన వ్యాఖ్యతో 'తండ్రి పరమపూజ్యుడు...' అనే పుస్తకాన్ని వ్రాశారు. అది మీకంద చేసాను.

భగవద్గీత సంస్కృతంలో వుండడం చేత దానిలోని జ్ఞానబోధ సామాన్యజనులకు అందుబాటులో వుండదన్న ఉద్దేశంతో అన్నమయ్య గీతాసారాన్ని చక్కటి తెలుగు గేయాలుగా మార్చి కీర్తనల రూపంలో వ్యాప్తి చేశారు. ఆ విషయాన్ని సోదాహరణంగా నిరూపిస్తూ డా॥ తాడేపల్లి పతంజలి గారు వ్రాసిన "అన్నమయ్య గీతోపదేశం" అనే పుస్తకాన్ని మా నాన్నగారు అవలంబించిన జీవనసరళికి దగ్గరగా వుందనే కారణంగా క్రితం సంవత్సరం అందించాం.

ఈ సంవత్సరం అందిస్తున్న యీ పుస్తకం కూడా అన్నమయ్య కీర్తనలకు సంబంధించినదే. నిజానికి మనలో చాలామందికి అన్నమయ్య భావసంపద, కవితాపటిమ పూర్తిగా అర్థం కావడం లేదనే చెప్పాలి. పల్లవిని బట్టి భావాన్ని రేఖామాత్రంగా గ్రహించి,

తక్కినది వూహించి, పైపైన స్పృశించి, అన్నమయ్య భావుకుడనో, శృంగారకవియనో, సామాజిక స్పృహ వున్న భక్తకవి అనో తీర్మానాలు చేసేస్తూ వుంటాం.

ఎందుకంటే పూర్తి భావాన్ని గ్రహించాలంటే వాటిలోని ప్రతి పదానికి అర్థాలు తెలియాలి. ఉపయోగించిన ఉపమానాల ఔచిత్యం బోధపరచుకోవాలంటే ఆనాటి సామెతల గురించి, సామాజికపరమైన అలవాట్ల గురించి, జీవనవిధానం గురించి, పలుకుబళ్ల గురించి, పురాణాల గురించి తెలుసుకోవాలి. వేయేల, మనను మనం ఆనాటి కాలానికి రవాణా చేసుకోవాలి. అప్పుడే మనం ఆ గేయాలను పూర్తి స్థాయిలో అవగతం చేసుకుని ఆస్వాదించగలం.

అయితే అలా చేసుకోవాలంటే మనకున్న ప్రధాన అవరోధం – భాష ! ఏ భాషైనా నిత్యం మార్పుకు లోనవుతూనే వుంటుంది. వందేళ్లనాటి కథలోని పదాలే అర్థంకాక మనను యిబ్బంది పెడతాయి. 600 ఏళ్ల క్రితం నాటి పదాలు యింకెంత బాధిస్తాయో ఊహించవచ్చు. "ఆకటి వేళల నలపైన వేళలను" ప్రసిద్ధ కీర్తనలో పల్లవిలోని 'తేకువ', చరణాలలోని 'తెరగు', 'అంకిలి' పదాలు అందరికీ అర్థమవుతాయా?

'అలరులు కురియగ' అనే సంకీర్తనలో అలమేలుమంగను వర్ణిస్తూ 'అరతెర మరుగున నాడెనదే' అంటూ కూచిపూడి నాట్యసంప్రదాయంలో జడపూజను, 'పూర్వదువాళపు తిరుపుల' అనే విశేషణంతో భరతనాట్యపు నర్తకి ఎగిరే పద్ధతిని సూచించాడని మనలో ఎందరికి తెలుస్తుంది?

వీసము, మణుగు, వంటివి ఆనాటి కొలతలని తెలుస్తాయా?

వ్యవసాయానికి సంబంధించిన 'పొల్లకట్టు దంచడం' వంటి ఉపమానాల ఔచిత్యం అర్థమవుతుందా?

"ఇందరికి నభయంబు లిచ్చుజేయి" కీర్తనలో 'భూదానమొసగు చేయి' అని పరశురామావతారం గురించి, 'పురసతుల మానములు పొల్లసేసిన చేయి' అని బుద్ధావతారం గురించి చెప్పాడన్న సంగతి పురాణాలు క్షుణ్ణంగా పఠించనిదే తెలుస్తుందా? ఎంతో ప్రాచుర్యం చెందిన "ఇన్ని రాశుల యునికి" అనే కీర్తనలో కనుబొమలు–ధనురాశి, నడుము–సింహరాశి కుచములు–కుంభములు, కనులు–మీనరాశి వంటివి సంస్కృతకవుల వర్ణనలు కాస్త తెలిసినా అర్థమవుతాయి. చిగురుమోవికి మేషరాశికి సంబంధ మేమిటో తెలియాలంటే జ్యోతిషశాస్త్రం తెలియాల్సిందే. మేషవాహనుడు అగ్ని కాబట్టి పెదాల ఎరుపును అగ్నితో పోల్చాడు అన్నమయ్య. ఎండ్రకాయ గుట్టుగా వుంటుంది కాబట్టి,

గుట్టుగా మాట్లాడడానికి కర్ణాటకరాశికి సంబంధం కలిపాడు అన్నమయ్య. అలాగే వృషభానికి సంబంధించిన సంగీతస్వరం రిషభం కాబట్టి రిషభాన్ని అందంగా పలికే అమ్మవారిలో వృషభరాశి వుందన్నాడని తెలియాలంటే మనకు జ్యోతిషంతో బాటు సంగీత శాస్త్రమూ తెలియాలి.

"ఏమొకొ చిగురుటధరమున", "ఒకపరికొకపరి కొయ్యారమై" వంటి కీర్తనల్లో ప్రస్తావించిన కస్తూరి, ముత్యపు జల్లులు, కర్పూరధూళి, తట్టుపుణుగు, మోహమదము గురించి తెలియాలంటే ఆనాటి సౌందర్యసాధనాల గురించి జ్ఞానం వుండాలి.

ఇలా అనేక శాస్త్రాలను, పురాణాలను, చారిత్రక విషయాలను మథించి, ఆ నాటి సంగతులను పరిశోధించి 60 కీర్తనలపై "అన్నమయ్య అన్నమాట" పేర డా॥ తాడేపల్లి పతంజలిగారు ''సాక్షి'' ఆదివారం అనుబంధంలో ధారావాహికంగా వెలువరించారు. ఈ వ్యవసాయం వలన అన్నమయ్య గేయాలను యితోధికంగా ఆస్వాదించే వీలు కలిగింది పాఠకులకు ! వాటిని సుజనరంజని వారి సహకారంతో మా "శాంతా–వసంతా ట్రస్టు" యీనాడు పుస్తకరూపంలో వెలువరిస్తోంది.

ఈ విధంగా అన్నమయ్యను ప్రజలకు మరింత చేరువ చేయగలుగుతామని మా నమ్మకం. అన్నమయ్య వేలాది కీర్తనలలో కేవలం 60 కీర్తనలు మాత్రమే యీ పుస్తకంలో పాఠకులకు అందుతున్నాయి. మీరు మెచ్చి, రసాస్వాదనకై అర్థం తెలుసుకోగోరిన కీర్తనలు యీ పుస్తకంలో చోటు చేసుకుని వుండకపోతే వాటి వివరాలు మాకు తెలిపితే, డా॥ పతంజలిగారికి తెలిపి యిటువంటి యింకొక పుస్తకం వ్రాయమని అభ్యర్థిస్తాం.

తరతరాల మన సమాజం పాటించిన నైతిక విలువలు ఈ పుస్తకాల ప్రక్రియద్వారా జనసామాన్యం లోకి మరింత గాఢంగా చొచ్చుకుపోయి, మన జీవనవిధానంలో, ఆధ్యాత్మికసరళిలో కొంతైనా మార్పు వస్తుందని ఆశిస్తున్నాము. మనందరికి తండ్రి పట్ల ఆరాధనా, ఆత్మీయతాభావం కలుగుతాయన్న ఆశయం ఇటువంటి ప్రయత్నాల వలన నెరవేరుతుందని నా నమ్మకం. తలిదండ్రులను వృద్ధాశ్రమానికి తరలించబోయే ఏ వ్యక్తి యైనా యీ పుస్తకాలను చదివి తన నిర్ణయాన్ని మార్చుకుంటే మా కంటె ధన్యులు వేరెవరూ వుండరన్న భావంతోనే వాటిని వ్రాయించడం జరిగింది.

ఈ ప్రయత్నంలో పాలుపంచుకున్న శ్రీయుతులు డా॥ పతంజలి, 'సుజనరంజని' సీతారామశర్మ, ముఖచిత్రకారుడు శ్రీ బాపు గార్లకు ధన్యవాదాలు, శుభాకాంక్షలు.

వరప్రసాద్..

మే 26, 2012

శాంతా – వసంతా ట్రస్టు
హైదరాబాదు

స్మరామి

నా పుస్తకాలు ప్రచురించిన

డా. జియస్వీ ప్రసాద్ (నాటి భారతంలో నేటిసమాజం)

శ్రీ ఆకాశం అప్పల నరసింహమూర్తి (మామాకలాపం)

రామకృష్ణ మఠ్ హైదరాబాద్ (శ్రీమన్నారాయణీయం)

శ్రీ బి. విఠల్‌రెడ్డి (భావనలు)

టాగూర్ పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్ (శ్రీభవిష్య పురాణం)

సుజన రంజని (అన్నమయ్య గీతోపదేశాలు)

-డా॥ తాడేపల్లి పతంజలి

అనుస్మరామి

కనిపించే ప్రత్యక్ష దైవాలు నా తల్లిదండ్రులు తాడేపల్లి పార్వతీశ శాస్త్రి, సుశీలలకు అక్షర సాష్టాంగ ప్రణామములు.

ఇప్పటికీ ఆశ్చరంగానే ఉంది. నేనేమిటి?

అన్నమయ్య గీతాలకు వ్యాఖ్యానం చెప్పే సాహసం చేయటమేమిటి? అని.

సహృదయులైన పూజ్యులు మా మామయ్య గారు శ్రీ పిల్లలమర్రి సత్యసాగర్, రాజేశ్వరీ దంపతుల ఉత్తమ సంస్కారాన్ని పుట్టుకతో పొందిన మా బావమరుదులు రమణమూర్తి, సాయిరాం అన్నమయ్య గీతాలలోని పదాలకు అర్థాలు అడుగుతుండే వారు. నిఘంటువులు, పెద్దల సాయంతో అర్థ వివరణ చేస్తుండేవాడిని. అలా అన్నమయ్య తనవైపు నన్ను లాక్కొన్నాడు.

ఇలా ప్రారంభమైన అన్నమాచార్య వేంకటేశుని అనుగ్రహం 100 అన్నమయ్య గీతాలకు యూజీసీ వారి యంఆర్పీ చేయించింది. సాక్షి - ఫన్‌డేలో అన్నమయ్య గీతాలకు షష్టిపూర్తి చేయించింది.

గీతాలలో అక్కడక్కడ నేను అడిగిన సందేహాలు తీర్చిన పెద్దలు డా॥ సముద్రాల లక్ష్మణయ్య, ఆచార్య రవ్వా శ్రీహరి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, ఆచార్య పుల్లెల రామచంద్రుడు, డా॥ వారణాసి వేంకటేశ్వర్లు-వీరందరికీ కృతజ్ఞతలు.

60 వారాలు తమ పత్రికలో అన్నమయ్య అన్నమాటను ప్రచురించి, అనేకమంది అభిమానాన్ని నాకు ప్రసాదించిన సాక్షి యాజమాన్యానికి, ఫన్‌డే సంపాదకులు రామ్‌గారికి, ఫన్‌డే సంపాదక బాధ్యులు పూడూరి రాజిరెడ్డిగారికి ధన్యవాదములు.

ఇది వరలో **సుజనరంజని** సంస్థ నా అన్నమయ్య గీతోపదేశాలు ప్రచురించింది. ఇప్పుడు అన్నమయ్య అన్నమాట ప్రచురణ బాధ్యతను స్వీకరించి నన్ను ఋణగ్రస్తునిగా చేసింది.

పద్మభూషణ్ డా॥ వరప్రసాద్ రెడ్డి గారు ఈ పుస్తక ప్రచురణకు ఇచ్చిన ఆర్థిక, హార్థిక సౌజన్యానికి కృతజ్ఞతలు. 'వరప్రసాద్ లేఖిని' నుండి వారు వెలువరించిన అభిప్రాయ పారిజాత మంజరిలోని పద సౌగంధ్యం మనస్సును ఏనాడు వీడనిది.

'పుంభావ సరస్వతి' డా॥ పప్పు వేణు గోపాలరావు గారు సంతరించిన 'పదార్థ దర్పణం' **అన్నమయ్య అన్నమాట** పుస్తకానికి గోపురం.

నిగమాంత పీఠికను సంతరించిన ముద్రణా భాద్యత తీసుకున్న శ్రీ మహీధర సీతారామ శర్మగారు నిజమైన భాగవతులు. సుజనరంజని కార్యదర్శిగా అన్నమయ్యకు సంబంధించిన సంగీత, సాహిత్య ప్రచారం నిస్స్వార్థంగా చేస్తున్నారు.

విలువైన పీఠికలను వ్రాసిన పెద్దలందరికి ఎద పరిచిన ఏటికోళ్లు.

అన్నమయ్య పదగంధాన్ని తన ఇంటి పేరుగా మార్చుకొన్న మా గంధం శంకరరావు గారికి, శ్రీ కోటేశ్వరరావు దంపతులకు, శ్రీ రుద్రంగ్ రమేష్, శ్రీ భాస్కరరావు గార్లకు ధన్యవాదములు.

బాపు గారు అన్నమయ్య అన్నమాటకి వేసిన ముఖ చిత్రం మొట్టమొదటి సారి చూసినప్పుడు అయిదు నిమిషాలు మాట రాలేదు. తెలియని అలౌకికానందం కలిగింది.

'వేంకటేశుడన్నమయ్యగ వేషమూని
ముదుగారే యశోద చిన్ముద్ర చూపి
భావయామి యనుచు గీతి పాడుచుండ
పరవశించు చుండెను బాపు బాలకృష్ణ'

లక్షలాది మంది పరవశించే వెన్నెలమ్మ చల్లదనాన్ని, బాపు గారి చిత్రప్రతిభని నేను ఈ రోజు ప్రత్యేకంగా అభినందించక్కరలేదు కాని, మనస్సు ఊరుకోక ఆ కళాసరస్వతి పాదాలను కళ్లకద్దుకొంటున్నాను.

నా రచనా వ్యాసంగానికి సహకరిస్తూ, అన్నమయ్య సాహిత్య సేవ పరోక్షంగా చేస్తున్న నాహృదయ ప్రపూర్ణ మీనాక్షికి, చిరంజీవినులు దీప్తి, కావ్యలకు హృదయపూర్వక అభినందనలు.

ఫోన్లద్వారా, మెయిళ్లద్వారా, ఉత్తరాల ద్వారా నన్ను అభిమానించి, ఆశీర్వదించిన పాఠకులందరికీ ధన్యవాదాలు.

నాహం కర్తా-హరిః కర్తా

-డా॥ తాడేపల్లి పతంజలి

నిగమనిగమాంత

తొలి తెలుగు వాగ్గేయకారుడు, పద్యకాలంలోనే సామాన్యునికి అర్థమవ్వాలనే సదుద్దేశ్యంతో పదకవితను ఆసరాగా చేసుకొని వేద వేదాంత ఉపనిషత్ సారాన్ని తన పదాల ద్వారా, సంకీర్తనలద్వారా మన తెలుగు జాతికి అందించిన 'పదకవితా పితామహుడు' సంకీర్తనాచార్యుడు మన తాళ్ళపాక అన్నమాచార్యులవారు.

ఒక వేంకటేశ ముద్రతో 32000 సంకీర్తనలు ఏ కవీ సమర్పించిన దాఖలాలు మరే సాహితీ చరిత్రలోను మనకు కనబడవు. అన్నమయ్య సంకీర్తనలు గమనిస్తే, ఆయన సామాన్యుల పక్షపాతి అని, ఒక సాహితీ విప్లవకారుడని మనకు అనిపిస్తుంది. ఎందుకంటే నిగూఢమైన విషయజ్ఞానాన్ని సామాన్యులకి అర్థమయ్యేలా వివరించి వారిని జ్ఞాన మార్గంలో నడిపించి, మోక్షమార్గాన్ని అవలంబించేలాచేయటం అన్నమయ్య లక్ష్యంలా అనిపిస్తుంది. అందుకేనేమో అన్నమయ్య ఆనాడు సామాన్యుడు ఆదరించే, ఆనందించే జాజరలు, చందమామలు, కోవెలలు, చిలుకలు, తుమ్మెద పదములు, లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాల, జోల, శోభన, మంగళ, వైభోగములు, మేలుకొలుపులు, నలుగులు, దంపుళ్లు, కొట్నాలు, కూగూగులు, ఆరతులు, మంగళారతులు, అల్లో నేరేళ్లు, చాంగుభళాలు, తందనానలు–ఇలా ఎన్నో రీతుల్లో తన రచనలు చేసాడు.

ఇంతటి అద్భుతమైన కవితాసంపదని మన తెలుగువారికి అందించిన అన్నమయ్యని మనం సరిగా అర్థం చేసుకోలేదనే చెప్పాలి. ఆనాడు 600 సంవత్సరాల క్రితం ఆయన వాడిన భాష ఇప్పుడు వాడుకలో లేదు. అంతేకాక ఆయనకు శిష్యపరంపర లేకపోవటం వల్ల, ఆయన వ్రాసిన సంకీర్తనలన్నీ చాలాకాలం పాటు భాండాగారంలో నిక్షిప్తమై పోవటం వల్ల ఆ సంకీర్తనలకి రావలసిన ప్రచారం రాలేదేమో అనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితికి మనమూ, మన పరిపాలకులూ కూడా కారణమనే చెప్పుకోవాలి. మన పాఠ్యపుస్తకాలు, ఉపవాచకాలు అన్నీ పాశ్చాత్య ప్రభావాన్ని, ప్రాభవాన్ని ఎలుగెత్తి చాటేవేకాని, ఒక అన్నమయ్య గురించి, రామదాసుగురించి, త్యాగరాజ స్వామి గురించి, భగవద్గీత గురించి కూలంకషంగా అర్థమయ్యే ఒక్క పాఠ్యాంశం కూడాలేదు. ఏదో మొహమాటానికి నాలుగు భర్తృహరి శ్లోకాలు, సుమతి/వేమన శతక పద్యాలు ఒక పాఠ్యాంశంగా చేర్చి చేతులు దులుపుకోవటం–అంతే.

ఇలాంటి పరిస్థితి తెలుగు సాహితీ ప్రేమికులపై బాధ్యత పెంచింది. అలాంటి బాధ్యతను తనపై వేసుకొని అన్నమయ్య వ్రాసిన అనేక సంకీర్తనల్లో, అందరికి తెలిసిన ఆణి ముత్యాల్లాంటి 60 సంకీర్తనలు ఎంచుకొని వాటికి తన సుమధుర, విపుల, విస్తృత వ్యాఖ్యానంతో ఆయా సంకీర్తనలను మన మనసులకు హత్తుకొనే విధంగా మనకు 'అన్నమయ్య అన్నమాట' అనే శీర్షిక ద్వారా మన తెలుగు వారికి ఒక అద్భుతమైన జ్ఞాపికగా,

బహుమతిగా అందించారు మిత్రులు డా. తాడేపల్లి పతంజలిగారు. పతంజలిగారి వ్యాఖ్యానం చదువుతున్నప్పుడు, అన్నమయ్య తన సంకీర్తనలలో ఇంతటి విషయాన్ని పొందుపరిచాడా అని ఆశ్చర్యం కలుగక మానదు. ఇటువంటి అనుభూతిని కలిగించిన పతంజలిగారు ధన్యులు. అలాగే ఆయా కీర్తనల వివరణలలో సందర్భోచితంగా అనేక పురాణ విశేషాలను, పౌరాణిక గాథలను ఉటంకించి ఎంతోవిజ్ఞాన దాయకంగా informative గా తమ వ్యాఖ్యానాన్ని అందించారు. పురాణేతిహాసాలపై పతంజలిగారికున్న అవగాహన ఈ కథలద్వారా మనకు అవగతమవుతుంది.

కేవలం ప్రతిపదార్థం, తాత్పర్యంకే పరిమితం కాకుండా, అవసరమైన ప్రతిచోటా, అనేకమైన మనకు తెలియని ఎన్నో సంగతులు చెప్పారు పతంజలిగారు. ఉదా:

రకరకాల కస్తూరి గురించి	–	***'ఏమొకో చిగురుటధరమున'***
రకరకాలశరణాగత పద్ధతులు మరియూ మనస్థితుల గురించి	–	***'అంతర్యామి అలసితి'***
రకరకాల వైరాగ్యాల గురించి	–	***'నిగమనిగమాంత'***
వివిధరకాల వస్త్రాలగురించి	–	***'వాడల వాడలవెంట'***

సంకీర్తన వివరించేటప్పుడు అవసరానికి తగ్గట్టుగా అన్నమయ్య ప్రస్తావించిన పురాణ పురుషుల చరిత్రని తనకున్న పరిధిలో, సంక్షిప్తంగా పొందుపరిచి ఆ సంకీర్తన పాఠకుని మనస్సులో చెరగని ముద్రలా ఉండేలా చేసారు పతంజలిగారు. అలాగే ఉపనిషత్తుల ప్రస్తావన కూడా కలగలిపి ఎంతో విజ్ఞానదాయకంగా తన వ్యాఖ్యని తీర్చి దిద్దారు పతంజలిగారు.

చక్కటి అర్థాలు, వివిధ పదాల విశ్లేషణతో పాటు అన్నమయ్య కవి హృదయాన్ని , కవితానాడిని, వేడిని అద్భుతమైన అవగాహనతో ఆవాహన చేసుకొని వ్యాఖ్య చేయటంవల్ల, అన్నమయ్యే పతంజలి రూపంలో వచ్చి 'అయ్యలారా!అమ్మలారా! నా ఈ సంకీర్తనకి భావం ఇది. మీరు అర్థం చేసుకోండి' అని చెప్పినట్లుగా ఉంది.

ఈ 'అన్నమయ్య అన్నమాట' శీర్షికని 60 వారాల పాటు ప్రచురించిన 'సాక్షి' దినపత్రిక యాజమాన్యానికి యావత్ తెలుగుజాతి ఋణపడి ఉంటుంది.

'అన్నమయ్య అన్నమాట' డా॥ పతంజలిగారు మన తెలుగు వారందరికీ సమర్పించిన ఒక వెలుగు దివిటీ. ఈ దివిటీ సహాయంతో మరిన్ని అన్నమయ్య సంకీర్తనలు చదువుతూ, చదివిస్తూ, వింటూ, వినిపిస్తూ, చర్చిస్తూ ఆ అనుభూతులను నెమరు వేసుకొంటూ ఆనందిద్దాం.

వారం వారం ప్రచురితమైన ఈ సంకీర్తనలని పుస్తక రూపంలో వెలువరించటానికి గత సంవత్సరం నాకు, మిత్రులు రుద్రంగ్ రమేష్ గారికి సంకల్పం కలిగింది. ముందుగా ఈ ప్రచురణ కార్యక్రమం రమేష్ గారు చేపట్టినా, నా విన్నపం మేరకు **'సుజనరంజని'** ద్వారా ప్రచురించే అవకాశాన్ని ఇచ్చినందుకు శ్రీ రుద్రంగ్ రమేష్‌గారికి హృదయ పూర్వక ధన్యవాదములు.

ఈ పుస్తక ప్రచురణ విషయం తెలిపి, ముందుమాట వ్రాయమని కోరిన వెంటనే అంగీకరించి, తన "పదార్థ దర్పణాన్ని" అందించిన మా శ్రేయోభిలాషి, హితులు, డా॥ పప్పు వేణుగోపాలరావు గారికి పాదాభివందనాలు.

"అన్నమయ్య అన్నమాట" కి ముఖచిత్రం శ్రీ బాపు గారు గీస్తేనే దానికి సరియైన న్యాయం జరుగుతుంది, ఇంత చక్కటి పుస్తకానికి చక్కటి అలంకరణ చేకూరుతుందని, ఆ మహా చిత్రకారుణ్ని అడిగిన వెంటనే, అంగీకరించి ముఖచిత్రం వేసిచ్చిన శ్రీ బాపు గారికి హృదయపూర్వక సాష్టాంగ ప్రణామములు.

పైవన్నీ సమకూర్చుకోటానికి గల చిత్తము ఉన్నా, ఈ ప్రయత్నము కార్యరూపము దాల్చి, పుస్తక రూపంలో రావాలంటే విత్తం కావాలి. విషయం తెలిపిన వెంటనే, వారి తండ్రిగారి సంస్మరణార్థం పుస్తకం నేనే ముద్రించి ఇస్తానని ధైర్యం చెప్పి, ఎప్పటిలానే తమ వంతు ప్రోత్సాహం, సహాయం, అందించిన డా॥ వరప్రసాద్ రెడ్డి గారికి హృదయపూర్వక ధన్యవాదములు మరియు పాదాభివందనాలు.

నాకు జన్మనిచ్చి సంస్కారవంతునిగా చేసిన నా తల్లిదండ్రులకు నమస్కారములు. నాకు ఎప్పుడూ సహకారాన్నందించే నా సతీమణి సువర్చలకు, నా కుమార్తె చి॥ సాయి సింధు కి ఆశీర్వాదములు.

తమ సమయం మాకు కేటాయించి డి.టి.పి. కార్యక్రమాన్ని నిర్వర్తించిన శ్రీమతి పుట్టా శాంత కుమారి మరియు ముద్రణ ఏర్పాట్లు చూసుకున్న శ్రీ పుట్టా కోటేశ్వరరావుకి నా హృదయపూర్వక ఆశీర్వాదములు.

డా॥ పతంజలిగారు ఎంతో ప్రతిభాశాలి. సాహిత్యంపై మంచి అవగాహన ఉన్న వ్యక్తి. అయినా ఆయన నిగర్వి. నిరాడంబరాడంబరుడు. ఆయన ఇటువంటి పుస్తకాలు ముస్ముందు ఇంకా వ్రాయాలని, మరింత కీర్తి ప్రతిష్ఠలు సంపాదించాలని వారికి అవసరమైన శక్తిసామర్థ్యాలు ఎల్లప్పుడు ప్రసాదించాల్సిందిగా భగవంతుని ప్రార్థిస్తూ, నా ఆలోచనని పంచుకోవటానికి అవకాశం కల్పించినందుకు ధన్యవాదములు సమర్పిస్తూ

సెలవు

మహీధర సీతారామశర్మ

కార్యదర్శి

సుజనరంజని

వరుసగా ....

1.	అలరులు కురియగ	–	1
2.	అదివో అల్లదివో	–	4
3.	అన్నిమంత్రములు	–	7
4.	అప్పులేని సంసారమైన	–	10
5.	అంతర్యామీ అలసితి	–	13
6.	ఆకటివేళల	–	16
7.	ఇంతే మరేమి లేదు	–	19
8.	ఇందరికి నభయంబులిచ్చు	–	22
9.	ఇట్టి ముద్దులాడి	–	24
10.	ఇన్ని రాశుల యునికి	–	27
11.	ఇప్పుడిటు కలగంటి	–	30
12.	ఎక్కడి మానుష జన్మంబెత్తిన	–	33
13.	ఎవ్వరెవ్వరివాడో	–	36
14.	ఏమని పొగడుదుమే	–	39
15.	ఏమొకొ చిగురుటధరమున	–	42
16.	ఒకపరికొకపరికొయ్యారమై	–	45
17.	కంటి శుక్రవారము	–	48
18.	కట్టెదుర వైకుంఠము	–	51
19.	కొండలలో నెలకొన్న	–	54

20. కొండవేలనెత్తినట్టి – 57
21. కులుకక నడవరో – 60
22. కొలని దోపరికి – 63
23. గురుతెరిగిన దొంగ – 66
24. గోవిందాశ్రిత – 69
25. చిన్ని శిశువూ – 72
26. చూడరమ్మ సతులాల – 75
27. చేరి యశోదకు – 78
28. డోలాయాంచల – 81
29. జగడపుజనవుల జాజర – 84
30. జయజయరామ – 87
31. తిరువీథుల మెరసీ – 90
32. తిరుమలగిరిరాయ – 93
33. దాచుకో నీపాదాలకు – 96
34. దిబ్బలు వెట్టుచు దేలినదిదివో – 99
35. నాటికినాడే నా చదువు – 102
36. నానాటి బదుకు నాటకము – 105
37. నారాయణ తే నమోనమో – 108
38. నిగమ నిగమాంత వర్ణిత – 111
39. నిత్య పూజలివివో – 114
40. పలుకుదేనెల తల్లి – 117
41. పిడికిటి తలబాల – 120

42. పుడమినిందరి బట్టె – 123
43. పెరిగినాడు చూడరో – 126
44. పొడగంటిమయ్య – 130
45. ఫాల నేత్రానల – 133
46. బ్రహ్మగడిగిన పాదము – 136
47. భావయామి గోపాల బాలం – 139
48. ముద్దుగారే యశోద – 142
49. మూసిన ముత్యాలకేలే – 146
50. రాముడు లోకాభిరాముడు – 149
51. రావే కోడల రట్టడికోడల – 152
52. వాడల వాడల వెంట – 155
53. వినరో భాగ్యము – 158
54. విన్నపాలు వినవలె – 161
55. వేడుకొందామా – 164
56. శరణు శరణు సురేంద్ర – 167
57. శిరుత నవ్వుల వాడు – 170
58. సకలం హే సఖి జానామి – 173
59. సత్యభామ సరసపు నగవు – 176
60. క్షీరాబ్ధి కన్యకకు – 179
ఆప్తవాక్యం – 182

1. అలరులు కురియగ..

అలరులు కురియగ నాడెనదె
అలకల కులుకులనలమేల్‌మంగ

అరవిరి సొబగుల నతివలు మెచ్చగ
అరతెర మరుగున నాడెనదే
వరుసగ పూర్వదువాళపు తిరుపుల
హరి కరగింపుచునలమేల్‌మంగ

మట్టపు మలపుల మట్టెల కెలపుల
తట్టెడి నడపుల దాటెనదే
పెట్టిన వజ్రపు పెండెపు తళుకులు
అట్టిటు జిమ్ముచునలమేల్‌మంగ

చిందుల పాటల శిరిపొలయాటల
అందెల మోతలనాడెనదే
కందువ తిరు వేంకటపతి మెచ్చగ
అందపు తిరువులనలమేల్‌మంగ

ముఖ్య పదార్థం :

అలకలు	=	నుదుటి మీద ఆడే ఉంగరాల వెంట్రుకలు
అలరులు	=	పువ్వులు
అరవిరి సొబగుల	=	సగము వికసించిన పూల అలంకారాలు
అరతెర	=	సగం తెర
తిరుపు	=	తిరుగుట
మట్టపు మలపులు	=	లయతో అవయవాలను అటు ఇటు కదుపుట
కెలపులు	=	చప్పుళ్ళు
తట్టెడి నడపులు	=	శబ్దముతో అడుగు పెట్టుటలు
పెండెపు తళుకులు	=	బిరుదులుగా పాదాలలో ధరించిన అందెల కాంతులు
చిందుల పాటలు	=	లయ ప్రధానంగా కలిగిన పాటలు
శిరిపొలయాటలు	=	లక్ష్మీదేవి ప్రేమ తగాదాలతో ఉన్న నాట్యాలు
కందువ	=	ప్రేమ (భావార్థం)

భావం :

అలమేలుమంగ నాట్యానికి మన హృదయాలను వేదికగా అన్నమయ్య ఈ కీర్తనలో చేస్తున్నాడు. పూలు కురుస్తుండగా, నుదుటిపై ఉంగరాల వెంట్రుకలు అందంగా కదులుతుండగా – సగము వికసించిన పూల అలంకారాల వంటి తన అందాలను – స్నేహితురాళ్ళు మెచ్చుకొంటుంటే, పూర్వదువాళపు తిరుపులతో వేంకటేశ్వరుని ఆనందంతో కరిగిస్తూ, సమానంగా అవయవాలను ఇటూ అటూ కదుపుతూ అలమేలుమంగ నాట్యం చేస్తోంది. కాళ్ళకు పెట్టుకున్న మట్టెలు సుతారంగా చప్పుళ్ళు చేస్తున్నాయి. వజ్రాల అందెల గండపెండేరాల కాంతులు – ఆమె అటూ ఇటూ తిరుగుతుంటే – నాలుగు పక్కలకీ కాంతులు చిమ్ముతున్నాయి. అలమేలుమంగ ఉత్తుత్తి ప్రేమ తగాదాలతో ఉన్న నాట్యాలు చేస్తోంది. ఘల్లు ఘల్లు అని అందెల చప్పుళ్లు వినిపిస్తోంది. అందమైన తిరుగుళ్ళతో ఆమె అలా ఆడుతుంటే వేంకటేశ్వరుడికి ఎంతో ఆనందం కలుగుతోంది.

*****

ఆట –పాట అని తెలుగులో నానుడి. నాట్యానికి తెలుగులో సమానమైన శబ్దం ఆట. నృత్య, నాట్య, నృత్త శబ్దాల అర్థాల్లో కొంచెం తేడా ఉన్నప్పటికీ, కావ్యాల్లో పర్యాయ శబ్దాలుగా వాడుతున్నారు. పదాల అర్థాలని అభినయించటం నృత్యం.వాక్యాల అర్థాలని అభినయించటం నాట్యం. అవయవాలు అటూ ఇటూ కదపటం నృత్తం. అన్నమయ్య తన కీర్తనలో ఈ మూడు రకాల ఆటలు అలమేలుమంగ చేత చేయించాడు. ఆమె నాట్యము చేసేటప్పుడు పూలు కురుస్తున్నాయి. కురిసే పూలు ఆమె జడలోవా? ఆమె నాట్యాన్ని చూసి ఆనందోత్సాహాలతో దేవతలు కురిపించినవా? ఏమో! రెండూ కావచ్చు. విశాలమైన నుదుటిమీద వెంట్రుకలు కదులుతున్నప్పుడు ఆ అందం చూసి తీరవలసిందే కాని, మాటల్లో చెప్పలేం. భావుకుడైన కవి ఇక్కడ ఆ అలకల కులుకులను ఊహా ప్రపంచంలో మనకే వదిలేశాడు.

'పూర్వదువాళపు తిరుపు' అనేది నాట్యంలోని ఒక పద్ధతి. నటి రంగస్థలానికి వచ్చేటప్పుడు ఒక్కసారి రెండు కాళ్ళతో ఎగిరి, మళ్ళీ నేలను తాకే లోపుగా ఒక చుట్టు తిరిగి దూకటం 'పూర్వదువాళపు తిరుపు' అని ప్రభాకరశాస్త్రి చెబితే 'రెట్టింపయిన తిరుగునాళ్ల'ని బాలాంత్రపు వారు వివరించారు.

సత్యభామ ప్రవేశించటానికి ముందుగా ఆమె జడ తెరమీద కనిపించడం కూచిపూడి సంప్రదాయం. మూడు నాలుగుదశాబ్దాల క్రితం సత్యభామ జడ ఉన్న సిద్ధేంద్రయోగి భామాకలాపం మూడురాత్రులు ఆపకుండా జరిగేది. ఆ జడలో నక్షత్రాలకి గుర్తుగా 27 ఆభరణాలు, స్వామివారి దశావతారాలను సూచించే బంగారపు గుర్తులు ఉండేవి.

సూత్రధారుడు (ఇప్పటి భాషలో చెప్పాలంటే దర్శకుడు) జడకి హారతి ఇచ్చేవాడు. జడపూజ తరువాత సత్యభామ తెరమీదికి వచ్చేది. అప్పటిదాకా ఆవిడ అన్నమయ్య చెప్పినట్లు (అర) తెర మరుగున ఉండేది. ఉత్తమ కవులు తమ జీవిత కాలంలో ఉన్న ఉత్తమ సాంప్రదాయాలను రాబోయే తరాల వారికోసం ఏదో రూపంలో భద్రపరుస్తారు. అన్నమయ్య అటువంటి ఉత్తమ కవి కనుకనే తన కాలంలో విపరీతంగా ప్రచారంలో ఉన్న కూచిపూడి సంప్రదాయాన్ని అలమేలుమంగకి అన్వయించి ఈ కీర్తనలో భద్రపరిచాడు.

'నర్తకి ప్రవర్తన అంతా దేవతలని సంతోషపెట్టడానికి' అని నాట్యవేదంలో ఉంది. అందుకే దేవుడైన 'వేంకటపతి మెచ్చగ' అని ఈ కీర్తనలో అన్నమయ్య చెప్పాడు. 'తన నృత్యాలతో హరిని ఆనందపెడుతోంది' అని చెప్పకుండా "హరి కరగింపుచు – అలమేల్‌మంగ"అని అన్నమయ్య ప్రయోగం. కరిగించటం ఆనందానికి పరాకాష్ఠ. కరిగిపోయినప్పుడు తనని తాను మరచిపోతాడు. నిర్వచించటానికి వీలులేని స్థితిలో ఉండిపోతాడు. ఇలా ఎదుటివ్యక్తిని తమ కళల ద్వారా కరగించటం ఎంతో నేర్పున్నవారు మాత్రమే చేయగలరు. తల్లి పాలరుచి తెలిసిన కృష్ణుడు, తనని సేవించిన వారికి, తల్లి పాలరుచి తెలియకుండా చేస్తాడని (అంటే మళ్ళీ జన్మంటూ రాకుండా మోక్షమిస్తాడని భావం) అన్నమయ్య ఒక చోట పాల తియ్యదనంతో చెప్పాడు. ఆ తీపికి ఈ 'అలరులు....' కీర్తనలో గజ్జె కట్టించాడు. 'వచ్చెను అలమేలుమంగ' అను మరో కీర్తన ఈ పద్ధతిలో ఉంది.

'అలకల కులుకుల'కు బదులుగా 'అలుకల కులుకులు' అని సత్యభామ పారిజాతాల గుబాళింపులను గుర్తుకుతెచ్చే ఇంకొక పాఠాంతరం. ఇది కూడా బాగుంది.

2. అదివో అల్లదివో హరివాసము

అదివో అల్లదివో హరివాసము
పదివేలు శేషుల పడగలమయము

అదె వేంకటాచల మఖిల వున్నతము
అదివో బ్రహ్మాదులకపురూపము
అదివో నిత్య నివాస మఖిల మునులకు
నదె చూడుడదె మొక్కుడానందమయము

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిటనల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము

కైవల్య పదము వేంకటనగమదివో
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకల సంపద రూపమదివో
పావనములకెల్ల భావనమయము

ముఖ్యపదార్థం :

కైవల్యపదము	=	ముక్తికి మార్గము
నింగినున్న	=	స్వర్గలోకములో ఉన్న
చెంగట	=	దగ్గరగా
సిరులైనది	=	ఐశ్వర్యముతో కూడుకొన్నది
ముంగిట	=	అందుబాటులో ఎదురుగా
మూలనున్న ధనము	=	శ్రీవేంకటేశ్వరుని స్వరూపము

భావం :

బాల్యంలో కొండని మొదటిసారి చూసిన సందర్భంలో ఆనందంతో అన్నమయ్య పాడిన గీతం ఇది. ఆదిశేషుడి పడగల వలె ఉన్న అనేక శిఖరాలతో ఉన్న శ్రీహరి నివాసమైన తిరుమలగిరి అదిగో !అన్నింటిలో ఎత్తైనది. బ్రహ్మ మొదలైన దేవతలందరికి అపురూపంగా కనబడేది. మునులందరికీ ఎప్పుడూ నివాసానికి తగినది. ఆనందముతో

కూడుకొన్నది – వేంకటగిరి అదిగో! నమస్కరించు. వేంకటగిరి పక్కనే శేషగిరి. అది దేవతలకు నిజమైన నివాసం. ఓ భక్తుడా! నిజమైన ధనం ఆ మూల శ్రీవేంకటేశ్వరుని స్వరూపంతో ఉంది. ఆ కొండ బంగారు శిఖరాలతో కూడుకొంది. వేంకటగిరి అదిగో అది మోక్షానికి నిలయం. వేంకటగిరి అన్ని విధాల సంపదలకు ఒక ఆకారం. గొప్ప వాటన్నింటిలోకి గొప్పది.

*****

శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలో ఏడు కొండలుగా 1.శైలం, 2.శేషాచలం, 3. గరుడాచలం, 4. వేంకటాద్రి, 5.నారాయణాద్రి, 6. వృషభాద్రి, 7. వృషాద్రిగా పేర్కొన్నారు. శేషాచలం, నీలాద్రి, గరుడాచలం, అంజనాద్రి, వృషభాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రి ఏడుకొండలుగా మరికొందరు చెబుతారు. లక్ష్మీదేవికి (శ్రీ)నివాసం కనుక శ్రీశైలం వాయువుకి, ఆదిశేషుడికి ఒకసారి పోటీ ఏర్పడిన సందర్భంలో ఆనంద శిఖరాన్ని చుట్టుకొని ఉన్న ఆదిశేషుడిని వాయువు కదిలించి స్వర్ణముఖీ నదీతీరంలో దించాడు. అదే శేషాచలం. పాములను చంపిన దోషాన్ని పోగొట్టుకోవడానికి తపస్సు చేస్తున్న గరుత్మంతుణ్ణి కొండగా మారమని విష్ణుమూర్తి ఆదేశించాడు. అదే గరుడాద్రి. వైకుంఠం నుంచి గరుత్మంతుడు తెచ్చి క్రీడా పర్వతం వేంకటాద్రి (సకల పాపాలను పోగొట్టేది కనుక వేంకటాద్రి). నారాయణ మహర్షి తపస్సు చేసిన కొండ కనుక నారాయణాద్రి. శివుడితో యుద్ధం చేసి ఓడిపోయిన వృషభుడనే రాక్షసుని కోరిక మేరకు అతని పేరుమీద వెలసిన కొండ వృషభాద్రి. ధర్మబుద్ధిని కలిగించేది, ధర్మ నిలయమైనది వృషాద్రి.

నీలాంబరి అనే భక్తురాలు స్వామివారికి మొట్టమొదటగా తలనీలాలు సమర్పించింది కనుక ఆమె పేరు మీదుగా ఏర్పడిన కొండ నీలాద్రి అని, అంజనాదేవి తపస్సు చేసిన కొండ కనుక అంజనాద్రి అని ఇలా రకరకాలుగా పేర్లు ఉన్నాయి. వీటన్నింటిలోకి వేంకటాద్రి ప్రసిద్ధమైన పేరు. "వేంకటాద్రితో సమానమైన స్థానం ఈ లోకంలో ఇంకొకటి లేదు" అనే వాక్యం ప్రసిద్ధమైనది. అందుకే అన్నమయ్య కూడా కొండని మొట్టమొదటగా వేంకటాచలంతో పిలిచాడు. తొలి తెలుగు కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క (అన్నమాచార్యుల వారి భార్య) తన కావ్యంలో అర్జునుని తీర్థయాత్రలు వర్ణిస్తున్న ఘట్టంలో వేంకటాద్రిని అర్జునుడు కొలిచాడని రాసింది. వేంకటాద్రి – వైకుంఠంలో మహావిష్ణువు యొక్క క్రీడా పర్వతం.వరాహస్వామి హిరణ్యాక్షుని సంహరించి నీటిలోనుంచి మొట్టమొదట పైకి తీసుకువచ్చింది ఈ వేంకటాద్రినే. అన్నమయ్య వేంకటాచలాన్ని మొదటగా స్మరించటంలో ఇంత నేపథ్యం ఉంది.

ఆదిశేషుడికి అయిదు పడగలని, ఏడు పడగలని, వేయి పడగలని రకరకాల లెక్కలున్నాయి. కొండలోని ఒక్కొక్కరాయి పడగలా స్ఫురిస్తోంది కనుక 'పదివేల శేషుల పడగల' తో కూడుకొన్నదిగా వేంకటాద్రిని అన్నమయ్య వర్ణించాడు. ఇక్కడ పదివేలు అపరిమితమైన సంఖ్యకు సంకేతం. అది మన అదృష్టవశాన భూమిమీద కనబడుతోంది. ప్రతిఅర్ధరాత్రి స్వామివారిని దేవతలు సందర్శించుకొంటారు. అందుకే రాత్రిపూట తలుపులు మూసే సమయంలో స్వామివారి దగ్గర నీటితో నిండిన ఒక బంగారు పాత్రను ఉంచి, తలుపులు మూసి వెళతారు. ఒక్కోసారి తెల్లవారేసరికి ఈ బంగారు పాత్రలోని నీరు సగం తరిగిపోయి ఉండటం కద్దు. దానిని తీర్థంగా ఉదయం గ్రహిస్తారు. అందుకే వెంకటగిరి బ్రహ్మాది దేవతలకు అపురూపమైనది. కనకాద్రి అని ఈ కొండకు మరో పేరు. అందుకే దానిని బంగారు శిఖరాలమయంగా కవి భావించాడు. శంకరాచార్యులవారు ఈ కొండకు వచ్చిన సందర్భంలో శ్రీచక్రాన్ని స్వామి వారి మూర్తి కింద, ధనాకర్షక యంత్రాన్ని హుండీ కింద స్థాపించారని ఒక కథనం. స్వామివారి సంపద ఎంత ఉందో సరిగ్గా లెక్కపెట్టడం ఎవరి వల్ల కావటంలేదు. అందుకే కొండని సంపద రూపమంటూ స్వామివారిని మూలగా ఉన్న ధనమని (పెట్టుబడిసొమ్ము) వేంకటేశునితో చనువు ఉన్న అన్నమయ్య వర్ణించాడు.

మోక్షమంటే ఆకాశానికి ఆ పక్కలేదు. పాతాళంలోనో భూమిమీదో లేదు.మన మనస్సులోనే ఉంది. మనిషి ఆనందస్వరూపునిగా బతకటమే మోక్షమన్న వసిష్ఠగీత 'అదె మొక్కుడు ఆనందమయము" అను పాదములో ప్రతిధ్వనిస్తోంది. తొండమాను చక్రవర్తి కట్టించిన గర్భగుడిని ఆనంద నిలయము అంటారు. ఆ ఆనందుడు ఉండే కొండ ఆనందమయమే కదా! ఆనంద స్వరూపులుగా మనం బతకటం కోసం వెంకటాద్రికి నమస్కరించండి అనే కవి ఉపదేశం పాటించి మన జన్మను సార్థకం చేసుకొందాం.

3. అన్ని మంత్రములు...

అన్ని మంత్రములు నిందే యావహించెను
వెన్నతో నాకు గలిగె వేంకటేశు మంత్రము

నారదుండు జపియించె నారాయణ మంత్రము
చేరె బ్రహ్లాదుడు నారసింహ మంత్రము
కోరి విభీషణుడు చేకొనె రామ మంత్రము
వేరె నాకు గలిగె వేంకటేశు మంత్రము

రంగగు వాసుదేవ మంత్రము ధ్రువుడు జపించె
నంగవించె కృష్ణ మంత్రమర్జునుడును
ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుడు పఠించె
వింగడమై నాకునబ్బె వేంకటేశు మంత్రము

యిన్నిమంత్రముల కెల్ల యిందిరానాథుడే గురి
పన్నినదిదియే పరబ్రహ్మ మంత్రము
నన్ను గావ కలిగెబో నాకు గురుడియ్యగాను
వెన్నెలవంటిది వేంకటేశుమంత్రము

భావం :

అన్ని మంత్రాల కంటె వేంకటేశ్వరుని మంత్రం గొప్పదని ఈ కీర్తనలో అన్నమయ్య పొగుడుతున్నాడు.

అన్ని మంత్రాలని ఈ వేంకటేశుని మంత్రం ధరించింది (= ఆవహించు). వెన్నతో పెట్టిన విద్యలా అన్నమయ్యకు శ్రీవేంకటేశ్వరుని మంత్రం లభించింది.

నారదుడు 'ఓం నమో నారాయణాయ' అను నారాయణ మంత్రాన్ని జపించాడు. ప్రహ్లాదుని 'ఓంశ్రీ మద్దివ్య నృసింహాయ' అను నరసింహ మంత్రం చేరింది. విభీషణుడు కోరుకొని 'శ్రీరామశ్శరణం మమ' అను మంత్రము స్వీకరించాడు. (= చేకొనె)

వీటన్నింటికంటే ప్రత్యేకంగా (= వేరె) అన్నమయ్యకు వేంకటేశుని మంత్రం లభించింది.

మనోహరమైన (= రంగగు) 'ఓంనమో భగవతే వాసుదేవాయ' (ద్వాదశాక్షరి) వాసుదేవ మంత్రాన్ని ధ్రువుడు జపించాడు. 'ఓం క్లీం కృష్ణాయ గోపీజన వల్లభాయ నమస్స్వాహా' అను కృష్ణుని మంత్రము అర్జునుడి మనస్సుకు దగ్గరగా వచ్చింది (=అంగవించు)

స్వామిని తన ఎదుట (= మొగి) భావించి విష్ణుమంత్రాన్ని ఉత్సాహంతో వ్యాసుని కొడుకు శుకుడు వల్లించాడు. అందమైన (= వింగడము) వేంకటేశుని మంత్రము అన్నమయ్యకు దొరికింది.

అన్ని మంత్రములకు వేంకటేశుడే (= ఇందిరానాథుడే) లక్ష్యం (= గురి). పరమాత్ముడైన 'ఓం నమో వేంకటేశాయ' అను వేంకటేశుని మంత్రం అన్నమయ్య మనస్సులో వ్యాపించింది. (= పన్నినది). తనను రక్షించగా గురువు ద్వారా ఈ మంత్రము ప్రాప్తించింది. ఈ వేంకటేశుని మంత్రం వెన్నెల లాంటిది.

*****

"ఆచార్యుని వల్లే విద్య నేర్చుకోవాలి" అని ఛాందోగ్యోపనిషత్తు.

గురువు స్థానము అంత గొప్పది. భారతంలో అవక్రీతుడనే వాడు గురువు దగ్గర చదవకుండా అన్ని విద్యలు, శాస్త్రాలు రావాలని తపస్సు చేస్తుంటాడు. ఇంద్రుడు ముసలి బ్రాహ్మణుడి వేషంలో వచ్చి గంగ ఒడ్డున నిలబడి, గుప్పెళ్ళతో ఇసుకను గంగలోకి వేస్తుంటాడు. అది చూసిన అవక్రీతుడు ఎందుకు ఆ పని చేస్తున్నావని ముసలి బ్రాహ్మణుడిని అడుగుతాడు. గంగను పూడ్చి సేతువు కట్టడానికని బ్రాహ్మణుడు జవాబిచ్చాడు.

"నువ్వు వేసే ఇసుక వల్ల గంగ పూడుతుందా?" అని అవక్రీతుడు నవ్వుతాడు. "తపస్సు వల్ల విద్య వస్తుందా? అది జరిగితే గంగ కూడా పూడుతుంద"ని ఆ బ్రాహ్మణుడు జవాబిస్తాడు. 'గురువు లేని విద్య గుడ్డి విద్య' అని మన తెలుగులో కూడా సామెత. అందువల్లనే అన్నమయ్య అంతటి గొప్పవాడు కూడా 'గురుడియ్యగాను' అని గురువును ప్రశంసించాడు.

'అన్నమయ్యకు పంచ సంస్కారాలు (తాపం, పుండ్రం, నామం, మంత్రం, వైష్ణవేష్టి) చేసిన గురువు ఘన విష్ణుడు' అని అన్నమయ్య జీవిత చరిత్రలో ఉంది.

దానికి పీఠిక రాసిన వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'అన్నమయ్య గురువు పేరు సరిగా తెలియ'దని అన్నారు. కాగా 'అన్నమయ్య గురువు శఠగోప యతి' అని రాళ్ళపల్లిగారు చెప్పారు.

'ధ్రువుడు, ప్రహ్లాదుడు మొదలైనవారు చేసిన విష్ణు మంత్రాలు వేంకటేశ్వరుని మంత్రాలే' అని అన్నమయ్య ఆంతర్యం. ఎందుకంటే 'కొనరో కొనరో కూరిమి మందు' అను ఇంకో కీర్తనలో ధ్రువుడు, ప్రహ్లాదుడు, నారదుడు, అజుడు మొదలైన వారు తీసుకొన్న మందు (స్వామి పేరును జపించుట అనే మందు) తిరుపతి కోనేటి గట్టున ఉన్న మందే అని తీర్మానించాడు. వేంకటేశ్వరుని పేరును మందుతో పోల్చటం అన్నమయ్యకు చాలా ఇష్టం.

సమర్పణ బుద్ధితో ఎంత మననం చేస్తే, అంతగా మంత్రం మనల్ని కాపాడుతుంది. అక్షరాలే కదా అని తేలికగా అనుకొంటే, అక్షరాలా అలాగే జరుగుతుంది.

ఈ అక్షరాలు మన బతుకును ఆనంద తీరాలకు చేరుస్తాయనే నమ్మకంతో జపిస్తే అలాగే జరుగుతుంది. అందునా సర్వ పాపాలను హరించే వేంకటేశ మంత్రం భక్తితో పఠిస్తే జన్మ ధన్యమవుతుంది. ఇది అన్నమయ్య సందేశం.

వెన్నెలను మంత్రంతో పోల్చటం అద్భుతమైన భావకవిత్వం. వెన్నెలను తలిస్తే ఆనందం. వెన్నెలలో తడిస్తే ఆనందం. వెన్నెల వంటి వేంకటేశ మంత్రాన్ని జపిస్తే ఆనందం.

'సమర్పణ బుద్ధితో మనం హరిఃఓమ్ అని అన్న వెంటనే ఈ శరీరం హరికి హోమ్ అవుతుంది' అని చమత్కరించారు కృష్ణస్వామి అనే పెద్దాయన.

మంత్రమయమైన అన్నమయ్య కీర్తనలు సమర్పణ బుద్ధితో చదివితే అంతే ఫలితం.

4. అప్పలేని సంసారమైన పాటే చాలు

అప్పులేని సంసారమైన పాటే చాలు
తప్పులేని జీతమొక్క తారమైన జాలు

కంతలేని గుడిశొక్క గంపంతయినజాలు
చింతలేని యంబలొక్క చేరెడే చాలు
జంతగాని తరుణి యేజాతైన నది చాలు
వింత లేని సంపదొక్క వీసమే చాలు

తిట్టులేని బ్రదుకొక్క దినమైన నదె చాలు
ముట్టు లేని కూడొక్క ముద్దెడే చాలు
గుట్టుజెడి మనుకంటే కొంచెపు మేలైన జాలు
వట్టి జాలి బడుకంటే వచ్చినంతె చాలు

లంపట పడని మేలు లవలేశమె చాలు
రొంపి కంబమౌకంటె రోయుటే చాలు
రంపపు గోరిక కంటె రతి వెంకటపతి
పంపున నాతని జేరె భవమె చాలు

భావం :

ఎంత భక్తకవి అయినా సమాజం బాగోగుల పట్ల తన బాధ్యతను మరచిపోడని నిరూపించే అన్నమయ్య కీర్తన ఇది.

అప్పులు లేకుండా, గొప్పలకు పోకుండా సంసారం – అయినపాటే (= ఉన్నంతలో తృప్తి పడుతుంటే) చాలు. అవినీతి లేకుండా, నిజాయితీగా వచ్చే తప్పులేని జీతం తారమైన (= నాలుగు కాసుల నాణెం, కొంచెమైనా)చాలు.

పెద్ద పెద్ద భవనాలు కట్టుకోవడం కంటే ఉన్నంతలో గంపంతయిన (= చక్కగా కప్పిన) గుడిసె చాలు. నానా బాధలు పడుతూ తినే తిండి కంటే, చింత లేకుండా తాగే అంబలి (= పిండి, నూకలు చేర్చి ముద్ద కాకుండా పలచగా వండినది) చేరెడయినా (= కొంచెము వంచిన అరచేతిలో పట్టినంత) చాలు. చెడు గుణాలు ఉన్న గయ్యాళి స్త్రీ (= జంత) కంటే మంచి గుణాలున్న ఏజాతి స్త్రీ అయినా పెండ్లి చేసుకోవడానికి

చాలు. అందరూ వింతపడే (= ఇతరమైన) సంపాదన కంటే వింత లేకుండా న్యాయంగా సంపాదించిన సంపద వీసమయినా (= చిన్నమెత్తు బంగారునాణెంలో 16వభాగం. కొంచెమైనా) చాలు.

ఇతరుల చేత తిట్లు పడకుండా గడిపే బతుకు ఒక్క రోజయినా చాలు. పరిశుభ్రంగా లేని అన్నం తినటం కంటే పరిశుభ్రంగా ఉన్న (= ముట్టులేని) ఆహారం ఒక్క ముద్దయినా చాలు. ఏదేదో ఆశించి మన విలువను చెడగొట్టుకొని (= గట్టు జెడి) బతకటం కంటే (= మనుకంటే) భగవంతుడు మనకు చేసే కొంచెం మేలుతో తృప్తిపడటం చాలు. శక్తికి మించి ప్రయత్నాలు చేసి, నలుగురిలో నవ్వులపాలై జాలి (=దుఃఖం) పొందటం కంటే వచ్చిన దానితో హాయి అనుభవించటం చాలు.

అనేక లంపటాలలో (= బాధ,తొందర, ఆయాసము) తగుల్కొని ఏ ఒక్క దానికి సరైన న్యాయం చేయలేక బాధపడడం కంటే ఏ లంపటం లేకుండా చేసే మేలు లవలేశమైనా (= కొంచెమైనా) చాలు. బురదలో ఉన్న స్తంభానికి (= రొంపి కంబం) స్థిరత్వం లేదు. ఎప్పుడు పడిపోతుందో తెలియదు. రొంపి కంబంలా ఒక నిలకడ లేకుండా బతకటం కంటే,ఈ లోకంలోని సుఖాల మీద అసహ్యపడి, సుఖాలని రోయుట (= విడుచుట) చాలు. అనుక్షణం బాధపెట్టే రంపపు కోరిక కంటే అనురాగంతో (= రతి) వేంకటేశ్వరుని చేరటానికి ప్రయత్నించే పుట్టుక (= భవం) చాలు.

*****

ఇది వరకు జీతం ఎంతుందో చూసి పిల్లనిచ్చి పెళ్లి చేసేవారు. జీతంతో పాటు అధిక సంపాదన ఎంత సంపాదిస్తున్నాడో చూసి, పిల్లనిచ్చి పెళ్ళి చేసే దౌర్భాగ్యపు రోజులు వచ్చాయి. అన్నమయ్య కాలంనాటి సమాజంలో కూడా ఇలాటి 'అమ్యామ్యా'లు ఉండేవి కాబోలు! అందుకే తప్పులేకుండా – అంటే అవినీతి అంటకుండా వచ్చే కొద్ది పాటి జీతంతో సంతృప్తి పడమని కవి చెప్పాడు. శంకర భగవత్పాదులు కూడా "నువ్వు చేసేపనితో నీకు ఎంత సంపాదన వస్తుందో, దానితో తృప్తిపడ"మన్నారు. భక్తకవులు మనస్సును సంతోషపెడుతూ మేల్కొలుపుతారనటానికి ఇదే సాక్ష్యం.

తృప్తిగా తింటే ఆహారం ఒంటికి పడుతుంది. "ఏం తింటున్నాం?" (వాట్ వుయ్ ఈట్?) ఎంత ప్రధానమో, "ఎలా తింటున్నాం?" (హౌ వుయ్ ఈట్) అంత ప్రధానమని ఆధునికులు చెబుతున్నారు. (డా. హెన్రీ ఫస్కో 'మైండ్‌ఫుల్ ఈటింగ్) అన్నమయ్య వీళ్ళకంటే ముందే విచారం లేకుండా తినమని, అదే ఒంటపడుతుందని బోధించాడు.

విరహంలోను, గారాబంలోను తిట్లు బాగా ఉంటాయి. "సెందురుణ్ణీ తిట్టు నా యెంకి/ సూరియుణ్ణీ తిట్టు నా యెంకి" అని పాడుకొంటుంటే, "దొంగ సచ్చినోడా!" అని మన (ఇతరుల కాదు) ప్రేమికురాలు తిడుతుంటే – కమ్మగా ఉంటుంది. కాని మనం కష్టపడినా – మెచ్చుకొనేవాడు మెచ్చుకోకపోగా, తిట్ల వర్షం కురిపిస్తే, ఆ బాధ వర్ణనాతీతం. తిట్టకుండా, తిట్టించుకోకుండా ఒక్కరోజు గడిపినా, ఆ బతుకునే బతుకు అంటారని అన్నమయ్య చెబుతున్నాడు. ఈ లెక్కన ఎన్నిరోజులు మనం నిజంగా బతుకుతున్నామో ఎన్ని రోజులు బతుకుతూ చస్తున్నామో ఎవరికి వారు లెక్కవేసుకోవచ్చు.

"నీతిశాస్త్ర నిపుణులు మెచ్చుకోనీ! తిట్టనీ! సంపద రానీ! పోనీ! మరణం రానీ! పోనీ! తాను న్యాయమనుకొన్న మార్గం నుంచి నీతిపరులు వెనుకడుగు వేయరు" అని భర్తృహరి చెబితే దానినే అన్నమయ్య తన భాషలో ఇంకొంచెం అందంగా చెప్పాడు. నీతి మార్గాన్ని తప్పి, నీ గుట్టు అందరికీ తెలిసిపోయి అలా అవమానంతో బతకటం కంటే, భగవంతుడు నీకుచేసిన కొంచెంపాటి మేలుతో తృప్తిగా ఉండమన్నాడు.

మనం పేదవారి మీద జాలి కలిగి ఉండాలి. కాని మన మీద ఇతరులు జాలి పడకుండా కాలాన్ని గడపాలి. "పాపం! ఎలా ఉండేవాడు ఎలా అయిపోయాడో!" అనే సానుభూతి మన ఎదురుగా వినబడుతుంది. "వీడి తిక్క బాగా కుదిరింది" అనే హేళన మన చాటున వీరవిహారం చేస్తుంది. అందుకే ఇటువంటి "వట్టి జాలి పొందకుండా వచ్చిన దానితో బతుకు జాగ్రత్తగా గడుపుకో నాయనా!" అని అన్నమయ్య బోధ.

రంపం పరపరా కోస్తుంది. కోరిక కూడా మనిషిని అలాగే బాధపెడుతూ చీలుస్తుంది. లౌకికంగా రంపపు కోరికలు వద్దన్నాడు గాని, వేంకటేశ్వరుని ఆశ్రయించే కోరిక ఈ పుట్టుకలో తప్పనిసరిగా ఉండాలన్నాడు కవి. ఎందుకంటే మళ్ళీ పుట్టుకలేకుండా ఉండటం కోసం.

5. అంతర్యామి అలసితి సొలసితి

అంతర్యామీ అలసితి సొలసితి
యింతట నీ శరణిదె చొచ్చితిని

కోరిన కోర్కెలు కోయని కట్లు
తీరవు నీవని తెంచక
భారపుబగ్గాలు పాప పుణ్యములు
నేరుపులబోనీవు నీవు వద్దనక

జనుల సంగముల జక్క రోగములు
విను విడువవు నీవు విడిపించక
వినయపు దైన్యము విడువని కర్మము
చనదది నీవిటు సంతపరచక

మదిలో చింతలు మయిలలు మణుగులు
వదలవు నీవని వద్దనక
యెదుటనె శ్రీవేంకటేశ్వర నీవదె
అదనగాచితివి అట్టిట్టనక

భావం :

స్వామి దర్శనం కోసం మనస్సు తపన పడుతుంటే, హృదయం ఆర్తితో కరుగుతుంటే ఆ తపన, ఆర్తి కలిసి ఈ అన్నమయ్య కీర్తనలో అక్షరాలుగా మారాయి.

స్వామీ! నాలో ఉండి నన్ను నడిపించే పరమాత్మా! మాయతో కలిసిన దేవా! (=అంతర్యామీ) ఈ జీవన ప్రయాణంలో బాగా అలసి పోయానయ్యా! నువ్వు కనిపించలేదని బాధపడుతున్నాను. ఇక నువ్వే దిక్కని నిన్నే శరణు కోరుతున్నాను.

వేంకటేశా! ఒకటా! రెండా! ఎన్ని కోర్కెలయ్యా! ఈ కోర్కెల తాళ్ళు నన్ను కట్టి పడేస్తున్నాయి. అవి ఎవరూ కోయని కట్లు. నువ్వు గాని ఆ కట్లు తెంచకపోతే, వాటిని ఇంక ఎవ్వరూ తెంచలేరు. ఈ జీవిత రథాన్ని నీ దగ్గరికి నడిపించకుండా పాప పుణ్యాలనే బరువైన పగ్గాలు కర్మలనే గుర్రాలను గట్టిగా పట్టుకొంటున్నాయి. నేర్పు గల స్వామీ! కొంచెం నీ నేర్పు చూపించవయ్యా! ఆ పగ్గాలను వదులు చేయవయ్యా!

పాపపుణ్యాలు లేని మోక్షాన్ని ఇవ్వవయ్యా!

ప్రేమలు, చుట్టరికాలు, స్నేహాలు (= సంగములు) ఇవన్నీ అందంగా కనిపించే రోగాలు. స్వామీ! నువ్వు పెద్ద వైద్యుడివి కదా! నువ్వు విడిపించకుండా నన్ను ఈ రోగాలు విడువవు. నీ భక్తుడి భక్తుడి భక్తుడి కంటే నేను తక్కువ అనే వినయపు దైన్యం (=నీచత్వం) నన్ను విడిచిపెట్టని కర్మ. నువ్వు మోక్షమిచ్చి నన్ను శాంతపరచేదాక (= సంతపరచక) ఆ భావం పోదు.

స్వామీ! నా మనస్సులో ఆలోచనలు మురికిగా (= మైలలు), రెట్టింపుగా (=మణుగులు) ఉన్నాయి. నువ్వు వద్దంటేనే – నీ దయ చూపిస్తేనే – క్షణం క్షణం రెట్టింపు అయ్యే ఆ మురికి ఆలోచనలు వదులుతాయి. ఎదురుగా ఉన్న వేంకటేశ్వరా! నన్ను ఎన్నోసార్లు తగిన సమయాల్లో బాధపెట్టక (= అట్టిట్టనక) రక్షించావు.

*****

శరణుకోరటం మూడు రకాలు. 1. తస్యైవాహం (నువ్వు నావాడనే భావం) 2. తవైవాహం (నేను నీ వాడనే భావం) 3. త్వమేవాహం (నువ్వే నేను అనే భావం).

ఈ కీర్తనలో అన్నమయ్య మొదటి పద్ధతిని ఎక్కువగా పాటించాడు. నువ్వు నావాడివి; నన్ను రక్షించుకోవలసిన బాధ్యత నీదేనని స్వామిని శరణు కోరుతున్నాడు.

సంసారం ఒక సంత. పాపపుణ్యాలు సొమ్ములు కింద భావించి, జీవుడు సుఖ దుఃఖాలను కొనుక్కొంటున్నాడు. అటు వంటి బరువైన పుణ్యపాపాలను ఈ కీర్తనలో భారపు పగ్గాలతో అన్నమయ్య పోల్చాడు. జీవుడు అంతిమంగా చేరవలసిన గమ్యం మోక్షం. కాని అక్కడికి వెళ్ళనీయకుండా మనల్ని పుణ్యపాపాలనే భారపు పగ్గాలు గట్టిగాపట్టుకుంటున్నాయి. పాపం, పుణ్యం రెండూ లేనప్పుడే మోక్షం కనుక అది ప్రసాదించమంటున్నాడు కవి.

'వైద్యో నారాయణహరిః' వైద్యుడు నారాయణుడు ఒక్కటే. దీనిని అన్నమయ్య ఈ కీర్తనలో నిరూపిస్తున్నాడు. తపింపచేసేదాన్ని రోగమంటారు. మనస్సుకు సంబంధించిన అనేక రకాలైన కష్టాలు కలుగజేస్తుంది. కాబట్టి వ్యాధి అని రోగానికి ఇంకో పేరు. 'నా వాళ్ళు బాగుండాలి. ఎదుటివాడికి చెడ్డపేరు రావాలి. నాకు మంచి పేరు రావాలి. అందరికంటే నాకు ఎక్కువసంపద ఉండాలి' ఇలా చెప్పరాని, చెప్పుకోలేని చాలా రోగాలు చాలామందిని పట్టి పీడిస్తుంటాయి. 'ఓ సంసార వైద్యుడా! నువ్వు బాగుచేయకుండా ప్రజలను ఈ రోగాలు విడువవు" అని స్వామిని అన్నమయ్య అభ్యర్థిస్తున్నాడు.

ముకుందమాలలో 'స్వామివారి సేవకుడి సేవకుడి సేవకుడి..... ' అని ఒక ప్రసిద్ధ వైష్ణవ వినయభావం కనిపిస్తుంది. ఈ కీర్తనలో అన్నమయ్య వాడిన వినయపు దైన్యము ఇదే! 'పదే పదే నీకు అలా విన్నపం చేస్తుంటాను. నువ్వు నన్ను అనుగ్రహించే దాక ఆ పద్ధతి మాన'నని అన్నమయ్య భావం. "స్వామీ! సాళువ నరసింహరాయలు బంధించినప్పుడు కాపాడావు. ఇలా సరియైన సమయాల్లో నన్ను రక్షించావు. అప్పుడప్పుడు చూపించిన దయను శాశ్వతంగా చూపించి మోక్షమియ్యవయ్యా" అని అన్నమయ్య విన్నపం.

"అడవిలో పశువు తప్పిపోతే వెతికి ఇంటికి తీసుకురావలసిన బాధ్యత పశువుల కాపరిదే. అలాగే కోరికలనే అడవిలో భక్తుడి మనస్సు తప్పిపోయింది. దానికి వెతికి తనదగ్గరికి చేర్చవలసిన బాధ్యత స్వామిదే" అన్నాడు ఒకచోట అన్నమయ్య. అదే ధోరణిలో ఈ కీర్తనలో 'క్షణం క్షణం రెట్టింపు అయ్యే మురికి ఆలోచనలు దూరం చేయవలసిన బాధ్యత నీదే స్వామీ' అంటున్నాడు.

మనస్సుకు అయిదు రకాల స్థితులు.

1. క్షిప్తం (ప్రతి దానిమీద ఆశ. దేనియందు స్థిరంగా ఉండదు)
2. మూఢం (నిద్ర, అలసట మొదలైన వాటితో ఉంటుంది)
3. విక్షిప్తం (ఎప్పుడో ఒకప్పుడు కొంచెం సేపు ధ్యానం కుదురుతుంది. తరువాత చెదిరిపోతుంది)
4. ఏకాగ్రం (ఒకే వస్తువులో ప్రవేశించటం మనస్సు ఉనికి)
5. నిరుద్ధం (మనస్సు తనని తాను మరచిపోయి, ఇతర విషయాల్లో ఏ మాత్రం ప్రవేశింపని స్థితి) ఈ కీర్తనలో మనస్సు తన నాలుగవ స్థితినుంచి, అయిదవ స్థితిలోకి పాకిన అద్భుత రచనాస్థితి కనిపిస్తుంది.

ఈ కీర్తనలోని ప్రతి పదాన్ని స్వామివారి పదాల కాంతి ఆక్రమించింది. అన్నమయ్య భక్తి గోపురం ఈ కీర్తన.

6. ఆకటి వేళల నలపైన వేళలను...

ఆకటి వేళల నలపైన వేళలను
తేకువ హరినామమే దిక్కు మరిలేదు

కొరమాలి వున్న వేళ కులము చెడిన వేళ
చెర వడి వొరులచే జిక్కినవేళ
వొరపైన హరినామ మొక్కటే గతిగాక
మరచి తప్పిన నైన మరిలేదు తెరగు

ఆపద వచ్చినవేళ యారడి బడిన వేళ
పాపపు వేళల భయపడిన వేళ
వోపినంత హరినామ మొక్కటే గతిగాక
మాపుదాకా బొరలిన మరిలేదు తెరగు

సంకెళ బెట్టిన వేళ చంప బిలిచినవేళ
అంకిలిగా నప్పుల వారాగిన వేళ
వెంకటేశు నామమే విడిపించ గతిగాక
మంకుబుద్ధి బొరలిన మరిలేదు తెరగు

భావం :

హరి అనే పేరులో ఉన్న గొప్పతనాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో వివరిస్తున్నాడు. ఆకలైనప్పుడు, శ్రమ చెందినప్పుడు (= అలపు) శ్రీహరి నామమే రక్షిస్తుంది. (= తేకువ). ఇక వేరే దిక్కులేదు.

ఏదీ మనకు ఉపయోగపడనప్పుడు (= కొరమాలి ఉన్నవేళ) కులం చెడిపోయినప్పుడు, ఇతరులు మనలని బంధించినప్పుడు అందమైన (= ఒరపైన) శ్రీహరి అను పేరే గతి. ఒకవేళ ఆ పేరు నువ్వు మరచిపోతే నీకు ఇంకో దిక్కు (= తెరగు) లేదు.

ఆపద వచ్చినప్పుడు, నింద (= ఆరడి) పడినప్పుడు, పాపం అనుభవిస్తున్న సందర్భంలో, భయం కలిగినప్పుడు చేతనయినంతసేపు జపించే శ్రీహరి అనుపేరు నీకు గతి. శ్రీహరి నామం కాదని వేరే వాటితో ఎక్కువసేపు (= మాపుదాకా) పొరలినప్పటికీ, ఇతర ఉపాయాలు వెతికినా నీకు దిక్కులేదు.

సంకెళ్ళతో బంధించినప్పుడు, ఎవరైనా చంపుతామని బెదిరించినప్పుడు, బాధపెడుతూ (= అంకిలిగా) అప్పులవారు ఇంకో పని చేసుకోకుండా నిలబెట్టినప్పుడు (= ఆగిన), వేంకటేశ్వరుడి పేరు నిన్ను కష్టాల నుంచి విడిపిస్తుంది. మూర్ఖ బుద్ధితో ఇంకోపేరు జపిస్తే నీకు గతి లేకుండా పోతుంది.

*****

'ఏమొకొ చిగురుటధరమున....' వంటి కీర్తన తనమీద చెప్పమని అన్నమయ్యని సాళువ నరసింహరాయలు అడిగాడు. అన్నమయ్య దేవుడిమీద తప్పించి నా నాలుక ఇంకొకరి మీద పాట పాడదన్నాడు. ఉన్నమాట చెప్పిన అన్నమయ్యను సంకెళ్ళతో రాయలు జైలులో పడేశాడు. అప్పుడు అన్నమయ్య చెరసాలలో ఈ 'ఆకటివేళల' కీర్తన చెప్పాడు. వెంటనే కాలికి తగిలించిన సంకెల మొదలైనవి హరిదయతో తెగిపోయాయని ఒక కథ. అందుకే హరి అనే పేరు సమస్యల సంకెలలు తొలగిస్తుందని, అదే గతి అని అన్నమయ్య ఈ కీర్తనలో పదే పదే చెప్పాడు.

'ఇది గొప్పది' అని చెప్పటం ఒక పద్ధతి. 'ఇదే గొప్పది' అని చెప్పటం ఇంకో పద్ధతి. మొదటిదాంట్లో దీనితోపాటు మిగతావి కూడా గొప్పవనే భావన వస్తుంది. రెండవ దాంట్లో నేను చెప్పినదే గొప్పది, మిగతావి పనికిరానివి అనే అర్థం వస్తుంది. అన్నమయ్య ఈ కీర్తనలో రెండవ పద్ధతి పాటించాడు. హరి నామమే గొప్పది. కష్టాలొచ్చినప్పుడు పొరపాటున కూడా ఇంకో పేరు తలచావో "నువ్వు మూర్ఖుడివి. నీది మూర్ఖ బుద్ధి" అన్నాడు అన్నమయ్య.

'అన్నమయ్య ఇంత కటువుగా అన్నాడేమిట్రా' అని మనం భావించుకోనక్కర్లేదు. భగవద్గీతలో చెప్పిన విషయాన్నే (9-23) అన్నమయ్య చెప్పాడు. ఇతర దేవతలని పూజించటం అజ్ఞానం అని భగవద్గీత అంటే, మూర్ఖత్వం అని అన్నమయ్య అన్నాడు.

ఆకలికి, పాపానికి దగ్గర సంబంధముంది. ఆకలి తీరకపోతే, మనిషి దేనినైనా చేయడానికి సిద్ధపడతాడు. తినాలనే కోరిక ఉన్నవాడి ఎదుట, దేవుడు కూడా తన రూపంతో కనిపించడని, అన్నం ముద్ద రూపంలో కనిపిస్తాడని మహాత్మాగాంధీ చెప్పారు. ఆకలి తీరిన తర్వాత మిగతా విషయాలు. మరి అటువంటి ఆకలి సమయాల్లో హరి నామస్మరణ దిక్కని అన్నమయ్య అభయం. 'పేరు స్మరిస్తే ఆకలి తీరిపోతుందా?' అని కాదు ప్రశ్న. భక్తిగా నువ్వు స్మరిస్తే ఆకలి తీరే మార్గం కనబడుతుంది. ఇది ఎంతోమందికి అనుభవ సిద్ధమైన విషయం.

పూర్వకాలంలో ఒక యాత్రికుడు దట్టమైన అడవిలో చీకటిలో చిక్కుపడి పోయాడు.

అతను చేరాల్సిన ఊరు ఇంకో అయిదు మైళ్లు ఉంది. చిన్నపాటి లాంతరు వెలిగించాడు. 'ఈ లాంతరు వెలుగు కొంచెం దూరమే కనబడుతోంది కదా! అయిదు మైళ్లు చీకటిలో ఎలా వెళ్ళాలి?' అని బాధపడుతుంటే, ఒక తెలివైనవాడు 'ముందు నడవటం మొదలుపెట్టు. వెలుగు నీ వెంటే ఉండి చీకటిని పోగొడుతుంద"ని సలహా ఇచ్చాడు. నామ స్మరణ కూడా ఇంతే. చిన్నదిగా కనపడుతుంది. చేయటం మొదలుపెడితే, అది మన వెలుగై వెన్నంటి అన్నమయ్య చెప్పినట్లు ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తుంది.

జెల్ఫ్ పెలాంగ్ అనే ఆంగ్లకవి తన 'ఎంప్టీ పాకెట్స్' అనే కవితలో రకరకాల అప్పుల వల్ల బాధపడుతున్న మనిషిని వర్ణిస్తూ చివరగా 'అప్పుల బాధతో నువ్వింకా జీవిస్తూ ఉన్నందుకు, నీ ఆశీర్వచనాలని లెక్కపెట్టుకో!' అంటాడు. ఆ ఆశీర్వచనాలు స్వామి నామాన్ని జపిస్తేనే దొరుకుతాయని మన అన్నమయ్య భావన.

భాగవతంలో చావుకు సిద్ధమైన వృత్రాసురుడు ఇలా హరి నామాన్ని కీర్తిస్తాడు. 'శ్రీహరీ! నా మాట ఎప్పుడూ నిన్నే స్మరించుగాక! ఆకలితో అల్లల్లాడే లేగ దూడలు గోమాతకోసం ఎదురుచూసినట్టు, ఈకలు రాని పక్షి పిల్లలు తమ తల్లికోసం ఎదురుచూస్తున్నట్టు, చాలారోజులు తనకు దూరమైన భర్తకోసం భార్య ఎదురు చూస్తున్నట్టు.... నీ కోసం ఎదురు చూస్తున్నాను.'

హరి నామాన్ని జపించటంలో ఇటు వంటి సమర్పణ బుద్ధి ఉండాలి. అప్పుడు తప్పకుండా హరినామం సర్వకాల సర్వావస్థల్లోనూ కాపాడుతుంది.

7. ఇంతే మరేమి లేదు

ఇంతే మరేమిలేదు యిందుమీదను
దొంతుల కర్మాలు దుమ్ము దూరుపెత్తుట

వుల్లములో నుండి దేహమొగి రక్షించే హరి
నొల్లకున్న దన్నుదానొల్లకుండుట
బల్లిదుడాతనిమాని పరుల వేడేదెల్లా
పొల్లకట్టు దంచి దంచి పోగుసేసుకొనుట

యెయ్యెడా బుణ్యఫలములేమి గలిగిన హరి
కియ్యకున్ననది దైవమియ్య కుండుట
చెయ్యారనాతని కొప్పుసేయకున్న భోగములెల్లా
చయ్యనజెరకు పిప్పి చవిగొనుట

శ్రీకాంతుడైనట్టి శ్రీవేంకటేశ్వరుని
జేకొంటే సిరులెల్లా జేకొనుట
మేకుల శ్రీహరినామమే నోరనుడుగుట
కైకొన్న యమృతపుగందువగుట

భావం :

అన్నమయ్య ఈ కీర్తనలో మనం చేయవలసిన, చేయకూడని కర్మలేమిటో చెప్పి, శ్రీ హరిని శరణు కోరితే కర్మబంధాల నుంచి ఎలా విముక్తి లభిస్తుందో చెబుతున్నాడు.

వ్యవసాయదారులు ధాన్యం మొదలైన వాటిని దొంతులుగా పేర్చిన కుండలలో ఉంచి ఎత్తి తూర్పు గాలికి విడుస్తుంటారు. (= దుమ్ముదూరుపెత్తుట). ఆ గాలికి పొట్టు ఎగిరి పోతుంది. గట్టి మిగిలి పోతుంది. ఈ లోకంలోను, పై లోకంలోను (= ఇందుమీదను) మనల్ని అనుసరించి వచ్చే కర్మల వరుస (= దొంతుల కర్మాలు) కూడా ఇంతే. మరేమి లేదు.

మన హృదయంలో (= ఉల్లములో) ఉండి మన శరీరాన్ని రక్షించే శ్రీహరిని క్రమంగా (= ఒగి) ధ్యానించకుండా నిర్లక్ష్యం (= ఒల్లకున్న)చేస్తే తనను తాను నిర్లక్ష్యం

చేసుకొన్నట్లే .గింజలేని పనికిమాలిన ధాన్యాన్ని (= పొల్లకట్టు) ఎంత దంచినా ప్రయోజనం లేదు. బలవంతుడైన (= బల్లిదుడు) శ్రీహరిని కాదని ఇతరులను నువ్వు రక్షించమని వేడుకొంటే అంతే లాభం.

నీ పుణ్యానికి వచ్చిన మంచి ఫలితాలను శ్రీహరికి నువ్వు అర్పించకుంటే – దైవానికి సమర్పించే బుద్ధి నీకు లేనట్టే. నిండు చేతులతో (= చెయ్యార) అంటే నిండుహృదయంతో శ్రీహరికి నువ్వు సేవలు చేయకుండా, నీ వ్యక్తిగత భోగాలు అనుభవిస్తే ఆ సుఖం – చెరకు పిప్పిలో రుచి చూడడం లాంటిది.

లక్ష్మికి (= సంపదకు) ఇష్టమైన శ్రీవేంకటేశ్వరుని (= శ్రీకాంతుని) మనస్సులో గ్రహిస్తే (= చేకొంటే) ధ్యానిస్తే సంపదలన్నీ నువ్వు గ్రహించినట్టే. విలాసమైన (= మేకుల) శ్రీహరి పేరును నీ నోటిలో జపించటం మానేస్తే – చేతిలో చిక్కిన అమృతాన్ని కింద బురదలో వేసి మలినం చేసినట్టే. (= అమృతపు గందువగుట).

*****

సంభాషణాశైలి రచనకు ప్రాణమిస్తుంది. “బావా! ఎప్పుడు వచ్చితీవు!” అనే పద్యంలో తెలుగువాడి నిత్యవ్యవహార సంభాషణాశైలి ఉండడం వల్ల, ఆ పద్యం ఇంకా సజీవంగా ఉంది. “ఇంతే! మరేమిటేదు” అనే అన్నమయ్య కీర్తన కూడా ఇంతే.

వ్యవసాయం చేసుకొనే ఒక సామాన్య మానవుడు అన్నమయ్యని “స్వామీ! పండితులు కర్మల గురించి ఏవేవో చెబుతుంటారు. నాకేం అర్థం కావటం లేదు. కొంచెం తేలిగ్గా చెప్పండయ్యా” అని అడిగాడు. అన్నమయ్య అతడిమాటకు నవ్వుతూ, “ఒరేయ్! మనం పొలంలో కుప్ప నూర్చేటప్పుడు – ధాన్యాన్ని తూర్పుగాలికి విడుస్తాం కదా! అప్పుడేమవుతుంది!? పొట్టు ఎగిరిపోయి గట్టి ధాన్యం మిగులుంది. కర్మలంటే ఇంతేరా! వేంకటేశ్వరస్వామిని మనసారా నమ్ముకొని, ప్రతి పని చేశావనుకో! చెడు అంతా కొట్టుకుపోతుంది. మంచి మిగిలిపోతుంది. ఇంతే! మరేమి లేదు.

“అబ్బా! ఎంత బాగా చెప్పారండి!” అంటూ ఆ సామాన్యుడు మురిసిపోయి ఉంటాడు. ఆ సామాన్యుడి వారసులమైన మనం కూడా ఈ అన్నమయ్య కీర్తనని నేటికీ చదువుకొని, పాడుకొని మురిసిపోతున్నాం.

“తనని తాను తిట్టుకోవడం, తనని తాను నిర్లక్ష్యం చేసుకోవటం” తప్పు అనే ఆధునిక వ్యక్తిత్వ వికాస పాఠాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో వ్యంగ్యంగా నేర్పాడు. తనని తాను తిట్టుకోవటం ఎంత తప్పో, శ్రీహరి నామాన్ని జపించకపోవటం కూడా అంతే తప్పు అని కవి భావన. అందరికంటే బలవంతుడు స్వామి. ఆయన భయం వల్లే గాలి

వీస్తోందని ఉపనిషత్తు చెబుతోంది. 'ఆయనని నమ్ముకో! ఈ మానవుల దగ్గరికి వెళ్ళి నీ అవసరాల కోసం రక్షించమని వేడుకోకు 'అంటూ సారములేని ధాన్యాన్ని (పొల్లకట్టును)– అన్నమయ్య మానవులకు ఉపమానంగా తీసుకొన్నాడు. ఇటువంటి అందమైన వ్యవసాయ సంబంధమైన పోలికలు రాయటం అన్నమయ్యకు కొట్టినపిండి.

మనం పూర్వజన్మల్లో చేసుకొన్న పుణ్యాలకు ఫలితంగా ఐశ్వర్యం, ఉత్తమ పదవులు– ఇలాంటివి వస్తుంటాయి. ఆ పుణ్యఫలితాలను దైవానికి అర్పించమంటున్నాడు అన్నమయ్య. తాను చేసే పనిని దైవానికి అర్పించే బుద్ధి చెడు చెయ్యనివ్వదు. "చెరకులో రసం ఉంటుంది. నోరూరించే రుచి ఉంటుంది. పిప్పిలో రుచి ఉండదు" అని కవి మాట. కాదు – మాకు – దైవాన్ని కాదన్న – భౌతిక సుఖాల భోగపు పిప్పిలోనే రుచి లభిస్తోంది అంటే నమో నమః! కుక్కకి ఎముక కొరికేటప్పుడు గుచ్చుకొని దాని నోట్లోంచి రక్తం వస్తుంది. కాని కుక్క – ఆ రక్తం ఎముక నుంచి వస్తోంది అనుకొని ఆస్వాదిస్తుంటుంది. దైవాన్ని కాదన్న భోగాల రుచి ఇదే.

'గంగాధరుడు మిమ్మల్ని చల్లగా చూడుగాక!' అనటంలో అందం ఉంది. 'శివుడు మిమ్మల్ని చల్లగా చూడుగాక!' అనటంలో అందం లేదు. 'ఏం! గంగాధరుడు శివుడు ఒకటే కదా!' అనవచ్చు. చల్లని గంగను నెత్తిమీద పెట్టుకొన్న గంగాధరుడు చల్లగా చూడమనటంలో ఉన్న అందం – శుభాలనిచ్చే శివుడు చల్లగా చూడమనటంలో రాదు. సరిపోయే పదాన్ని వాడటంలో కవి ప్రతిభ ఉంటుంది. అన్నమయ్య ప్రయోగించిన 'శ్రీకాంతుడు' శబ్దం కూడా ఇలాంటిదే. లక్ష్మికి ఇష్టమైన శ్రీవేంకటేశ్వరుని కొలిస్తే నీ దగ్గరకు సంపద వస్తుందనటంలో ఎంతో అందం ఉంది.

ఈ 'ఇంతే' పదంతో ప్రారంభమయ్యే అన్నమయ్య కీర్తనలు చాలా ఉన్నాయి. ఆ కీర్తనలన్నీ చదవకపోతే నష్టం – మరేమి లేదు – అందమైన భావాలను కోల్పోతాం. అంతే.

8. ఇందరికి నభయంబులిచ్చుజేయి

ఇందరికి నభయంబులిచ్చుజేయి
కందువగు మంచి బంగారు చేయి

వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి
చిలుకు గుబ్బలికిందజేర్చు చేయి
కలికియగు భూకాంత గాగిలించిన చేయి
వలనైన కొనగోళ్లవాడి చేయి

తనివోక బలి చేత దానమడిగిన చేయి
వొనరంగ భూదానమొసగు చేయి
మొనసి జలనిధి యమ్ము మొనకు దెచ్చిన చేయి
యెనయ నాగేలు ధరియించు చేయి

పురసతుల మానములు పొల్లసేసిన చేయి
తురగంబుబరపెడి దొడ్డ చేయి
తిరువేంకటాచలధీశుడై మోక్షంబు
తెరువు ప్రాణులకెల్ల దెలిపెడి చేయి

భావం:

వేంకటేశ్వరుని చేయి ఎందరినో రక్షించేది. చమత్కారమైనది. బంగారం లాంటిది. హయగ్రీవుడనే (సోమకాసురుడను) రాక్షసుడు నాలుగు వేదాలు దొంగిలించి సముద్రములో దాక్కున్నప్పుడు మత్స్యావతారం (1) ధరించి, రాక్షసుని చంపి విష్ణుమూర్తి వేదాలను వెదకి తెచ్చాడు. విశాలమైన భూమి – పాతాళములో మునిగిపోకుండా, మందర పర్వతమును కూర్మావతారం (2)లో మూపున ధరించాడు. హిరణ్యాక్షుడు భూమినంతా చాపగా చుట్టినప్పుడు వరాహావతారం (3) ధరించి దంతం చివర భూమిని ధరించాడు. హిరణ్యకశిపుడిని నరసింహావతారం (4)లో కొనగోళ్ళతోచంపాడు. వామనావతారం (5)లో బలిని దానమడిగాడు. పరశురామావతారం(6)లో రాజులను సంహరించి వాళ్ళ భూములను కశ్యపునకు దానము చేశాడు.

రామావతారం (7)లో దారి ఇవ్వనందుకు కోపముతో సముద్రుని బాణముతో బెదిరించాడు. బలరామావతారం (8)లో ప్రలంబుడు మొదలైన రాక్షసులను సంహరించి

తన నాగేటి తాకుడులకు భయపడిన యమునానది నల్లని కాంతి వంటి కాంతితో ప్రకాశించాడు. స్వర్గాన్ని అందరూ పొందుతూ పుణ్యవంతులై ప్రజలున్నప్పుడు ఏమి పనిలేని యముడు విష్ణుమూర్తికి మొరపెట్టుకోగా ప్రజలకు వేదాలలో గౌరవాన్ని పోగొట్టి, వారిని కర్మ భ్రష్టులను చేయటానికి విష్ణుమూర్తి బుద్ధావతారము(9) ధరించి త్రిపురసతుల మానాలు వ్యర్థము చేశాడు. పాపాత్ములను నాశనం చేయటానికి భయంకరమైన అగ్ని జ్వాలలు చిమ్మే ఖడ్గాన్ని ధరించి కల్క్యావతారము(10)లో గుర్రము మీద విష్ణుమూర్తి వస్తాడు. ఇలా విష్ణుమూర్తి అని చెప్పి అన్నమయ్య దశావతారాలు ఈ కీర్తనలో వర్ణించాడు.

*****

వేదాంత పరిభాషలో ధృతి అనే మాట ఉంది. ఆకును మడచి, దానిలోని ఈనె పుల్లను ఇవతలికి లాగినట్లు, శరీరం నుంచి ఆత్మతత్త్వాన్ని వేరుచేసి పట్టుకొనే సామర్థ్యాన్ని ధృతి అంటారు. ఇంకో రకంగా చెప్పుకోవాలంటే ఆలోచనకి, ఆలోచనకి మధ్య ఉండే శూన్యాన్ని పెంచుకొంటూ ఆహారం విడిచి యోగ సాధన చేయటం. ఈ ధృతిని ప్రసాదించేవాడు నరసింహుడు. పోతన నరసింహుని గోళ్ళను శరణుగోరిన భక్తులకు చంద్రరేఖలుగా, శత్రువులకు వజ్రాయుధ సమానాలుగా చెప్పగా (07-285) అన్నమయ్య 'సామర్థ్యము గల వాడిగోళ్ళ చేయి' అని తక్కువ అక్షరాలలో ఎక్కువ అర్థం వచ్చేటట్లు వర్ణించాడు.

ఒకసారి త్రిపుర కాంతలు తమ తమ భర్తల ఆయుష్షు పెంచటానికి పూజల కోసం పోతుంటే దారిలో నారాయణుడు బుద్ధావతారములో (పౌరాణికబుద్ధుడు) దిగంబరుడిగా కనిపించాడు. కామపీడితులైన త్రిపుర కాంతలు తట్టుకొనలేక ఆ బుద్ధుడిని కౌగిలించుకొన్నారు. పరపురుష స్పర్శ కలిగినందున వారికి మానభంగము కలిగినట్లే కదా! మాయవతీ శుద్ధోదనుల పుత్రుడు చారిత్రక బుద్ధుడు. ఇతడు బౌద్ధమత స్థాపకుడు. ఇతడు వస్త్రధారి. వంకీలు తిరిగిన వెంట్రుకలు కలవాడు. దిగంబరుడు. శ్రీవేంకటేశ సహస్రనామ స్తోత్రంలో 'త్రిపుర స్త్రీ మానభంగఃు, జగన్మోహకధర్మీ'- అను విశేషణాలు బుద్ధునికి సంబంధించినవి.

'వరాహావతారంలో విష్ణువు సముద్రం నుండి భూమిని వెలికి తీసిన సందర్భంలో, వరాహం పళ్ళ సందున వచ్చిన భాగాలు హిమాలయ పర్వతాలుగా, ఆల్ప్స్ పర్వతాలుగా, సహ్యాద్రి పర్వతశ్రేణులుగా ఏర్పడ్డాయని పూజ్యశ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ చెబుతారు. స్వామివారి కుడిచేయి సర్వం తన కర్పించి, తన పాదాలు శరణువేడమని చెప్పగా ఎడమచేయి తనను నమ్మిన వారికి సంసారాన్ని సులభముగా దాటడానికి వీలవుతుందని చెబుతుంది. ఈ అర్థాలను గ్రహించి ఈ జీవితానికి ఒక అర్థాన్ని కల్పించుకొందాం.

9. ఇట్టి ముద్దులాడి...

ఇట్టి ముద్దులాడి బాలుడేడ వాడు వాని
పట్టి తెచ్చి పొట్టనిండ పాలు వోయరే

గామిడై పారితెంచి – కాగెడి వెన్నలలోన
చేమ పూవు కడియాల – చేయిపెట్టి
చీమ కుట్టెనని తన – చెక్కిట కన్నీరు జార
వేమరు వాపోవు వాని – వెడ్డువెట్టరే.

ముచ్చవలె వచ్చి తన ముంగ మురువుల చేయి
తచ్చెడి పెరుగులోన తగబెట్ట
నొచ్చెనని చేయి దీసి నోరనెల్ల జొల్లుగార
వొచ్చెలి వాపోవు వాని నూరడించరే.

ఎప్పుడు వచ్చెనో మా యిల్లు చొచ్చి పెట్టెలోని
చెప్పరాని వుంగరాల – చేయిపెట్టి
అప్పుడైన వేంకటాద్రి –అసవాలకుడుగాన
తప్పకుండ పెట్టె వాని తలకెత్తరే.

ముఖ్యపదార్థము :

ముద్దులాడి	=	అందమైనవాడు
గామిడై	=	ఊరి పెద్దగా
పారితెంచి	=	ఏనుగును కట్టు తాడును తెంచి
వెన్నలలోన	=	పాలలోన అని ఇక్కడ అర్థం
వేమరు	=	అనేకసార్లు
వెడ్డువెట్టరే	=	మాయమాటలు చెప్పరా!
ముచ్చవలె	=	దొంగలా
ముంగమురువు	=	చేతి కంకణం
తచ్చెడి	=	కవ్వముతో కదలాడే
వొచ్చెలి	=	అవమానము

అప్పడైన = తండ్రయిన
అసవాలకుడు = పోలిక ఎవడు లేనివాడు

భావం :

కవి ఆనాటి కాలంలో ఒక పాత్రధారి అయ్యాడు. బాలకృష్ణుడు దొంగ చేష్టలు చేస్తుంటే గమనిస్తూ, అతనంటే విపరీతమైన అభిమానం గల గోపికలలో తానొకడిగా మారాడు. ఆ సమయంలో మమకారంతో నిండిన మల్లెల మాటల గుబాళింపులివి.

ఇటువంటి ముద్దుగుమ్మ అయిన బాలుడు ఎక్కడ? వానిని పట్టుకొని, తీసుకొచ్చి, పొట్ట నిండుగా పాలు పోయరే! తన శరీరానికి అమ్మ యశోదమ్మ చుట్టిన తాడును తెంచాడు. పరుగెత్తుకొని వచ్చి కాలే పాలలో తన చేమపూవులు చుట్టిన కడియాల చేయి పెట్టాడు. ఇంకేముంది! చుర్రుమని చేయి కాలింది. తను ఇలా చేయటం వల్ల చేయి కాలిందని నలుగురికి తెలియటం ఇష్టం లేదు. అందుకే చీమ కుట్టిందని మాయ మాటలు చెప్పి ఏడ్చేవాణ్ణి – ఏడ్పు మానునట్లుగా మాయమాటలు చెప్పరా?

దొంగలాగా వచ్చి కంకణాల చేయిని పెరుగు చిలికే కుండలో పెట్టాడు. ఆ రాపిడికి చేయి నొప్పి పుట్టింది. ఈసారి మాయమాటలు లేవు. చేయి తీసి – నోరంతా చొంగ కారుతుంటే, అవమానముతో అరుస్తూ, ఏడుస్తున్నాడు. వాడిని ఓదార్చండి. ఎప్పుడు వచ్చాడో! మా ఇంట్లోకి వచ్చి పెట్టెలో తన ఉంగరాల చేయి పెట్టాడు. అందరికీ తండ్రి అయిన ఆ తిరుపతి కొండ ఏలేవాడిని, బాలకృష్ణుడిని తప్పకుండా పట్టుకొని పెట్టె వాడి తలమీద పెట్టండి.

*****

ఈ కీర్తనలో భగవంతుని కన్నబిడ్డగా చూసే తల్లి ప్రేమ వరదలుగా పారింది. పసిబిడ్డ తల్లి దగ్గర గారాలు పోతుంటాడు. అమ్మ దగ్గరికి వచ్చినట్లే వచ్చి అంతలోనే తుర్రుమని పారిపోతుంటాడు. కన్నాని.... పట్టుకోండి... చిన్నాని ... పట్టుకోండి.. అని నిత్య జీవితంలో తల్లులు పిల్లలతో ఆడే దోబూచులాటలను కవి అందంగా రాశాడు.

"మా ఇంట్లో వెన్నకుండలో చేయి పెట్టావేమిట్రా?" అని ఒకగోపిక గద్దిస్తే, "మరేనండి! మా దూడ తప్పిపోయిందండి. ఇందులో ఉందేమోనని వెతుకుతున్నానండి" అని లీలాశుకుడు కర్ణామృతంలో మధురంగా రాశాడు. అన్నమయ్య కృష్ణుని చేష్ట దానితో పోటీ పడింది. ఎవరో వెన్న చిలుకుతుంటే వాళ్ళ కుండలో చేయి పెట్టింది తాను. "చూడు! నాచేయి నొప్పెడుతోంది" అని నోట్లోచొంగ కారుతుండగా ముద్దుముద్దుగా ఏడుస్తున్నాడు. ఆ సమయంలో పిల్లలని కొట్టడానికి చేయిరాదు. "ఏం... నాన్నా! ఉండలేం.

పోటీ పడింది. ఎవరో వెన్న చిలుకుతుంటే వాళ్ళ కుండలో చేయి పెట్టింది తాను. "చూడు! నాచేయి నొప్పెడుతోంది" అని నోట్లోచొంగ కారుతుండగా ముద్దుముద్దుగా ఏడుస్తున్నాడు. ఆ సమయంలో పిల్లలని కొట్టడానికి చేయిరాదు. "ఏం... నాన్నా! ఏమయిందమ్మా!" అంటూ ప్రేమగా ఊరడించబుద్ధేస్తుంది. సహజమైన ఈ తెలుగువాడి అభిమాన స్వభావాన్ని తన కీర్తనలో చిత్రించిన అన్నమయ్యకు 'జయహో' అనకుండా ఉండలేం.

మూడుచరణాలలో మూడు రకాల చేతులు. మొదటి దాంట్లో పూల చేయి. రెండవ దాంట్లో మోచేతి వరకు ఏవో ఆభరణాలున్న చేయి. మూడవ దాంట్లో ఉంగరాల చేయి. ఉంగరాల చేతిని డబ్బులున్న పెట్టెలో పెట్టాడు. 'ఆ పెట్టె వాడి నెత్తిమీద పెట్టండమ్మా!" అని అన్నమయ్య బోధ. పెట్టెడబ్బు దాచుకోనేదానికి గుర్తు. అంటే మనకున్న సంపదను దేవునికి, దైవ కార్యాలకు వాడమని వ్యంగ్యంగా ఉపదేశించాడు అన్నమయ్య. కేవలం ఇలా ఉపదేశించడమే కాదు, శుక్రవారపు అభిషేకాలు మొదలైన వాటి కోసం అన్నమయ్య తన సర్వస్వాన్ని స్వామి వారికి అర్పించినట్లుగా ఆధారాలున్నాయి. ఇలా ఆధ్యాత్మిక అర్థంలోనే కాదు. లౌకికార్థంలో తీసుకొన్నా – పెట్టెలో చేయి పెట్టిన వాడు ఎవరితోనూ పోలిక చెప్పటానికి వీలులేని వేంకటేశ్వరుడు. సంపదలను మనకు ప్రసాదించినవాడు. చిన్నికృష్ణుడి వేషంలో వచ్చి మన సంపదల పెట్టెమీద చేయి వేసినంత మాత్రాన – నీ సొమ్మేం పోయింది తల్లీ! ఆ పెట్టె వాడి నెత్తిమీద పెట్టు అని కూడా అర్థంగా చెప్పుకోవచ్చు.

"ఇట్టి ముద్దులాడి బాలుడు" అని చిన్న పిల్లవాడిని వర్ణిస్తూ. అంతలోనే గామిడి (=ఊరిపెద్ద) అని అన్నమయ్య ఎందుకన్నాడబ్బా! ఆయన ఏది రాసినా, ఏ దేవుడి గురించి రాసినా, అది చిట్టచివర వేంకటేశ్వరుని ముద్రతో పూర్తి అవుతుంది. ప్రపంచమే ఒక కుగ్రామమని ఇంటర్నెట్ యుగంలో మనం భావిస్తున్నాం. ఈ లెక్కన తీసుకున్నా ఈ 'ప్రపంచ కుగ్రామపు పెద్ద' వేంకటేశ్వరుడు కావటంలో ఆశ్చర్యం లేదు. కాదు – అప్పటి లెక్క ప్రకారం చెప్పుకొన్నా అన్నమయ్య కాలానికి తిరుపతి ఒక పల్లె. అందువలన వేంకటేశ్వరుణ్ణి (కృష్ణుడు) గ్రామ పెద్దగా అన్నమయ్య భావించాడని చెప్పుకోవటంలో తప్పులేదు.

"ఇట్టి" అనే పదంతో ప్రారంభమయ్యే పల్లవిని ప్రతి చరణంలోని మూడవ పాదం అయిన తర్వాత కలిపి చదువుకొంటే అందంగా ఉంటుంది. "దొంగ ఏడుపులు ఏడ్చేవాడు. చొంగ కార్చేవాడు. పోలిక లేనివాడు – ఇట్టి ముద్దు బాలుడెక్కడ?" అని అన్నమయ్య ప్రశ్న. "స్వామీ! అందంగా ఉన్న నీ కీర్తనలో!" అని మన జవాబు.

10. ఇన్ని రాశుల యునికి...

ఇన్నిరాశుల యునికి యింతి చెలువపు రాశి
కన్నె నీ రాశి కూటమి కలిగిన రాశి

కలికి బొమవిండ్లుగల కాంతకును ధనురాశి
మెలయు మీనాక్షికిని మీనరాశి
కులుకు కుచకుంభముల కొమ్మకును కుంభరాశి
చెలగు హరి మధ్యకును సింహరాశి

చిన్ని మకరాంకపు బయ్యెద చేడెకు మకరరాశి
కన్నె పాయపు సతికి కన్నెరాశి
వన్నెమై పైడి తుల దూగు వనితకు దులా రాశి
తిన్నని వాడి గోళ్ళ సతికి వృశ్చికరాశి

ఆముకొను నొరపుల మెరయు సతివకు వృషభరాశి
గామిడి గుట్టు మాటల సతి కర్కటక రాశి
కోమలపు చిగురుమోవి కోమలికి మేషరాశి
ప్రేమవేంకటపతి గలసె ప్రియ మిథునరాశి

ముఖ్యపదార్థం

కన్నె	=	నాయిక (అలంకార శాస్త్రం)
కూటమి	=	చెలిమి
కలికి	=	అందమైన
బొమవిండ్లు గల	=	ధనుస్సుల వంటి కనుబొమలు గల
కాంత	=	కోరదగిన ఆడుది
మీనాక్షి	=	చేపల వంటి కన్నులు గల నాయిక
కొమ్మ	=	స్త్రీ
హరిమధ్య	=	సింహము వంటి నడుము గల స్త్రీ
మకరాంకపు బయ్యెద	=	మన్మథుని జెండా మొసలి గుర్తున్న పయ్యెద
సతి	=	చూడటంతోనే పాపం పోగొట్టే స్త్రీ

చేడె	=	స్త్రీ
పైడి	=	బంగారము
ఆముకొను	=	గాఢంగా
గామిడి	=	బలిసిన

భావం :

అన్నమయ్య ఈ కీర్తనలో అలిమేలు మంగమ్మలో అన్ని రాశులున్నాయని చమత్కరిస్తున్నాడు.

ఓ వేంకటేశ్వరా! అలిమేలు మంగలో అన్ని రాశులు ఉండటం వలన, ఆమె అందాల రాశి. మీ ఇద్దరి జాతకాలు మా బాగా కలిసిపోయాయి.

అందమైన విల్లులాంటి కనుబొమలు ఉన్న అలిమేలు మంగలో ధనురాశి (1) ఉంది. చేపల్లాంటి ఆమె కళ్ళల్లో మీనరాశి (2) ఉంది. శృంగారంగా కదలి ప్రకాశించే ఆమె కుంభాల (=కుండలు) వంటి స్తనాల్లో కుంభరాశి (3) ఉంది. వయ్యారంగా సన్నగా సింహం నడుములా ఉన్న ఆమె నడుములో సింహరాశి(4) ఉంది.

మన్మథుడి జెండా మొసలి గుర్తులతో ఉన్న ఆమె పైటలో మకరరాశి (5) ఉంది. యౌవనం ఎప్పుడూ స్థిరంగా ఉండే కన్నెవయస్సు ఉన్న ఆ పతివ్రతలో కన్నెరాశి(6) ఉంది. బంగారముతో తులతూగే ఆమెలో తులారాశి (7) ఉంది. అందమైన వాడి గోళ్ళున్న ఆమెలో వృశ్చికరాశి (8) ఉంది.

వృషభానికి (=ఎద్దుకు) సంబంధించిన సంగీత స్వరం రిషభం. ఆ రిషభ స్వరాన్ని తతిమ్మా స్వరాలతో పాటు అందంగా పలికే ఆమెలో వృషభరాశి (9) ఉంది. ప్రౌఢమైన రహస్యపు మాటలతో గుట్టుగా మాట్లాడే ఆమెలో కర్కాటక రాశి (10) ఉంది. మృదువైన లేత ఆకు వంటి పెదవి గల చక్కదనము గల ఆమెలో మేషరాశి(11) ఉంది. ప్రేమతో నిన్ను (శ్రీవేంకటేశ్వరుని) కలిసే ఆమెలో మిథునరాశి (12) ఉంది.

*****

ఎదుటి పొట్టేలుతో పోరాడుతుంది కనుక గొర్రెను మేషమన్నారు. మేష వాహనుడు అగ్ని. అగ్ని రంగు ఎరుపు. అందువల్ల లేతగా, ఎర్రగా, చిగురులాంటి పెదవి ఉన్న ఆమెలో మేషరాశి ఉందన్నాడు కవి. ఎండ్రకాయ గుట్టుగా ఉంటుంది. సమయం వచ్చినప్పుడు ఒక పట్టు పడుతుంది. స్వామితో గుట్టు మాటలు బాగా మాట్లాడే అలిమేలు మంగలో కర్కాటక రాశి ఉందనటం ఆలోచనామృతం.

బంగారంతో లేదా ఐశ్వర్యంతో తులతూగుతున్నారని తెలుగు సంభాషణల్లో చెబుతుంటారు. బంగారంతో తులతూగే (=సమానమైన) ఆమెలో తులారాశి ఉందని ఈ జాతీయాన్ని అన్నమయ్య అలవోకగా రాశాడు. లక్ష్మీదేవి రూపమైన అలిమేలు మంగని హిరణ్యమయిగా (=బంగారంతో కూడుకొన్నది) పొగుడుతూ అనేక స్తోత్రాలు ఉన్నాయి.

"రసికులైనవారు రమణులకొకవేళ
వంగుటెల్ల ధర్మవర్తనంబు
ఈరసమున విల్లు నారికి వంగదా
చిత్తజాత రూప సింగభూప

(రసికులు రమణులకు లొంగి ఉండటం ధర్మమే. అల్లె తాటికి విల్లు లొంగి ఉంటుంది కదా!)" అనే పోతన పద్యం ఎంత చమత్కారంగా ఉందో, అందమైన విల్లు లాంటి కనుబొమలు ఉన్న అలిమేలు మంగలో ధనురాశి ఉందను అన్నమయ్య పోలిక అంత రమణీయంగా ఉంది.

అన్నమయ్య చేసిన ఈ రాశుల వర్ణనని అందిపుచ్చుకొని దాదాపుగా అవే అర్థాలు వచ్చేటట్లు "కన్యకు నైదు జంఘలును కన్యకు నారుకుచంబులెన్నగా", "సంతప్తె దశమ ధ్వజాదిగతినా" మొదలైన పద్యశ్లోకాలు వచ్చాయి.

అన్నమయ్య మార్గదర్శకుడు.

11. ఇప్పుడిటు కలగంటి నెల్లలోకములకు

ఇప్పుడిటు కలగంటి నెల్లలోకములకు
నప్పుడగు తిరువేంకటాద్రీశుగంటి

అతిశయంబైన శేషాద్రి శిఖరము గంటి
ప్రతి లేని గోపుర ప్రభలు గంటి
శతకోటి సూర్యతేజములు వెలుగగ గంటి
చతురాస్యు బొడగంటి చయ్యన మేలుకంటి

కనక రత్న కవాట కాంతులిరుగడ గంటి
ఘనమైన దీప సంఘములు గంటి
అనుపమ మణిమయమగు కిరీటము గంటి
కనకాంబరము గంటి గక్కన మేలుకంటి

అరుదైన శంఖచక్రాదులిరుగడగంటి
సరిలేని అభయహస్తము గంటి
తిరు వేంకటాచలాధిపుని జూడగగంటి
హరిగంటి గురుగంటి నంతట మేలుకంటి

భావం :

అన్నమయ్యకు తన పదహారవ సంవత్సరంలో శ్రీవేంకటేశ్వరుడు కలలో కనిపించాడు. ఆ దివ్య మంగళ విగ్రహాన్ని, ఆ మహానుభావుడి నివాసాన్ని చూసిన ఆనందాన్ని తన వాళ్ళతో అన్నమయ్య ఈ కీర్తనలో పంచుకొంటున్నాడు.

ఇప్పుడే ఇలా కలగన్నాను. ఆ కలలో అన్ని లోకాలకి తండ్రయిన (= అప్పడగు) శుభాలనిచ్చే (= తిరు) వేంకట శిఖరం మీద ఉండే స్వామిని చూశాను.

మహిమలతో ఎక్కువైన (= అతిశయంబైన) సప్తగిరులలో ఒక కొండైన శేషపర్వతపు కొన (= శేషాద్రి శిఖరము) చూశాను. సాటిలేని (= ప్రతిలేని) గోపుర కాంతులు (=ప్రభలు) చూశాను. నూరు కోట్ల (= శతకోటి) సూర్యకాంతులు ఒక్కసారి వెలిగిపోతుంటే చూశాను. నాలుగు ముఖాల (= చతురాస్యు) బ్రహ్మను చూశాను. (= పొడగంటి) వెంటనే (= చయ్యన) మేల్కొన్నాను.

బంగారము మాణిక్యములు చెక్కిన తలుపుల (=కవాట) కాంతులు రెండువైపుల (=ఇరుగడ) చూశాను. గొప్పగా ప్రకాశించే అనేక దీపాలు చూశాను. సాటిలేని (=అనుపమ) మణులతో ఉన్న స్వామి కిరీటాన్ని చూశాను. స్వామి ధరించిన బంగారువస్త్రాన్ని (=కనకాంబరము) చూశాను. వెంటనే (=గక్కన) మేల్కొన్నాను.

స్వామివారి రెండుప్రక్కల అపూర్వమైన (=అరుదైన) పాంచజన్యమనే శంఖాన్ని, సుదర్శన చక్రాన్ని చూశాను. దేనితో సమానం కాని (=సరిలేని) అభయ హస్తాన్ని చూశాను. శ్రీవేంకటేశుని చూసే అదృష్టాన్ని పొందాను. విష్ణువును (=వేంకటేశుని) చూశాను. గురువును చూశాను. తర్వాతమేలుకొన్నాను.

*****

అన్నమయ్య కాలానికి ముందున్న పల్లవ రాజులు మొదలయిన వాళ్ళు స్వామి వారి గోపురానికి బంగారు పూతలు ఉన్న రాగిరేకులు వేయించారు. దీనిని కలలో చూసి పరవశించి సాటిలేని గోపుర కాంతులు చూశానన్నాడు కవి.

కనకరత్న కవాట కాంతులిరుగడగంటి – అని అన్నమయ్యచెప్పింది – ఈ రోజు మనము చూసే బంగారు వాకిలి కాంతుల గురించి. క్యూలో నిలబడి వెళ్ళిన తర్వాత ఇక్కడినుంచే స్వామి వారి దర్శనం మనకు లభిస్తుంది. ఈ బంగారు వాకిలి ముందు ప్రతిరోజూ స్వామివారి సుప్రభాతం తెల్లవారుజామున చదువుతారు.

తొండమాను చక్రవర్తికి స్వామివారు తన శంఖచక్రాలను ఇచ్చి, వరప్రభావం వలన తిరిగి వాటిని స్వీకరించలేదని వేంకటాచల మాహాత్మ్యంలో చెప్పారు. అయితే సరిగ్గా ఈ ఘట్టములోనే శంఖచక్రాలు అదృశ్యంగా స్వామివారి దగ్గరగా ఉన్నాయనే వాక్యం ఉంది. అన్నమయ్య గొప్ప భక్తుడు. కనుక శంఖచక్రాలు ఆయనకు కనబడ్డాయి. స్వామివారి రెండు చేతుల్లో ధరించిన శంఖచక్రాలు స్వామి మూల స్వరూపంలో లేవని తర్వాత తగిలించారని కొందరంటారు. ఈ వాదాన్ని అన్నమయ్య కీర్తన ఖండిస్తోంది.

భయం లేదని చెప్పటానికి అరచేతి వేళ్ళను నిలువుబట్టి ముందరికి చాచిన హస్తాన్ని అభయహస్తం అంటారు. దానిని చూశానని అన్నమయ్య చెబుతున్నాడు. అభయహస్తం ఖాళీగా కనిపిస్తుంది. కాని దాంట్లో లేనిదంటూ ఏమీలేదు (సత్యసాయి) ఇవ్వలేనిదంటూ ఏమీలేదు.

అన్నమయ్య చూసిన గురువు ముక్తిని అనుభవిస్తున్న శ్రీ శఠకోపయతి అని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు చెప్పారు. శ్రీ వేంకటేశ సహస్ర నామస్తోత్రములో గురుః అని ఉంది. అందువల్ల ఈ కీర్తనలో గురుశబ్దం స్వామివారికి పర్యాయపదంగా కూడా

అన్నమయ్య వాడి ఉండవచ్చు. ఎందుకంటే ఆ తర్వాతే స్వామివారి ఇంకో పర్యాయపదమైన విష్ణుశబ్దాన్ని కవి ప్రయోగించాడు కనుక.

వెంకన్న ఆభరణాలు 11టన్నులు దాటాయని ఒక లెక్క. ఇటీవలే రామన్ స్పెక్ట్రోమీటర్ ద్వారా స్వామివారి వజ్రాభరణాల విలువను లెక్కించటం మొదలయింది. కలలని జీవశాస్త్ర పరంగా మనస్తత్వ శాస్త్రపరంగా, ఆధ్యాత్మిక పరంగా విశ్లేషణలు చేసినవారున్నారు. ఎవరి నమ్మకాలు వారివి.అన్నమయ్యకు కలలో జరిగింది ఇలలో కూడా జరిగింది. కలలో కనిపించిన స్వామి ఇలలో కూడా కనిపించి అనుగ్రహించాడు. వెలకట్టలేని పద సంపదను ప్రసాదించి, పదకవితా పితామహుడిని చేశాడు.

వేంకటేశుడు అన్నమయ్యకు కల్లో కనిపించినది తిరుపతికి అతడు వెళ్ళక మునుపు. తిరుపతికి వెళ్ళిన తర్వాత స్వామివారి నిజరూపాన్ని చూసిన ఆనందంలోమళ్ళీ కంటి శబ్దాన్ని వాడుతూ 'కంటినఖిలాండ కర్త నధికుని గంటి' అను కీర్తన రాశాడని ప్రసిద్ధి. సీతను చూసిన హనుమంతుడు రామునితో పలికిన మొదటి మాట 'దృష్టా దేవీ' (సీతమ్మను కంటి). ఈ 'కంటి' మాట అమృతంతో సమానమైనదని వాల్మీకి మహర్షి పేర్కొన్నారు. అందుకే కాబోలు – అన్నమయ్య కూడా వేంకటేశుని వంటి అమృతమూర్తిని చూసిన ఆనందంలో అమృతంతో సమానమైన కంటి శబ్దాన్ని అనేకమార్లు ప్రయోగించాడు.

ఆనందాన్ని ఏదో సందర్భంలో అందరం పొందుతాం. ఆ ఆనందాన్ని బయటికి చెప్పాలంటేనే అక్షరాలు మనకు లొంగవు. మనంచెప్పాలనుకొంటున్న దానికి, చెబుతున్నదానికి మధ్య లంకె ఏదో తెగిపోయిన విషయం మనకు స్పష్టంగా తెలుస్తుంటుంది. దైవానుగ్రహం పొందిన అన్నమయ్య లాంటివాళ్ళకి ఈ ఇబ్బంది ఉండదని ఈ కీర్తన సాక్ష్యం చెబుతుంది.

12. ఎక్కడి మానుష జన్మంబెత్తిన

ఎక్కడి మానుష జన్మంబెత్తిన
ఫల మేమున్నది నిక్కము
నిన్నే నమ్మితి నీ చిత్తంబికనూ

మరవను ఆహారంబును మరవను సంసార సుఖము
మరవను ఇంద్రియ భోగము మాధవ నీమాయా
మరచెద సుజ్ఞానంబును మరచెద తత్వ రహస్యము
మరచెద గురువును దైవము మాధవ నీ మాయా

విడువను బాపము పుణ్యము విడువను నా దుర్గుణములు
విడువను మిక్కిలి యాసలు విష్ణుడ నీ మాయా
విడిచెద షట్కర్మంబులు విడిచెద వైరాగ్యంబును
విడిచెద నాచారంబును విష్ణుడ నీ మాయా

తగిలెద బహు లంపటముల తగిలెద బహు బంధంబుల
తగులను మోక్షపు మార్గము తలపున యెంతైనా
అగపడి శ్రీవేంకటేశ్వర అంతర్యామివై
నగినగి నను నీవేలితి నాకా యీ మాయా

భావం :

అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యులవారు రాసిన కీర్తన ఇది.

84 లక్షల జన్మలలో మానవజన్మ ఎక్కడిది? ఈ జన్మఎత్తిన లాభం ఏమిటి? (లాభం లేదని భావం). ఓ వేంకటేశ్వరా! నిన్నే నమ్ముకొన్నాను. ఇది నిజం (= నిక్కము). ఈ నమ్ముకొన్న భక్తుడిని ఏం చేస్తావో... అది నీఇష్టం (= నీ చిత్తంబికనూ)

మాధవ! (= లక్ష్మికి భర్తా!)నీ భక్తుడనైన నేను వేళకు అన్నం తినటం మరవను. రాత్రయ్యేసరికి లభించే సంసార సుఖం మరవను. కర్మ, జ్ఞాన ఇంద్రియాల వల్ల లభించే సుఖాల భోగం మరవను. ఇదంతా నీ మాయ! ఏదయితే నీ సంబంధమైన జ్ఞానముందో (= సుజ్ఞానంబును) దానిని మరచిపోతాను. దేవుని తెలుసుకొనే (= తత్వ) రహస్యాలు మరిచిపోతాను. గురువును దైవాన్ని మరచిపోతాను. ఇది కూడ నీ మాయ.

పాపాన్ని, పుణ్యాన్ని విడువను. నా చెడ్డ గుణాలు విడిచిపెట్టను. దురాశలు (=మిక్కిలి యాసలు) విడిచి పెట్టను. ఓ విష్ణుదేవా! ఇదంతా నీ మాయ. యజ్ఞం చేయటం, యజ్ఞం చేయించటం, గురువు దగ్గర వేదం చదువుకోవటం, వేదం చదివించటం, దానం చేయటం, అవసరమైన మేరకు దానం తీసుకోవటం అనే ఆరుకర్మలు విడిచి పెడతాను. దేనిమీద ఆసక్తిలేని వైరాగ్య గుణాన్ని విడచిపెడతాను. ఆచారాలు విడచి పెడతాను. ఇదంతా నీ మాయ.

సంబంధాలు కలిగించే అనేక పనులు (= బహు లంపటములు) తగిలించు కొంటాను. అనేక బంధాలలో చిక్కుకొంటాను. కాని అదేం కర్మమో కాని, ఎంత జరగనీ! మోక్షపు మార్గంలో నడవను. స్వామీ! నువ్వు నాకు ఎదురుగా కనబడతావు (= అగపడి) నాలోపల అంతర్యామిగా ఉంటావు. ఏమీ చేయలేని నా చేతకాని తనాన్ని చూసి నవ్వుకొంటుంటావు. అయినా నిన్ను శరణుపొందిన నాకా యీ మాయా?! (నీభక్తుడనైన నాకు మాయ తగదు. మాయను తొలగించమని విన్నపం)

*****

భగవంతుని అతి విచిత్రమైన శక్తి మాయ. ఈ మాయను ఎవరూ దాటలేరని, తనను సేవించినవారు ఈ మాయను దాటవచ్చని భగవానుడు భగవద్గీతలో చెప్పిన శ్లోకానికి (7-14) ఈ కీర్తన సారాంశం లాంటిది.

తిక్కన భారతంలో ధర్మరాజు కృష్ణుడితో 'మాకు మా నాన్న పాండుమహారాజు పెద్ద దిక్కుగా నిన్నచూపించి వెళ్ళాడు' అంటాడు. తండ్రి చేసే రక్షణ లాంటివి నువ్వు చెయ్యక తప్పదని, ఇకపై మా బాధ్యతంతా నీదే అని చెప్పకుండా ధర్మరాజు చెప్పాడు. సరిగ్గా ఇదే మోస్తరులో ఈకీర్తన పల్లవిలో కవి 'నిన్నే నమ్ముకొన్నాను. ఇక నీఇష్టం' అన్నాడు స్వామివారితో. అంటే నమ్ముకొన్నవాళ్ళని నువ్వు రక్షించక తప్పదని ధ్వని.

చర్మం, కన్ను, చెవి, నాలుక, ముక్కు - ఇవి జ్ఞానేంద్రియాలు. వాక్కు, చేయి, పాదం, పాయువు, జననేంద్రియం - ఇవి కర్మేంద్రియాలు. ఈపదింటిని కలిపి దశేంద్రియాలంటారు. కొంతమంది మనస్సుతో కలిపి ఇంద్రియాల సంఖ్య పదకొండుకు పెంచారు. ఈ పదకొండు ఇంద్రియాలు సుఖాన్ని, భోగాన్ని కోరుకుంటున్నాయి కాని, శాశ్వత సుఖాన్ని ఇచ్చే నీ గురించి ఆలోచించటం లేదని జీవుని బాధ కవి ప్రకటించాడు. ఆధ్యాత్మ సాధన చేసేవాడు ఆహారం తీసుకోవటంలో నియమాలున్నాయి. ఆ ఆహారం న్యాయంగా సంపాదించినది అయి ఉండాలి. పరిమితంగా ఉండాలి. రుచి కోసం కాకుండా ఆకలి కోసం తీసుకోవాలి. మాంసాహారం కాకూడదు. దేవునికి నివేదించి తినాలి.

ఈ ఆహార నియమాలన్నీ పాటించలేకపోతున్నాను అంటూ, ఇది నా తప్పుకాదు-నీ మాయ అంటున్నాడు కవి..

గొడ్డు ఎంత వేగంగా ముందుకు వెళదామనుకొన్నా, లంపటం సాగనీయదు. ఆధ్యాత్మ సాధన చేసేవాని పరిస్థితి కూడా ఇంతే! తనుస్వయంగా తగిలించుకొన్న సంబంధాలు తాననుకొన్న కృషిని సాగనీయవు. ఇది నీ మాయే అని కవి చెప్పటంలో, దీనిని తొలగించమనే ఆర్తి ఉంది.

మోక్షపు మార్గం అంటే శ్రేయోమార్గం. (కర్మ, భక్తి, జ్ఞాన మార్గాలు) ఇది నిత్య సుఖాన్ని కలిగించేది. దీనికి విరుద్ధమైనది ప్రేయోమార్గం. అంటే భౌతిక సుఖాల మీద ఇష్టం. నేను ఈ లోకంలో కనిపించే తాత్కాలిక సుఖాల మీద మోజు పడుతున్నాను. శాశ్వత సుఖాన్ని కలిగించే మోక్షపు మార్గం సంగతి ఆలోచించనని కవి వాపోతున్నాడు. వైరాగ్యమంటే అల్లాటప్పగ వచ్చేది కాదు. అనుభవిస్తున్న భోగాలను విడిచి పెట్టడం, కొత్త భోగాలను కోరుకోకుండా ఉండటం. ఈ రెండింటినీ పాటించగలిగితే వైరాగ్యం వచ్చినట్టే. ఇది విడిచిపెట్టానని కవి ఆవేదన.

చేయకూడనివి చేస్తున్నాను. చేయవలసినవి చేయటం లేదు. ఈ రెండింటికీ నీ మాయ కారణం అని, తన తప్పేమీ లేదని ఈ కీర్తనలో కవి చమత్కరిస్తున్నాడు. ఇది ఉత్తమ మానవునిగా ఎదగలేని దుర్యోధన స్వభావం. 'నాకు ధర్మం అంటే ఏమిటో తెలుసు. కాని అది నన్ను ఆకర్షించదు. అధర్మమంటే ఏమిటో తెలుసు. నేను దానిని విడవలేకపోతున్నాను' (జానామి...) ఈరకమైన దుర్యోధన స్వభావం దేవుని మాయ అని, ఆయనని హృదయ పూర్వకంగా శరణు కోరితే ఈమాయను తప్పించుకోవచ్చని ఈ కీర్తనలో అన్నమయ్య వారసుని సందేశం.

మాయతో కూడిన పరమాత్మ, పాలలో నెయ్యిలాగ ప్రతి జీవిలోను అంతర్యామిలా ఉంటాడు. ఆ స్వామికి జీవుల ఆవేదనలను చెప్పి, వాటికి శరణాగతి అనే పరిష్కారాన్ని సూచించిన ఉత్తమ కీర్తన ఇది.

13. ఎవ్వరెవ్వరివాడో యీ జీవుడు చూడ

ఎవ్వరెవ్వరివాడో యీ జీవుడు చూడ
నెవ్వరికి నేమౌనొ యీ జీవుడు

ఎందరికి గొడుకుగాడీ జీవుడు వెనక
కెందరికి దోబుట్టడీ జీవుడు?
ఎందరిని భ్రమయించడీ జీవుడు దుఃఖ
మెందరికి గావింపడీ జీవుడు?

ఎక్కడెక్కడ దిరుగడీ జీవుడు వెనక
కెక్కడో తనజన్మ మీ జీవుడు?
ఎక్కడి చుట్టము తనకు నీ జీవుడు ఎప్పు
డెక్కడికి నేగునో యీ జీవుడు?

ఎన్నడును జేటులేనీ జీవుడు వెనక
కెన్ని తనువులు మోవడీ జీవుడు?
ఎన్నగల తిరువేంకటేశు మాయల దగిలి
యెన్ని పదవుల బొందడీజీవుడు?

ముఖ్యపదార్థం :

వెనకకెందరికి	=	వెనుక జన్మలలో ఎందరికి
మోవడీ	=	ధరించడు?
పదవుల బొందడీ	=	హోదాలను పొందడు?
జీవుడు	=	ప్రాణి, జీవాత్మ

భావం :

జీవుడంటే ఏమిటో, అతని స్వరూప స్వభావాలేమిటో చెబుతూ వేంకటేశ్వరుని కరుణ జీవుడికి ఎంత అవసరమో అన్నమయ్య కీర్తనలో పేర్కొన్నాడు.

ఈ జీవుడు ఎవరెవరికి సంబంధించిన వాడు? ఎవరికి ఏమౌతాడు? ఈ జీవుడు వెనుక జన్మలలో ఎందరికి కొడుకు? ఎందరికి తోబుట్టువు? వెనుకటి జన్మలలో ఎందరిని

భ్రమలలో ఉంచాడు? ఎందరికి దుఃఖము కలిగించాడు? వెనుకటి జన్మలలో ఎక్కడెక్కడ ఈ జీవుడు తిరిగాడు? ఎన్నిచోట్ల పుట్టి ఉంటాడు? జీవుడు ఈ జన్మలో ఈ శరీరానికి చుట్టమెలా అవుతాడు? రాబోయే జన్మలలో ఈ జీవుడు ఎక్కడికి వెళతాడు? ఆలోచిస్తే ఈ జీవాత్మకు నాశనం లేదు. అతడు దాల్చిన శరీరాలు నశిస్తున్నాయి. జీవాత్మ నశించటం లేదు. ఇదంతా శ్రీవేంకటేశ్వరుని మాయ. దేవతాభావం, మోక్షం –ఇలాంటి పదవులు స్వామి దయ ఉంటే జీవుడికి లభిస్తాయి.

*****

నదీప్రవాహంలో కొన్ని కట్టెపుల్లలు ఒకచోట కలిసి మరలా విడిపోయినట్లు కొందరు జీవులు ఒకచోట కలిసి మరలా ఎవరి దోవన వారు పోవుచున్నారు. ఇంకో రకంగా చెప్పాలంటే సాయంకాలంలో ఒక చెట్టుమీద గుమికూడిన రకరకాల పక్షులు తెల్లవారి ఎక్కడెక్కడికో ఎగిరిపోతాయి. జీవులు ఇంతే. రుణానుబంధంతో కలుసుకొని మరలా ఎవరికి వారు విడిపోతుంటారు. అందుకే ఎవరూ ఎవరికీ ఏమీ కారు అని కవి వాక్కు.

చనిపోయినవాడు ప్రేత రూపంలో ఒక సంవత్సరం ఉంటాడు. మొదటి పది రోజులు జీవుడి పంచప్రాణాలూ (ప్రాణ, అపాన, వ్యాస, ఉదాన, సమాన) చనిపోయిన స్థలంలో, శ్మశానంలో, కర్తలో, కాకులలో, వాయువులో ఉంటాయి. సంచయనం (శవాన్ని దహనం చేసిన పిదప ఎముకలను, బూడిదని పోగుచేయటం)అయ్యేదాక ప్రాణాలు నానా బాధలు పడుతుంటాయి. కర్మలు చేసిన తర్వాత ఆ ప్రాణాలు ఒకచోట చేరి యాతనా శరీరం ధరిస్తాయి. సాంవత్సరీకం (చనిపోయిన వారి కొరకు ఏడాది చివర చేసే శ్రాద్ధకర్మ) అయిన మర్నాడు యముడి దగ్గర జీవుడిని ప్రవేశపెడతారు. శిక్షలేమైనా ఉంటే అనుభవించి జీవులు పుణ్యలోకాలకు పోతారు. పుణ్యాలు క్షీణించిన తర్వాత మళ్ళీ జన్మ ఎత్తుతారు. "ఎక్కడెక్కడ తిరుగడీ జీవుడు" అని అన్నమయ్య అనటంలో భావం ఇదే. రవీంద్రనాథ్ టాగూర్ కూడా గీతాంజలిలో "ఈ లోకం నుంచి మరో లోకానికి నడిపించేది నువ్వే" అని జీవుడిని నడిపించే శక్తిని నుతించాడు.

కొందరిని చూస్తే పెట్టబుద్ధేస్తుంది. కొందరిని చూస్తే తిట్టబుద్ధేస్తుందని తెలుగు వాడి మాట. ఒక్కో వ్యక్తిని మొదటిసారి చూసినప్పుడు అతనితో ఎప్పటినుంచో పరిచయం ఉన్నట్టు అనిపిస్తుంది. ఏదో తెలియని భావం మనసంతా ఆక్రమిస్తుంది. వీటినే కాళిదాసు జన్మాంతర సౌహృదాలు (మరొక జన్మలో స్నేహాలు) అన్నాడు. పూర్వజన్మలో తానెవరో తెలుసుకోవాలంటే మన సంస్కారాల్ని నియమించాలన్నాడు పతంజలి. వీటిని కలగలుపుతూ "వెనకెక్కడో తన జన్మ మీ జీవుడు?"అని కవి మాట. ఆగామి (ఈ జన్మలో

చేసే పనులు). ప్రారబ్ధం (ఈ జన్మ పూర్తయ్యేంతవరకు అనుభవించటానికి విధి నియమించిన కర్మ). సంచితం (పూర్వజన్మలో సంపాదించిన పుణ్యపాపాలతో కూడిన కర్మ) ఈ మూడు కర్మలు జీవుడిపై ప్రభావం చూపిస్తాయి. అందుకే తోటివారిని ఎందరినో భ్రమింప జేసి, తాను రకరకాల భ్రమలలో పడటానికి కారణమైన కర్మలను భ్రమల రూపంలో అన్నమయ్య ప్రస్తావించాడు.

ఇంద్రియాలని దుర్మార్గంగా బాధపెట్టే దాన్ని దుఃఖమన్నారు. జీవుడు దుఃఖంతో పుడతాడు. దుఃఖం నుండి పారిపోవటానికి సుఖంగా బతకటానికి బతికున్నంతకాలం ప్రయత్నిస్తాడు. అందుకోసం దుఃఖాన్ని ఇతరులకు పంచుతాడు. చిట్టచివరికి తన వాళ్ళకి దుఃఖాన్ని మిగిల్చి లోకం నుంచి జీవుడు సెలవు తీసుకుంటాడు. ఆ రకంగా ఎన్నోవేల జన్మలెత్తిన జీవుడు దుఃఖం ఎంతోమందికి కల్గిస్తున్నాడని అన్నమయ్య 'దుఃఖ మెందరికి కావింపడు' అని సూటిగా ప్రశ్నించాడు. స్వామిని శరణువేడి దుఃఖాంతాన్ని (మోక్షం) పొందమని ఆచార్యుని సందేశం.

తల్లి గర్భంలో ఉన్నప్పుడు జీవుడు దేవుడికి "స్వామీ! ఈ గర్భావాసం భరించలేకపోతున్నాను. తొందరగా బయటపడేయ్. నేను బయటికి వచ్చిన తర్వాత, మళ్ళీ జన్మంటూ రాకుండా నీ ధ్యానం చేసుకొంటా"అని మొరపెట్టుకొంటాడట. పుట్టిన తర్వాత మాయా ప్రభావంతో స్వామికి ఇచ్చిన మాట మరిచిపోయి, ఆయన స్మరణ విడిచి, వేరే స్మరణలు మొదలుపెడుతుంటాడు. సంసార మాయలో పడి హరిని కొలువకుండా అడ్డమైన వాళ్ళందరికీ అడ్డంగా, నిలువుగా దండాలు పెడుతూ జీవుడు జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నాడని అన్నమయ్య ఇంకోచోట (ఛీఛీ వివేకమా!) ఆవేదన చెందాడు.

మనలను ఆవరించిన ఈ సంసార మాయ నుండి విముక్తికి, ఉత్తమ పదానికి తనలా వేంకటేశుని ధ్యానించుమని కీర్తన చివరలోని మాయా ప్రస్తావనలో అన్నమయ్య భావంగా మనం గ్రహించాలి.

తెలిసిన వస్తువు (భగవంతుడు) కోసం చీకటిలో (మాయ) వెతుక్కొంటున్నాం. వస్తువు కనబడడం లేదని బాధపడుతున్నాం. అన్నమయ్య కీర్తన ఒక వెలుగు.

14. ఏమని పొగడుదుమే...

ఏమని పొగడుదుమే యిక నిన్ను (ను)
ఆమని సొబగుల అలమేల్మంగ

తెలిగన్నుల నీ తేటలే కదవే
వెలయగ విభునికి వెన్నెలలు
పులకల మొలకల పొదులివిగదవే
పలుమరు బువ్వుల పానుపులు

తియ్యని నీ మోవి తేనెలే కదవే
వియ్యపు రమణుని విందులివి
ముయ్యక మూసిన మొలక నవ్వు గదె
నెయ్యపుగప్రపు నెరి బాగాలు

కైవసమగు నీ కాగిలి కదవే
శ్రీవేంకటేశ్వరు సిరినగరు
తావుకొన్న మీ తమకములే కదే
కావించిన మీ కల్యాణములు

ముఖ్యపదార్థం :

ఆమని	=	వసంత రుతువు
సొబగుల	=	అందములతో
తెలిగన్నుల	=	తెల్లని (స్వచ్ఛము) కన్నులలో
తేట	=	సారము
పొదులు	=	సమూహములు
రమణుని	=	ప్రియుని, భర్తని
ముయ్యక మూసిన	=	మూయక మూసిన
మొలకనవ్వు	=	లేత నవ్వు
నెయ్యపు	=	అనురాగపు
కప్రపు	=	కర్పూరపు

నెరి బాగాలు = అందమైన తాంబూలాలు
తావుకొన్న = నిలచియున్న

భావం :

ఓ అలమేలు మంగా! వసంత రుతువు అందాలతో ఉన్న నిన్ను పొగడటానికి మాకున్న భావాలు సరిపోవు.

అంతటా వ్యాపించిన వేంకటేశునికి స్వచ్ఛమైన నీ కన్నులలో కాంతులే – వెన్నెల కాంతులు. మాటి మాటికి స్వామి సన్నిధిలో నీకు కలిగే పులకల సమూహాలే – పువ్వులనెడి పరపులు.

నీ ప్రియుడైన వేంకటేశునికి మధురమైన నీ పెదవుల తేనెలే విందు భోజనాలు. మూసీ మూయక పెదవుల చివర నవ్వే నీ లేత నవ్వులు – స్వామికి అందమైన కర్పూరపు తాంబూలాలు.

నీ కౌగిలి శ్రీవేంకటేశ్వరునికి లక్ష్మీ (శోభ) నిలయం. మీ ఇద్దరి ఉత్సాహాలు లోకానికి శుభాలు.

*****

మాధవము (వసంత రుతు సంబంధమైనది), మాధవి (లక్ష్మి), మాధవుడు (విష్ణువు) – ఈ మూడు పదాల మాధుర్యాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో నింపాడు. ఈ కీర్తనలోని కొన్ని పాదాలు సంస్కృత భాషలో శృంగార శిఖరమైన అమరుకాన్ని నువ్వా... నేనా అన్నట్లున్నాయి.

కోరికలతో ప్రజ్వలిస్తున్నప్పుడు కళ్ళు ఎర్రగామారుతాయి. కోరికలు తీరిన తర్వాత– ఆ కమ్మదనంలో కళ్ళలోని ఎర్రదనం తెల్లదనంగామారి నాయకునికి వెన్నెలలవుతాయి. అందుకే అలమేలు మంగమ్మ అను నాయిక యొక్క స్వచ్ఛమైన తెల్లని కన్నులు వేంకటేశ్వరుడను శృంగార నాయకునికి వెన్నెలలు – అని కవి వర్ణన.

పులకలు ఆనందం అధికమైనప్పుడు జనిస్తాయి. సాధారణంగా నిక్కబొడుచుకొన్న వెండ్రుక గరుకుగా ఉంటుంది. హాయినివ్వదు. కానీ పులకలు శృంగార యాత్రలో పువ్వుల పానుపులంటున్నాడు పదకవితా పితామహుడు. ఒక్కసారి కాదుట – 'పలుమరు'. సాహితీ చరిత్రలో ఎవరూ చేయని అచుంబితమైన భావన.

ఏ కవి ఏమి చెప్పాడని కాదు – ఎలా చెప్పాడన్నది ప్రధానమని ఒక అలంకారికుడు అన్నాడు. అన్నమయ్య భావాలకే కాదు–చెప్పిన విధానానికి కూడా రసికుడు పులకించిపోతాడు.

బాగా నవ్వింది... చక్కగా నవ్వింది... ఈ మేరకు మించి నవ్వుని వర్ణించడం సామాన్యులకు చేతకాదు. "స్మితం, హసితం.." అటూ నవ్వులలో రకాలను అలంకారికులు చెప్పారు కాని, ముయ్యక మూసిన నవ్వులను గూర్చి ఏ కవి చెప్పలేదు. పెదవులు ముయ్యకుండా మూస్తూ – ఎదుటివాడి గుండెలను ధమాల్ చేస్తూ నవ్వే గుట్టుచప్పుడైన పెదవి చివర నవ్వు అనుభవ సిద్ధం.

నవ్వులను పువ్వులతో పోల్చటం ఉంది కాని, తాంబూలాలతో పోల్చడం అన్నమయ్యకే చెల్లింది. తాంబూలాన్ని ఒక్కసారిగా ఎవరూ మింగేయరు. నెమ్మదిగా మింగుతూ రుచిని ఆస్వాదిస్తుంటారు. ఇప్పుడు ఊహ చేయండి. అమ్మ వారి నవ్వులను, అయ్యవారి చేష్టలను.

కౌగిలి అనకుండా 'కాగిలి' అని అన్నమయ్య ప్రయోగిస్తుంటాడు. "కోమలి కాగిటిలోనే కోటి కోటి వినయాలు" అని మరొక అందమైన ప్రయోగం (టీటీడి25వ సంపుటం)

తిరుపతి వెంకన్నకు కల్యాణం చేయించటం – మన జీవితంలో కల్యాణం (=శుభం) కోసం. అందుకే అన్నమయ్య నాయికా నాయకుల తమకాలు లోక కల్యాణాలని ముక్తాయింపు పలికాడు. ఋతువుల్లో వసంత ఋతువుని తానేనని చెప్పిన భగవద్గీతా వాక్యం అందరికీ తెలిసిందే.

నాయికలో ఉన్న సొబగులు నాయకునికి సంబంధించినవిగా చేసిన శృంగార వర్ణనలో జీవాత్మ పరమాత్మకి సంబంధించినదనే మర్మం మనం గ్రహించాలి. సామాన్యులకు రాయిలా ఉండే జీవేశ్వర తత్త్వాన్ని వెన్నపూసగా మార్చేది అన్నమయ్య కీర్తనలోని మధురభక్తి. శృంగార మాధుర్యంలో మునిగిపోయిన జీవుని నాలుక – అసలైన జీవన మాధుర్యాన్ని ప్రసాదించే మాధవుడనే ఈశ్వరుని కొరకు తపన పడాలి. అన్నమయ్య శృంగార వర్ణనలో ఈ మహా సత్యాన్ని గుర్తించాలి.

15. ఏమొకొ చిగురుటధరమున

ఏమొకొ చిగురుటధరమున యెడనెడ గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా

కలికి చకోరాక్షికి గడకన్నులు కెంపై తోచిన
చెలువంబిప్పుడిదేమో చింతింపరె చెలులు
నలువున బ్రాణేశ్వరుపై నాటిన యా కొన చూపులు
నిలువున బెరుకగనంటిన నెత్తురు గాదుగదా

పడతికి చనుగవ మెరుగులు పైపై బయ్యెద వెలుపల
కడు మించిన విధమేమో కనుగొనరే చెలులు
ఉడుగని వేడుకతో బ్రియుడొత్తిన నఖశశిరేఖలు
వెడలగ వేసవికాలపు వెన్నెల కాదుగదా

ముద్దియ చెక్కుల కెలకుల ముత్యపు జల్లుల చేర్పుల
వొద్దిక లాగులివేమో వూహింపరె చెలులు
గద్దరి తిరు వేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురతపు జెమటల అందము గాదు గదా

ముఖ్య పదార్థం :

కస్తురి	=	ఒక విధమైన పరిమళ ద్రవ్యం
కలికి	=	అందమైన స్త్రీ
చకోరము	=	గబ్బిలం
కడకన్నులు	=	కళ్లచివరలు
కెంపై	=	ఎరుపై
చెలువము	=	అందం
ఉడుగని	=	తగ్గని
కడు మించిన	=	మిక్కిలిగా
నఖశశిరేఖలు	=	చంద్రరేఖల వంటి గోటి నొక్కులు
వొద్దిక లాగులు	=	పోలిక విధములు
గద్దరి	=	నేర్పు కలిగిన

భావం :

రాత్రి స్వామితో సుఖాలు అనుభవించిన అలమేలు మంగను చెలికత్తెలు ఒకరితో ఒకరు మాట్లాడుకొంటూ ఇలా ఆట పట్టిస్తున్నట్టుగా ప్రసిద్ధికెక్కిన కీర్తన ఇది.

ఈ అలమేలుమంగ పెదవికి నల్లటి కస్తూరి అంటుకొంది చూశావటే! ఎర్రటి కాగితం మీద నల్లటి అక్షరాలతో ఆవిడ తన ప్రియుడికి ఉత్తరం రాసినట్టు ఉంది కదా! అవునే! ఈ ఎర్రటి కళ్ళ సుందరికి ఆ కళ్ళ చివర మరీ ఎర్రగా ఉందేమిటే! ఆ.. ఆ.. తెలిసిందిలే! ప్రియుణ్ణి అదే పనిగా చూస్తున్న వేళ, ఆయన శరీరంలో నాటుకొన్న ఆవిడ చూపులని ఎవరో బలవంతంగా లాగేసరికి ఆ చూపుల చివరలకి అంటిన రక్తపు రంగు అది కాదు కదా (కళ్ళ చివరి ఎరుపు – చూపులను లాగగా అంటిన నెత్తురు అని ఊహ)! అది సరే! ఆవిడ పైట దాటి ఏవో తెల్లటి కాంతులు బయటకు వచ్చి మెరిసిపోతున్నాయ్! అవి ఏమిటబ్బా!.. ఆ... ఆ... తెలిసిందిలే. ఉబలాటంతో ప్రియుడు స్తనాల మీద చేసిన గోటిగుర్తులనే వేసవి కాలపు వెన్నెలలు బైటకు వచ్చాయి. అవునే! మన అలమేలుమంగ చెంపలకు రెండువైపులా వేలాడే ఆభరణాలు ఏవో ఉన్నాయి చూశారటే! అవి ఏమిటో ఊహించగలరా! బాగా నేర్పరి అయిన వేంకటేశుడితో చేసిన రాత్రి ఆటలలో ముఖానికి పట్టిన చెమట బిందువులే అవి.

*****

కస్తూరి వాసన మన సాహిత్యంలో వందల సంవత్సరాల నుంచి గుబాళిస్తోంది. ఆ రోజులలో తాంబూలంలో కస్తూరి వేసుకొనేవారు. మనిషిని చూడకుండానే కస్తూరి పాళ్ళను బట్టి, తాంబూలం వేసుకొంది మగవాళ్ళా; ఆడవాళ్ళా అని గ్రహించే నేర్పు మన పూర్వీకులకు ఉండేది (మనుచరిత్ర). ఆయుర్వేదాన్ని అనుసరించి మూడురకాల కస్తూరులలో కామరూప కస్తూరి (నేపాల్ కస్తూరి, కాశ్మీర కస్తూరి మిగతా రెండు) గొప్పది. ఈ కీర్తనలో ఈ రకమైన కస్తూరినే అలమేలు మంగమ్మ వేసుకొందేమో! ఇకనేం! ఘుమాయింపులతో చెలికత్తెలకు దొరికిపోయింది. ఆ తాంబూల పూరిత ముఖి (లలితా సహస్రనామాలు) అలమేలుమంగ వేసుకొన్న కస్తూరిలో కొన్ని పలుకులు నాయకుడు చేసిన పలుగాట్ల స్థానంలో అక్షరాల్లాగా పెదవుల మీదకు చేరాయి. వాటిని అలమేలు మంగమ్మ ప్రియునికి రాసిన లేఖతో కవి పోల్చాడు. అమరం చదువుకొన్నవాళ్లు కస్తూరి అంటే శిరస్సు నందు స్తోత్రం చేయబడేది అని అర్థం చెప్పుకొంటారు. అద్భుతమైన ఈ కస్తూరి వర్ణన చదివిన తర్వాత శిరస్సు స్థానంలో పెదవి చేరుతుంది. స్తోత్రం కస్తూరి నుంచి కవిగారి వైపు పాకుతుంది.

అరచేయి, అరికాలు, కంటి చివరలు, గోళ్ళు, చెంప, నాలుక, పెదవి – ఈ ఏడు ఎర్రగా ఉంటే సుఖంగా ఉంటారని సాముద్రిక శాస్త్రం. సహజంగానే ఉత్తమ సాముద్రిక లక్షణాలున్న అలమేలుమంగలో కంటి చివరల ఎరుపు ఎందుకు వచ్చిందంటే స్వామివైపు చూసే చూపులను ఎవరో పెరికినట్లుగా ఊహించి మెప్పించాడు అన్నమయ్య.

గోటి నొక్కులను మహాకవి వేసవి కాలపు వెన్నెల అన్నాడు. ఇక్కడి పోలికలో అనుభూతి ప్రధానం. శరత్కాలపు వెన్నెలలో హాయి ఉంటుంది. వేసవికాలపు వెన్నెలలో హాయితో పాటు తృప్తి ఉంటుంది. పగలంతా ఎండలో శ్రమపడి ఉంటాం. రాత్రయేసరికి వెన్నెల. అంటే శ్రమ తర్వాత సుఖం కనుకనే హాయితోపాటు తృప్తి. వేసవికాలపు వెన్నెల ప్రయోగ ఆంతర్యం ఇప్పుడు తెలుసుకోవచ్చు. ఈ కీర్తనలో చకోరానికి ఎర్రటి కళ్ళున్న గబ్బిలమని అర్థం చెప్పారు రాళ్ళపల్లి వారు. ఆయనకంటే గొప్పగా అన్నమయ్యను అర్థం చేసుకొన్నవారు అరుదు. అందుకే ఆ అర్థాన్ని ఒప్పుకోవాలి.

ఈ కీర్తన విన్న సాళువ నరసింహరాయుడు తనమీద కూడా ఇటువంటి కీర్తన రాయమన్నాడు. "హరిని పొగడిన నా నాలుక నిన్న పొగడదు" అని అన్నమయ్య తిరస్కరించాడు. అన్నమయ్యకు సంకెళ్ళు వేసి జైలులో పెట్టాడు రాజు. తర్వాత వేంకటేశ్వరుడిని కీర్తించిన వెంటనే అన్నమయ్య సంకెళ్ళు తెగిపోయాయి. (అన్నమయ్య చరిత్ర). ఈ ఏమొకొ... కీర్తనలో శృంగారం ఉన్నట్లు మనకు అనిపిస్తుంది. కాని మధురభక్తిలో పండిపోయిన అన్నమయ్య ఈ కీర్తనలో హరిని పొగిడానని లౌకిక శృంగార దృష్టితో చూడొద్దని రాజుగారితో పాటు మనకు కూడా బోధించాడు.

ఆళ్వారులు (ద్రావిడ ప్రబంధకర్తలయిన విష్ణుభక్తులు) స్వామిని కీర్తించేవిధానంలో మూడు అవస్థలున్నాయన్నారు విమర్శకులు. అవి 1. తోరిమార్ (సఖి) అవస్థ. 2. తాయ్‌మార్ (తల్లి) అవస్థ. 3. మగళ్ (నాయిక) అవస్థ. ఇందులో మూడవ అవస్థను విష్ణు భక్తుడయిన అన్నమయ్య ఈ కీర్తనలో పాటించాడనిపిస్తుంది.

తానే రాధగా మారి చైతన్యుడు కృష్ణుడిని ఆరాధించి ప్రసిద్ధుడయ్యాడు. తానే అలమేలుమంగగా మారి అన్నమయ్య వేంకటేశుని కీర్తించి ఇటువంటి కీర్తనల ద్వారా ఆరాధ్యమానుడయ్యాడు.

16. ఒకపరికొకపరి కొయ్యారమై

ఒకపరికొకపరి కొయ్యారమై
మొకమున గళలెల్లా మొలచినట్లుండె

జగదేక పతి మేనజల్లిన కర్పూర ధూళి
జిగిగొని నలువంక జిందగాను
మొగి జంద్రముఖి నురమున నిలిపె గనక
పొగరు వెన్నెల దీగబోసినట్లుండె

పొరి మెరగుజెక్కుల బూసిన తట్టుపుణుగు
కరగి యిరుదెసల గారగాను
కరిగమన విభుడు గనక మోహమదము
తొరిగి సామజ సిరి దొరికినట్లుండె

మెరయ శ్రీవేంకటేశు మేన సింగారముగాను
తరచయిన సొమ్ములు ధరియించగా
మెరుగు బోణి యలమేలు మంగయు దాను
మెరుపు మేఘము గూడి మెరసినట్లుండె

భావం :

అన్నమయ్య పెద్ద కుమారుడు పెద తిరుమలాచార్యులవారు అభిషేక సమయంలో వేంకటేశ్వర స్వామివారిని చూస్తూ పాడిన గీతమిది.

అభిషేకం చేస్తున్నప్పుడు స్వామివారి మొగం ఒకసారి (= ఒకపరికి) 'అబ్బా! ఎంత బాగుంది' అనిపిస్తుంది. ఇంకోసారి అదే మొగం వెనక చూసిన దానికన్నా ఈసారి ఇంకా వయ్యారాలు పోతోంది. ఇంకా బాగుంది' అనిపిస్తుంది. 'స్వామివారి మొగంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త కళలు పుట్టుకొస్తున్నాయి' అనిపిస్తుంది.

స్వామి ఈ ప్రపంచం మొత్తానికి అధిపతి (= జగదేక పతి). ఆయన శరీరం మీద చల్లిన తెల్లని కర్పూరపు పొడి ప్రకాశిస్తూ (= జిగిగొని) నాలుగు పక్కలకు చిందింది. అది ఎలా ఉందో చెప్పనా! స్వామివారి వక్షస్థలంలో చంద్రుడి లాంటి మొగంతో (= చంద్రముఖి) అమ్మ లక్ష్మీదేవి ఉంటుంది కదా! ఆమె తెల్లదనంతో కలిసి పొడుగైన

(= పొగరు) వెన్నెల స్వామి మెడలో ఒక విధమైన బంగారు నగగా (= తీగ) మారినట్లుంది. (పొడుగైన వెన్నెల తీగలుగా, సన్నసన్నని దారాలుగా స్వామివారి శరీరం మీద ఉన్నదని ఇంకో అర్థం)

స్వామి వారి మెరిసే రెండు బుగ్గలమీద పునుగు పిల్లితైలాన్ని రాశారు. అది రెండు పక్కల కారుతోంది. ఇదెలా ఉందో చెప్పనా! మా అమ్మకి ఏనుగులా అందంగా నడిచే లక్షణం ఉంది. పెళ్లయిన తర్వాత భార్యకుండే కొన్నిలక్షణాలు అటు ఇటుగా భర్తకొస్తాయి కదా! అందుకే ఏనుగుకి సంబంధించిన మదజల లక్షణం మా అయ్యకి వచ్చింది. బుగ్గల మీద కారే పునుగు పిల్లి తైలం. ఏనుగుకి సంబంధించిన మదజలంలా ఉంది. (ప్రేమికుల మధ్య మోహంతో కలిగే మదాన్ని, ఏనుగు మదజలంతో పోల్చి కవి శబ్ద చమత్కారం చూపాడు)

మెరుస్తున్న మా అయ్య వేంకటేశ్వరుని శరీరాన్ని అందంగా అలంకరించారు. అబ్బబ్బా! ఎన్నెన్ని సొమ్ములు పెట్టారో! అలంకారాలు ధరించిన తర్వాత, మెరుపు వంటి శరీరము కల (= మెరుగుబోణి) మా అమ్మ లక్ష్మీదేవి – నల్లని మా అయ్యతో ఉన్నప్పుడు ఎలా ఉందో చెప్పనా! మెరుపు మేఘంతో కలిసి మెరిసినట్లుంది.

*****

అన్నమయ్యను, అతని కుమారుడు పెద తిరుమలాచార్యులను వేరుచేసి చూడలేం. తండ్రిలాగానే ఈయన కూడా రోజుకో సంకీర్తన చెప్పిన మహానుభావుడు. ఇది పెద తిరుమలయ్య గీతం అని ప్రత్యేకంగా చెబితే తప్ప, అన్నమయ్య రాసిన దానికి, కుమారుడు రాసిన దానికి తేడా గుర్తించలేం. తండ్రి నోట్లోంచి ఊడిపడ్డట్టున్న పెద తిరుమలయ్య గీతాన్ని, అన్నమయ్య అన్నమాటగా లోకం పాడుకుంటోంది.

శ్రీకృష్ణదేవరాయలు భార్య తిరుమలాంబతో కలిసి, ఒకసారి కంచి వరద రాజస్వామిని (విష్ణువు) దర్శించుకోవటానికి వెళ్ళారు. రాయల అందమైన భార్యను చూసి, విష్ణువు ఓసారి తన వక్ష స్థలాన్ని ఆత్రుతగా తడిమి చూసుకొన్నాడట. 'ఇదేంట్రా. నా హృదయంలో ఉండాల్సిన లక్ష్మీదేవి ఎదురుగా నిలబడిందేమిటని' విష్ణువుకు సందేహం వచ్చింది. తిరుమలాంబ –లక్ష్మీదేవి అంత అందమైనదని భావం. దీనిని చెప్పటానికి సంస్కృత కవి. అలా అద్భుతమైన ఊహచేశాడు. ఆ కవి భావన – మన అన్నమయ్య కుమారుని ఈ 'ఒకపరి ఒకపరి' కీర్తన ఒకే పాదులో మొలిచిన మొక్కలు.

మూడు చరణాల్లోను లక్ష్మీదేవిని కవి అందంగా పోల్చాడు. మొదటి చరణంలో ఆమె చంద్రముఖి, రెండవ చరణంలో సామజగమన. మూడోచరణంలో మెరుపు.

ఈ వర్ణనా విశేషాలు భౌతిక దృష్టితో ఆలోచిద్దాం. సంపద (లక్ష్మీదేవి) స్వభావమే అంత. అది చెంత చేరినప్పుడు మనసుకు చల్లగా అనిపిస్తుంది (చంద్రముఖి). ఒయ్యారాలు కురిపిస్తుంటుంది. (సామజగమన). మెరుపులా మెరుస్తుంది. 'వీడి దగ్గర ఎంత సంపద ఉందిరా!' అని కళ్ళు మిరుమిట్లు గొలుపుతుంది. దాచుకోవటం రాని వారి దగ్గర మెరుపులా మెరిసి అదృశ్యమవుతుంది.

మూడు చరణాల్లోను లక్ష్మీదేవిని కవి అందంగా పోల్చాడు. మొదటి చరణంలో ఆమె చంద్రముఖి, రెండవ చరణంలో సామజగమన. మూడోచరణంలో మెరుపు. ఈ వర్ణనా విశేషాలు భౌతిక దృష్టితో ఆలోచిద్దాం. సంపద (లక్ష్మీదేవి) స్వభావమే అంత. అది చెంత చేరినప్పుడు మనసుకు చల్లగా అనిపిస్తుంది (చంద్రముఖి). ఒయ్యారాలు కురిపిస్తుంటుంది. (సామజగమన). మెరుపులా మెరుస్తుంది. 'వీడి దగ్గర ఎంత సంపద ఉందిరా!' అని కళ్ళు మిరుమిట్లు గొలుపుతుంది. దాచుకోవటం రాని వారి దగ్గర మెరుపులా మెరిసి అదృశ్యమవుతుంది.

లక్ష్మీ అమ్మవారి 108 పేర్లలో 'చంద్రవదన'. 'చంద్రసహోదరీ' ఇలా చంద్ర సంబంధమైన పేర్లు కనిపిస్తాయి. చంద్రుడు చల్లదనానికి ప్రతీక. తనను కొలిచే భక్తుల జీవితాల్లో ఆమె చల్లదనాన్ని కలిగిస్తుందని, చంద్రముఖి అనే పేరులో అంతరార్థంగా తీసుకోవాలి. చంద్రుడి లాంటి ముఖం కలది అనే అర్థం కేవలం సామాన్యార్థం.

'వేంకటేశ్వరుని వర్ణనతో, కవి లక్ష్మీదేవిని ఎందుకు కలిపాడు?' అని సందేహం రావటానికి వీల్లేదు. శంకర భగవత్పాదులు అమ్మ శక్తితోనే అయ్యగారు వ్యవహారాలు చక్కబెడతారని సౌందర్యలహరిలో చెప్పారు.

వేంకటేశ సుప్రభాత మంగళంలో 'లక్ష్మీస విభ్రమాలోక....' అని చదువుకొంటాం. అయ్య తన అందమైన కనుబొమల కదలికలని, అమ్మ కటాక్షాలతో ప్రసరిస్తున్నాడని దీని అర్థం. పెద తిరుమలయ్య కూడా అందుకే ఈ అమ్మ అయ్యల విడదీయరాని అనుబంధాన్ని తెలుపుతూ, మూడో చరణం మొట్టమొదట్లో 'శ్రీవేంకటేశు' అన్నాడు. ఇంతకీ కళలన్నీ మొలచినది అమ్మకా, అయ్యకా అంటే ఇద్దరికీ అని సమాధానం.

18. కంటి శుక్రవారము గడియ లేడింట

కంటి శుక్రవారము గడియ లేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని

సొమ్ములన్ని కడబెట్టి సొంపుతో గోణము గట్టి
కమ్మని కదంబము కప్పు పన్నీరు చెమ్మతోన వేష్టువలు
రొమ్ము తల మొల చుట్టి తుమ్మెద మైచాయతోన
నెమ్మది నుండే స్వామిని

పచ్చకప్పురమె నూరి పసిడిగిన్నెల నించి
తెచ్చి శిరసాదిగ దిగనలది
అచ్చెరపడి చూడ అందరి కన్నులకింపై
నిచ్చమల్లె పూవువలె నిటు తానుండే స్వామిని

తట్టు పునుగె కూరిచి చట్టలు చేరిచి నిప్పు
పట్టి కరిగించి వెండి పళ్యాలనించి
దట్టముగ మేనునిండ పట్టించి దిద్ది
బిట్టు వేడుక మురియుచుండే బిత్తరిస్వామిని

భావం :

పవిత్రమైన శుక్రవారపు అభిషేకాన్ని తన్మయంగా చేస్తూ అన్నమయ్య పాడిన కీర్తన ఇది.

శుక్రవారం నాడు ఏడుగడియల ప్రాంతంలో (సుమారు అయిదు – ఆరు గంటల మధ్య) స్వామిని చూశాను. అలమేలుమంగను తన రొమ్ములో అంటిపెట్టుకొని ఉండే స్వామిని చూశాను.

అభిషేకం కోసం స్వామివారి ఆభరణాలన్ని దూరముగా పెట్టారు. (= కడపెట్టి). అందముగా గోచీ (=గోణము) కట్టారు. కమ్మని సుగంధ ద్రవ్యాల మిశ్రమం (= కదంబము) కలపటం వల్ల తడి వస్త్రాలు (=వేష్టువలు) సువాసనలు వెదజల్లుతున్నాయి. ఆ వస్త్రాలు రొమ్ముమీద, భుజము మీద, మొలచుట్టు చుట్టారు. అటువంటి తుమ్మెద రెక్కల్లాంటి కాంతితో ఉండే స్వామిని చూశాను.

చల్లగా మంచి వాసనలు వెదజల్లే పచ్చకర్పూరాన్ని నూరి, బంగారపు గిన్నె లలో పోశారు. దానిని తల మొదలు కిందికి రాశారు. స్వామి అందాన్ని అందరూ ఆశ్చర్యపడి (=అచ్చెరపడి) చూస్తున్నారు. అందరి కళ్ళకు ఆనందాన్ని ఇస్తూ అన్ని కాలాలలో పూసే నిత్యమల్లె పూవులా (=నిచ్చమల్లె పూవు) వెలుగులు చిమ్మే స్వామిని చూశాను.

ప్రశస్తమైన పునుగుపిల్లి తైలాన్ని (=తట్టు పునుగు) ఒకచోట సమకూర్చారు. పైపూతలు (=చట్టలు) చేర్చారు. తర్వాత నిప్పు పట్టి కరిగించి వెండి పళ్ళాల్లో (=పళ్యాలు) పోశారు. దట్టంగా తైలాన్ని స్వామివారి శరీరం నిండా పట్టించారు. అప్పుడు బాగా సంతోషంతో నిగనిగా మెరిసే (=బిత్తరి) స్వామిని చూశాను.

*****

60 రెప్పపాట్లు ఒక విఘడియ. 60 విఘడియలు ఒక ఘడియ. రెండున్నర ఘడియలు ఒక గంట. జాము అంటే ఏడున్నర ఘడియలు (03గంటలు). 'గడియ లేడింట' అంటే సుమారుగా ఉదయం అయిదు – ఆరు గంటల మధ్య అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఇప్పడు కూడా తిరుమలలో శుక్రవారం అభిషేకం ఉదయం నాలుగున్నర గంటల నుండి ఆరు గంటల మధ్య జరుగుతోంది.

లక్ష్మీదేవి ఈ లోకంలో మూడు రకాలుగా పూజలు అందుకుంటోంది.

1. కామ్య ఆర్చారూపంలో వేరే ఎవరితోనూ కలవకుండా విడిగా పూజలు అందుకొంటుంది.
2. భోగ అర్చారూపంలో స్వామివారి పక్కగా ఉండి పూజలు అందుకుంటుంది.
3. లయ అర్చారూపంలో స్వామివారి వక్షస్థలంలో ఉండి భక్తుల మీద దయ చూపిస్తుంది.

ఇంకో విశేషం –

అన్ని ఆభరణాలు శుక్రవారం అభిషేకంలో స్వామివారికి తీసేస్తారు కాని – అమ్మవారి ఆభరణాన్ని మాత్రం తీయరు. ఆమె సర్వకాల సర్వావస్థల్లోను స్వామిని విడనాడని తల్లి. అందుకే – అభిషేక సమయంలో లయ అర్చా రూపంలో – లక్ష్మీ అమ్మవారిని ధరించిన 'శ్రీ' వేంకటేశుని చూసి పరవశిస్తూ అన్నమయ్య 'అలమేల్మంగ అండనుండే స్వామిని' అన్నాడు.

ఆడ పునుగు పిల్లిని ఆకర్షించటానికి మగ పునుగు పిల్లి తైలాన్ని వదులుతుంది. దీనిని సేకరించి, నూనెలో కలిపి అభిషేకానికి వాడతారు. ఆ పునుగుతైలం విగ్రహానికి నిగారింపు ఇస్తుంది.

మూడు చరణాల్లోను కవి మూడు విలక్షణమైన పోలికలు వాడాడు.

సొమ్ములన్నీ తీసేసిన తర్వాత స్వామి నల్లటి తుమ్మెదలా ధగధగా మెరిసిపోయాడు. ఈ వర్ణన స్వామి రూపానికి సంబంధించింది.

పచ్చకర్పూరాలు రాసిన తర్వాత నిత్యమల్లె పూవులా తెల్లగామెరిసిపోయాడు. ఈ వర్ణన స్వామి స్వభావానికి సంబంధించింది. నిత్యమల్లెపూవుచెట్టు సంవత్సరం పొడుగునా ,అన్ని కాలాలలో పూసే స్వభావం కలది. స్వామివారు కూడా నిత్య ప్రకాశంతో ప్రపంచాన్ని ఆనందనిలయం చేసే ఆనంద స్వభావం కలవాడు.

పునుగు పిల్లి తైలం రాసిన తర్వాత నిగనిగా మెరిసిపోయాడు. ఈ వర్ణన ఆకర్షణకి సంబంధించింది. నిగనిగా మెరిసేది హృదయాన్ని చటుక్కున ఆకర్షిస్తుంది. స్వామిలోని ఆకర్షణ గుణమే కదా– ఇన్ని కోట్లమందిని తిరుమలకు ప్రయాణం చేయిస్తోంది.

ప్రతి శుక్రవారం స్వామివారి అభిషేకం తర్వాత నుదిటిపై అలంకరింపబడే నామాలు మొదలైనవాటికి 16 తులాల పచ్చకర్పూరం. 11/2 తులాల కస్తూరి వాడతారు. అభిషేకం తర్వాత మూలమూర్తికి 24 మూరల పొడవు, 4 మూరల వెడల్పు గల సరిగంచు పెద్ద పట్టువస్త్రాన్ని ధోవతిగా, 12 మూరల పొడవు, 2 మూరల వెడల్పు గల పట్టువస్త్రాన్ని ఉత్తరీయంగా కడతారు (హరికొలువు. 233పే.)

భక్తులు చేసిన అభిషేకానికి స్వామి మురిసిపోయాడన్నాడు అన్నమయ్య. ఇది మిగతా కవులు చేయలేని వర్ణన. మురిసి పోవటం ఒక జీవచేష్ట. తనకు ఇష్టమైనది ఎదుటివారు ఇష్టంతో చేస్తే ఎవరైనా మురిసిపోతారు. అభిషేకాలకు అగ్రహారాలు రాసిచ్చిన అన్నమయ్య ఇష్టపూర్వకంగా తనను అభిషేకం జరిపిస్తుంటే, స్వామివారు మురిసిపోతారు.

శుక్రవారం పవిత్రం. శుక్రవారం నాడు స్వామివారికి చేయించే అభిషేకం ఇంకా పవిత్రం. అభిషేక సమయంలో పాడే శ్రీసూక్తంలా ఉండే ఈ అన్నమయ్య కీర్తన కూడా పవిత్రాతి పవిత్రం.

18. కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ

వేదములే శిలలై వెలసినది కొండ
యేదెస బుణ్యరాసులే యేరులైనది కొండ
గాదిలి బ్రహ్మాది లోకముల కొనల కొండ
శ్రీదేవుడుండేటి శేషాద్రి యీ కొండ

సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ
వుర్వీదపసులే తరువులై నిలిచిన కొండ
పూర్వపుటంజనాద్రి యీ పొడవాటి కొండ

వరముల కొటారుగా వక్కణించి పెంచే కొండ
పరగు లక్ష్మీకాంతు సోబనపు గొండ
కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ
విరివైనదిదివో శ్రీవేంకటపు గొండ

ముఖ్యపదార్థం :

కట్టెదుర	=	బాగా ఎదుట
కాణాచి	=	చాలాకాలము నుంచి ఉన్నది
తెట్టెలాయ	=	గుంపులుగా
గాదిలి	=	ప్రేమ
నిట్టచరులైన	=	పొంగుచు ప్రవహించే
నిర్వహించి	=	చేయు
వక్కణించి	=	చెప్పి
సోబనము	=	మంగళము
విరివైనది	=	గొప్పదైనది

భావం :

అన్నమయ్య ఈ కీర్తనలో తిరుపతి కొండ గొప్పతనాన్ని భక్తులకు వివరిస్తున్నాడు.

భక్తుడా! ఈ తిరుపతి కొండ నీ ఎదురుగా ఉన్న వైకుంఠం. ఇది చాలా కాలము నుంచి ఉంది. ఈ కొండకి చాలా మహిమలు ఉన్నాయి. నాలుగు వేదాలు శిలలు కాగా ఈ తిరపతి కొండ పుట్టింది. ఇక్కడ ఏ దిక్కులో చూసినా నదులున్నాయి.(ఆకాశగంగ మొదలైనవి) అవి ఏమిటనుకొంటున్నావ్! పుణ్యరాశులే అలా మారాయి. ఈ కొండ శిఖరాలలో బ్రహ్మలోకము మొదలైన లోకాలన్నీ ఉన్నాయి. లక్ష్మీదేవికి ఇష్టమైన శ్రీవేంకటేశ్వరుడు ఉండే శేషాద్రి ఈ కొండ. ఈ తిరుపతి కొండ మీద దేవతలు జంతువులుగా మారారు. మునులు చెట్లుగా మారారు. ఆనందంతో పొంగుతూ ప్రవహించే జనసముద్రాలు ఒకవైపు దానితోపాటు పొంగుతూ శిఖరాల నుంచి కిందికి దొర్లే సముద్రాలు (తీర్థాలు) ఇంకోవైపు ఈ కొండ మీద ఉన్నాయి. పూర్వకాలంలో ఉన్న అంజనాద్రి ఈ పొడవైన కొండ. ఈ కొండమీద వరాలన్నీ శిలలుగా మారి కుప్పలు తెప్పలుగా ఉన్నాయి.

ఓ భక్తుడా! నువ్వు అడగటమే ఆలస్యం. నువ్వు కొంచెం అడిగితే, రెట్టింపుగా నీ కోర్కెలు తీర్చటానికి అవి సిద్ధంగా ఉన్నాయి. శుభాలిచ్చే విష్ణుమూర్తి ఉండే కొండ ఇది. సంపదలలో ఈ కొండ గుహలన్నీ నిండిపోయాయి. ఇదిగో! అన్నింటికంటే అధికమైనది. శుభాలిచ్చేది ఈ తిరుపతి కొండ.

*****

ఒక అవతారంలో వికుంఠ అనే తల్లికి విష్ణువు పుట్టి, వైకుంఠుడయ్యాడు. ఆ వైకుంఠుడు ఉండే చోటు వైకుంఠం. వైకుంఠమంటే మోక్షం. అది కొండ రూపంలో నీ ఎదురుగా చాలా కాలం నుంచి ఉంది. నువ్వు పట్టించుకోకుండా, కొండతత్వాన్ని అర్థం చేసుకోకుండా నీ జీవితాన్ని వృధా చేసుకొంటున్నావని జీవుని అన్నమయ్య సున్నితంగా మందలిస్తున్నాడు. ఎనిమిది రకాల ఐశ్వర్యాల్లో (అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం, వశిత్వం) గొప్పతనము కలిగినది మహిమ. అటువంటి మహిమలు గుంపులు గుంపులుగా అనేకం ఈ కొండ మీద ఉన్నాయని కవి వాక్కు. మెట్ల మార్గంలో కొండ మీదకు నడిచి వెళుతున్నప్పుడు తలయేరు గుండు కనపడుతుంది. దీనికి తలను ఆనిస్తే నమ్మినవారికి ఎప్పటినుంచో ఉన్న తలనొప్పి తగ్గుతుంది. ఇటు వంటి మహిమలు ఎన్నెన్నో ఈ కొండ మీద ఉన్నాయి.

ఆదిశేషుని ముఖభాగం శ్రీకాళహస్తి. వెన్నుభాగం అహోబిలం, తల తిరుమల, తోక శ్రీశైలంగా పెద్దలు చెబుతారు. భక్తులు నెత్తిమీద పెట్టుకొనే దేవుడిని కలిగిన శేషాద్రిని

వర్ణిస్తున్న పాదానికి దగ్గరగా, కొండ నెత్తిమీద ప్రవహించే ఏరులని వర్ణించటం మనోహరం. హనుమంతుని తల్లి అంజనాదేవి తపస్సు చేసిన కారణంగా ఈ కొండకు అంజనాద్రి అని పేరు వచ్చింది. పొడవాటి అను విశేషణ ప్రయోగంలో చాలాకాలం నుంచి ఈ కొండ ఉన్నదని భావం.

తిరుమలకి చుట్టుపక్కల 108 పుణ్యతీర్థాలున్నాయని చెబుతారు. ఆకాశగంగకు నీరు ఎక్కడినుండి లభిస్తోందో అంతుచిక్కదు. భగీరథుడు గంగను భూమికి తెచ్చు సమయంలో ఆకాశగంగ తిరుమల మీద పుట్టిందని పెద్దల మాట. తిరుమల నంబి కోసం బాల వేటగాడిగా మారిన వేంకటేశుడు వేసిన బాణంతో ఈ ఆకాశగంగ పుట్టిందని మరొక కథ. స్వామివారి పాదాలనుంచి పుట్టిన నీరు పాపవినాశన తీర్థంగా మారిందంటారు. వైకుంఠం నుంచి భూమికి దిగివచ్చిన అద్భుత మహిమలు గల కోనేరు పుష్కరిణి. స్వామి దర్శనానికి వెళ్ళేముందు తప్పనిసరిగా దీనిలో స్నానం చేయాలని నియమం. బంగారు బావి తీర్థం నుండి ప్రతిరోజు తెచ్చే నీటిని స్వామివారి అభిషేకానికి ఉపయోగిస్తారు. ఇంకా పాపనాశన తీర్థం. ఆకాశగంగ తీర్థం, కపిలతీర్థం ఇలా తిరుమలలో అనేక తీర్థాలు చేసి పుణ్యరాశులన్నీ ఏరులయ్యానని అన్నమయ్య పరవశించాడు.

జలధి అంటే సాధారణంగా సముద్రమని ప్రసిద్ధమైన అర్థం. అయితే అన్నమయ్య ఈ కీర్తనలో నదికి, తీర్థానికి పర్యాయపదంగా జలధి వాడాడు. నీటిని ధరించేది జలధి కనుక ఆ శబ్దాన్ని ఏరులకు, నదులకు వాడి శబ్దార్థాన్ని పెంచాడు.

అనంతాళ్వారు పొగడ చెట్టుగా తిరుమల కొండ మీద ఉన్నాడంటారు. ఇలా అనేకమంది మునులు. భక్తులు తిరుమల కొండమీద చెట్లుగా వెలిశారు. మునులు తరువులై నిలిచిన కొండ అంటూ కల్పతరువు స్వామి ఉన్న కొండను కవి వినుతించాడు.

అన్నమయ్య 'వక్కాణించు'కు బదులుగా 'వక్కణించు' అని ఈ కీర్తనలో ప్రయోగించాడు. తెనాలి రామకృష్ణుడు పాండురంగ మాహాత్మ్యంలో ఈ ప్రయోగాన్ని అనుసరించాడు (4-92)

19. కొండలలో నెలకొన్న కోనేటి రాయడు

కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు
కొండలంత వరములు గుప్పెడు వాడు

కుమ్మర దాసుడైన కురువరతినంబి
ఇమ్మన్న వరములెల్లనిచ్చినవాడు
దొమ్ములు సేసిన యట్టితొండమాంజక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు

అచ్చపు వేడుక తోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు
మచ్చిక దొలక దిరుమల నంబితోడుత
నిచ్చ నిచ్చ మాటలాడి నొచ్చినవాడు

కంచిలోననుండ దిరుకచ్చి నంబిమీద గరు
ణించి తన యెడకు రప్పించినవాడు
యెంచనెక్కుడైన వేంకటేశుడు మనలకు
మంచివాడై కరుణ బాలించిన వాడు

భావం :

తన భక్తులను స్వామివారు కాపాడిన విధానాన్ని వివరిస్తూ స్వామిని అన్నమయ్య ఈ కీర్తనలో పొగడుతున్నాడు.

దేవాలయం పక్కనే ఉన్న కోనేటికి (= చుట్టు మెట్లు ఉన్న నీటి గుంట) రాజయిన మా వేంకటేశుడు. ఏడుకొండలలో ఉన్నాడు. స్వామి కొండలంత (= అనేక) శుభాలు ఇచ్చే వాడు (= గుప్పెడువాడు)

వేంకటేశ్వరుడు కుండలుమున్నగునవి చేసి జీవించే (= కుమ్మర దాసుడైన) 'కురువ రతినంబి' అనే భక్తునికి కోరుకున్న వరాలు ఇచ్చాడు, యుద్ధాలు (= దొమ్ములు) చేసిన 'తొండమాన్' అను పేరున్న చక్రవర్తి రమ్మన్న చోటికి వచ్చాడు.

స్వచ్ఛమైన సంతోషంతో (= అచ్చపు వేడుక) 'అనంతాళ్వారు' అనే భక్తుని కష్టానికి

స్పందించి, కూలి లేకుండానే పనిచేసి (= వెట్టి) మట్టి మోశాడు. 'తిరుమలనంబి' అనే భక్తుడితో ఆనందంతో, కోరికతో (= ఇచ్చనిచ్చ) ముచ్చటించి, ప్రేమ పొంగుతుండగా (= మచ్చిక దొలక) స్వామి కష్టపడ్డాడు (= నొచ్చినవాడు)

కంచిలో ఉన్న 'తిరుకచ్చినంబి' అనే కంచి వరదరాజు స్వామి భక్తుని మీద దయచూపించి తన దగ్గరికి (=తన యెడకు) రప్పించుకొన్నాడు. తనను తలచుకొన్న వారిని ఎక్కువైన (= ఎంచనెక్కుడైన) దయతో వేంకటేశుడు రక్షిస్తాడు.

*****

కుండలు తయారుచేసే 'కురువరతినంబి' అనేవాడు బంకమట్టి పూలతో, స్వామి వారి కొయ్య బొమ్మకు పూజ చేసేవాడు. 'తొండమాన్ చక్రవర్తి' బంగారపు పూలతో తనను పూజిస్తున్నా, స్వామి వారికి కురువరతినంబి పూజావిధానం నచ్చింది. అందుకే అద్భుతమైన వరాన్ని కురువరతినంబికి ఇచ్చాడు. అతడు చేసే బంకమట్టి పూలు తిరుమలలోని తన నిజరూపానికి దగ్గరగా చేరే వరం అది. బంగారంతో – సింగారంతో తనను అర్చించాలని దేవుడు కోరుకోడు. హృదయం కావాలి. హృదయపూజ చేసేవారికి స్వామి దయ తప్పక ఉంటుందని ఈ వృత్తాంతం తెలియజేస్తుంది.

తొండమాను చక్రవర్తి ఒక సొరంగమార్గంలో రోజు స్వామివారి దర్శనం కోసం వెళ్ళేవాడు. ముసలితనంలో అలా వెళ్లటానికి ఓపిక లేనప్పుడు తొండమానుడు స్వామి వారిని తను ఉన్న చోటికే రమ్మన్నాడు. స్వామివారు కూడా భక్తుడు రమ్మన్న చోటికి వచ్చాడు. తొండమానుడు ఒకసారి శత్రురాజుతో యుద్ధంలో ఓడిపోయాడు. వేంకటేశ్వరుని శరణువేడి, స్వామివారి శంఖచక్రాలు స్వీకరించి, శత్రువులతో మళ్ళీ యుద్ధం చేసి గెలుపొందాడు.

"స్వామీ! నాకు యుద్ధానికి చేసిన సహాయం గుర్తు ఉండేట్లు శంఖచక్రాలు ఇకపై మీరు ధరించకూడ"దని తొండమానుడు వరం అడిగాడు. భక్తులు నమ్మిన భగవంతుడు (నమ్మినవాడు) కనుక నమ్మకాన్ని నిలబెట్టుకోవటానికి శంఖచక్రాలు ధరించటం మానేశాడు (తరువాత రామానుజాచార్యులవారు శంఖచక్రాలను స్వామివారికి ధరింపజేశారనేది వేరే కథ)

అనంతాళువార్ (అనంతాచార్యులు అసలుపేరు) తిరుమలలో వేంకటేశ్వరస్వామికి పూలతోట నిర్మించిన భక్తుడు. పూలతోటలో నీళ్ళకోసం ఓసారి ఆ భక్తుడు బావి తవ్వుతున్నాడు. నిండు చూలాలైన అనంతాళువార్ భార్య బావి మట్టిని తట్టలో పెట్టుకొని కొంచెం దూరంలో పారేస్తోంది. స్వామి ఆమె కష్టం చూసి సహించలేక బాధపడ్డాడు.

చిన్న బాలుడిలాగా మారాడు. ఆవిడ చేతిలో నుంచి తట్టను తీసుకుని సహాయం చేయసాగాడు. తామిద్దరమే చేస్తున్న ఈ సేవలో ఈ అబ్బాయికి భాగం ఇవ్వటం ఇష్టంలేని అనంతాళువార్ చేతిలోని గునపం విసిరివేశాడు. అది తన గడ్డానికి తగలగా, ఆ దెబ్బకు చెయ్యి అడ్డం పెట్టుకొని ఆ బాలుడు పరుగెత్తాడు. ఈ రోజు మనకు కనిపించే స్వామి వారి గడ్డం మీదనుండే చందనపు మచ్చ వెనుక కథ ఇది అని చెబుతారు.

తిరుమల నంబి ఒక ముసలివాడైన భక్తుడు. దూరంగా ఉన్న పాపనాశనం నుండి నీళ్లుతెచ్చి స్వామివారికి అభిషేకం చేసేవాడు. అతని కష్టాన్ని స్వామి తొలగిద్దామనుకొన్నాడు. అందుకే ఒకరోజు బాలుడి రూపంలో తిరుమలనంబి అభిషేకానికి తెచ్చే కుండలు పగులకొట్టాడు. తనను పట్టుకోవడానికి వెంటబడిన తిరుమలనంబిని ఆకాశగంగ వరకు తీసుకువచ్చి మాయమయ్యాడు. పాపనాశనం కంటే ఆకాశగంగ దగ్గరని, అక్కడి నుంచి అభిషేకానికి నీళ్ళు తెచ్చుకొమ్మనే సందేశాన్ని బాలుని రూపంలో వేంకటేశుడు తెలియజేశాడని తిరుమలనంబి గ్రహించాడు.

దూరాన్ని దగ్గరగా చేసే చేతల్లో మనస్సుకు ఇష్టమైన మాటలు దాగుంటాయి. చేతలు మాటలు క్రియారూపాలు కదా! అందుకే వేంకటేశుడు – 'ఇచ్చ ఇచ్చ' మాటలు తిరుమలనంబికి చేతల రూపంలో చెప్పాడు. తనను పట్టుకోవడానికి తిరుమల నంబి తరుముతున్నప్పుడు బాలుని రూపంలో స్వామి పరుగెత్తి శ్రమపడ్డాడు. అందుకని స్వామిని 'నొచ్చినవా'డని అన్నమయ్య చెప్పాడు.

తిరుకచ్చినంబి తిరుమలకు దూరంగా కంచిలో ఉండేవాడు. వరదరాజ స్వామి సేవకొరకు, పూలకోసం తోటలోకి వెళ్ళిన తిరుకచ్చినంబికి ఒక్క పూవు కూడా కన్పించలేదు. ఒక గుర్రం మీద ఉన్న ఒక మహనీయుడు 'పూలు కావాలా?' అని అడుగుతూ, వాటినేరుకొంటున్న తిరుకచ్చినంబిని తిరుమల దాక తీసుకుపోయాడు. మూలమూర్తిలో కలిసిపోయాడు. కంచి స్వామి, వేంకటేశుడు ఒక్కటేనని తెలుసుకొన్న తిరుకచ్చినంబి తిరుమలలోనే ఉండిపోయాడట.

కోనేరు – స్వామివారు వైకుంఠంలో విహరించే సరస్సు. దీనిని ఇష్టపడి స్వామివారు భూమి మీదకి తెప్పించుకొన్నారు. అందుకే అన్ని పాపాలను నాశనం చేసే కోనేరును స్వామివారి పేరుతో కలిపి కోనేటిరాయ అంటూకవి మురిసిపోయాడు. భక్తులను కొండంత దిక్కయిన వేంకటేశుడు – అన్నమయ్య వర్ణించినట్లు నేటికీ నమ్ముకొన్న వారికి కొండంత వరాలు ఇస్తాడు.

20. కొండవేల నెత్తినట్టి...

కొండవేల నెత్తినట్టి గోవిందా నిన్ను
గొండించేరు యశోదకు గోవిందా

గొల్లెతలు మొక్కేరు గోవిందా
కొల్లల చీరలిమ్మని గోవిందా
గొల్లు వెన్న దొంగిలగ గోవిందా – నిన్ను
గొల్లున నవ్వేరు వీరె గోవిందా

గోవుల గాచేవేళ గోవిందా పిల్ల
గోవిని వలచిరి గోవిందా
గోవాళులై యమునలో గోవిందా నీకు
కోవరమున్నారురా గోవిందా

కొట్టేటి వుట్ల కింద గోవిందా నీతో
గొట్టెవాటై పెనగేరు గోవిందా
గుట్టుతో శ్రీవేంకటాద్రి గోవిందా కూడి
గొట్టాన బెట్టేరు బత్తి గోవిందా

ముఖ్యపదార్థం :

వేలనెత్తినట్టి	=	చిటికెన వేలితో ఎత్తిన
గోవిందా	=	భూమి, ఆవు మొ।। వాటిని పొందేవాడా!
కొండించేరు	=	పొగిడారు
కొల్లలచీరలు	=	దొంగిలించిన చీరలు
గొల్లువెన్న	=	మలినాలతో ఉన్న వెన్న
గోవాళులై	=	యౌవనవంతులై
గొట్టెవాటై	=	బాధలతో

భావం :

శ్రీకృష్ణుని వేంకటేశునిలో చూసుకొని, అన్నమయ్య రాసిన కృష్ణ సంకీర్తన ఇది.

ఓ శ్రీకృష్ణా! బృందావనంలో గోవర్ధన పర్వతాన్ని చిటికెన వేలితో ఎత్తిన నీ శక్తిని గ్రహించి, యశోదమ్మ దగ్గర నిన్ను గోపికలు పొగిడారు. దొంగిలించిన చీరలిమ్మని నీకు నమస్కరించారు. మలినాలతో ఉన్న వెన్నను నువ్వు దొంగిలిస్తే నవ్వారు. నువ్వు ఆవులను రక్షించే వేళలో నీ మురళిని గోపికలు ప్రేమించారు.యవ్వనము కలిగిన ఆ గోపికలు యమునానదిలో ఉండి ప్రియమైన శత్రువైన నీకోసం పడిగాపులు పడుతున్నారు.

గోవిందా! పగులగొట్టే ఉట్ల కింద గోపికలు ఒకరితో ఒకరు తగాదా పడుతున్నారు. గుట్టుగా నిన్ను కలిసి తమ మనస్సులను భక్తితో నీ మురళిలో పెడుతున్నారు.

ప్రపంచంలో ఉన్న చెడ్డనంతా గొప్ప బుద్ధితో సహించేవాడు. అందరి మనస్సులనూ ఆకర్షించేవాడు గోవిందుడు. తన ఐదవసంవత్సరంలో బ్రహ్మగర్వంతో గోవులను, గోపాలకులను ఒక సంవత్సరకాలం పాటు మాయం చేస్తే, ఆవుదూడల, గోపాలకుల రూపాలు తానే ధరించాడు కృష్ణుడు. గోపికలని, గోవులని తన తల్లులుగా చేసుకున్నాడు. వారి అదృష్టం అది. అటువంటి వాడు ఇంద్రుడికి పూజలు వద్దని, కొండమీద, కొండకింద తానుంటూ గోవర్ధన పర్వతానికి పూజలు చేయించాడు. తట్టుకోలేని పురందరుడనే పేరుగల ఇంద్రుడు (ఇంద్రుడు అనేది ఒక పదవి. ఈ గోవర్ధన పూజా సమయంలో ఇంద్రపదవి మీద ఉన్న వారి పేరు పురందరుడు) శిలలతో బ్రహ్మాండమైన వర్షాన్ని కురిపించాడు. వరాహావతారంలో భూమినే పైకెత్తిన స్వామి ఇప్పుడు చిటికెన వేలిమీద గోవర్ధన పర్వతాన్ని ధరించాడు. ఏడేండ్ల వయస్సువాడు, ఏడు రాత్రిళ్ళు గోవర్ధన పర్వతాన్ని ధరిస్తే ఇంద్రుడికి విసుగెత్తి వెళ్ళిపోయాడు. ఇలా కొండ వేలనెత్తినట్టి గోవిందుణ్ణి యశోదమ్మ దగ్గర గోపికలు పొగిడారు. ఇదివరలో ఆమె దగ్గిర కృష్ణుడి మీద చాడీలు చెప్పినవారి చేత అన్నమయ్య పొగిడించాడు. ఇంకే కవీ ఇలా చేసినట్టు దాఖలా లేదు.

కాత్యాయనీ వ్రతం చేసే గోపికలు బట్టలు ధరించక స్నానం చేస్తూ నియమం తప్పారు. ఆ నియమాన్ని వారికి గుర్తుచేయటానికి వాళ్ళ చీరలు దొంగిలించాడు బాలకృష్ణుడు. "స్వామీ! మా చీరలు మాకు ప్రసాదించవయ్యా!" అని గోపికలు స్వామివారికి మొక్కారన్నాడు అన్నమయ్య. చీర మమకారానికి, అజ్ఞానానికి గుర్తని, నా అనే అహంకారం తొలగించటానికి స్వామి ఆ చీరలు దొంగిలించాడని దీనిలో అంతరార్థంగా చెబుతారు. నియమం తప్పిన వాళ్ళచేత, నియమాన్ని పాటింపజేసే అధికారచర్య అందరిని శాసించే కృష్ణుడు చేశాడనుకొంటే సుఖం.

లోకంలో దొంగతనం అందరికీ తెలిసిన విషయమే. కానీ దొంగతనాన్ని దొంగిలించే వాడు కృష్ణుడు. ఇంద్రియాలు మన చేత చేయించే దొంగతనపు భావాలని

దొంగిలించే వాడు కృష్ణుడు. మనలోని చెడు భావాలు దొంగిలించే కార్యక్రమానికి ఒక గుర్తు వెన్నదొంగతనం. అటువంటి వెన్నదొంగ ఒకరోజు మంచివెన్న దొంగిలిద్దామని వెళ్ళాడు. తీరా అక్కడికి వెళ్ళి వెన్న దొంగతనం చేసేసరికి అది ఏ నాలుగైదు రోజుల కిందో తీసిన, పాసిపోయిన వెన్న. ఇలా పాసిపోయిన, మలినమైన వెన్నను చేతిలో పెట్టుకొన్న కృష్ణుని చూసి గోపికలు గొల్లున నవ్వారు. ఆనందింపజేసే ఇటువంటి నిర్మలసంఘటనలు సృష్టించటంలో అన్నమయ్యది అందె వేసిన చేయి.

లోపల శూన్యంగా ఉన్నవేణువును ఊది, జీవులకు ఆహ్వానాల రాగాలు పలుకుతాడు కృష్ణుడు. మన మనస్సుకు కూడా కోరికలు ఏమీ లేకుండా శూన్యంగా ఉంచగలిగితే, వేణుగాననిలయమవుతుంది. గోపికలు అటువంటి మనస్సు కలవారు కనుక, తమ మనస్సుతో పోలిక ఉన్న కృష్ణుని వేణువును వలచారని, తద్వారా రాగాలు కురిపించమని భగవంతుని వేడుకొన్నారని 'పిల్లగోవిని వలచిరి గోవిందా' అని అన్నమయ్య రాశాడు. ఈ వేణువంటే అన్నమయ్యకి ఎంత ప్రేమంటే, ఈ కీర్తన చదివి పాదంలో కూడా 'గొట్టాన బెట్టేరు బత్తి' అంటూ వెదురు గొట్టమైన వేణువులో భక్తిని పెట్టారని మళ్ళీ చెప్పాడు.

అన్నమయ్య వాడే ఒక్కో పదం, ఒక్కోసారి ఒక సంఘటనని చెబుతాయి. ఉదాహరణకి 'కోవరము' అనే పదం తీసుకొందాం. శత్రువులను పట్టడానికి పొంచి ఉండే పద్ధతిని కోవరమంటారు. యమునా నది ఒడ్డులో కృష్ణుడనే శత్రువని పట్టడానికి కాసుకొని కూర్చున్నారట గోపికలు. కృష్ణుడు శత్రువు ఎలా అవుతాడు? సంస్కృతంలో శత్రువంటే కృశింపజేసేవాడు. కృష్ణుడు కూడా గోపికలని విరహంతో కృశింపజేశాడు కదా! అందువలన అతడు గోపికలకి ప్రియమైన శత్రువు. ఆ శత్రువు ఎప్పుడు వస్తాడా అని ఆ యమునా తీరంలో, అతనిని పట్టి బంధించటానికి గోపికలు ఎదురు చూస్తున్నారన్న అన్నమయ్య పదకవితా పితామహుడే కాదు. భావకవితా పితామహుడు అనటంలో తప్పేముంది?

పొగడటం, మొక్కటం, నవ్వటం, ప్రేమించటం, ఎదురుచూట్టం – చేసిన గోపికలు చివరగా మనస్సును ఆయన గానంలో పెట్టారని – లీనం చేశారని అంటూ భక్తుల తుది కర్తవ్యం చెప్పకుండానే చెప్పాడు అన్నమయ్య.

21. కులుకక నడవరో కొమ్మలాలా

కులుకక నడవరో కొమ్మలాలా
జలజల రాలీని జాజులు మాయమ్మకు

ఒయ్యనే మేను గదలీ నొప్పుగా నడవరో
గయ్యాళి శ్రీపాద తాకు కాంతలాలా
పయ్యెద చెరగు జారీ భారపు గుబ్బల మీద
అయ్యో చెమరించె మా యమ్మకు నెన్నుదురు

చల్లెడి గందవొడి మైజారీ నిలువరో
పల్లకి పట్టిన ముద్దుబణతులాల
మొల్లమైన కుందనపు ముత్యాల కుచ్చులదర
గల్లనుచు గంకణాలు గదలీ మా యమ్మకు

జమళి ముత్యాలతోడి చమ్మాళిగలిడరో
రమణికి మణుల నారతులెత్తరో
అమరించి కౌగిట నలమేలుమంగనిదె
సమకూడె వేంకటేశ్వరుడు మా యమ్మకు

ముఖ్యపదార్థం :

కొమ్మలాలా	=	పల్లకి మోసెడి స్త్రీలారా!
శ్రీపాదతాకు కాంతలు	=	లక్ష్మీదేవి పాదాలు తాకే అధికారం ఉన్న స్త్రీలు
గందవొడి	=	గంధపు పొడి
పణతులాల	=	ఓ పల్లకి మోసెడి స్త్రీలారా!
మొల్లలైన	=	అధికమైన
కుందనపు	=	పరిశుద్ధ బంగారపు
జమళి	=	జంట
చమ్మాళిగ	=	పాదరక్ష

భావం :

అలమేలుమంగని కొత్త పెండ్లికూతురుగా అలంకరించి, చెలికత్తెలు బోయీలుగా

మారి పల్లకీలో ఊరేగిస్తున్నారు. ప్రత్యక్షసాక్షిగా ఆ దృశ్యాన్ని అన్నమయ్య చూస్తూ, చెలికత్తెలను ఈ కీర్తన రెండు చరణాలలో హెచ్చరించాడు. చివరి చరణపు రెండు పాదాలలో ఆమె వేంకటేశ్వరుని చేరిన ఘట్టాన్ని చూస్తూ పరవశించాడు.

అమ్మలారా! కులుకుతూ నడవకండి. మీరు అలా నడిచినందువల్ల, అమ్మ కొప్పునుండి జాజిపూలు జలజలా రాలిపోయాయి జాగ్రత్త!

మీకే అమ్మ పాదాలు తాకే అధికారం ఉన్నదని ఆ గొప్పని నడకలో చూపకండి. అమ్మ శరీరము మెల్లమెల్లగా కదిలిపోయి, పైట జారి బరువైన స్తనాలు బైట పడుతున్నాయి. మీ కుదుపులకి ఆమె నుదుటిమీద చెమటలు పడుతున్నాయి. కొంచెం నెమ్మదిగా నడవండి.

ఓ ముద్దుగుమ్మలారా! అమ్మ పరిశుద్ధమైన బంగారపు ముత్యాలజడ కుచ్చులు అదిరిపోతున్నాయ్. కంకణాలు ఘల్లని కదులుతున్నాయి. చూసుకొని నడవండి. అమ్మ పాపిటలో ఉన్నగంధపు తడిపొడి ఆమె ఒళ్లంతా పడుతోంది, అవసరమైన చోట్ల కొద్దిసేపు నిలబడండి.

అదుగో! అమ్మ దిగుతోంది. అమ్మకు జంట ముత్యాలతో కూడిన పాదరక్షలివ్వండి. ఆ అందాల రమణీమణికి మణుల కాంతులతో హారతులివ్వండి. ఆహా! వేంకటేశ్వరుడు అలమేలు మంగని దగ్గరికి తీసుకొన్నాడు. ఎంత చూడముచ్చటగా మా అమ్మకు వేంకటేశ్వరుడు లభించాడు.

*****

కొమ్మలారా! అనటానికి అన్నమయ్య 'కొమ్మలాల' అంటాడు. అలాగే బాలులాల అని ఇంకోచోట ప్రయోగిస్తాడు. ఇది మనం అన్నమయ్య భాషలో గమనించాలి. "ఏమమ్మో! పెండ్లి నడకేంటి... కొంచెం చూసుకొని నడవండి" అని తెలుగునాట వినిపించే జాతీయాలు. వీటిని తన కవిత్వంలో సందర్భశుద్ధితో కలిపి అన్నమయ్య హృదయాలకు దగ్గరయ్యాడు.

గడుసుదనము గల స్త్రీకి వాయి (నోటి బిరుసుతనము కలిగిన స్త్రీ) గయ్యాళి అనే పేర్లున్నాయని ఆంధ్రనామ సంగ్రహం చెబుతోంది. అందువల్ల 'గయ్యాళి శ్రీపాద తాకు' లో గయ్యాళి పదాన్ని అమ్మవారికి కాకుండా చెలికత్తెలకు అన్వయించుకోవాలి.

కొద్దిపాటి కష్టము చేసిన తర్వాత శరీరం మీద చెమటలు రావడం సహజం. శరీర తత్త్వాలను బట్టి ఈ చెమట బిందువుల సమ్మేళనం ఉంటుంది. అలమేలు మంగమ్మ సుకుమారి. ఆవిడ నడవటం లేదు. పల్లకీలో కూర్చుంది. కాని పల్లకీ మోసే చెలికత్తెలు

కొంచెం అటు ఇటుగా అడుగువేస్తే అలమేలుమంగ శరీరం ఆ కొద్దిపాటి కుదుపులకు తట్టుకోలేక పోయింది.

శరీరపు కష్టంతో ఆమె నుదుటిమీద చెమట కమ్మింది. ఇక్కడ అన్నమయ్య చెప్పదలచుకొన్న అంశం – అలమేలుమంగ మహా సుకుమారి అని. ఒక పూలమాల పైనుంచి తనమీద పడగానే పూర్వకాలపు నాయికలు ప్రాణాలు కూడా విడిచేసేవారు. వాళ్ళు అంతటి సుకుమార స్వభావలు (రఘు.8వ సర్గ). అందువల్లనే వేంకటేశుడనే కథానాయకుని కలుసుకొనబోయే అలమేలుమంగ అనే కథానాయిక సుకుమారి అని పదేపదే అన్నమయ్య హెచ్చరిక.

అలమేలు మంగ కొరకు విష్ణుమూర్తి 12 సంవత్సరాలు తపస్సు చేశాడు. కార్తీక మాసంలో శుక్లపక్ష పంచమీ శుక్రవారం నాడు ఉత్తరాషాఢ నక్షత్ర శుభదినాన మహాలక్ష్మి బంగారు కమలములో కూర్చుండి మహావిష్ణువునకు సాక్షాత్కరించింది. ఇటువంటి అలమేలుమంగను (మహాలక్ష్మిని) వేంకటేశుని కొరకు పెండ్లికూతురుగా అందమైన మాటల పల్లకీలో ఊరేగించాడు అన్నమయ్య.

మొదటిసారి తాను కొండకు వచ్చి అలసిపోయినప్పుడు అలమేలుమంగ పెట్టిన తియ్యటి ప్రసాదం అన్నమయ్య చేత ఇలాంటి తియ్యటి పాటలు పాడించింది.

ఈ కీర్తనకు చక్కటి సంగీతం, గాత్రం, నృత్యం కలిస్తే–ఏదో తెలియని ఆనందంతో కులుకు తప్పనిసరిగా వస్తుంది. ఈ కులుకు కీర్తనలో అన్నమయ్య పలుకులు కండ చక్కెర పలుకులు.

22. కొలని దోపరికో గొబ్బిళ్లో

కొలని దోపరికి గొబ్బిళ్ళో
యదుకుల స్వామికిని గొబ్బిళ్ళో

కొండ గొడుగుగా గోవుల గాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్ళో
దుండగపు దైత్యులకెల్లను తల
గుండు గండనికి గొబ్బిళ్ళో

పాపవిధుల శిశుపాలుని తిట్ల
కోపగానికిని గొబ్బిళ్ళో
యేపునగంసుని యిడుమల బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్ళో

దండి వైరులను తఱిమిన దనుజుల
గుండె దిగులునకు గొబ్బిళ్ళో
వెండి పైడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్ళో

ముఖ్యపదార్థం :

కొలని దోపరి	= నీటి కొలనులో దొంగ
గొబ్బిళ్ళో	= ఆవుపేడతో చేసిన గొబ్బిళ్ళ చుట్టూ స్త్రీలు నిలబడి చేసే నాట్యం
కొండుక	= చిన్న
దైత్యులకెల్లను	= రాక్షసులందరికీ
తలగుండు గండనికి	= తలకోయు శూరునికి
ఇడుమల బెట్టిన	= కష్టాలు పెట్టిన

భావం :

అన్నమయ్య ఈ కీర్తనలో బాలకృష్ణునిపై అభినందనల ప్రశంసలు కురిపిస్తున్నారు.

నీటికొలనులో గోపికల చీరలను అపహరించిన దొంగకి గొబ్బిళ్ళో, యాదవకుల స్వామికి గొబ్బిళ్ళో.

గోవర్ధన పర్వతాన్ని గొడుగుగా ధరించి ఆవులను రక్షించిన చిన్నపిల్లవాడికి గొబ్బిళ్ళో. దుర్మార్గులైన రాక్షసుల తలకోయుశూరుడికి గొబ్బిళ్ళో.

పాపపు పనులు చేసి, తనను తిట్టిన శిశుపాలునిపై కోపము కలవానికి గొబ్బిళ్ళో. కంసుని కష్టాలపాలు చేసి, గోవులను రక్షించు బాలుడికి గొబ్బిళ్ళో.

ప్రతాపము, ధైర్యము గల శత్రువులను తరిమిన రాక్షసుల గుండె దిగులుకు గొబ్బిళ్ళో. వేంకటగిరిపై కొండల రాయుడైన శ్రీవేంకటేశ్వరునికి గొబ్బిళ్ళో.

శ్రీకృష్ణుడిని చీరల దొంగ, వెన్నదొంగ – ఇటువంటి బిరుదులతో సత్కరించు కోవటం తెలుగునాట ఉంది. అన్నమయ్యకు స్వామి వారి దగ్గర స్వేచ్ఛ ఉంది కదా! ఒకడుగు ముందుకు వేసి ఏకంగా కొలనులో స్నానం చేస్తున్న గోపికల చీరలు దొంగిలించిన దొంగ అనే అర్థంలో 'కొలని దోపరి' అన్నాడు. 'అంతయూ నీవే హరిసర్వోత్తమా....' స్థాయిని తన జీవితంలో పాటగా, బాటగా మలుచుకొన్నాడు. కనుక అన్నమయ్య ఏమన్నా స్వామి ఇబ్బంది పడడు.

''వేంకటేశ్వరస్వామి వరాహస్వామి వద్దనుండి కొలను, క్షేత్రమును ఆక్రమించుకొన్నాడు. కనుక కొలను దోపరియైనా"డని చెలికాని వారు ఊహ చేశారు. ఇది కూడా బాగుంది.

యయాతిమహారాజు శుక్రాచార్యుడి శాపం వల్ల ముసలివాడయ్యాడు. తన ముసలితనాన్ని స్వీకరించమని కుమారుడు యదువును కోరితే అతడు కాదన్నాడు. "యదువంశమువారు రాజ్యానికి పనికిరా"రని యయాతి శాపమిచ్చాడు. ఈ శాపాన్ని యాదవ వంశాల్లో ఒకటైన వృష్ణి వంశంలో పుట్టిన వసుదేవుడు గౌరవించి, తన రాజ్యాన్ని భోజవంశంలోని ఉగ్రసేనుడికి (కంసుడి తండ్రి) ధారపోశాడు. శ్రీకృష్ణుడిది కౌరవ పాండవుల్లాగ చంద్రవంశం (మూలపురుషుడైన యదువు చంద్రవంశీయుడు). తండ్రి వసుదేవుడి బాటలో కంసుడిని చంపగా వచ్చిన రాజ్యాన్ని కాలదన్ని మధురకు తిరిగి ఉగ్రసేనుని రాజుగా చేసిన ఘనుడు.

బలిచక్రవర్తి కూతురు రత్నమాల – పూతనగా జన్మిస్తే కృష్ణమూర్తి ప్రాణాలు పీల్చేశాడు. పూర్వజన్మలో కదలలేని చెట్లను హింసించిన హిరణ్యాక్షుని కుమారుడు ఉత్కచుడికి మరుజన్మలో బండి రూపంలో మోక్షమిచ్చాడు. పూర్వజన్మలో హయగ్రీవుడనే రాక్షసుడి కుమారుడైన బకుడు చేపలను హింసిస్తూ, బక (కొంగ)వేషాలేస్తూ జాబాలి చేత శాపం పొంది,మరుజన్మలో బకాసురునిగా జన్మించగా, వానికి ముక్తి కలిగించాడు

కృష్ణుడు. పూతన, బకాసురులకు తోబుట్టువైన అఘుడు, వంకరగా ఉన్నావని అష్టావక్ర మహర్షిని హేళనచేసి, మరుజన్మలో వంకరలుగల పాము రూపంలో అఘాసురునిగా జన్మించి, కృష్ణుని చేతిలో తలచిరిగి ముక్తి పొందాడు. కాలనేమి రాక్షసాంశతో పుట్టిన కంసుడు కృష్ణమూర్తి ద్వారా సాయుజ్యం పొందాడు. ఇంతమంది రాక్షసులకు మంగళం పాడిన కృష్ణున్ని 'దుండగపు దైత్యులకెల్లను తలగుండు గండడు' అని అన్నమయ్య అన్నాడు. చావుకంటే భయంకరమైనది ఆ చావును గూర్చి పడే భయం. ఆ భయాన్ని కృష్ణుడు కంసునికి కల్గించాడు. "అష్టమ గర్భాన పుట్టేవాడే తనని సంహరిస్తా"డని ఆకాశవాణి ద్వారా చెప్పించి, మొదట ప్రాణభయము కలిగించాడు. అక్కడినుండి తను పుట్టేవరకు 8 సంవత్సరాలు, పెరిగి పెద్దవాడై, కంసుని చంపడానికి 14 ఏళ్ళు – మొత్తం 22 ఏళ్ళు కంసుణ్ణి ప్రాణభయంతో విలవిలలాడించాడు. 'యేపునగంసుని యిడుమల బెట్టిన '– అని అన్నమయ్య అనటంలో భావం ఇది.

శిశుపాలుడు నిండు సభలో కృష్ణుడిని ఇలా తిట్టాడు. 'కృష్ణుడు హీనమైన చరిత్ర కలవాడు. రాజ్యాన్ని పాలించే అర్హతలేని వృష్ణి వంశానికి సంబంధించినవాడు. మొద్దు కృష్ణుడికి అందరికంటే ముందు పూజ చేయటం నపుంసకుడికి పెండ్లి చేయటం లాంటిది.. పుట్ట అంతటి చిన్నకొండ ఎత్తి బలవంతుడిగా విర్రవీగుతున్నాడు. మహా పాపాలు అని చెప్పే స్త్రీ వధ, గోవధ చేశాడు. జరాసంధుడిని యుద్ధంలో ఎదుర్కొనలేక పదిసార్లు యుద్ధంలో పారిపోయాడు.' ఈ విధంగా శిశుపాలుడు ఒక దానివెంట ఒకటిగా పాపాలు మాట్లాడుతుంటే కృష్ణుడి చక్రము అతనిని తల లేనివాడిగా చేసింది. ఇది కృష్ణుడు కోపగించుకున్న విధం.

ఇదివరకు కొన్ని పండుగలప్పుడు గొబ్బి ముద్దలు పెట్టి 'గొబ్బిళ్ళో' అంటూ మండలాకారంగా కన్నెపిల్లలు నృత్యం చేసే అలవాటు ఈ జాతి చరిత్రలో ఉంది. సి.పి.బ్రౌన్ తన ఇంగ్లీషు – తెలుగు నిఘంటువులో గొబ్బిళ్ళు పదానికి నమస్కారాలని కూడా ఒక అర్థం చెప్పాడు. తెలుగు సంకేతమైన గొబ్బిళ్ళని అన్నమయ్య అక్షరాలలో భద్రపరిచాడు. 'గుండె దిగులు' అనే పదం ఈ కీర్తనలో జాతిరత్నం. కోపమొస్తే 'నీ గుండెల్లో నిద్రపోతా'నంటాం. దానికి అన్నమయ్య కల్పించిన పదబంధం గుండె దిగులు. ఇటువంటి అన్నమయ్య కీర్తనలు వేలాదిగా వెలుగులోకి రాలేదు. అదే తెలుగువాడి గుండెదిగులు.

23. గురుతెరిగిన దొంగ కూగూగు

గురుతెరిగిన దొంగ కూగూగు వీడె
గురిలోనె దాగేని కూగూగు

నెలతల దోచేని నీళ్ళాడగనే
కొలనిదరిని దొంగకూగూగు
బలువైన వుట్ల పాలారగించేని
కొలది మీరిన దొంగ కూగూగు

చల్లలమ్మంగ చనుకట్టు దొడికేని
గొల్లెతలను దొంగ కూగూగు
యిల్లిల్లు దప్పక యిందరి పాలిండ్లు
కొల్లలాడిన దొంగ కూగూగు

తావుకొన్న దొంగ దగిలిపట్టుండిదె
గోవులలోదొంగ కూగూగు
శ్రీవేంకటగిరి చెలువుండొ ఏమొ
కోవిదుడగు దొంగ కూగూగు

భావం :

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరున్ని చిన్ని కిట్టయ్యగా భావించి, పిల్లవాడిగా మారిన స్వామిని, భుజాలమీదకు ఎక్కించుకొని ఆడిస్తున్న మధురమైన అనుభూతిలో తేలియాడుతూ పాడిన పాట ఇది.

కిట్టయ్య గురుతు (= మేర) తెలిసిన దొంగ. వీడు గురిలోనే (= లక్ష్యంలోనే) దాగి ఉంటాడు.

గోపికలు (= నెలతల) స్నానం చేస్తుండగా (= నీళ్ళాడగనే) ఆ సరస్సు ఒడ్డున ఉన్న (= కొలని దరిని) వాళ్ల బట్టలు దోచుకున్న దొంగ (= దోచేని) ఎత్తయిన (=బలువైన) ఉట్లలో పాలు ఆరగించేవాడు. పట్టడానికి దొరకని (= కొలది మీరిన) దొంగ.

చిన్నపిల్లాడు గదా అని చంకనేసుకొని గోపికలు పాలు, పెరుగు అమ్ముతుండగా

(= చల్లలమ్మంగ) వాళ్ళ స్తనాలను (= చనుకట్టు) తడిమే దొంగ(= దొడికేని). ఏ ఒక్క ఇల్లు కూడా విడువకుండా గొల్లభామలు – పాలు దాచిపెట్టిన ఇండ్లన్నీ (= పాలిండ్లు) కొల్లగొట్టిన (= కొల్లలాడిన) దొంగ.

ఈ తిరుమలపై (= ఇదె) ఆ దొంగ నిలిచి (= తావుకొన్న) వేంకటేశుని రూపంలో స్థిరనివాసం (= తగిలి పట్టు) ఏర్పరుచుకొన్నాడు. గోవులలో దాగిన దొంగ వీడు. ఈ దొంగ శ్రీవేంకటగిరిపై ఉన్న అందగాడేమో (= చెలువుండొ ఏమొ). లేకపోతే ఇంతగా దొంగతనాలు చేసే పండితుడు ఎలా అవుతాడు?

'కూగూగు' మనస్సును ఊగించే ఒక అందమైన పదం. చిన్న పిల్లలను ఆడించేటప్పుడు 'దోబూచి, దోబూచి' అంటుంటాం కదా! ఈ 'కూగూగు' కూడ అలాంటి పదమే. చిన్న పిల్లలను మెడమీద ఎక్కించుకొని, పాడే పాట కూగూగు అని కొంతమంది చెప్పారు. అలా కాదయ్యా! కన్నడంలో 'కూగు' అంటే ఒకర్ని పిలవటం. ఆటలాడిస్తున్నప్పుడు మనకు కనబడకుండా దాక్కొన్న వాడిని పిలిచే పదం 'కూగూగు' అని ఇంకొంతమంది చెబుతున్నారు. మొత్తానికి మనలో దాగి ఉండి, మనకు కనబడకుండా ఉన్న స్వామిని మురిపెంగా అన్నమయ్య పిలిచిన పదం 'కూగూగు' అని సమన్వయించుకొంటే సమంజసంగా ఉంటుంది. దొంగకి, స్వామికి ఇద్దరికి అన్వయించేటట్లు అన్నమయ్య మనోహరంగా ఇందులో పదాలు వాడాడు.

గురుతులు అంటే శంఖం, చక్రం మొదలైన గురుతులు. వాటిని ధరించి అందరికి తెలిసినవాడు గురుతెరిగినవాడు. గీతలో చెప్పినట్లుగా దేవుడిని పొందాలనుకొని తీవ్రంగా ప్రయత్నించే జ్ఞానవంతుల లక్ష్యంలో దాగి ఉన్నవాడు.

ఈ దొంగగారు పడదామంటే ఒక పట్టాన దొరకడు. భక్తుల మనస్సుకు దొరికిన తర్వాత ఆయన వీళ్లని వదలడు. 'యోగ క్షేమం మహామ్యహం' అంటూ తనని 'పట్టుకొన్న' వారి యోగక్షేమాలు ఆయనే చూసుకొంటాడు. అన్నమయ్య ప్రయోగించిన 'కొలదిమీరిన– – విపుల వ్యాఖ్యానానికి వీలైన విశేషణం. ఏ ఒక్క ఇల్లు కూడ గోకులంలో స్వామి అనే దొంగ విడిచి పెట్టలేదంటున్నాడు కవి. అంటే ప్రతి ఒక్కరిని అనుగ్రహించాడని భావార్థం.

'గోపికల చనుకట్టును కృష్ణుడు అనే దొంగ తడిమాడు' అని చదివి మనం ఉలిక్కి పడకూడదు. చిన్నపిల్లల అతి సహజమైన చేష్ట అది. కృష్ణుడినే రసికుడనే దృష్టితో చూడడం మన అవగాహనా లోపం. పరీక్షిత్తు మృతశిశువుగా జన్మించాడు. సుభద్ర పాండవులు పరీక్షిత్తుని బతికించమని కృష్ణుడిని ప్రార్థించారు. అప్పుడు కృష్ణుడు ఇలా ప్రతిజ్ఞ చేశాడు. –'నాలోగనుక బ్రహ్మచర్యం ఉంటే (యది మేస్యాత్ బ్రహ్మచర్యం) నేను చేసే పరిపాలన

ఏ అడ్డంకులు లేనిదైతే, నేను ఎప్పుడు సత్యమే మాట్లాడే వాడినైతే ఈ బాలుడు బతుకుగాక'. అంతే! పరీక్షిత్తు బతికాడు.

సనత్సుజాతుడు అనేవాడు ధృతరాష్ట్ర మహారాజుకి మృత్యువంటే ప్రమాదమని చెప్పాడు. ఉండవలసిన విషయం మీద జాగ్రత్త లేకపోవటం ప్రమాదం. ఈ మానవజన్మ ఎత్తిన తర్వాత దుఃఖం లేని ఆనందం కోసం ఆలోచించాలి. ఆ దిశగా ఆలోచించకపోతే ప్రమాదం ముంచుకొస్తుంది. వచ్చేజన్మలో ఎలా పుడతామో తెలియదు. ఆలోచన చేసే శక్తి ఉంటుందో ఉండదో తెలియదు. అందుకే అన్ని తెలిసిన ఆ కోవిదుడు – కృష్ణుడనే పండితుని గురించి ఆనందకరమైన భావనలు చేసి, మనల్ని అనుగ్రహించటానికి అన్నమయ్య గీతాలుగా రాసి పెట్టాడు. అవి చదివి, వాటి ఆంతర్యాన్ని తెలుసుకొని, కోవిదులు కావటం మన వంతు.

స్వామికి అన్నమయ్య ఎంతో భక్తుడు కదా! ఆయనని పట్టుకొని దొంగ దొంగ అని ఇన్నిసార్లు అనవలసిన అవసరం ఉందా అనిపిస్తుంది. మనం నిత్యం జపించే పరమ పవిత్రమైన విష్ణుసహస్ర నామాలలో విష్ణువును 'అనర్థః' అన్నారు. అనర్థాలకు నిలయుడు లేదా కారకుడు అని అనర్థః పదానికి మనకు తెలిసిన అర్థాన్ని ఆపాదించకూడదు. దాని అసలు అర్థం ఇది. ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి – ఈ ముగ్గురు భక్తులు స్వామివారిని తప్పించి మిగతావి అన్నీ కావాలని కోరుకొనేవారు. ఈ ముగ్గురిచేత కోరబడేవాడు కాబట్టి, స్వామివారికి 'అనర్థః' అనే పేరు వచ్చింది. ఇలాగే 'దొంగ' అనే పదానికి, లోకంలో మనం వాడే అర్థం కంటే మించిన అర్థం ఉంది. ఆయనని ఆశ్రయిస్తే, ఈ సంసార తాపత్రయాలను మనలోనుంచి దొంగిలిస్తాడు. గోపికల దేహాభిమానాలనే వస్త్రాలను దొంగిలించిన దొంగ కృష్ణుడు.

బ్రహ్మయ్య ఒకసారి బాలకిట్టయ్యని పరీక్షిద్దామనుకొన్నాడు. అడవిలో ఉన్న ఆవుదూడలను, భోజనాలు చేస్తున్న గోపబాలకులను ఒక రహస్య ప్రదేశంలో దాచాడు. కృష్ణుడు, బ్రహ్మదేవుడు చేసిన మోసం గ్రహించాడు. ఈ బ్రహ్మాండాలను వంచించటం, మరలించటం తెలిసిన శ్రీహరి (భాగ. 10-509) ఆవుదూడల ఆకారాన్ని తానే ధరించాడు. ఈ ఘట్టాన్ని మనకు జ్ఞాపకం చేస్తూ అన్నమయ్య 'గోవులలో దాగిన దొంగ వీడు' అన్నాడు. పోతన కృష్ణుడిని 'వంచకుడు' అనటానికి సందేహపడలేదు. అన్నమయ్య 'వంచకత్వం తెలిసిన దొంగ' అన్నాడు.

24. గోవిందా శ్రిత గోకుల బృందా

గోవిందా శ్రిత గోకులబృందా
పావన జయ జయ పరమానందా

జగదభిరామా సహస్రనామా
సుగుణ ధామ సంస్తుత నామా
గగన శ్యామా ఘన రిపు భీమా
అగణిత రఘు వంశాంబుధి సోమా

జననుత చరణా శరణ్య శరణా
దనుజ హరణ లలిత స్ఫురణా
అనఘా చరణాయత భూభరణా
దినకర సన్నిభ దివ్యాభరణా

గరుడతురంగా కారోత్తుంగా
శరధి భంగ ఫణి శయనాంగా
కరుణాపాంగా కమలాసంగా
వర శ్రీవేంకటగిరిపతి రంగా

ముఖ్యపదార్థం :

గోవిందా	=	భూమిని, గోవును, స్వర్గాన్ని వేదాన్ని పొందినవాడా!
శ్రిత	=	ఆశ్రయించిన
గోకులబృంద	=	ఆవుల గుంపు కలిగినవాడా!
పావన	=	పవిత్రమైనవాడా!
జయ	=	సర్వులను జయించి వశపరచుకొనెడివాడా!
జయజయ	=	గెలువుము, గెలువుము (ఇంకొక అర్థం)
పరమానంద	=	ఎక్కువైన ఆనందమే స్వరూపముగా కలిగినవాడా!
జగదభిరామా	=	ప్రపంచంలో ప్రియమైనవాడా!
సహస్రనామా	=	వేయిపేర్లు కలిగినవాడా!
సుగుణధామ	=	మంచి గుణాలకు నిలయమైన వాడా!

సంస్తుత నామా	=	పొగడదగిన పేర్లు కలిగినవాడా!
గగన శ్యామా	=	ఆకుపచ్చన, నల్లన కలిసిన ఆకాశపు రంగు కలవాడా!
ఘనరిపుభీమా	=	ఘనులయిన శత్రువులకు భయంకరమయినవాడా!
అగణిత	=	లెక్కించటానికి వీలులేని
రఘువంశాబుధి సోమా	=	గొప్పదయిన రఘువంశ సముద్రమునకు చంద్రుడా!
జనసుత చరణా	=	జనులచేత పొగడదగిన పాదాలు కలవాడా!
శరణ్యశరణా	=	రక్షకులకు రక్షణ ఇచ్చువాడా!
దనుజ హరణ	=	రాక్షసులను సంహరించువాడా!
లలిత స్ఫురణా	=	అందంగా ప్రకాశించువాడా!
అనఘా	=	పాపము లేనివాడా!
చరణాయత	=	చరణముల చేత విస్తృతమయిన
భూభరణా	=	భూమిని ధరించినవాడా!
దినకర సన్నిభా	=	సూర్యునితో సమానమయినవాడా!
దివ్యాభరణా	=	దివ్యమైన ఆభరణములు కలిగినవాడా!
గరుడతురంగా	=	గరుత్మంతుడు వాహనముగా కలిగినవాడా!
ఆకారోత్తుంగా	=	విశ్వరూపము కలిగినవాడా!
శరధిభంగ	=	సమద్ర గర్వమును పోగొట్టిన వాడా!
ఫణిశయనాంగా	=	ఆదిశేషుడు పానుపుగా కలిగినవాడా!
కరుణాపాంగా	=	దయ నిండిన కడకన్ను కలవాడా!
కమలాసంగా	=	లక్ష్మీదేవి యందు అనురాగము కలిగినవాడా!
వర	=	శ్రేష్ఠుడైన
శ్రీవేంకటగిరిపతిరంగా	=	శ్రీవేంకటాచల ప్రభూ!

భావం :

అన్నమాచార్యులవారి రెండోభార్య అక్కలమ్మ. ఆమెకు పుట్టినవారు పెదతిరుమలాచార్యులవారు. ఈయన కూడా తండ్రిలాగా రోజుకో కీర్తన వేంకటేశ్వరునికి అంకితం చేస్తూ రాశారు. వారు రాసిన ప్రసిద్ధమైన సంస్కృత కీర్తన ఇది.

గోవర్ధనగిరిని ఎత్తి గోవులను రక్షించటం చేత గోవిందుడయ్యాడని భారతం చెప్పింది. గోవర్ధనోద్ధరణ సందర్భంలో సురభి పాలతో శ్రీకృష్ణుని అభిషేకించి ఆయనకు గోవిందుడని నామకరణం చేసినట్టు భాగవతంలో ఉంది. వరాహావతారంలో రసాతలంలో ఉన్న భూమిని తన కోరలతో పైకి ఉద్ధరించాడు కనుక విష్ణువును గోవిందుడన్నారు.

నమ్ముకొన్న భక్తులను కూడా నేటి కలియుగంలో ఆయన ఉద్ధరిస్తాడని మనసారా నమ్ముతూ 'గోవింద! గోవింద'అంటూ కోట్లాది భక్తులు నోరారా పిలుస్తుంటారు.

తనకు సంబంధించిన గోపాలక మిత్రులను, గోగణాలను రక్షించటానికి ఏడు రోజులపాటు శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని చిటికెన వేలిమీద ఎత్తాడు. వారికోసం ఎందరో రాక్షసులను సంహరించాడు. దీనినే పెదతిరుమలాచార్యులు 'శ్రితగోకుల బృందా!' అన్నాడు.

ఈ కీర్తనలో కవి ప్రయోగించిన 'జగదభిరామ' ప్రయోగం ఎంతో పేరు పొందింది. ఆధునిక చలన చిత్ర యుగంలో ఈ ప్రయోగంతో మొదలయ్యేపాట విశేషమైన ఆదరణ పొందిన విషయం అందరికీ తెలిసిందే. అభిరామ అనే పేరుతో తమిళనాడులో మీనాక్షిదేవికి పూజలు జరుగుతున్నాయి.

స్ఫురణ అంటే మనస్సు మీద మెరుపు అన్నారు రమణమహర్షి. కాంతి, శబ్దం – రెండింటిని ఈ శబ్దం సూచిస్తుందని వారి మాట. ఇంతటి విశేషార్థం కల స్ఫురణ శబ్దాన్ని లలితంగా కవి ప్రయోగించాడు.

పెదతిరుమలాచార్యులు 'గరుడ తురంగ'– అంటే 'జగదానంద కారక ' అను ప్రసిద్ధమైన కీర్తనలో త్యాగరాజస్వామి 'ఖగతురంగ' అన్నారు. రెండుచోట్లా తురంగ మంటే వాహనమనే అర్థం.

పదే పదే స్వామి నామస్మరణ చేస్తే తరిస్తాం. ఈ కీర్తనలో ఉద్దేశ్యం అదే. 'జయలిడగా' అని తండ్రి (1-320) పలికిన రీతిలో స్వామికి 'జయజయ' అన్న పెద తిరుమలయ్యను కూడా 'జయము జయము' అని సాహితీ పరులు కొనియాడుతారు.

25. చిన్ని శిశువూ చిన్ని శిశువూ

చిన్ని శిశువూ చిన్ని శిశువూ
యెన్నడు చూడమమ్మ యిటువంటి శిశువూ

తోయంపుగురులతో తూగేటి శిరసు, చింత
కాయల వంటి జడలగముల తోడ
మ్రోయుచున్న కనకంపు మువ్వల పాదాల తోడ
పాయక యశోద వెంట పారాడు శిశువూ

ముద్దుల వ్రేళ్ళ తోడ మొరవంక ఉంగరాల
నిద్దపుంజేతుల పైడి బొద్దుల తోడ
అద్దపుంజెక్కులతోడ అప్పలప్పలనినంత
గద్దించి యశోద మేనుగౌగిలించు శిశువూ

బలుపైన పొట్టమీది పాల చాఱల తోడ
నులివేడి వెన్న దిన్న నోరితోడ
చెలగి నేడిదె వచ్చి శ్రీవేంకటాద్రిపై
నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువూ

ముఖ్యపదార్థం :

తోయంపు గురుల	=	నీళ్ళతో తడిసిన వెంట్రుకలతో
తూగేటి శిరసు	=	ఊగేటి తల
జడలగముల	=	జుట్టు ముడుల గుంపుతో
కనకంపు మువ్వల	=	బంగారపు అందెల
పాయక	=	విడువక
పారాడు	=	తిరుగుతున్నాడు
మొరవంక	=	వంకరైన
నిద్దపుంజేతుల	=	నునుపైన చేతులతో
బొద్దుల	=	శిశువుల చేతులకు వేసే ఆభరణాలు
అప్పలప్పలు	=	పిల్లలను దగ్గరకు పిలుచుటలోని అనుకరణ విశేషం

నులివేడి = కొంచెము వెచ్చనైన
చెలగి = వికసించి, విజృంభించి, ఉత్సాహించి

భావం :

అన్నమయ్య ఈ కీర్తనలో బాలకృష్ణుని తలచి, పిలచి, పరవశిస్తున్నాడు. చిన్ని శిశువు... చిన్ని శిశువు... (ప్రేమలో రెండు మార్లు పిలుపు) ఎప్పుడూ చూడలేదమ్మా.... ఇటువంటి చిన్ని శిశువుని.

ఎక్కడెక్కడ ఆడాడో, దుమ్ముతో తలంతా చింతకాయల్లా జడలు కట్టుకుపోయింది. అలాగే – ఆ దుమ్ము తలతోనే – నీళ్ళలో మునిగి ఉంటాడు. నీళ్ళతో తడిసిన దుమ్ము తల చిరాకు పుట్టిందేమో– తలను అదేపనిగా ఊపుతున్నాడు. ఆ కదలికలకి కాలికున్న బంగారపు మువ్వలు ఘల్లుఘల్లుమని మోగుతున్నాయి. ఏమీ తెలియని నంగనాచిలా – అదిగో – అమ్మ యశోదమ్మ కొంగు పట్టుకొని విడవక తిరుగుతున్నాడు.

అబ్బా! ఈ వేళ్ళు చూశారా! ఎంత ముద్దుగా ఉన్నాయో! ఏవో వంకరగా ఉన్న ఉంగరాలు ఆ వేళ్లకి పెట్టారు. ఆ నునుపైన చేతులకి బంగారపు బొద్దులు పెట్టారు. అద్దాల్లాగా చెక్కిళ్ళు ఎంత బాగున్నాయి! ఎవరో గోపాలకుడు ఆడుకొందామని అప్పలప్పలు అని (ఆటకు సంబంధించిన గుర్తుతో) పిలిచాడో లేదో – అమ్మని విడిచి వెళ్ళటం ఇష్టం లేని కన్నయ్య కోసం నటిస్తూ – నేను రానుపో అని అతడిని బెదిరించి, అమ్మని కౌగిలించుకొంటున్నాడు.

అదిగో – నేను చెబుతున్నానని – మీరేమి దిష్టి పెట్టకండి – మా కన్నయ్య పొట్టనిండా పాలు తాగేసరికి కొంచెం పొట్ట ఉబ్బింది. పాలు తాగేటప్పుడు చిన్నపిల్లాడు కదా! కొంచెము పాలు ఒలికిపోయి, పొట్టమీద చారలయ్యాయి. అప్పుడే తీసిన వెచ్చటి వెన్న తిన్న నోటితో –ఆ ద్వాపర యుగంలో అందరినీ ఆనందపరిచిన ఆ చిన్నిశిశువు – ఈకలియుగంలో మనందరినీ ఉద్ధరించటానికి వేంకటాద్రిపై శ్రీవేంకటేశ్వరునిగా నిలిచి– లోకాలన్నీ నిలుపుతున్నాడు.

సులభంగా ఒక గొప్పవాక్యం రాయటం ఎంత కష్టమో, కళ్ళెదుట జరుగుతున్న విషయం అందంగా చెప్పటం అంత కష్టం. అందమైన భావాలకు చిరునామా అయిన అన్నమయ్యకు ఇటువంటివి జీడిపప్పులు నమిలినంత సులభం. పిల్లవాడు కదిలితే ముద్దు. అందునా తడిసిన తలను అటూ ఇటూ ఊపితే ఆ దృశ్యాన్ని చూస్తూ హృదయాలు కూడా ఊగిపోతాయి.

తేనెనుంచి తీపిని వేరు చేయటం ఎంత కష్టమో చిన్నికృష్ణుడి వర్ణనలో గజ్జెల మోతలు లేకుండా రాయటం అంత కష్టం. అందుకే అన్నమయ్య కూడా మోగుతున్న బంగారు అందెల పాదాలు వర్ణించి మురిసిపోయాడు. అమ్మకూచిగా యశోదమ్మను వదలటం లేదుట కన్నయ్య. అలా యశోద వెంట పారాడు శిశువును అందంగా చిత్రించి, మనలని ధన్యుల్ని చేశాడు కవి.

ఈ కీర్తనలో మూడు చరణాల్లో మూడు రకాలైన అవస్థలు. మొదటిదాంట్లో పారాడే శిశువు. రెండవదాంట్లో నిలబడటానికి ప్రయత్నిస్తూ గద్దించే శిశువు. మూడవ దాంట్లో తన శిశువులైన లోకజనులను ఉద్ధరించటానికి తిరుపతి కొండమీద నిలిచిన పెద్ద శిశువు. మొదటి రెండు చరణాల్లో ఉన్న 'కదిలే సౌందర్యం' మూడో చరణంలో వేంకటేశుడిగా ముద్ద కట్టిందనే అన్నమయ్య భావుకతకు ఏటికోళ్ళు (నమస్కారాలు) తనకు ఆడుకోవటం ఇష్టమే. కానీ అమ్మ ఏమంటుందో అని భయం. అందుకే ఆడుకొందాం రారా అని స్నేహితుడు పిలుస్తుంటే, దొంగ వేషాలేస్తూ తెలుగు శిశువు 'నేను రా...ను' అని ఉత్తుత్తిగా చెబుతాడు. స్నేహితుడు మరీ ఒత్తిడిచేస్తే అమ్మ ఎదుట తిరుగుళ్ళు ఏమీ తెలియనివాడిలాగా చెబుతుంటే... వినిపించుకోవా' అని గద్దిస్తాడు. అన్నమయ్య చిన్నిశిశువు ఇదే పని చేశాడు.

అద్దంలో కనబడేది మనమే. కానీ మనల్ని మనం అద్దంలో చూసుకోవటం ఆనందంగా ఉంటుంది. లోకంలో కనపడేదాన్ని అన్నమయ్యలాంటి మహాకవుల కవిత్వంలో చూసుకొన్నా అంతే!

విష్ణుమూర్తి అవతారమైన వేంకటేశ్వరుని రూపం కూర్చొని మనకు కనబడచ్చు గదా! నిలబడే ఎందుకుంది? విష్ణుమూర్తి నందకము (కత్తి) అన్నమయ్యగా పుట్టిందంటారు. అందుకే ఆయనకే దీనికి జవాబు చెప్పే అర్హతుంది. "లోకాలన్నీ నిలపటానికి వేంకటేశుడు నిలబడ్డా"డని అన్నమయ్య తీర్పు. ఇటువంటి అందమైన అన్నమయ్య కీర్తనలు లోకంలో కలకాలం నిలబడతాయి.

26. చూడరమ్మ సతులాల సోబాన బాడరమ్మ

చూడరమ్మ సతులాల సోబాన బాడరమ్మ
కూడున్నది పతి జూడికుడుత నాంచారి

శ్రీమహాలక్ష్మియట సింగారాలకేమరుదు
కాముని తల్లియట చక్కదనాలకేమరుదు
సోముని తోబుట్టువట సొంపుగళకేమరుదు
కోమలాంగి ఈ చూడికుడుత నాంచారి

కలశాబ్ధి కూతురట గంభీరాలకేమరుదు
తలప లోక మాతయట దయమరి యేమరుదు
జలజ నివాసియట చల్లదనమేమరుదు
కొలది మీర ఈ చూడికుడుత నాంచారి

అమర వందితయట అట్టె మహిమేమరుదు
అమృతము చుట్టమట ఆనందాలకేమరుదు
తమితో శ్రీవేంకటేశుదానె వచ్చి పెండ్లాడె
కొమెర వయసు చూడికుడుత నాంచారి

ముఖ్యపదార్థం :

సోబాన	=	ఒక పెండ్లిపాట
కూడున్నది	=	కలిసి ఉన్నది
సింగారాలకు	=	అలంకారాలకు
అరుదు	=	ఆశ్చర్యం
సోముని	=	చంద్రుని
కలశాబ్ధి	=	పాల సముద్రం
కొలదిమీర	=	అపరిమితంగా
తమితో	=	వలపుతో

భావం :

లక్ష్మీదేవి రూపమైన గోదాదేవిని తమిళంలో చూడికుడుత్త నాచ్చియార్ అంటారు. ఆ – ఆముక్తమాల్యదను చూడికుడుత నాచారి, చూడికుడనాచారి అంటూ అన్నమయ్య

ఈ కీర్తనలో పరవశించాడు.

ఓ మంచి గుణములు గల స్త్రీలారా! చూడటానికి రండమ్మా! పెండ్లి పాటను పాడండి. అదుగో! మన కళ్ళెదురుగా శ్రీ వేంకటేశునితో ఆముక్తమాల్యద (తను ధరించిన పూలమాల శ్రీరంగనాథునికి ఇచ్చినది) కలసి ఉంది.

లక్ష్మి అంటే సంపద. అందరూ కోరుకునే అలంకారాలు. సంపద సహజంగానే ఆవిడ దగ్గర ఉన్నాయి. అష్టైశ్వర్యాలు ఇచ్చే ఆమెకు అలంకారాలకు ఏమి తక్కువ? లక్ష్మిదేవి రుక్మిణీదేవిగా అవతరించినప్పుడు మన్మథుడు ప్రద్యుమ్నుని పేరుతో ఆమెకు పుట్టాడు. అందగాడు మన్మథుని తల్లికి అందచందాలకు లోటేమిటి? పాల సముద్రాన్ని మధించేటప్పుడు చంద్రుడి తర్వాత లక్ష్మి పుట్టింది. కనుక వారిద్దరూ తోబుట్టువులు. పదహారు కళలు గల చంద్రుడు సోదరుడైనప్పుడు, సోదరియైన లక్ష్మికి కళలకు లోటేమిటి? మా గోదాదేవి కోమలాంగి.

గంభీరము గల పాలసముద్రపు కూతురైన లక్ష్మి గంభీరత గూర్చి వేరే చెప్పాలా? కుటుంబంలో తల్లి దయ ఇంతని ఎవరం చెప్పలేం. అలాంటప్పుడు అన్ని లోకాలకు తల్లి గోదాదేవి దయ ఇంతని చెప్పటం ఎవరి వల్ల కాదు. పద్మం చల్లదనమున్న నీటిలో పుడుతుంది. ఆ పద్మంలో ఉన్న లక్ష్మికి నీటి చల్లదనం సహజంగానే వస్తుంది. కనుక ఆమె చల్లదనం గురించి వేరే చెప్పాలా? మా తల్లి గుణాలు అపరిమితం.

అందరూ నమస్కరించే దేవతలే మా లక్ష్మీదేవికి దండం పెడతారు. ఇక ఆమె గొప్పతనాన్ని గూర్చి వేరే చెప్పక్కర్లేదు. మానవుడికి భయం పుట్టించి ఆనందాన్ని దూరం చేస్తుంది మృత్యుభయం. దానిని పోగొట్టేది అమృతం. ఆ అమృతము వంటి దయావిశేషాలు అనేకం ఉండి, అమృతపు చుట్టమైన లక్ష్మీదేవి దగ్గర ఆనందాలకు సుఖాలకు లోటేముంటుంది?! యౌవనవతియైన గోదాదేవిని కోరికతో శ్రీవేంకటేశుడు రంగనాథునిగా స్వయంగా తనంత తానుగా పెండ్లాడాడు.

బాల్యానికి అవతల, యౌవనానికి ముందుది అయిన అవస్థలో అంటే కౌమారంలో ఉన్న స్త్రీని కొమిరె అంటారు. దానిని కొమరుం బాయము అని కళాపూర్ణోదయము వంటి గ్రంథాలలో అంటే మన అన్నమయ్య గోదాదేవిది కొమెర వయసు అన్నాడు. చూడికుడుత్తనాచ్చియార్‌ను సంస్కృతీకరించి రాయలవారు ఆముక్తమాల్యద అని అద్భుతమైన కావ్యం రాశారు. తమిళ దేశంలో విలిపుత్తూర్ గ్రామంలోని విష్ణుచిత్తుడనే (పెరియాళ్వార్) భక్తుడుండేవాడు. అతని కుమార్తె. తండ్రి విష్ణుదేవునికి కట్టిన పూలమాలను రహస్యంగా జడలో పెట్టుకొని మురిసిపోయి, కొద్దిసేపటి తర్వాత స్వామివారి సేవ

కోసం పెట్టిన సెజ్జలో పెడుతుండేది. ఒకరోజు ఈ విషయం విష్ణుచిత్తుడి కంట పడింది. అది అపచారంగా భావించి, విష్ణుచిత్తుడు వేరే పువ్వులతో ఇంకొక మాలను చేసి స్వామివారికి సమర్పించాడట. ఆ రాత్రి కలలో స్వామివారు విష్ణుచిత్తునికి కనబడి, "కూతురు ముడిచి ఇచ్చిన మాలలే తనకిష్ట"మని చెప్పాడట. తదుపరి కొన్ని సంఘటనల పిదప శ్రీరంగనాథుడు సకల మునులతో విలిపుత్తూర్ చేరి గోదాదేవిని పెండ్లాడాడు (ఆము-6ఆశ్వా). తిరుమల వేంకటేశ్వరుడే రంగనాథుడు. ఇప్పటికీ గోదాదేవి ధరించిన తోమాల తెచ్చి స్వామి వారికి అలంకరిస్తుంటారు.

లోతైన సముద్రానికి ఉండే గంభీర లక్షణం అమ్మలో ఉందన్న కవి మాట ఆలోచించదగినది. "నా బుద్ధి చాలా పరిమితం. నా మనస్సు స్వామి గతకాలపు లీలల సముద్రాలలోనికి అడుగుపెట్టలేదు" అన్నాడు వేంకటభట్టనే ఒక వైష్ణవ మహానుభావుడు. అన్నమయ్య వర్ణించిన అమ్మ గంభీరత్వం కూడా ఇదే. తల్లి దయ ఉంటేనే ఆమె లీలల గంభీరత్వం తెలుస్తుంది.

ఈ కీర్తనలో చూడికుడుతనాచారి అన్నాడు కాని, ఇంకొక కీర్తనలో 'పెరియాళువారి బిడ్డ పిసికి పై వేసిన విరుల దండల మెడ వేసినవాడు" అని ఆ తమిళ పదానికి అన్నమయ్య తెలుగు కస్తూరి పెట్టాడు.

మహాకవి పాల సముద్రానికి పర్యాయపదంగా కలశాబ్ధి అని కీర్తనలో వాడాడు. విశ్వకర్మ సముద్రంలో పుట్టిన అమృతాన్ని పోయటానికి ఒక కలశాన్ని సృష్టించాడు. ఆ కలశానికి సంబంధించినది కాబట్టి పాల సముద్రాన్ని కలశపాథోరాశి అంటారు (వావిళ్ళ) అమృత కలశం వెలువడిన సముద్రం కాబట్టి పాల సముద్రానికి కలశాబ్ధి అని పేరు (మల్లంపల్లి) అన్నయయ్య ప్రతి కీర్తన కలశాబ్ధి.

"అన్నమయ్య కీర్తనట - అందాలకే మరుదు" అని ఈ కీర్తన చదివిన తర్వాత సాహితీపరులు పరవశిస్తారు.

27. చేరి యశోదకు శిశువితడు

చేరి యశోదకు శిశువితడు
ధారుణి బ్రహ్మకు దండ్రియు నితడు.

సొలసి చూచినను సూర్యచంద్రులను
లలి వెదజల్లెడు లక్షణుడు
నిలిచిన నిలువున నిఖిల దేవతల
కలిగించు సురుల గనివో యితడు

మాటలాడినను మరి యజాండములు
కోటులు వొడమెటి గుణరాశి
నీటగునూర్పుల నిఖిల వేదములు
చాటున నూరెటి సముద్రమితడు

ముంగిట పొలసిన మోహనమాత్మల
పొంగించే ఘన పురుషుడు
సంగతి మావంటి శరణాగతులకు
నంగము శ్రీవేంకటాధిపుడితడు

ముఖ్యపదార్థం :

ధారుణి బ్రహ్మకు	=	14 లోకాలు సృష్టించిన బ్రహ్మకు
సొలసి చూచినను	=	పరవశించి చూడగా
లలి	=	ప్రేమను
లక్షణుడు	=	విశేషపు గుర్తులు కలవాడు
నీటగు నూర్పుల	=	విలాసపు ఊపిరుల
చాటున	=	విశదపరచే
ఘనపురుషుడు	=	పురుష సూక్తంలో చెప్పిన పురుషుడు
సంగతి	=	సావాసము చేయు
అంగము	=	మనస్సు, ఉపాయము, గతి

భావం :

సాధారణంగా చిన్నపిల్లలు ఏమి చేసినా, ఏమి మాట్లాడినా మానవ జన్మ ఎత్తినవారికి బాగానే ఉంటుంది. కాకరకాయ కూరను తాతరతాయ కూర అంటే 'ఎంత బాగా అన్నాడో మా అబ్బాయి' అని మురిసిపోతాం. 'చిన్న పిల్లలని, పువ్వులను ప్రేమించనివాడిలో ఏదో లోపముందని, వాళ్ళు హింసా ప్రేమికులుగా (శాడిస్టులు) మారకముందే వైద్యం చేయించుకోవా'లని పెద్దలు చెప్పారు.చిన్నపిల్లలని ప్రేమించే పెద్దమనస్సు ఉండడం వల్ల మన తెలుగు కవులు, సంస్కృతకవులు శ్రీకృష్ణుడి బాల్యాన్ని అంతగా ప్రేమించారు. అన్నమయ్య కూడా దీనికి మినహాయింపు కాదు. కృష్ణుడనే శిశువును తనివితీరా కీర్తనల్లో వర్ణించాడు. అందులో ఒక కీర్తన ఇది.

ఈ చిన్నికృష్ణుడు పుట్టింది దేవకి కడ. శిశువుగా పెరుగుటకు చేరింది యశోద దగ్గరకు. అందువలన 'చేరి యశోదకు శిశువితడు'. 14 లోకాలు సృష్టించిన బ్రహ్మకు ఈ బాలకృష్ణుడు తండ్రి. తాను పరవశించి చూస్తే సూర్యచంద్రులు ఒకేసారి చూస్తున్నట్లు (సూర్యచంద్రులు తన రెండు కళ్ళు కనుక) అనిపిస్తుంది. అలా ప్రేమను వెదజల్లే విశేషపు గుర్తులు కలవాడు. ఒక్కసారి అలా కదలకుండా ఉంటే, సకల దేవతలూ మన ఎదుట కనిపిస్తున్నట్టు అనిపిస్తారు. మాట్లాడటానికి నోరు విప్పితే చాలు – బ్రహ్మాండాలన్నీ ఆ శిశువు నోట్లో పుడుతుంటాయి. అందంగా తీసే ఊపిరుల్లో అన్ని వేదాలూ కనపడతాయి. మన కన్నుల ఎదుట వ్యాపించిన మోహం కలిగించు రూపం. ఈ ప్రపంచానికి కారణమైన గొప్పవాడైన పురుషుడు ఆయనని శరణుగోరి వచ్చిన మాబోటివారికి (అన్నమయ్య వంటివారికి) గతి అయిన శ్రీవేంకటేశ్వరుడు ఈ చిన్ని శిశువు.

*****

శ్రీరాముడు చిన్నతనంలో ఎలా ఉన్నాడో రామాయణంలో మనకు కనిపించదు. స్వామివారి బాల్యం ఎలా ఉందన్న మన కోరికను, ఆయన ఇంకో అవతారమైన కృష్ణుడి రూపంలో తీర్చింది భాగవతం. వ్యాసమహర్షి 'అద్భుత బాలకుడు' అని భాగవతంలో కృష్ణున్ని పొగిడాడు. ఆ అద్భుత బాలుడినే అన్నమయ్య చేరి 'యశోదకు – శిశువితడు' కీర్తనలో వర్ణించాడు. బ్రహ్మదేవుడు ధర, ద్రోణుడు అనే దేవతలను భూలోకంలో జన్మించమంటే వాళ్ళు విష్ణుదేవుని సేవించే భాగ్యం ఇమ్మన్నారు. బ్రహ్మ వారు కోరినట్లు అనుగ్రహించాడు. అలా వాళ్ళిద్దరూ యశోద, వసుదేవులు కాగా విష్ణువు కృష్ణుడై బిడ్డగా వాళ్ళ సేవలు పొందాడు. బ్రహ్మకు తండ్రియైన కృష్ణుడు (విష్ణువు) బ్రహ్మ సృష్టిలో యశోద శిశువు. అందుకే అన్నమయ్య ఒక పాదంలో శిశువు అంటూ ఇంకో పాదంలో తండ్రి అన్నాడు.

ఒక్కసారి అలా కదలకుండా ఉంటే, సకలదేవతలూ మన ఎదుట కనిపిస్తారని అన్నమయ్య అనటం – భగవద్గీతలో దేవతలందరూ స్వామిలో ఉన్నారని చెప్పిన వాక్యాన్ని గుర్తుకు తెస్తుంది. (11-21, 22వ శ్లో) మన మనస్సులు కదలకుండా స్వామి మీద నిలబడితే ఆయనతో సకల దేవతల దర్శనం అవుతుందని ఇక్కడ అర్థం గ్రహించాలి. నిలిచిన భక్తుల మనస్సులకు సంబంధించిన విశేషణం. స్వామివారికి సంబంధించింది కాదు.

ఐశ్వర్యం, శక్తి, కీర్తి, జ్ఞానం, శ్రీవైరాగ్యం అనేవి భగవంతుడి ఆరు గుణాలు. ఈ గుణాలు కలవాడినే అన్నమయ్య 'గుణరాశి' అన్నాడు. పసివాడి నోట్లో సముద్రాలు, పర్వతాలు మొదలైన వాటితో ఉన్న బ్రహ్మాండాన్ని చూసి, యశోదమ్మ ఆశ్చర్యపోయింది. 'కలయో వైష్ణవమాయయో' అనుకొంది. ఈ కృష్ణుడి నోట్లో అజాండాలు ఉన్నాయేమిటా అని బిత్తరపోయింది. (ద.స్కం. 342) సరిగ్గా ఈ అజాండ (=భూమి అనే గోళం) శబ్దాన్నే అన్నమయ్య తన కీర్తనలో, అదే సందర్భంలో చెప్పటం గమనించదగిన అంశం.

మహాభారతం శాంతిపర్వంలో పురుషుడంటే ఏమిటో చెప్పారు. తొమ్మిది ద్వారాలు కలిగిన ఈ శరీరమనే పురంలో వ్యాపించిన బొటన వేలంత సూక్ష్మమైన ఆకారంలో ఉండే వాడు పురుషుడు. ఈ కీర్తనలో'ఆత్మలను పొంగించే పురుషుడు' వీడే. 'ఆ పురుషుని ఈ విధంగా తెలుసుకొన్నవాడు ఇక్కడే ముక్తుడవుతాడు., మోక్షానికి ఇతర మార్గం లేదు" (తమేవం విద్వానమృత..) అని పురుష సూక్తంలో చెప్పిన మార్గంలో, యశోదకు శిశువుగా ఆ పురుషుణ్ణి చూసి, తన కీర్తనలు చదివేవాళ్ళకు కూడా ఈ అదృష్టం కలిగించాడు అన్నమయ్య.

శరణు వేడడం వైష్ణవంలో ఒక గొప్ప మార్గం. స్వామివారితో సంగతి (=స్నేహము) చేసేవాడినని, తనలాంటి శరణు కోరేవాళ్ళకు స్వామియే గతి అని, ఉపాయమని అన్నమయ్య చెబుతున్నాడు. ఈ కీర్తనలో స్వామితో తనకు స్నేహమని అన్నాడు కాని, మిగతా కీర్తనల్లో చాలాచోట్ల స్వామివారికి సేవకుడయ్యాడు. ప్రేయసిగా మారాడు. నాయికా నాయకుల మధ్య రాయబారం చేసే దూతికగా మారాడు. తెలుగువారి నాలుకలపై కదిలే మంత్రాక్షరమయ్యాడు.

28. డోలాయాంచల డోలాయం హరే...

డో లాయాంచల డోలాయాం హరే డోలాయాం

మీన కూర్మ వరాహ మృగపతి అవతారా
దాన వారే గుణ శౌరే ధరణి ధర మరుజనక

వామన రామ రామ వర కృష్ణ అవతారా
శ్యామలాంగా రంగ రంగా సామజ వరద మురహఱణ

దారుణ బుద్ధ కలికి దశవిధ అవతారా
సీరపాణే ఘోషమణే శ్రీవేంకటగిరి కూట నిలయ

ముఖ్యపదార్థం :

హరే	=	ఓ హరీ!
డోలాయం	=	ఊయెలలో
చల	=	ఊగు!
మీన	=	చేప (1.మత్స్యావతారం)
కూర్మ	=	తాబేలు (2. కూర్మ అవతారం)
వరాహ	=	అడవి పంది (3. వరాహ అవతారం)
మృగపతి	=	సింహము (4. నరసింహ అవతారం)
దానవారే	=	రాక్షసులకు శత్రువైన వాడా!
గుణశౌరే	=	ధైర్య గుణాలున్న విష్ణుమూర్తీ!
ధరణిధర	=	భూమిని ధరించువాడా!
మరుజనక	=	మన్మథునికి తండ్రీ!
వామన	=	పొట్టివాడు (5. వామన అవతారం)
రామ	=	6. పరశురామావతారం
రామ	=	7. రామావతరాం
వరకృష్ణ అవతారా	=	శ్రేష్ఠుడైన (8) కృష్ణావతారం దాల్చినవాడా!
శ్యామలాంగా	=	నల్లగా ఉన్న అవయవాలు కలవాడా!
రంగ రంగా	=	శ్రీరంగనాథా!
సామజ వరద	=	గజేంద్రునికి వరాలు ప్రసాదించిన వాడా!

మురహరణ	=	మురుడనే రాక్షసుని చంపినవాడా!
దారుణబుద్ధ	=	కఠినమైన (9) బుద్ధావతారం దాల్చినవాడా!
కలికిదశవిధ అవతారా	=	10. కల్కిమొదలైన దశావతారములు కలవాడా!
సీరపాణే	=	నాగలి చేతిలో ఉన్నవాడా (బలరాముడా)!
ఘోషమణే	=	గొల్లపల్లెకు మణివంటివాడా!
శ్రీవేంకటగిరి	=	శ్రీవేంకట పర్వతం
కూట నిలయం	=	శిఖరముపై ఉన్నవాడా!

భావం :

'జో' అచ్యుతానంద' అని తెలుగులో ప్రతి తల్లి పాడుకొనే ఉయ్యాల పాట రాసిన అన్నమయ్య స్వామివారి దశావతారాలను పొగుడుతూ ఈ సంస్కృత కీర్తనలో జంపాల (జోలపాట) పాడుతున్నాడు.

మీన, కూర్మ, వరాహ, నరసింహఅవతారాలు దాల్చినవాడా! రాక్షసులకు శత్రువైన వాడా! ధైర్య గుణాలున్న విష్ణుమూర్తీ! మన్మథునికి తండ్రీ! వామన, పరశురామ, శ్రీరామ. శ్రీకృష్ణ అవతారాలు ధరించినవాడా! నల్లనయిన అవయవాలు కలవాడా! గజేంద్రునికి వరాలు ప్రసాదించినవాడా! కఠినమైన బుద్ధ, కల్కి – ఈ విధంగా 10 అవతారాలు దాల్చిన(దాల్చే) వాడా! బలరాముడా! గొల్లపల్లెకు మణివంటివాడా! శ్రీవెంకట పర్వతశిఖరముపై ఉన్నవాడా! ఓ హరీ! ఊయెలలో ఊగు.

*****

విష్ణువు సృష్టిని కాపాడటానికి (1. మత్స్యం).మందరపర్వతం సముద్రంలో కుంగిపోకుండా ఉండటానికి (2. కూర్మం) వేదాలను కాపాడి, హిరణ్యాక్షుడిని చంపటానికి (4. నరసింహ) బలి గర్వాన్ని అణచివేయటానికి (5. వామన) దుష్ట క్షత్రియులను సంహరించటానికి (6.పరశురామ) రావణ వధ చేసి ఒక ఆదర్శ పురుషుడిని లోకంలో ఆవిష్కరించటానికి (7. శ్రీరామ) కంసాదిరాక్షస సంహారముతో పాటు, ఒక ఆచార్యునిగా, గీతా ప్రబోధం చేయటానికి (8.శ్రీకృష్ణ), త్రిపురాసుర సంహారం చేయటానికి (9.పురాణబుద్ధ) అవతారాలు ధరించాడు. దుష్ట సంహారం కోసం మరో (10. కల్కి) అవతారం ధరిస్తాడు. ప్రతి మన్వంతరంలో వచ్చే ఈ అవతారాలను అన్నమయ్య ఈ కీర్తనలో ప్రస్తావించాడు.

రావిచెట్టును కౌగిలించుకొంటే మీ కోరికలు నెరవేరుతాయని బుద్ధుడి ఆకారంలో త్రిపురాసురుల భార్యలకు విష్ణుమూర్తి చెప్పాడు. ఆ రకంగా వారు చేస్తుండగా, రావిచెట్టులో

విష్ణుమూర్తి కనబడి, వారి పాతివ్రత్యాన్ని పోగొట్టాడని ఒక కథ. త్రిపురాసురులను చంపటానికి ఈ విధంగా చేసినప్పటికీ ఆ పని దారుణమైనది కనుక 'దారుణబుద్ధ' అని అన్నమయ్య చెప్పాడు. గౌతమబుద్ధుడు, ఈ బుద్ధుడు ఇద్దరూ వేర్వేరు.

దశావతారాలు ఏవనే విషయంమీద ఈ నాటికీ ఎడతెగని చర్చ కొనసాగుతోంది. 'మత్స్యకూర్మ వరాహశ్చ' అను ప్రసిద్ధమైన దశావతార శ్లోకంలో బలరాముడికి బదులు కృష్ణుడి పేరున్న ఇంకొక పాఠముంది. బలరాముడిని కొందరు దశావతారాల్లో చేరిస్తే, ఆయనకు బదులు కృష్ణుడిని కొంతమంది చేర్చారు. కృష్ణుడికి బదులు బలరాముడి అవతారాన్ని 'పుడమినిందర' మొదలైన కీర్తనల్లో చేర్చిన అన్నమయ్య 'సంసారమే మేలు' అనే కీర్తనలో బలరాముడికి బదులు కృష్ణుడిని దశావతారాల్లో చేర్చి పొగిడారు.

ఊయెల పైకి పోయి కిందికి వస్తుంటుంది. జీవితంలో కూడా ఈ ఎగుడు దిగుడు తప్పదని, దృఢమైన మనస్తత్వం అలవర్చుకోవాలని వివాహంలో ఉయ్యాల కార్యక్రమం చెబుతోంది. 'ఊంజల్ సేవ' (తిరుమలలో జరిగే పవిత్రమైన ఉయ్యాల కార్యక్రమం) దేవునికి ఆపాదించటంలో ఈ బోధని ప్రచారం చేయాలనే కాంక్ష మన పెద్దలకు ఉంది.

ఈ కీర్తనలోని మూడు చరణాల్లో కవి ఒక క్రమమైన పద్ధతిని పాటించాడు. మొదటి పాదంలో అవతారాలను వర్ణించటం, రెండవ పాదంలో స్వామిని పొగుడుతూ సంబోధనలు చేయటం. మూడు చరణాలలోను కవి అలాగే రాశాడు.

దశావతారాల వర్ణనలో జీవుని పరిణామ క్రమం ఉన్నదని (నీటిలో మొదలైన జీవన క్రమం క్రమంగా భూమిపైకి పాకిందని) ఒకవాదం. ఆ పరిణామాల సంగతేమిటో కాని, ఈ అన్నమయ్య దశావతార కీర్తనలో దుఃఖం నుంచి ఆనందానికి హృదయాన్ని పరిణామం చెందించే ఒక దివ్యాక్షర సమ్మేళనం ఉంది.

29. జగడపు జనవుల జాజర

జిగడపు జనవుల జాజర
సగినల మంచపు జాజర

మొల్లలు దురుముల ముడిచిన బరువున
మొల్లపు సరసపు మురిపెమున
జల్లన బుప్పొడి జారగ బతిపై
చల్లే రతివలు జాజర

భారపు గుచముల పైపై గడుసిం
గారము నెరపేటి గందవొడి
చేరువ పతిపై చిందగ బడతులు
సారెకు జల్లేరు జాజర

బింకపు గూటమి పెనగేటి చెమటల–
పంకపు బూతల పరిమళము
వేంకటపతిపై వెలదులు నించేరు
సంకుమదంబుల జాజర

భావం :

జాజర అంటే రంగులు, సుగంధ ద్రవ్యాలు ఒకరి మీద ఒకరు చల్లుకొని ఆటలాడుకోవటం (వి.ఎ.కె.రంగారావు). వేంకటేశ్వరుని మీద అనేకమంది నాయికలు రంగులు, సుగంధ ద్రవ్యాలు చల్లే మనోహర దృశ్యాలు ఈ గీతంలో అన్నమయ్య చిత్రించాడు.

ప్రేమలో చిలిపి తగాదాలు, అధికారాలు, కోరికలు (=జగడపు చనవులు) సహజం. ఆ నాయికలు ఒకరితో ఒకరు అందంగా పోట్లాడుకొంటూ స్వామివారిమీద రంగులు పోస్తున్నారు. స్వామివారు కూర్చున్న మంచానికి కదిలితే చప్పుడు చేసే పక్షుల బొమ్మలు ఉన్నాయి. (= సగినల మంచపు) ఆ మంచం మీద నాయికా నాయకులు రంగులు పోసుకొంటున్నారు.

నాయికల కొప్పులు (= తురుములు) పెద్దవి. వాటి నిండా దిట్టంగా మొల్లలు

(= బొండు మల్లెపూలు) పెట్టుకొన్నారు. ఆ బరువైన కొప్పులతో దట్టంగా (= మొల్లపు) పరిహాసాల విలాసాలు (= సరసపు మురిపెమున) మొదలుపెట్టారు. ఒక పక్క అందం, మరొక పక్క చల్లగా (= చల్లన) పుప్పొడి (= పూవుల యందలి ధూళి), ఇంకొక పక్క జాజర వేంకటేశ్వరుని మీద చల్లుతున్నారు.

నాయికల బరువుగా ఉన్న స్తనాల (= భారపుగుచముల) మీద గంధపుపొడి బాగా (= కడు) సింగారాన్ని (= అందాన్ని) వ్యాప్తి చేస్తోంది (= నెరపేటి) వేంకటేశునికి దగ్గరగా ఉన్న నాయికలు అతనిపై మాటిమాటికి (= సారెకు) తమ స్తనాలమీది గంధపు పొడిని కలుపుతూ జాజరను చల్లుతున్నారు.

నాయికా నాయకుల బిగువైన కూడిక (= బింకపు గూటమి)లో ఒకరికొకరు చుట్టుకొంటుంటే (= పెనగేటి) ఒంటికి చెమట పట్టింది. ఇదివరకే ఒంటికి పట్టించుకొన్న పంకపు పూతలు (= గంధపు పూతలు) చెమట చిత్తడిలో కలసిపోయి వాసన (= పరిమళం) గుప్పుమంది. ఆ మనోహర చెమట వాసనలు కలిగిన జవ్వాజులను సుగంధ ద్రవ్యాలను (= సంకుమదములు) వేంకటేశుని శరీరం మీద నాయికలు చల్లుతున్నారు.

'బొండుమల్లెల పరపుల'పై నాయికలను అనేక కీర్తనల్లో వర్ణించిన అన్నమయ్య ఈ కీర్తనలో మొదటి చరణంలో బొండు మల్లెలతో కథ నడిపించాడు. బొండుమల్లెల నుంచి రాలే పుప్పొడిలో – ఏదో – ఆకర్షించే సువాసన ఉందని 'రసికుల పెద్దన్న' పెద్దన వర్ణించి మురిసిపోయాడు. అన్నమయ్య ఇంకొంచెం ముందుకు అడుగువేసి ఆ పుప్పొడితో స్వామి వారికి అభిషేకం చేయించాడు. ఆ బొండుమల్లెలు వేంకటేశుని నాయికలు ధరించారు. "కొప్పులో మొల్లలు పెట్టుకొంటే బరువులయ్యాయి"అని కవి ఊరుకొన్నాడు. కొప్పులు బరువెక్కాయా? ఆ అందాల పూల కొప్పులను చూస్తున్న నాయకుడి కళ్ళు బరువెక్కాయా? రెండవదే జరిగి ఉంటుంది. అందుకే పుప్పొడిని చిలిపిగా కళ్ళలోకి చల్లే కార్యక్రమం నాయికలు పెట్టుకొన్నారు.

భక్త కవులందరికి చందన చర్చితునిగ (గంధం పూసుకొన్నవానిగా) స్వామిని చూడటం ఇష్టం. "గంధము పూయరుగా" కీర్తనలో త్యాగరాజు తన నాయకుడు కృష్ణునికి గంధం సేవ చేయమని నాయికలకు పురమాయించాడు.

"నువ్వు ఒంటికి గంధం ఎందుకు రాస్తావే! నీ శరీరపు వాసన కంటే ఈ గంధం వాసన ఎక్కువా?" మొదలైన అన్నమయ్య భావాలు అనేకం త్యాగరాజు దృష్టికి తప్పక వచ్చి ఉంటాయి. అందుకే "గంధం రాస్తున్న నాయికలకు యౌవనాన్ని అధికంగా అనుగ్రహించేవాడు" అని తన నాయకుడిని మాటలకు గంధం పెట్టి వర్ణించాడు.

పందిరిమంచం, ఉయ్యాలమంచం, గుర్రపు తోక వెంట్రుకలతో అల్లినమంచం, నులక మంచం – ఇలా నాగరికులకు కనుమరుగవుతున్న మంచాలు చాలా ఉన్నాయి. అన్నమయ్య రాసిన 'సగినల మంచం' కూడా ఇలాంటిదే. కృత్రిమంగా తయారుచేసిన కీచు కీచు అనే పక్షులబొమ్మలు ఈ మంచానికి ఉంటాయి.

ఒత్తితే 'కుయ్ కుయ్' అనే పీక బిళ్లలు ఈ మంచపు దిండ్లలో ఉంటాయట. (బ్రౌన్ నిఘంటువు). ఇటువంటి మంచం మీద స్వామివారితో కలిసి నాయికలు రంగుల జాజర చేస్తున్నారు. అన్నమయ్య జాజరని తలచుకొన్న కొద్దీ పరుగులెత్తే రకరకాల భావాల జాతర. కవిత్వం అంటే ఇలా ఆలోచనామృతంగా ఉండాలి.

జాజర పాట, వెన్నెలపాట, అల్లో నేరేళ్లు, గొబ్బి పాటలు, చందమామ పాటలు, తందనాన పదాలు – ఇటువంటి పదకవితలు అన్నమయ్యకు చాలా ఇష్టం. ఇవి తెలుగువాడి తరతరాల ఆస్తి, తాటాకుల్లోను, పుస్తకాల్లో కంటె ప్రజల నాలుకల మీద తన కవితలు ఉండాలనుకొనే కవి ఈ జాజర, తందనాన మొదలైన పదాలను వాడుకొంటాడు. అన్నమయ్య కీర్తనల వెనుక విజయ రహస్యం ఇదే.

నిత్య పూజలలో 'పుష్పం సమర్పయామి, గంధం సమర్పయామి' అనే మాటలు మనకు తెలిసినవే. ఇవే కవి మాటల్లో చరణాలుగా మారాయి. జీవులు నాయికలవుతుంటారు. స్వామి నాయకుడవుతుంటాడు.

అన్నమయ్య చెప్పే విధానంలో తేడా ఉండచ్చు. చెప్పేది మాత్రం ఒకటే. స్వామిని జీవులు శరణు వేడాలి. ఆయనలో కలిసి పోయే సాన్నిహిత్యం పెంచుకోవాలి. ఈ మధురభక్తి అన్నమయ్య శృంగార కీర్తనల్లో కనపడని సరస్వతీనదిలా ప్రవహిస్తుంటుంది.

30. జయ జయ రామా

జయ జయరామా సమర విజయరామా
భయ హర నిజభక్త పారీణ రామా

జలధి బంధించిన సౌమిత్రి రామా
సెలవిల్లు విరచిన సీతారామా
అల సుగ్రీవునేలిన అయోధ్య రామా
కలిగి యజ్ఞముగాచే కౌసల్యరామా

అరి రావణాంతక ఆదిత్యకుల రామా
గురు మౌనులను గాచే కోదండ రామా
ధరనహల్య పాలిటి దశరథ రామా
హరురాణి నుతుల లోకాభిరామా

అతి ప్రతాపముల మాయా మృగాంతక రామా
సుత కుశలవ ప్రియ సుగుణ రామా
వితత మహిమల శ్రీవెంకటాద్రి రామా
మతిలోన బాయని మనువంశ రామా

భావం :

శ్రీరాముని ప్రవర్తనపై అన్నమయ్య చిన్నచిన్న పదాలలో చేసిన వ్యాఖ్య ఈ కీర్తన.

యుద్ధంలో ఎప్పుడూ విజయాన్ని సాధించే రామా! నీకు జయం. నీ భక్తుల భయాన్ని పోగొట్టేవాడిని. నేర్పు కలవాడిని. భక్తుల కష్టాలు తొలగించి అవతలి ఒడ్డుకు చేర్చేవాడివి (పారీణ). నీకు జయం.

సముద్రాన్ని బంధించిన లక్ష్మణ రామా! శివుని విల్లు విరచి సీతకు భర్తయైన రామా! సుగ్రీవుని కాపాడిన అయోధ్యకు సంబంధించిన రామా! క్షేమాన్ని ఇచ్చే విశ్వామిత్రుని యాగాన్ని రక్షించిన కౌసల్య కుమారుడైన రామా! నీకు జయం.

శత్రువులు కల రావణుని చంపిన వాడా! సూర్యవంశంలో జన్మించిన సీతకు భర్తయైన రామా! గొప్పవారయిన ముునులను రక్షించే ధనుస్సు కలిగిన రామా!భూమిలో అహల్యకి దశరథరామా! శివుని రాణియైన పార్వతి చేత పొగిడించు కొన్న వాడా! లోకానికి ప్రియమైనవాడా! నీకు జయం.

మాయలేడిని చంపినవాడా! కుమారులైన కుశలవులకు ప్రియమైన వాడా! మంచి గుణములు కలరామా! విస్తరించిన (వితత) గొప్పతనంతో శ్రీవేంకటేశ్వరుని అవతారమయిన రామా! నా మనస్సులో శాశ్వతంగా నిలిచిన (బాయని) మనువంశంలో జన్మించిన రామా! నీకు జయం.

*****

సందర్భానికి తగినట్లు విశేషణాలను ప్రయోగించే పరికరాలంకార లక్షణం ఈ కీర్తనలో ఉంది.

సీతను వెదికే సమయంలో శ్రీరాముడు సముద్రాన్ని బంధించాడు. విభీషణుడు సముద్రాన్ని ప్రార్థించమని రాముడికి చెప్పాడు. లక్ష్మణుడికి ఈ మాట ఇష్టం కాలేదు. మూడు రోజులు గడిచిపోయాయి. "లక్ష్మణా! నా ధనుస్సు, బాణాలు తీసుకురా. అగ్ని బాణాన్ని ప్రయోగించి, ఏనాడూ ఎండిపోని ఈ సముద్రాన్ని ఎండిపోయేటట్లు చేస్తాను" అని పలికి అతడు తెచ్చిచ్చిన ధనుస్సును రాముడు ఎక్కుపెట్టాడు. శ్రీరాముని చర్య లక్ష్మణునికి ఎంతో ఇష్టమైంది (రామచరితమానస్) కోపించే లక్షణం లక్ష్మణుడిది. ఆ లక్షణాన్ని ఇక్కడ రాముడు ప్రదర్శించాడు. కనుక రాముడు లక్ష్మణుడై, సౌమిత్రి రాముడయ్యాడు.

సెలవిల్లు అంటే సెలసు బద్దలతో చేసిన విల్లు అయినా సందర్భానుసారంగా ఇక్కడ శివుని విల్లు అని అర్థం చెప్పుకోవాలి. ఐదువేలమంది పురుషులు ఎనిమిది చక్రాల బండిమీద ఉన్న శివధనుస్సు పెట్టె లాక్కొచ్చారంటే – ఆ శివుని విల్లు గొప్పతనాన్ని ఊహించుకోవచ్చు. ఆ శివుని విల్లు ఫెళ్ళున విరిగింది. "ఫెళ్ళుమనే విల్లు గంటలు ఘల్లుమనెగు/ భిల్లుమనె గుండె నృపులకు ఝల్లుమనియె/ జానకీ దేహమొక నిమేషమ్మునందె; నయము జయము భయము విస్మయము గదుర" అని కరుణశ్రీ అద్భుతముగా ఈ ఘట్టాన్ని రాశారు. విల్లు విరగటంలో రాముని నయం (నేర్పు) గంటలు ఘల్లుమనటంలో జయం, శత్రువుల గుండె గుభిల్లుమనటంలో భయం, ఇదంతా చూస్తున్న సీత శరీరంలో ఆశ్చర్యం (విస్మయం) – ఈ నాలుగు రకాల భావాలు ఒకేసారి బయట పడ్డాయి. రాముడు శివధనుస్సును విరచి , సీతను వివాహమాడి సీతారాముడయ్యాడు. కనుక" సెలవిల్లు విరచిన సీతారాము'డయ్యాడు. పార్వతీదేవి రాముడిని పొగిడిన సందర్భాలు (హరురాణినుతులు) రామచరిత మానస్‌లో ఎక్కువగా కనిపిస్తాయి.

యుద్ధకాండలో రాముడి సమక్షంలో భరతుడు సుగ్రీవుడితో ఇట్లా అంటాడు. 'మా రాముడికి ఎంతో మేలు చేసిన నువ్వు మాకు సోదరుడివి. ఇవాళ్టి నుంచి మనం

అయిదుగురుం సోదరులం.' (130-47) సుగ్రీవుడికి ఇంక వేరే కిరీటాలు అక్కర్లేదు. రాముడి సోదరుడనే ఈ కిరీటం చాలు. అందుకే రామ సుగ్రీవుల ఆత్మీయతను సూచిస్తూ 'సుగ్రీవునేలిన అయోధ్యరామా' అన్నాడు అన్నమయ్య.

తనతల్లి కౌసల్యకు దూరమయ్యాననే బాధతో 'తండ్రి దశరథుడికి మతిచలించిం'దనే పరుషమైన వ్యాఖ్య రామచంద్రుడు చేస్తాడు. (అయో. 53-9) తల్లి అంటే రాముడికి అంత ప్రేమ. అంతమాత్రాన దశరథుడంటే గౌరవం లేకపోలేదు. తండ్రి ఇచ్చిన మాటకోసం అడవులకు వెళ్ళినవాడు కాని తల్లి బాధను తల్చుకొన్నప్పుడు మాత్రం కామానికి (కైకేయి) దాసుడయిన తండ్రిని ఒక మాట అనడానికి వెనుదీయలేదు. తల్లిపై రామునికున్న ఈ అభిమానాన్ని నిరూపిస్తూ అన్నమయ్య "కౌసల్యరామా!" అన్నాడు. కామానికి దాసురాలయిన అహల్యను రక్షించినవాడు అని చెప్పే సందర్భంలో 'దశరథరామా!' అన్నాడు.

తన మాటలు వినని ఇంద్రియాలు మనిషికి శత్రువులు. అటువంటి శత్రువులు అనేకం కలిగినవాడు అరి రావణుడు. వాడిని చంపినవాడు రాముడు (అరి రావణాంతకుడు) మండోదరి రావణుడి శవం మీద పడి ఏడుస్తూ, "ఇదివరకు తపస్సు చేసి ఇంద్రియాలను నీ ఆధీనంలో ఉంచుకొన్నావు. తమని బాధపెట్టిన నీమీద ఆ ఇంద్రియాలు ఇప్పుడు శత్రువులై పగతీర్చుకొన్నాయి" అంటుంది. (114-18). అంటే సీతమ్మని అపహరించి, రావణుడు తన ఇంద్రియాల మీద పట్టు కోల్పోయి మరణించాడు అని భావం. ఈ భావాన్నంతా 'అరి రావణాంతక' అనే ఒక చిన్నపదంలో అన్నమయ్య పొదిగాడు.

సూర్యుడు వెలుగుతుంటే దీపాల కాంతి వెలవెలబోతోంది. ఆ విధంగానే సూర్యకాలంలో పుట్టిన రాముడి ముందు మిగతావారి పరాక్రమాలు దేనికీ పనికి రావని 'ఆదిత్య కులరామా' అన్నాడు. మునులను రక్షించే సందర్భంలో ధనుస్సు ఉన్న రాముడు అనే అర్థం కల 'కోదండ రామా' అని కవి ప్రయోగం. అన్నమయ్య కవిత్వంలో ఇలా వెతికినకొద్దీ ఎన్నో రత్నాలు దొరుకుతాయి. అన్నమయ్య కవిత్వం అర్థం చేసుకోవటం ఒక యోగం.

31. తిరువీథుల మెరసీ దేవదేవుడు

తిరువీథుల మెరసీ దేవదేవుడు
గరిమలమించిన సింగారములతోడను

తిరుదండెలపై నేగీ దేవుడిదే తొలునాడు
సిరుల రెండవనాడు శేషునిమీద
మురిపేన మూడోనాడు ముత్యాల పందిరి క్రింద
పొరి నాలుగోనాడు పువ్వుగోవిలలోను

గక్కనయిదవనాడు గరుడుని మీదను
యెక్కెను ఆరవనాడు యేనుగుమీద
చొక్కమై యేడవనాడు సూర్యప్రభలోనను
యిక్కువ దేరును గుర్రమెనిమిదోనాడు

కనకపుటందలము కదిసి తొమ్మిదోనాడు
పెనచి పదోనాడు పెండ్లిపీట
యెనసి శ్రీవేంకటేశుడింతి యలమేల్మంగతో
వనితల నడుమను వాహనాల మీదను

భావం :

శ్రీవేంకటేశ్వర స్వామివారికి జరిగే బ్రహ్మోత్సవాలను అన్నమయ్య ఇందులో వర్ణిస్తున్నాడు.

దేవతలకు దేవత అయిన వేంకటేశ్వరుడు గొప్పతనాలను (= గరిమల) మించిన అలంకారాలతో శ్రీప్రదమైన తిరుమల వీధులలో (= తిరువీధుల) మెరిసిపోతున్నాడు.

బ్రహ్మోత్సవాలలో శ్రీవేంకటేశ్వరుడు మొదటిరోజు పెద్ద ఆదిశేషుని వాహనం మీద (= తిరుదండెలపై) ఊరేగుతున్నాడు. శోభలతో (= సిరుల) రెండవరోజు చిన్న ఆదిశేషుని వాహనం మీద ఊరేగుతున్నాడు. కులుకులతో (= మురిపేన) మూడోరోజు ముత్యాలపందిరి కింద కూర్చొని ఊరేగుతున్నాడు. క్రమంగా (= పొరి) నాలుగోరోజు కల్పవృక్ష వాహనంపై (= పువ్వుగోవిల) ఊరేగుతున్నాడు.

వెంటనే (=గక్కన) అయిదవరోజు గరుత్మంతునిమీద ఊరేగుతున్నాడు. ఆరవరోజు ఏనుగుమీద ఎక్కాడు. పరవశంతో (=చొక్కమై) యేడవరోజు సూర్యప్రభ వాహనంమీద ఊరేగుతున్నాడు. కళలు అతిశయించేటట్లుగా (=యిక్కువ) ఎనిమిదో రోజు ఉదయం రథం మీద (=తేరును) రాత్రికి అశ్వ వాహనం మీద ఊరేగుతున్నాడు.

తొమ్మిదోరోజు బంగారపు పల్లకీ (= కనకపుటందలము) చేరి (=కదిసి) ఊరేగుతున్నాడు. పదోరోజు అమ్మవారితో కలిపి (=పెనచి) పెండ్లి పీటలపైన కొలువై ఉన్నాడు. శ్రీవేంకటేశ్వరుడు అన్నిరకాలుగా తనతో సాటి వచ్చే (=ఎనసి) మా అలమేల్మంగమ్మ తోను, ఇతరస్త్రీల మధ్య కొలువై ఈ బ్రహ్మోత్సవాలలో వాహనాల మీద ఊరేగుతున్నాడు.

*****

బ్రహ్మ స్వయంగా ఈ ఉత్సవాలు స్వామివారికి చేయటం ప్రారంభించాడు కనుక, బ్రహ్మోత్సవాలు అనే పేరు వచ్చిందని కొందరు చెబుతారు. అన్నమయ్య కాలంనాటి బ్రహ్మోత్సవాలకి ఇప్పుడు జరుగుతున్న వాటికి కొన్ని తేడాలు ఉన్నట్లు ఈ గీతం చదివిన తర్వాత అనిపిస్తుంది.

అధికమాసం వచ్చినప్పుడు రెండుసార్లు స్వామివారికి బ్రహ్మోత్సవాలు చేస్తారు. మొదటిదానిని వార్షిక బ్రహ్మోత్సవాలు, రెండవదానిని నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంటారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణం (గరుడపటం ఉన్న జెండా పైకి ఎగరవేయటం); ధ్వజారోహణం (జెండా కిందికి దింపటం) ఉండవు. ఈ తిరువీథుల కీర్తన నవరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించినదేమో! ఎందుకంటే ధ్వజారోహణం, ధ్వజావరోహణ వర్ణనలు లేవు.

మొదటిరోజు సాయంత్రం స్వామివారిని పెద్ద శేష (= ఆదిశేషుడు) వాహనం మీద ఊరేగిస్తారు, అన్నమయ్య మొదటిరోజు స్వామివారిని 'తిరుదండెల'పై ఊరేగించాడు. 'దండె' అంటే దండాకారము అంటే గుండ్రటి ఆకారం కలిగిన వాయిద్యం. పాముకు ఉండే రకరకాల పేర్లలో 'కుండలి' (గుండ్రటి ఆకారం కలిగిన శరీరం కలిగినది) అని ఒక పేరుంది. ఇలా ఆలోచిస్తే అన్నమయ్య 'తిరుదండెల' అనే పేరులో శుభాన్నిచ్చే ఆదిశేషుడి వాహనాన్ని సూచించాడేమో అనిపిస్తుంది. లేదా శుభకరములైన కర్రలు కలిగిన పల్లకీ వాహనం అని కూడ చెప్పుకోవచ్చు. రెండవరోజు ఉదయం చిన్నశేష వాహనం మీద ఊరేగిస్తారు. అన్నమయ్య కీర్తనలో కూడ ఇదే ఉంది.

ఈనాడు కూడ అన్నమయ్య వర్ణించినట్లుగానే మూడోరోజు ముత్యాలపందిరి వాహనసేవ

యథాతథంగా జరుగుతోంది. నాలుగోరోజు ఉదయం కల్పవృక్ష వాహనం మీద స్వామిని ఇప్పుడు ఊరేగిస్తున్నారు. దీనిని అన్నమయ్య పువ్వుగోవిల అన్నాడు. అది పువ్వు గోవెల అనుకోవచ్చన్నారు సముద్రాల లక్ష్మణయ్య. కోవెల అంటే పొడుగైన దేవాలయం. కోవెలలో భక్తితో కోరిన కోరికలు ఫలిస్తాయి. కల్పవృక్షం కూడా కోరిన కోరికలు ఫలింపజేస్తుంది. అందువల్ల కల్పవృక్ష వాహనాన్ని అన్నమయ్య పువ్వు గోవెల అన్నాడేమో!

అయిదవరోజు రాత్రి జరిగే సేవ చాలా ప్రత్యేకత కలిగినది. గరుత్ అంటే రెక్క. రెక్కల చేత ఎగురుతాడు కాబట్టి గరుడుడు అని పేరు వచ్చింది. తల్లిదాస్యం తీర్చటానికి అమృతం తెచ్చేటప్పుడు దానిని తాను కూడా ఆస్వాదిద్దామనే చింతలేని, నిస్స్వార్థపరుడు గరుడుడు. అందుకే స్వామి గరుడుని తన వాహనంగా చేసుకొన్నాడు.

ఆరవరోజు రాత్రి గజవాహన సేవ. ఏనుగులు అమ్మవారికి తోడబుట్టినవి. ఆమెను నిత్యం అమృత కలశాలతో అభిషేకిస్తూ ఉంటాయి. శ్రీవేంకటేశునికి పద్మావతితో (లక్ష్మి) పెండ్లి కావటానికి కారణమయినది కూడా గజమే. అందుకే, అమ్మకు, అయ్యకు ఇష్టమైన గజం – బ్రహ్మోత్సవాలలో వాహనంగా మారింది.

ఏడవరోజు ఉదయం సూర్యప్రభ వాహనం మీద పరవశంగా స్వామి తిరుగుతున్నాడన్నాడు అన్నమయ్య. మన పనులలో మనలిని ప్రేరేపిస్తాడు కాబట్టి ఆయన్ని సూర్యుడన్నారు. ఎనిమిదవరోజు ఉదయం రథోత్సవం. రాత్రికి అశ్వవాహనం. రథం మీద ఉన్న కేశవున్ని చూస్తే పునర్జన్మ ఉండదని చెబుతారు.

హయగ్రీవావతారంలో స్వామి గుర్రం ముఖాన్ని ధరించి జ్ఞానాన్ని ప్రసాదించారు. అశ్వం అంటే నడుస్తూ వ్యాపించేది. ఈ అశ్వవాహన సేవతో ఈనాటి బ్రహ్మోత్సవాలలో వాహన సేవలు పూర్తవుతాయి. తొమ్మిదవ రోజు ఉదయం చక్రస్నానం. ఆ సాయంత్రం జెండా దింపే కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

అన్నమయ్య కీర్తనలో తొమ్మిదోరోజు స్వామివారికి బంగారు పల్లకీ వాహన సేవ చేయించాడు. (ఇది ఇప్పుడు అయిదవరోజు ఉదయం జరుగుతోంది). పదవరోజు అమ్మని, అయ్యని పెండ్లిపీటల మీద కూర్చోబెట్టి కల్యాణం చేయించాడు. ఇలా కొన్ని తేడాలు ఉన్నప్పటికీ – అన్నమయ్య కాలం నాటి బ్రహ్మోత్సవాలలో అత్యధికభాగం వాహనసేవలు ఇప్పటికి జరుగుతుండడం గమనార్హం.

32. తిరుమల గిరిరాయ

తిరుమల గిరిరాయ దేవరాహుత్తరాయ
సురతబిన్నాణ రాయ సుగుణ కోనేటిరాయ

సిరుల సింగారరాయ చెలువపు తిమ్మరాయ
సరస వైభవరాయ సకల వినోదరాయ
వరవసంతముల రాయ వనితల విటలాయ
గురుతైన తేగరాయ కొండల కోనేటిరాయ

గొల్లెతల వుద్దండరాయ గోపాల కృష్ణరాయ
చల్లువెద జాణరాయ చల్లబరిమళరాయ
చెల్లుబడి ధర్మరాయ చెప్పరాని వలరాయ
కొల్లలైన భోగరాయ కొండల కోనేటిరాయ

సామ సంగీతరాయ సర్వమోహనరాయ
ధామ వైకుంఠరాయ దైత్య విభాళరాయ
కామించి నిన్ను కోరితే కరుణించితివి నన్ను
శ్రీమంతుడ నీకు జయ శ్రీవేంకటరాయ

భావం :

స్వామివారిని వలచిన ఒక సుందరి, ఆయనని తలచుకొంటూ ఈ గీతంలో పరవశిస్తోంది.

ఓ తిరుమల రాజా! దేవతలలో యోధాగ్రేసరుడా (= దేవరాహుత్తరాయ) కలయిక విషయం బాగా తెలిసిన అందమైన రాజా (= సురత బిన్నాణ రాయ) మంచి గుణాలున్న పుష్కరిణి అను కోనేరుకు అధిపతీ! నీకు జయం!

ఐశ్వర్యాన్ని అందంగా, శృంగారంగా ప్రదర్శించే మహానుభావా (=సిరుల సింగారపురాయ)! చక్కటి తిరుమల దేవరా (= చెలువపు తిమ్మరాయ) సరసాల వైభోగాలతో పరవశించేవాడా! అన్నిరకాల వినోదాలతో సంతోషించేవాడా! నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా ప్రతి రోజును వసంతంగా మార్చేచక్రవర్తీ! అనేకమంది వనితలతో శృంగారాలు చేసే విటనాయకా! గుర్తు పెట్టుకోదగిన త్యాగాలతో మా మనస్సులను దోచుకొన్న నాయకా (= తేగరాయ)! కొండల మధ్య ఉన్న కోనేరుకు అధిపతీ! నీకు జయం!

మా గొల్లభామలు ఎక్కువగా కీర్తించే రాజా (=వుద్దండరాయ)! ఆవులను కాస్తూ మమ్మల్ని ఆకర్షించే కృష్ణుడా! మంచి విషయాలు మా మనస్సుల్లో నాటుకుపోయేటట్టు చేసే నేర్పరీ! నీ మాటలో! అవి పరిమళాలో! మొత్తానికి వాటితో చల్లగా మమ్మలిని లోబరుచుకునే మహానుభావా (చల్లబరిమళరాయ)! అధికారం చూపే సమయంలో నువ్వు ధర్మరాజువి. అనుమానమేముంది! (=చెల్లుబడి ధర్మరాయ) అందం విషయంలో ఆ మన్మథుడిలా ఉంటానని చెప్పటానికి మావల్ల కావటం లేదు. (మన్మథుడి కంటె అందగాడివని భావం). మమ్మలిని కొల్లగొట్టి భోగాలు అనుభవించిన ఓ సమ్రాట్! కొండల మధ్య ఉన్నకోనేరుకు అధిపతీ! నీకు జయం!

ఓ రాజా! నువ్వు 'ఊ' అంటే సామవేద సంగీతం. నువ్వు ఓ చూపు చూశావంటే సర్వ మోహనం. నువ్వెక్కడుంటే అది వైకుంఠం. రాక్షసులను వశపరచుకొనే (దైత్య విభాళ) రాజా! నీమీద ప్రేమతో నీ దగ్గరకు వచ్చి అలా కోరానో లేదో! వెంటనే నన్ను దయ చూశావు. ఓ అందగాడా! ధనవంతుడా! శ్రీ వేంకటేశ్వరుడా! నీకు జయం!

*****

తిరుమల అంటేనే పవిత్రమైన కొండ అని అర్థం. మళ్ళీ కొండ అని అర్థం వచ్చే'గిరి' పదం తిరుమల పక్కన అవసరం లేదు కాని, తిరుమలగిరి అనేది జనాల వాడుకలో ఉంది కాబట్టి, అన్నమయ్య కూడ ప్రయోగించి ఉంటాడు. హైదరాబాద్‌లో 'తిరుమలగిరి' ఉండటం గమనార్హం.

తరిగొండ వేంగమాంబ తాను రాసిన శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలో, స్వామివారి చేత విటుడి వేషం వేయించింది. ఓసారి ఋషులుచేసే యజ్ఞం చూద్దామని స్వామివారికి అనిపించిందట. లక్ష్మి అమ్మవారిని పిలిచి, 'నువ్వు వేశ్య వేషం వేయి. నేను విటుడి వేషం వేస్తాను' అని చెప్పాడట (1-128) ఇక్కడ విటుడంటే ఆడవాళ్ళ వెంటతిరిగే 'జారుడు' అని అర్థం తీసుకోకూడదు. 'తనను కోరేవారి కోరికలు తీర్చటానికి వారి వెంట తిరిగేవాడు' అని అర్థం తీసుకోవాలి. కృష్ణుడికి ఉన్న ఎనిమిదిమంది భార్యలు. భూమి మొదలైన ఎనిమిది విభూతులకు ప్రతీక (అపరా ప్రకృతి). 16,000 మంది గోపికలు ఈ సృష్టిలో ఉన్న అసంఖ్యాకమైన జీవకోటికి గుర్తుగా చెబుతారు. (పరాప్రకృతి). అన్నమయ్య పేర్కొన్న వనితలుకూడ, ఈ ప్రపంచంలో ఉన్న జీవకోటికి గుర్తుగా స్వీకరించాలి.

సురతమంటే ఆనందం. స్వామివారుండే నిలయమే ఆనంద నిలయం. తనను నమ్ముకొన్నవారికి శాశ్వతమైన బ్రహ్మానందాన్ని ప్రసాదించే విజ్ఞాని అని 'సురతబిన్నాణ

రాయ' కు అర్థం తీసుకోవాలి. మన లౌకిక సురతాలను (శారీరక సుఖాలు) స్వామివారికి ఆపాదించటం మహాపాపం.

వలపు కలిగించే రాయడు కనుక, మన్మథునికి వలరాయడు అని పేరు. అన్నమయ్య తమాషాగా స్వామివారిని 'చెప్పరాని వలరాయ' అన్నాడు. రామరావణ యుద్ధం ఎలా ఉంటుందంటే, పోలిక చెప్పలేక రామ రావణయుద్ధం – రామ రావణ యుద్ధంలానే ఉంటుందన్నాడు పోలికల చక్రవర్తి వాల్మీకి. అన్నమయ్య 'చెప్పరాని' పదం కూడ ఇలాంటిదే. ఆ అందం ఈ లౌకికపు మాటలతో చెప్పలేనిది.

భగవంతుడిని గూర్చిన విశేషణాలు మూడు రకాలుగా ఉంటాయి.

1. అధికారంతో ఉండేవి.
2. అధికారులకు మాత్రమే అందుబాటులో ఉండేవి.
3. ఆత్మజ్ఞానాన్ని బోధించేవి. అన్నమయ్య కీర్తనలోని ఈ విశేషణాలన్నీ మూడోరకానికి చెందినవి.

ఎవరైనా మాట్లాడుతుంటే, మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తూ ఆ మాటలు తియ్యగా ఉన్నట్టు లెక్క, భక్తవరేణ్యుడు అన్నమయ్య తేనెకంటె తియ్యనైన పరిమళాలు వె(ఎ)దచల్లే స్వామి మాటలు విని ఉంటాడు. అనుమానమే లేదు. అందుకే 'చల్ల బరిమళ రాయ' అని నోరార పొగిడాడు.

తెనాలి రామకృష్ణుడు బ్రహ్మని 'తొలుకారు కలకపులుగు మావు రాహుత్తు' (పాండు. 4-52) అన్నాడు. 'వర్షాకాలంలో కలతనొందే పక్షి హంస.దానిని గుర్రంగా చేసుకొని దానిమీద తిరిగే రౌతు.... బ్రహ్మ' అని తెనాలి వానిఅర్థం. శ్రీనాథుడు ఒక చాటువులో 'తెలుంగురాయ రాహుత్తుండు' అన్నాడు. ఇక్కడ 'రాహుత్తు' అనేది 'యోధుడు' అనే అర్థం వచ్చే బిరుదు వాచకం. ఈ అర్థాల నేపథ్యంలో మన ప్రస్తుత అన్నమయ్య కీర్తనలో 'దేవరాహుత్తరాయ' అంటే దేవతలలో యోధాగ్రేసరుడు అని సందర్భానుసారంగా అర్థం చెప్పుకోవాలి.

ఆత్మ విషయంలో – చెప్పేవాడు, పొందేవాడు, తెలిసినవాడు, మననం చేసేవాడు. వినేవాడు దొరకడం కష్టమంటారు. అన్నమయ్య లాంటి అద్భుత గురువు మనకు దొరికాడు. మనకు తేలికగా అర్థం కావటానికి ఆత్మని ఒక స్త్రీ రూపంలో ప్రతీకాత్మకంగా ఈ కీర్తనలో చెప్పాడు.

33. దాచుకో నీ పాదాలకు

దాచుకో నీ పాదాలకు దగ నే జేసిన పూజలివి
పూచి నీ కీరితి రూప పుష్పములివి యయ్యా!

ఒక్క సంకీర్తనే చాలు వొద్దికై మమ్మురక్షింపగ
తక్కినవి భండారాన దాచి వుండనీ
వెక్కసమగు నీ నామము వెల సులభము ఫలమధికము
దిక్కై నన్నేలితివికనవి తీరని నా ధనమయ్యా!

నా నాలికపై నుండి నానా సంకీర్తనలు
పూని నాచే నిన్ను బొగడించితిని
వేనామాల వెన్నుడా వినుతించ నెంతవాడ
కానిమ్మని నాకీ పుణ్యము గట్టితినింతే యయ్యా

ఈ మాట గర్వముగాదు నీ మహిమే కొనియాడితిగాని
చేముంచి నా స్వాతంత్ర్యము చెప్పినవాడగాను
నేమానబాడేవాడను నేరములెంచకుమీ
శ్రీమాధవ! నేనీ దాసుడ శ్రీవేంకటేశుడవయ్యా!

భావం :

అన్నమయ్య భక్తి ఆవేదనగా మారింది. ఆవేదన కన్నీళ్ళుగా మారింది. ఆ కల్మషం లేని కన్నీళ్ళు ఈ కీర్తనలో మాటలుగా మారాయి. స్వామీ! నేను రాసిన ఈ వేలాది కీర్తనలు నీకు నేను చేసిన పూజలు. ఈ కీర్తనలు నీ కీర్తి రూపంలో ఉన్న వికసించిన పూలు. వీటిని భద్రంగా నీ పాదాల దగ్గర దాచుకో.

ఈ వేలాది కీర్తనలలో మాకు అనుకూలమై (= వొద్దికై) మమ్మలిని రక్షించటానికి ఒక్క సంకీర్తన చాలు. అదొక్కటి మాకు వదిలేసేయ్! తక్కిన వాటిని నీ ఖజానాలో దాచిపెట్టుకో. స్వామీ! నీ పేరు ఎంత విలువైనదయ్యా! నీ పేరుకు వెల తక్కువ. ఫలితం ఎక్కువ. నాకు దిక్కుగా, నన్ను ఎన్నోసార్లు రక్షించావు. అయ్యా! ఇకపైన నీ సంకీర్తనలు భవిష్యత్తులో నాకు తరిగిపోని సంపదలు.

వేయి పేరులున్న విష్ణుడా! నా నాలిక మీద ఉండి ఎన్నో కీర్తనలు శ్రద్ధతో, నా చేత రాయించి పొగిడించుకొన్నావు. నిన్ను పొగడటానికి నేనెంతవాడిని! నామీద నీ దయ ఎంతో ఉంది! అందుకే సంకీర్తనలు రాయించి పుణ్యం వచ్చేట్లు చేశావు.

నీలో గొప్పతనం ఉంది. కనుకనే నేను నిన్ను పొగిడానయ్యా! ఈ మాట గర్వం కాదు. ఎక్కడా నేనే రాశానని పనిగట్టుకొని (= చేముంచి) నా స్వాతంత్ర్యం చెప్పలేదు. చెప్పుకోను. నియమంతో నీ పాటలు పాడుతున్నా! లక్ష్మీనాథుడా! పాపాలను పోగొట్టే వేంకటేశ్వరస్వామివి నువ్వు. నేను నీ సేవకుడిని. కాపాడవయ్యా!

*****

సంకీర్తనలను పుష్పాలతో పోలుస్తున్నాడు అన్నమయ్య. సాధారణ పుష్పాలు కొంతకాలానికి వాడిపోతాయి. సంకీర్తనా పుష్పాలు వాడినకొద్దీ పరిమళిస్తాయి. అన్నమయ్య మాటలు పొల్లుపోలేదు. వేంకటేశ్వరుని కీర్తిని చాటే ఈ సంకీర్తనాపుష్పాలు నేటికీ పరిమళిస్తూనే ఉన్నాయి. 'పత్రం పుష్పం ఫలం తోయం' (నీరు) అన్నది భగవద్గీత. ఈ నాలుగింటిలో ప్రయతాత్ముడు (పరిశుద్ధమైన ఆత్మ కలవాడు) అయిన అన్నమయ్య సంకీర్తనా పుష్పాలు సమర్పించి తాను తరించి మనల్ని తరింప చేశాడు.

'నాహం కర్తా– హరిః కర్తా' (నేను కర్తను కాను. హరి కర్త) అనే భావం భక్తుడిని దైవానికి దగ్గర చేస్తుంది. 'నేను చేస్తున్నాను' అంటే గర్వం.'స్వామీ! నువ్వే నా చేత చేయిస్తున్నావు' అంటే వినయం, భక్తుడికి కావలసింది ఈ వినయం. వినయం అంటే అణుకువ. విధేయత అంటే ఆ వినయాన్ని గ్రహించి ఆచరించటం. శరణు కోరేవాడిలో ఈ వినయ విధేయతలు తప్పనిసరిగా ఉండాలి. అన్నమయ్య ఈ కీర్తనలో 'నిన్ను పొగడటానికి నేనెంత వాడినయ్యా!' అని వినయ విధేయతలతో అన్నాడు. 'నువ్వు నా అంతవాడిని' అని స్వామి అన్నమయ్య పేరును శాశ్వతం చేశాడు. ఇది వినయం వల్ల వచ్చే ఫలితం.

కవులను ద్రష్టలంటారు. అంటే రాబోయే కాలాన్ని చూసేవారు. వేంకటేశుని నామాన్ని కీర్తించిన తన కీర్తనలు భవిష్యత్తులో ఎంతమంది వాడుకొన్నా తరిగిపోని సంపదలవుతాయని అన్నమయ్యకు తెలుసు. అందుకే 'అయ్యా! ఇకపైన నీ నామసంకీర్తనలు నాకు తరిగిపోని సంపదలు' అని దృఢ విశ్వాసంతో చెప్పాడు.

వేయి చేతులయెకిమీడు (కార్తవీర్యార్జునుడు), వేయి చేతుల సామి (సూర్యుడు), వేయి మోములవాడు (ఆదిశేషుడు) ఈ పద్ధతిలోనే అన్నమయ్య 'వేనామాలవాడు' అని తెలుగు పేరు విష్ణువుకు పెట్టాడు.

'ఒక్క సంకీర్తనైనా చాలు. మమ్మలిని రక్షిస్తుంది. తక్కినవి నువ్వు దాచిపెట్టుకో' అంటూ తను రాసిన ఒక్క సంకీర్తన అయినా మనసా స్మరిస్తే తరిస్తామని మనకు అన్నమయ్య చేసిన ప్రబోధంగా భావించాలి.

దేవుడి మీద 18 సెకండ్లు మన మనస్సు ఏకాగ్రంగా నిలబడితే మనకు ముక్తి లభిస్తుందని పెద్దలు చెబుతారు. ఒక్క అన్నమయ్య కీర్తనని తాదాత్మ్యంగా వింటే, ఎప్పుడో ఒకప్పుడు ఆ 18 సెకండ్ల యోగం లభిస్తుంది.

సంకీర్తన నన్ను రక్షిస్తుంది –అని కవి అనలేదు. దేవుడికి అనుకూలంగా మనస్సు ఉంటే మమ్మల్ని రక్షిస్తుందని తనతోపాటు మనల్ని కలుపుకొన్నాడు. మంచి అనేది తనతోపాటు అందరికీ దక్కాలని కోరుకొన్నవాడు అన్నమయ్యలా చిరస్మరణీయుడవుతాడు.

అన్నమయ్య తాను నియమంతో పాడే వాడిని అని తన స్వభావాన్ని పాటలో చెప్పుకొన్నాడు. రోజుకొక్క కీర్తన స్వామివారి మీద రాయాలని అన్నమయ్య పెట్టుకొన్న నియమం. నియమం పెట్టుకొన్నవాడికి ఏదో ఒక అడ్డంకి వస్తుంది. 'అయినా అడ్డంకులను లెక్కచేయకుండా కీర్తనలు రాశాను. ఎక్కడన్నా కీర్తనలో దోషాలుంటే మన్నించు. వాటిని నేరాలుగా చూడకు'అని స్వామి వారిని వేడుకొన్నాడు. తప్పు చేయకపోయినా 'పదాలలో గాని, ఉచ్చారణలో గాని తప్పులుంటే మన్నించ'మని దేవుడిని వేడుకోవటం అనాదిగా వస్తున్న ఒక సంప్రదాయం. దానినే అన్నమయ్య పాటించాడు.

యోగశాస్త్రపరంగా సహస్రారం నుంచి వచ్చే నాడులన్నీ పాదాలలో కలిసి ఉంటాయి. ఒకరి పాదాలకు తాకి నమస్కరిస్తే వారి శక్తి మనలోకి కొంత ప్రవేశిస్తుంది. అందుకే మహాత్ములు కొందరు తమ పాదాలను తాకనివ్వరు. మానవుల పాదాలే ఇంత శక్తి కలిగినవి అయినప్పుడు, గంగమ్మ లాంటి పవిత్రమైన నదికి జన్మనిచ్చిన స్వామి పాదాలు ఇంకెంత పవిత్రమో! అటువంటి పాదాల దగ్గర తన సంకీర్తనలను దాచిపెట్టాడు అన్నమయ్య. స్వామి పాదాల స్పర్శ పొందిన అన్నమయ్య కీర్తనలోని 'పాదాలు' హృదయానికి హత్తుకొంటున్న మనమెంతో అదృష్టవంతులం.

34. దిబ్బలు వెట్టుచు దేలినదిదివో

దిబ్బలు వెట్టుచు దేలినదిదివో
ఉబ్బు నీటిపై నొక హంసా

అనువున గమల విహారమె నెలవై
వొనరి వున్నదిదె వొక హంసా
మనియెడి జీవుల మానస సరసుల
వునికి నున్నదిదె వొక హంసా

పాలు నీరు నేర్పరచి పాలలో
నోలలాడె నిదె వొక హంసా
పాలుపడిన ఈ పరమహంసముల
వోలినున్నదిదె వొక హంసా

తడవిరోమ రంధ్రంబుల గుడ్ల
నుడుగక పొదిగీనొక హంసా
కడువేడుక వేంకటగిరి మీదట –
నొడలు పెంచె నిదె యొక హంసా

ముఖ్యపదార్థం :

దిబ్బలు	=	ఎత్తులు
ఉబ్బునీటిపై	=	పొంగుచున్న నీటిపై
అనువున	=	నేర్పుతో
కమలవిహారం	=	1.పద్మవిహారం, 2. లక్ష్మితో విహారం
నెలవై	=	ఆశ్రయమై
ఒనరి	=	ఇంపై
మనియెడి	=	జీవించు
పాలుపడిన	=	తనకు అధీనమైన
పరమహంసముల	=	ఉత్తమ పదము నొందిన సన్యాసుల
ఉడుగక	=	విడువక

భావం :

మానస సరోవరంలో విహరించే హంస అనే పక్షిని, భక్తుల మానస సరోవరాలలో విహరించే పరమాత్మ అనే హంసను ఈ కీర్తనలో అన్నమయ్య కలిపి వర్ణించాడు.

నీటిమీద వాలిన హంస పైకి ఎగిరేటప్పుడు నీరు కూడా పైకి ఎత్తుగా ఎగురుతుంది. అలా నీటిమీద ఎత్తులు పెడుతూ, పొంగుతున్న నీరు గల మానస సరోవరంలో ఒక హంస ఉంది. ప్రళయకాలంలో అంతటా నీరు పొంగుతున్నప్పుడు మర్రాకు మీద తేలుతూ పరమాత్మ అనే ఇంకొక హంస (బాలకృష్ణుడు) కొండలు మొదలైన ఎత్తులు కల్పిస్తూ మళ్ళీ సృష్టి ప్రారంభిస్తూ ఉంది. ఒక హంస కమలాలతో నిండిన సరోవరంలో విహారం చేస్తోంది. పరమాత్మ అనే ఇంకో హంస కమలతో అంటే లక్ష్మితో సంచారం చేస్తోంది.

ఒక హంస పాలు, నీరు వేరుపరిచి, పాలలో జలక్రీడ చేస్తోంది. శ్రేయస్సు, ప్రేయస్సు అను రెండు సుఖాలలో శ్రేయస్సు (మోక్షసుఖం) పాలు లాంటిది. ప్రేయస్సు (ఇంద్రియ సుఖం) నీళ్ళ వంటిది. పరమాత్మ అనే ఇంకో హంస ఈ రెండింటిని వేరుపరచే జ్ఞానాన్ని పెంచి, తనను నమ్ముకొన్న, భక్తులకు ఇంద్రియ సుఖాల నుంచి దృష్టి మరల్చి, మోక్షసుఖం వైపు ఆసక్తిని పెంచుతుంది (పాలు, నీళ్ళు పాపపుణ్యాలకు సంకేతాలన్నారు రాళ్ళపల్లివారు). ఒక హంస రెక్కలతో గుడ్లను పొదిగి పిల్లలకు జన్మ ఇస్తోంది. పరమాత్మ అనే హంస బ్రహ్మాండాలనే గుడ్లను పొదిగి లోకాలను సృష్టిస్తోంది. ఈ పరమాత్మ అనే హంస కలియుగంలో వేంకటాద్రి మీద పొడవైన, విశాలమైన రూపంతో కనువిందు చేస్తోంది.

*****

కంఠానికి కింద, బొడ్డుకు జానెడు మీద తామర మొగ్గలా బొటనవేలంత పరిమాణంతో ఒక మాంసపు ముద్ద ఉంటుందని సాంప్రదాయం. దీనినే హృదయ పద్మకోశం అంటారు. దీంట్లో బొటనవేలి పరిమాణం గల పురుషుడు ఉన్నాడని, అతను భూత, భవిష్యత్తులకు ప్రభువని కఠోపనిషత్తు. ఈ ప్రభువుకోసమే జీవుడు 'సోహం' అంటూ ఆరాటపడుతుంటాడు. ఆ 'సోహం'తిరగవేస్తే హంసో అయింది. మన ఉచ్ఛ్వాసం సోహం. మన నిశ్వాసం హంసోహమ్మన్నారు గణపతి సచ్చిదానంద స్వామీజీ. ఆ హంస కోసం తదేక కవితా దీక్షతో అన్నమయ్య చేసిన హంస గాయత్రి ఈ కీర్తన.

కృష్ణా! నీ పాదమనే పంజరంలో నా మనస్సనే రాజహంసను బంధిస్తానని ముకుందమాలలో కులశేఖరాళ్వారు భావించారు. అన్నమయ్య జీవుల మానస సరస్సులలో భగవంతుడనే రాజహంస ఉన్నాడని స్వామినే రాజహంసగా మార్చాడు.

కొన్ని కొంగలు, ఒక రాజహంస మాట్లాడుకుంటున్నాయి –
"కాళ్ళు, మొగం ఎర్రగా ఉన్నాయి. ఎవరు నువ్వు?"
"హంసని"
"ఎక్కడుంటావో?"
"ఇక్కడే మానస సరోవరంలో"
"అక్కడి విశేషాలేమిటి?"
"మంచిమంచి బంగారు పద్మాలు, ముత్యాలు ఉంటాయి."
"మరి నత్తలుండవా?"
"అవి నాకు తెలియదు" – నత్తల గురించి తెలియదు అని హంస జవాబిచ్చేసరికి కొంగలన్నీ హంసని ఎగతాళి చేస్తూ పకపకా నవ్వాయని ఒక అందమైన చాటుపద్య భావం. రాజహంస చూపు బంగారు పద్మాలమీద, ముత్యాలమీద అలా ఉండాలనే కాబోలు – వేంకటేశుడనే హంస అలా ఉన్నతమైన కొండలమీద ఉన్నాడు. అందుకే అన్నమయ్య కీర్తన కూడా ఉన్నతమైన హంస చుట్టూ ప్రదక్షిణ చేసింది.

జీవహింసలకైనా వెనుకాడకుండా కమల (లక్ష్మి) ఎప్పుడూ మన దగ్గర విహరించాలని మనబోటి జీవహింసలు కోరుకుంటాయి. కమల ఏరికోరి, వేంకటేశుడనే పరమహంస వక్షస్థలంలో విహరిస్తోంది. "ఒరేయ్ పిచ్చోళ్ళారా! మీరు కొరుకుంటున్న లక్ష్మి నన్ను కోరుకొని నా దగ్గర ఉంది చూడండిరా" అని ఒడలు పెంచి వేంకటేశుడు ఉన్నాడని, ఆయనిని ఆశ్రయించమని అన్నమయ్య సందేశమిస్తున్నాడు.

వృక్షాలు, ఓషధులు భగవంతుని రోమాలుగా భాగవతం చెబితే, రోమాలలో గుడ్లను ఉంచి వాటిని బ్రహ్మాండాలకు సంకేతాలుగా ఈ కీర్తనలో అన్నమయ్య వర్ణించాడు. దేవుని దయ ప్రసరిస్తే జీవుడికి, ఆయనను స్మరించే యోగ్యత కలుగుతుంది. దేవుని స్మరించే అన్నమయ్య కీర్తనలు చదివే యోగ్యత లభించిందంటేనే స్వామి దయ మనమీద ఉన్నట్లే. మనం ఎంత అదృష్టవంతులం!

35. నాటికి నాడే నా చదువు

నాటికి నాడే నా చదువు
మాటలాడుచును మరచేటి చదువు

ఎనయ నీతని నెరుగుటకే పో
వెనకవారు చదివిన చదువు
మనసున నీతని మరచుటకే పో
పనిపడి యిప్పటి ప్రౌఢల చదువు

తెలిసి యితనినే తెలియుటకే పో
తొలుత గృతయుగాదుల చదువు
కలిగిన యీతని గాదననే పో
కలియుగంబులోగలిగిన చదువు

పరమని వేంకటపతిగనుటకే పో
దొరలగు బ్రహ్మాదుల చదువు
సిరుల నితని మరచెడి కొరకే పో
విరసపు జీవుల విద్యల చదువు

భావం :

అన్నమయ్య నిజమైన చదువంటే ఏమిటో చెప్పి, కలియుగంలోని పసలేని చదువులను ఈ సంకీర్తనలో నిరసిస్తున్నాడు. 'నా' అనే స్వార్థంతో కూడిన ఈ కలియుగపు చదువు ఏ రోజుకారోజే (= నాటికి నాడే). అనగా తాత్కాలికమైన లౌకిక ప్రయోజనం కలిగినది. శాశ్వతమైన వేంకటేశుని దగ్గరకు చేర్చేది కాదు. ముచ్చటలాడుకొంటూ, వేంకటేశుని మరచుటకే ఈ చదువు.

ఈ వేంకటేశ్వరుని తెలుసుకోవటానికి వెనకటితరం వారు చదివారు. ఈ కలియుగంలో తమకు తాము గొప్పగా భావించుకొనే పండితులు (= ప్రౌఢులు) తమ మనస్సులో వేంకటేశ్వరుని మరచిపోవటానికి చదువుతున్నారు.

పెద్దల వల్ల, గ్రంథాల వల్ల స్వామి వివరాలు గ్రహించి, తమంతట తాము ఆ స్వామిని తెలుసుకోవటానికే పూర్వం కృత, త్రేత, ద్వాపర యుగాలలో చదివేవారు. పుట్టించిన వేంకటేశ్వరుని ధిక్కరించటానికే కలియుగంలో చదువుతున్నారు.

మోక్షమిచ్చే (= పరమని) వేంకటేశ్వరుని తమ లోపల చూడటానికే ఉత్తములైన (= దొరలగు) బ్రహ్మాదులు చదువుకొన్నారు. సంపదలిచ్చే సుఖాలను మరగి, వేంకటేశుని మరవటానికే ఈ (= విరసపు) కలియుగపు జీవులు చదువుతున్నారు.

*****

ఎప్పుడూ రెండు పక్షాలుంటాయి. ఒకరు మంచిదంటే, ఇంకొకరు చెడ్డదంటారు. పక్షి రెండు పక్షాలతో (= రెక్కలతో) ఎగురుతుంటుంది. అలాగే ప్రపంచం కూడా మంచి, చెడు అనే రెండు పక్షాలతో నడుస్తుంటుంది. ఏ ఒక్క పక్షం ఎప్పుడూ ఉండదు.

దేవుడిని మనసా, వాచా నమ్ముకొని ఆయనకు సంబంధించిన జ్ఞానాన్ని సంపాదించుకొంటే, నీకు అమృతత్వం (= మోక్షం) వస్తుందని ఒక వర్గం గట్టిగా చెబుతుంది. దేవుడి సంగతి మరచిపోయి, ఉపాధినిచ్చే విద్యలను, చిన్నప్పటినుంచి చదువుకొంటే మన అవసరాలన్నీ తీరిపోతాయని, సుఖాలననుభవించవచ్చునని ఇంకో వర్గం గట్టిగా వాదిస్తుంది. ఎవరికి తగిన వాదనలు వారికి ఉన్నాయి. అన్నమయ్య మొదటి వర్గానికి చెందినవాడు. ఈ పాటలో దైవాన్ని కాదన్న రెండవ వర్గాన్ని నిరసించాడు.

ఎప్పుడయితే విద్యావిధానంలో బ్రెడ్ పెట్టే అంగ్లపు జోరు ప్రారంభమయిందో, దైవాన్ని, సంప్రదాయాన్ని నరనరాలలో ప్రబోధించే దేశ భాషలు దెబ్బతిన్నాయి. 'సహనౌ భునక్తు' (అందరం కలిసి తిందాం) అనే భావన తొలగిపోయింది. నేను, నాది అన స్వార్థాన్ని గుమస్తా విద్యావిధానం పెంచింది. దీనినే అన్నమయ్య 'నా చదువు' అన్నాడు.

'ఇతరులకు చేసిన మేలు తనకు తాను చేసుకొన్నట్లే అని చెప్పని చదువు చదువు కాదు.'

'ఇదివరకు కొంత చదువుకొన్నాను. ఇంకా చదువుకొంటున్నాను. ఇక మీద కూడా చదువుతాను. కాని నా గురించి తెలుసుకోలేకపోతున్నాను.'

'అన్ని చదువులు దేవుని కోసమే. చదువుల్లో సారం భగవంతుడే.'

' దేవుడి ప్రసక్తి లేని లౌకిక విద్యలు చదవగా చదవగా ఆశ పెరుగుతుంది. కాని వదలిపోదు'.

పైన చెప్పినవన్నీ వివిధ కీర్తనల్లో అన్నమయ్య చదువుమీద చెప్పిన అభిప్రాయాలు. ప్రస్తుత చదువు కీర్తనలో పై కీర్తనల్లో కంటే కొంచెం ఘాటుగా చెప్పాడు.

ప్రౌఢులు, విరసపు జీవులు – ఈ పదాలు వ్యంగ్యంగా అన్నమయ్య కలియుగపు చదువరులకు పెట్టిన పేర్లు. గొప్పవాడు అనే శబ్దాన్ని పొగిడేటప్పుడు వాడతాం. ఎగతాళిగా

అనేటప్పుడు కూడా 'గొప్పవాడివి' అని అంటాం. ఇక్కడ గొప్పవాడు అంటే 'పనికి మాలినవాడు' అని అర్థం. ప్రౌఢులు శబ్దం కూడా ఈ కోవలోకి వస్తుంది.

"దేవుడిని తలవని చదువు చదువు కాదు. అది చదివేవారు పండితులు కారు" అని అన్నమయ్య చెర్నాకోలా జాడింపు. విరసమంటే తగాదా, ద్వేషం. ఈ గుణాలున్న విరసపు జీవులు భోగభాగ్యాల బురదగుంటలలో పడి స్వామిని మరచిపోతారని, అందుకోసమే వారు డబ్బు లొచ్చే విద్యలు మాత్రమే చదువుతారని అన్నమయ్య ఆవేదన.

కొన్ని శతాబ్దాల క్రితం రాబోయే కాలాన్ని ఊహించి చెప్పిన ఈ కీర్తన – అన్నమయ్యని ద్రష్టగా (రాబోయే కాలాన్ని మనస్సుతో కనుగొనువాడు) నిరూపిస్తుంది. చదువు విషయంలో మనం కోల్పోయిందేమిటో, సంపాదించుకోవలసింది ఏమిటో తెలియజేస్తుంది. చదువు చేత, చదువు వలన, చదువు కొరకు నోట్ల కట్టలు ప్రవహిస్తున్న ప్రస్తుత కాలంలో అన్నమయ్య కీర్తన కొందరికి ఇష్టం కాకపోవచ్చు. కాని చదువులసారం దేవుడనే విషయం ప్రహ్లాదుడు మొదలైన వారు ఎందరో నిరూపించారన్న విషయం మనం మరిచిపోకూడదు.

36. నానాటి బదుకు నాటకము

నానాటి బదుకు నాటకము
కానక కన్నది కైవల్యము

పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్టనడిమి పని నాటకము
యెట్టనెదుట గలదీ ప్రపంచమును
కట్టగడపటిది కైవల్యము

కుడిచేదన్నము కోక చుట్టెడిది
నడుమంత్రపు పని నాటకము
వొడిగట్టుకొనిన వుభయ కర్మములు
గడి దాటినపుడే కైవల్యము

తెగదు పాపమును తీరదు పుణ్యము
నగి నగి కాలము నాటకము
యెగువనె శ్రీ వేంకటేశ్వరుడేలిక
గగనము మీదిది కైవల్యము

ముఖ్య పదార్థం :

నానాటి	=	రోజు రోజుకు
నడుమంతరము	=	మధ్య కాలమున కలిగినది
పని	=	జీవితము
ఒడికట్టు	=	భరింపటానికి సిద్ధపడిన
ఉభయ కర్మములు	=	సంచిత ప్రారబ్దాలు
కైవల్యము	=	మోక్షము
ఎగువనె	=	ఎత్తైన ప్రదేశములో

భావం :

భౌతిక ప్రపంచములో మన జీవితం నాటకము, అసత్యమని వివరిస్తూ శాశ్వతమైన మోక్షాన్ని సాధించాలని అన్నమయ్య ఈ కీర్తనలో బోధిస్తున్నాడు.

రోజు రోజూ సాగే ఈ జీవితం నాటకం. అస్పష్టంగా కనిపించేది, ఎంతో పుణ్యం చేసుకొంటేనే దక్కేది మోక్షం.

పుట్టుట నిజం. చనిపోవుట నిజం. ఆ రెండింటి మధ్యగల జీవితం నాటకం. కళ్లకు కనిపిస్తూ ఎదురుగా ఉన్న ప్రపంచం భ్రమ. బాగా దూరంగా ఉండి. వాస్తవమైనది మోక్షం.

తినేది అన్నం. చుట్టుకొనేది బట్ట. ఆ రెండింటి పోరాటాల మధ్యగల జీవితం నాటకం. ఈ జీవిని అంటిపెట్టుకొని ఉండేవి సంచిత ప్రారబ్దాలు. వాటి సరిహద్దులు దాటినప్పుడే మోక్షం.

పాపం సమాప్తం కాదు. పుణ్యం లభించదు. ఈ రెండింటిని ఆచరించే మనల్ని చూసి నవ్వే కాలం నాటకం. ఎత్తైన కొండల మీద ఉన్న శ్రీ వేంకటేశ్వరుడే మనకు ప్రభువు. ఆకాశాన్ని దాటిపోతే మోక్షం.

*****

కష్టపడి సంపాదించిన సొమ్ములు భూమిమీద ఉండిపోతాయి. పశువులు వాటికి సంబంధించిన శాలల్లో ఉండిపోతాయి. భార్య గుమ్మం దగ్గరే ఉంటుంది. బంధు జనులు శ్మశానం వరకు వస్తారు. మురిపెంగా పెంచుకొన్న శరీరం చితిలో కాలిపోతుంది. కర్మను అనుసరించి జీవుడొక్కడే ఈ లోకాన్ని విడిచి వెళతాడు. అతని వెంట ఎవరూ రారు. అందుకే అన్నమయ్య 'నానాటి బదుకు నాటకము' అన్నాడు.

ప్రపంచమంటే విస్తరించబడినది అని అర్థం. మన శరీరంలో ఉన్న పంచభూతాలే (భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం) మన ఎదుటగా ఉన్నాయని అదే ప్ర'పంచ'మని అన్నమయ్య నిర్వచిస్తున్నాడు.

కొంతమంది అన్నం తింటుంటే, కొంతమందిని ఆశ తింటుంటుంది. అన్న వస్త్రాల కోసం (జీవితావసరాల కోసం) చేసే పోరాటాల మధ్య ఉండే జీవితం నాటకమని కవి హితబోధ.

కోక అనేది ఆత్మీయమైన తెలుగు పదం. **"అలికొన్నది కోక / అంతరిక్షపు నౌక/ అంతకన్నను చౌక / ఓ కూనలమ్మ'; 'అమ్మకి కూడు పెట్టనివాడు పెద్దమ్మకి కోక పెడతానన్నాడట"** – ఇలా ఎన్నో భావాలు కోకని చుట్టుకొన్నాయి. ఇలాంటి పదాలను ప్రయోగించే కవి మనసును చుట్టుకొంటాడు.

ప్రారబ్దం (ఈ జన్మ పూర్తయ్యేంతవరకు అనుభవించటానికి విధి నియమించిన

కర్మ) సంచితం (పూర్వ జన్మలో సంపాదించిన పుణ్య పాపాలతో కూడిన కర్మ)లను ఉభయకర్మలుగా ఇక్కడ మనం గ్రహించాలి. ఎందుకంటే ఉభయకర్మలు ఒడిగట్టుకొన్నవని కవి వాక్కు. మనకు ఇష్టమున్నా, లేకపోయినా ఈ రెండు కర్మలను భరించటానికి సిద్ధపడాలి. ఈ రెండింటిని స్వామి అనుగ్రహంతో సమాప్తం చేసుకొన్నప్పుడే మోక్షమని కవి బోధ.

దేనివల్ల జనం తమని తాము రక్షించుకొంటారో దాన్ని పాపమంటారు. శుభాన్ని చేసేది పుణ్యం. ఏది పాపం! ఏది పుణ్యమనేది నిర్ణయించటం చాలా కష్టం. ఒకసారి భగవాన్ రమణమహర్షి దగ్గరకు ఒకాయన వచ్చి, "నేను మహాపాపిని" అని ఏడ్చాడట. స్వామి నవ్వుతూ, "నిద్రలో నువ్వు పుణ్యుడివా, పాపివా?" చెప్పమన్నారు. ఆ వ్యక్తి నాకు తెలియదన్నాడు. "ఇప్పుడు మాత్రం నీకు ఏమి తెలుసు? నువ్వెవడివి చెప్పటానికి?" అన్నారట. తెగని పాపాన్ని పుణ్యాన్ని గురించి చెప్పటానికి మనకున్న జ్ఞానం చాలదు. అజ్ఞానం చాలదు. అందుకే కాల పురుషుడు మనలిని చూసి నవ్వుకొంటుంటాడని, ఇది నాటకమని అన్నమాచార్యుని బోధ.

ఈ సంసార నాటకమంతా నవ్వులపాలు కావటానికని 'నాటకమంతా నవ్వులకే' అనే ఇంకొక కీర్తనలో అన్నమయ్య మనల్ని హెచ్చరించాడు. ప్రతిదీ నాటకమే. నాటక సూత్రధారి వేంకటేశుడు. సూత్రధారి చెప్పినట్లు చేస్తే, ఆయనని నమ్ముకొంటే ఈ ప్రపంచ నాటకంలో పుణ్య పాపాలను అతీతంగా బతకగలం. అందుకే స్వామి ఏలిక అంటూ అన్నమయ్య బోధ.

"యాజ్ యూ లైక్ ఇట్" నాటకంలో షేక్స్పియర్ (1564 – 1616) "ప్రపంచం ఒక నాటక రంగస్థలం" అని చెప్పక మునుపే అన్నమయ్య (1408 – 1503) ఈ ప్రపంచంలోని బతుకు ఒక నాటకం అన్నాడు. యోగశాస్త్రంలో పదహారు రేకులు గల చక్కని శూన్యం గల కమలాన్ని ఆకాశచక్రం అంటారు. సాధకుడు యోగంలో దానిని దాటితే మోక్షం. "గగనము మీదిది కైవల్యము" అంటూ "నువ్వు ఆ యోగసాధనలు చేయలేవు, స్వామిని శరణు వేడురా! మోక్షం ఎంత గగనమైనా, నీకు సులభమవుతుం"దని కవి ఉపదేశం. ఈ కీర్తనలోని అన్నమయ్య వేదాంతం మమకార మాలిన్యాన్ని కడిగివేసే గంగోత్రి వంటిది.

37. నారాయణతే నమో నమో

నారాయణతే నమో నమో
నారద సన్నుత నమో నమో

మురహర భవహర ముకుంద మాధవ
గరుడ గమన పంకజనాభ
పరమ పురుష భవబంధ విమోచన
నరమృగ శరీర నమో నమో

జలధిశయన రవి చంద్ర విలోచన
జలరుహ భవనుత చరణ యుగ
బలిబంధన గోపవధూవల్లభ
నలినోదర తే నమో నమో

ఆది దేవ సకలాంగమ పూజిత
యాదవకుల మోహనరూప
వేదోద్ధర శ్రీ వేంకట నాయక
నాదప్రియతే నమో నమో

భావం :

నారాయణా! నారదుడు పొగిడిన వాడా! నీకు నమస్కారం.

ముడుడనే రాక్షసుని చంపినవాడా! మోక్షం ఇచ్చేవాడా! లక్ష్మీదేవికి భర్తయైన వాడా (యదువు పెద్దకొడుకు మధువు. అతని వంశమున పుట్టినవాడు మాధవుడు) గరుత్మంతుని వాహనమైనవాడా! పద్మం నాభిలో కలవాడా! పురుషుల్లో ఉత్తముడా! సంసారం బంధాలు విడిపించువాడా! నరసింహ స్వరూపుడా! నీకు నమస్కారం.

పాల సముద్రంలో పడుకొన్నవాడా! సూర్యచంద్రులు రెండు కళ్లయినవాడా! బ్రహ్మ, శివుడు పొగిడిన పాదాలున్న వాడా! బలిని బంధించినవాడా! గోపికాస్త్రీలకు ప్రభువా! నీకు నమస్కారం.

మొదటి దేవుడా! అన్ని వేదాలు పూజించే వాడా! యాదవ కులంలో అందమైన రూపం కలవాడా! వేదాలను ఉద్ధరించినవాడా! శ్రీ వేంకటేశ్వరుడా! నాదంలో ఇష్టమున్న

వాడా! నీకు నమస్కారం.

*****

నారాయణ శబ్దానికి రకరకాల అర్థాలున్నాయి.

1. నరసంబంధమైన శరీరం నారం. అవతారాలలో నర శరీరాన్ని పొందేవాడు నారాయణుడు.
2. నారమంటే నీళ్ళు. ఆది స్థానముగా కలవాడు నారాయణుడు.
3. నర సమూహం నివాసంగా కలవాడు నారాయణుడు.
4. ఎవడి వల్ల శబ్దాలు బయటకు వస్తున్నాయో అతడు రాయణుడు. రాయణుడు కాని వాడు అరాయణుడు. అరాయణుడు కానివాడు నారాయణుడు. ఇలా ఎన్నో అర్థాలున్న పవిత్రమైన నారాయణ శబ్దముతో ప్రారంభించిన ఈ కీర్తనలో విష్ణుమూర్తిని రకరకాల పేర్లతో కవి కీర్తిస్తున్నాడు. దశావతారాల్లో కొన్నింటిని 1. నరమృగశరీరం (నరసింహ), 2. బలిబంధన (వామన), 3. గోప వధూ వల్లభ (కృష్ణ), 4. వేదోద్ధర (ఆదివరాహ)– మొదలైన సంబోధనలలో మనం గమనించవచ్చు.

ఈ కీర్తనలో అన్నమయ్య 'నమః' అనే శబ్దాన్ని చాలాసార్లు ప్రయోగించాడు. సుందరకాండలో హనుమంతుడు అశోకవనంలో సీతమ్మని వెతకటానికి బయలుదేరుతున్న సందర్భంలో 'నమోస్తు రామాయ సలక్ష్మణాయ' (లక్ష్మణునితో ఉన్న రామచంద్రునికి నమస్కారం) అంటూ రాముడు మొదలైన వారిని కీర్తిస్తూ బయలుదేరుతాడు.

మః = నాది, న = కాదు; అని నమః శబ్దానికి అర్థం (శ్రీ భాష్యంవారు)

ఏది చేస్తున్నా ముందుగా మనలోకి వచ్చే భావం 'నేను చేస్తున్నాను' అనే భావం. ఈ అహంకారాన్ని విడిచిపెట్టి, 'నేను భగవంతుని చేతిలో ఒక పరికరాన్ని' అనే భావంతో భక్తుడు ఉండాలి. హనుమంతుడు 'నమో' అన్న తర్వాత సీతమ్మ దర్శనం అశోక వనంలో జరిగింది. మనం కూడా నమో అని స్వామిని సర్వాత్మనా నమ్మితేనే ఈ లోకమనే శోకవనంలో స్వామి దర్శనం జరుగుతుందని, ఒకటికి నాలుగు సార్లు నమో అంటూ అన్నమయ్య ప్రబోధించాడు.

నారద సన్నుత (నారదుడు పొగిడిన వాడా!) అని పేర్కొనుటలో ఒక విశేషముంది. నరుడి పాపాన్ని ఖండించేవాడు, నారము (జ్ఞానము) ఇచ్చేవాడు అని నారద శబ్దానికి అర్థాలున్నాయి. నారదుడు మన సినిమాల్లో చూపించేటంత తక్కువ వాడు కాదు. ప్రేమ రూపమైన భక్తి సూత్రాలను లోకానికి అందించినవాడు. 'నాదతను మనిశం' అని త్యాగరాజ స్వామి చేత నాదో పాసన చేయించిన గురువు నారదుడు. అందుకే ఈ కీర్తన ప్రారంభంలో

'నారద సన్నుత' అంటూ చివరకు మళ్లీ 'నాదప్రియ' అన్నాడు అన్నమయ్య నాదం కలిగినది కీర్తన. అటువంటి ఆంధ్ర వేదాలయిన తన కీర్తనలను తలుస్తుంటే, చదువుతుంటే స్వామి అనుగ్రహానికి మనం తప్పనిసరిగా నోచుకొంటామని అన్నమయ్య ఆశీర్వాదం.

'జలధి శయన' సంబోధనలోని సముద్రం పౌరాణికంగా ప్రసిద్ధమైన పాలకడలి. విష్ణుమూర్తి దీనిలో ఆది శేషునిపై పడుకొంటాడని ప్రసిద్ధి. నాలుగు సముద్రాలు, ఏడు సముద్రాలు – ఇలా సముద్రాల సంఖ్య మీద భిన్నాభిప్రాయాలున్నాయి. సంప్రదాయ విశ్వాసాలు అనుసరించి సాగరమనేది ఒక్కటే. నాలుగు దిక్కులా ఉన్నాయి కాబట్టి నాలుగు సముద్రాలు అన్నారు. అవి ఉన్న ద్వీప ప్రాంతాల్లో కనిపించే రంగులను బట్టి పాల సముద్రం, తేనె సముద్రం మొదలైన గుర్తులుగా పిలిచారని పెద్దలు చెబుతారు.

మామూలుగా **'పురుషుడు'** అని లోకంలో వాడే శబ్దానికి అన్నమయ్య ఈ కీర్తనలో ప్రయోగించిన పరమ పురుష శబ్దానికి కొంచెం తేడా ఉంది. మగవాడిని పురుషుడంటుంటాం కదా! 'పుట్టిన జీవులలోకెల్లా గొప్పవాడు' అని లోకంలో ఉపయోగించే పురుష శబ్దానికి అర్థం.

పురమంటే శరీరం. అందులో ఉండే ఆత్మని పురుషుడంటారు. ఈ పరమాత్మే పరమ పురుషుడు.

అన్నమయ్య కీర్తనకు పోలికగా 'నారాయణతే నమో నమో' అనే పురందరదాసు కీర్తన లోకములో ప్రసిద్ధి పొందింది. భవహర – నగధర; భవబంధ – భవభంజన – ఇటువంటి ఒకటి రెండు పదాలు తప్పించి రెండు కీర్తనలు ఒకేలా ఉండటం గమనార్హం.

మగవాళ్ళు కూడా శ్రీరామచంద్రమూర్తిని చూసి మోహపడ్డారనే వాల్మీకి మాటని (పుంసాం మోహనరూపాయ) అందిపుచ్చుకొని 'మోహనరూపు'డని అన్నమయ్య ఈ కీర్తనలో స్వామిని పొగిడాడు.

ఒళ్ళు మరచిపోవటం మోహం. వేంకటేశ్వరస్వామివారి దివ్యమంగళ విగ్రహాన్ని తదేకంగా అలానే చూడాలనిపిస్తుంది. స్వామిని చూస్తూ మనల్నిమనం మరచిపోతాం. అన్నమయ్య మాటలు ప్రత్యక్షర సత్యాలు.

38. నిగమ నిగమాంత వర్ణిత మనోహర రూప

నిగమ నిగమాంత వర్ణిత మనోహర రూప
నగరాజ ధరుడ శ్రీ నారాయణా

దీపించు వైరాగ్య దివ్య సౌఖ్యంబియ్య
నోపక కదా నన్ను నొడబరపుచు
పైపైనె సంసార బంధముల గట్టేవు
నా పలుకు చెల్లునా నారాయణ

చీకాకు పడిన నా చిత్త శాంతము సేయ
లేకకా నీవు బహులీల నన్ను
కాకు సేసెదవు బహుకర్మముల బడువారు
నా కొలదివారలా నారాయణా

వివిధ నిర్బంధముల వెడల ద్రోయక నన్ను
భవ సాగరముల దడబడజేతురా
దివిజేంద్ర వంద్య శ్రీ తిరువేంకటాద్రీశ
నవనీతచోర శ్రీ నారాయణా

భావం :

వేదం (= నిగమ), వేదాంతం (= నిగమాంతం) ఈ రెండింటిలోనూ వర్ణనలు కలవాడా! గోవర్ధన పర్వతాన్ని ధరించినవాడా (= నగరాజ ధరుడా)!

1. వైరాగ్యం అనేది ప్రకాశించే (= దీపించు) సుఖం. ఈ సుఖాన్ని నాకు ఇవ్వటం నీకు ఇష్టం లేదు (= ఓపక). అందుకే కదా! నన్ను ఒప్పిస్తూ (= ఒడ బరుచుచు) భార్యాబిడ్డలు, మమతలు మొదలైన సంసార బంధాలు నాకు అంటగట్టావు. నారాయణా! నా మాట నీ ముందు చెల్లుతుందా!

స్వామీ! నా మనస్సు ఈ లౌకిక బంధాలతో శాంతము లేక చాలా చీకాకుగా ఉంది. నేను కోరుకొన్న వైరాగ్యం ఇచ్చి... నా మనస్సుకు శాంతి నువ్వు ఇవ్వలేక కాదు!.. అయినా అదేమిటో నన్ను అనేక విధాలుగా (=బహులీల) తిరస్కరిస్తున్నావు. (=కాకు సేసెదవు). నారాయణా! అనేక కర్మలు చేసే వారు నాతో సమానమైనవారా? (=కొలదివారా?)

ఇంద్రుని చేత నమస్కారాలు అందుకొనేవాడా! శ్రీ వేంకటాచల ప్రభూ! అనేక రకాలైన నిర్బంధాల నుంచి నన్ను విడిపించక (= వెడల ద్రోయక) ఈ పుట్టుక, చావులతో కూడిన సంసార సాగరంలో (= భవసాగరం) ఉంచి బాధపెడుతున్నావు (= తడబడు).

ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం – ఇవి నాలుగు వేదాలు. వేదం యొక్క చివరి భాగం వేదాంతం (= ఉపనిషత్తులు మొదలైనవి). వేదంలోను, వేదాంతంలోను విష్ణు వర్ణనలు కనబడతాయి. కాని వేంకటేశ్వరుని వేంకటాద్రి ప్రస్తావన ఋగ్వేదంలో కనబడటం విశేషం (10-155-1). అందుకే అన్నమయ్య నిగమ నిగమాంత సంబోధన విష్ణువుకే కాకుండా ఆయన అవతారమైన వేంకటేశ్వరునికి కూడా కొంతవరకు అన్వయిస్తుంది.

అన్నమయ్య తన ఆవేదనని తెలియజేసే ఈ కీర్తనలో 'నగరాజ ధర' అనే ప్రయోగాన్ని వాడారు. త్యాగరాజస్వామి కూడా "ఎంతనుచు సైరింతు" అనే తన ఆవేదనని తెలియజేసే కీర్తనలో 'నగరాజ ధర' అనే ప్రయోగాన్ని వాడటం గమనార్హం. "సంసార భారం కొండలాంటిది. దానిని మేము మోయలేకపోతున్నాం. నీకు కొండలు మోసే అలవాటుంది కదా! కాస్త మా భారాన్ని కూడా మోయవయ్యా!" అనే రమ్యమైన వ్యంగ్యార్థం నగరాజ ధర అనే ప్రయోగంలో ఉంది.

"అనేక కర్మలు చేసేవారు నాతో సమానమైనవారా?" అనటంలో అందరితోపాటు తనను కర్మబంధాల చక్రంలో కట్టేశావనే ఆవేదనని మాత్రమే గ్రహించాలి. "నీ కోసం నిరంతరం తహతహలాడే నన్ను అందరితో పాటు కలప"ద్దని స్వామికి చనువుతో కూడిన విన్నపం ఇందులో ఉంది. ఇది భక్త కవులకు సామాన్యం.

ప్రపంచ విషయాలలో ప్రేమ లేకపోవటం వైరాగ్యం. మనకున్న ఇంద్రియాలు ఆనందపడితే అది సుఖం. మనబోటి సామాన్యులకి వైరాగ్యం, సుఖం రెండు వ్యతిరేకాలు అనిపిస్తాయి. తెల్లారి లేస్తే మన తలవెంట్రుకలు దగ్గర్నించి మనకు ప్రేమ. వెంట్రుక తెల్లబడితే మన ముఖం తెల్లబోతుంది. కాని "దేనిమీద ప్రేమ లేకుండా ఉండటం నాకు సుఖం. కాని ఆ సుఖం నాకు రాకుండా పెళ్లాం బిడ్డలు, సంసారం నాకు అంటగట్టా"వని అన్నమయ్య స్వామితో దెబ్బలాడుతున్నాడు.

కృష్ణ యజుర్వేదానికి సంబంధించి నారాయణోపనిషత్ అని ఒక ఉపనిషత్ ఉంది. అందులో నారాయణుడి కంటే గొప్ప శక్తి లేదని ఎవడు తెలుసుకుంటాడో వాడు నారాయణుడవుతాడని ఒక మాట ఉంది. అన్నమయ్య ఈ రహస్యాన్ని తెలుసుకొన్న మహాజ్ఞాని. అందుకే ఈ కీర్తనలో నారాయణ సంబోధన.

జనన మరణాలతో అంతులేని సముద్రంలా కనిపించే ఈ సంసారాన్ని భవసాగరం అంటారు. సాగరం దాటి అవతలి ఒడ్డుకు వెళితే మోక్షం "అనుబంధాల బంధాలు వేస్తూ, నన్ను ముందుకు సాగనీయకుండా తడబాటుకు గురి చేస్తున్నావు. ఇది ధర్మమా!" అని చనువు గల భక్తుడి ప్రశ్న.

విరాట పర్వంలో సుధేష్ణ – తమ్ముడింట్లో మద్యం తెమ్మని ద్రౌపదిని పంపే సందర్భంలో "ఇక వేరే ఎవ్వరినీ పంపడం ఇష్టం లేక (= ఓపక) నిన్ను పంపిస్తున్నాను" అంటుంది. తిక్కన తర్వాత ఈ 'ఓపక' ప్రయోగాన్ని అంత అందంగా వాడినవాడు అన్నమయ్య.

వైరాగ్యం – అలా అనుకొంటే ఇలా వచ్చేది కాదు. నాలుగు రకాలైన వైరాగ్య దశలున్నాయి.

1. మంచి, చెడు రెండింటిని తెలుసుకొనే ప్రయత్నం.
2. వివేకాన్ని అభ్యసించి తనలోని మోహం ఇంత తగ్గింది. అంత తగ్గింది అని పరిశీలించటం.
3. దోషాన్ని చూస్తూ విషయాలని వదిలిపెట్టడం.
4. విషయాల మీద కోరికని పూర్తిగా వదిలిపెట్టడం.

స్వామి అనుగ్రహం ఉంటేనే కాని నాలుగవ రకమైన వైరాగ్య దశ రాదు. అది నాకు కావాలని అన్నమయ్య అనే జీవుడు, దేవునికి చేసుకొన్న నివేదన ఈ సంకీర్తన.

39. నిత్య పూజలివివో

నిత్య పూజలివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి

తనువే గుడియట తలయే శిఖరమట
పెనుహృదయమే హరిపీఠమటా
కనుగొన చూపులే ఘనదీపములట
తన లోపలి యంతర్యామికిని

పలుకే మంత్రమట పాదైన నాలికే
కలకలమను పిడి ఘంటయట
నలువైన రుచులే నైవేద్యములట
తలపులోపలనున్న దైవమునకు

గమన చేష్టలే యంగరంగ గతియట
తమిగల జీవుడే దాసుడట
అమరిన మార్పులే యాలవట్టములట
క్రమముతో శ్రీ వేంకటరాయనికిని

భావం :

మన లోపల ఉండే పరమాత్మకి (= అంతర్యామి) మన శరీరం ఒక గుడి వంటిది. మన తల దేవాలయ శిఖరం. మన పెద్దదయిన (= పెను) హృదయం ఆసనం (=పీఠం). మన చూపులే గొప్పవైన దీపాలు.

హృదయము లోపల ఉన్న దేవునికి మన పలుకే మంత్రం. అన్ని రుచులకు ఆలవాలమై (=పాదైన) అన్నిటిని కావాలి, కావాలి అని ధ్వని చేసే నాలుక గణగణమని మోగే గుళ్ళో గంట వంటిది. చక్కనైన (=నలువైన) రుచులు నివేదించే వస్తువులు (=నైవేద్యములు)

మన నడకలే దేవునికి సమస్త భోగాలు (= అంగరంగ వైభోగం). ఆసక్తి (=తమి) కలిగిన జీవుడే దాసుడు. మనం ఊపిరి తీసే విధానమే వస్త్రంతో గుండ్రంగా చేసిన విసనకర్రల సేవ (=ఆలవట్టములు) ఇవన్నీ వరుసగా వేంకటేశునికి ఒక పద్ధతిగా (=క్రమంతో) చేసే సేవలు.

ఓహో! నేర్చుకొంటే మన కళ్ల ఎదురుగా ఉన్నట్టి వేంకటేశ్వరునికి ఇవే ఎప్పుడూ చేసే (= నిత్య) పూజలు.

*****

'నిత్యో నిత్యానాం' అని కఠోపనిషత్తు దేవున్ని నిత్యులలో నిత్యునిగా చెప్పింది. ఆ నిత్యునికి చేసే పూజలు నిత్యపూజలని ఒక అర్థం. ప్రతిరోజు చేసే సేవలని ఇంకో అర్థం.

'దేహో దేవాలయో' (ఈ శరీరం దేవాలయం), మరియూ శంకర భగవత్పాదుల వారి 'ఆత్మా..' (నా ఆత్మ నువ్వు) శ్లోక ప్రభావాలు ఈ కీర్తనపై ఉన్నాయి. 'నేనేం పనులు చేస్తే అవన్నీ నీకు నేను చేసే పూజలు', 'పాదాలు భూమిపై నడిచినంత దూరం – స్వామికి ప్రదక్షిణలు' అని శంకరులు అంటే, ఆ నడకను స్వామివారి 'అంగరంగ వైభోగము' అన్నాడు అన్నమయ్య. అంగం అంటే దేవతల విగ్రహం. రంగం అంటే దేవాలయం. ఈ రెండింటికి చేసే ఊరేగింపు మొదలైన భోగాలు అంగరంగ వైభోగాలు. మన శరీరం నడుస్తోందంటే మన లోపల ఉన్న స్వామికి ఊరేగింపు సేవ అని కవి భావన.

పల్లవికి, మొదటి రెండు చరణాలలోని చివరి పంక్తులకు రచనా పరంగా తేడా ఉన్నట్లు అనిపిస్తుంది. పల్లవిలో ప్రత్యక్షంగా (ప్రతి + అక్షం = కళ్లకెదురుగా) ఉన్న స్వామికి నిత్య పూజలు అంటున్నాడు. రెండు చరణాల్లోను తన లోపల ఉన్న స్వామికి నిత్య పూజలు అంటున్నాడు. మళ్లీ మూడవ చరణం చివర 'వేంకటేశునికి నిత్య పూజలు' అంటున్నాడు. రెండు కళ్ళు భక్తితో మూసినప్పుడు – అంటే బయటి విషయాల మీద నీకు ఆసక్తి తగ్గినప్పుడు, నీ లోపల ఉన్న స్వామి నీకు కనిపిస్తాడు. నీ లోపల ఉన్న స్వామిని చూసే శక్తిని పెంచుకోవటానికి, ఎదురుగా ఉన్న స్వామిని చూసి, ఆ రూపాన్ని నీలోకి ఆవాహన చేసుకోవటానికి – పెద్దలు కళ్ళు మూసుకొమ్మంటారు. మన కళ్లకెదురుగా ఉన్న స్వామికి, మన లోపల ఉన్న స్వామికి తేడాలేదు. మంత్ర పుష్పంలో లోపల, బయట ఉన్న నారాయణుడొకడే (అంతర్బహిశ్చ) అని ఉంది. అన్నమయ్య ఈ విషయాన్ని వ్యంగ్యంగా చెప్పటానికే రెండు రకాలుగా నారాయణుని ఉనికిని రాశాడు.

ఈ కీర్తనలో ఉన్న కీలకమైన క్రియ 'నేరిచినను' అనేది. నేర్చుకొంటేనే – నేర్చుకొన్న దానిని అభ్యసిస్తేనే ఈ కీర్తనలో చెబుతున్న వ్యవహారాలు నిత్య పూజలు అవుతాయి. శరీరమే గుడి అనుకొంటే సరిపోదు. నీ నిత్యవ్యవహారంలో ఆ భావనని సదా నిల్పుకోవాలి. శరీరాన్నే గుడిగా నువ్వు తలుస్తున్నప్పుడు – ఇక అన్యాయాలు మొదలైనవి ఆలోచించలేం. అలా ప్రతి జీవుడు స్వామివారి నిత్య సేవలో పునీతుడు కావాలని కవి కోరిక.

శిఖరం స్వామివారి ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలియజేస్తుంది. మన తల శిఖరం అన్నప్పుడు – మన ఆలోచనలు కూడా ఉన్నతంగా ఉండాలి. ఉన్నతుడైన దేవుడి ఆలోచనలతో మన తలపులు పరవశిస్తుండాలని కవి అంతర్యం.

గురువు చెప్పిన ప్రబోధమనే పాత్రలో, వైరాగ్యమనే నూనెను వేసి, భక్తి అనే వత్తిని వెలిగిస్తే జ్ఞానమనే జ్యోతి ప్రకాశిస్తుంది. ఇదే ఘనదీపం. మన చూపులు స్వామివారికి దీపాలు అంటున్నాడు అన్నమయ్య. మన చూపులు భగవంతుని వైపు ప్రసరించేటట్లు మనం నియంత్రించుకొంటే, అప్పుడు చూపులు దీపాలవుతాయి. భౌతిక సుఖాల వైపుకి ప్రసరిస్తుంటే కళ్లుండి గుడ్డివాళ్లవుతాం.

దేవాలయాల్లో స్వామివారి ముందు వేలాడదీసే గంటని మోగిస్తే అది 'ఓం' అనేది స్వామి వారి పేరు. 'స్వామీ! నీ భక్తుడిని వచ్చాను!' అని చెప్పటానికి ఏర్పాటు చేసుకొన్న ఒక విధానం. ఘంటానాదం దేవతాశక్తులను ఆహ్వానించటానికి, రాక్షస శక్తులను వెళ్లగొట్టడానికి గంట కొడతారని ఇంకో అభిప్రాయం. ఈ శరీరమనే గుడికి గంటగా నాలికను అన్నమయ్య చెబుతున్నాడు. గంట గణ గణ మోగుతుంది. నాలిక గలగలా వాగుతుంది. రెండింటికి చప్పుడు చేసే లక్షణముంది కనుకనే వాటిని కవి పోల్చాడు.

మనం వండుకొన్న ఆహారాన్ని స్వామికి నివేదిస్తే దాన్ని నైవేద్యం అంటారు. నైవేద్యమిచ్చిన తర్వాత ఆహారం ప్రసాదమవుతుంది. మనకు ఆహారాన్ని ప్రసాదించిన దేవునికి కృతజ్ఞతతో దాన్ని నివేదించటం ఒక గొప్ప మానవతా లక్షణాన్ని జీవితంలో నేర్పుతుంది.

మన నాలుకకి ఏయే రుచులు తగులుతున్నాయో, అవన్నీ లోపల ఉన్న స్వామికి నైవేద్యాలంటున్నాడు కవి. జీవితంలో ప్రతి సంఘటన తియ్యగా ఉండదు. చేదుగా ఉన్నా అన్నింటిని భరించాలని, అన్నీ స్వామికి నైవేద్యాలుగా భావించాలని కవి సందేశం.

స్వామికి చేసే 'షోడశోపచారము'ల్లో కొన్నింటినిలా, ప్రతిభావంతంగా మలిచిన అన్నమయ్యకి 'మా పూజలివిగో' అనకుండా ఉండలేం.

40. పలుకుదేనెల తల్లి పవళించెను

పలుకుదేనెల తల్లి పవళించెను
కలికితనముల విభుని గలసినది గాన

నిగనిగని మోముపై నెరులు గెలకుల జెదర
పగలైనదాక జెలి పవళించెను
తెగని పరిణతులతో దెల్లవారినదాక
జగదేక పతి మనసు జట్టిగొనెగాన

కొంగు జారిన మెరుగు గుబ్బలొలయగ దరుణి
బంగారు మేడపై బవళించెను
చెంగలువ కనుగొనల సింగారములు దొలక
నంగజగురునిదోడ నలసినదిగాన

మురిపెంపునటనతో ముత్యాల మలగుపై
పరవశంబున దరుణి పవళించెను
తిరు వేంకటాచలాధిపుని కౌగిట గలసి
యరవిరై నును జెమట నంటినది గాన

ముఖ్య పదార్థం :

పవళించెను	=	పడుకొనెను
కలికితనము	=	చక్కదనము
నెరులు	=	కేశములు
కెలకుల	=	పక్కల
జట్టిగొను	=	వశపరచుకొన్నది
చెంగలువ	=	ఎర్ర కలువ
అంగజగురుడు	=	మన్మథుని గురువు
మలగు	=	దిండు
తరుణి	=	యౌవనముగల స్త్రీ
తిరు	=	పవిత్రము

ఒలయగ = ప్రకాశించుచుండగా

అరవిరై = సగము పువ్వై

భావం

మా అలమేలు మంగమ్మ పలుకులలో తేనెలు కురిపించే తల్లి .నిన్న రాత్రి భర్త గారితో చేసిన చక్కదనాల యాత్రలో అలసిపోయింది కాబట్టి –పగలైనా– ఇంకా పడుకొనే ఉంది.

తెల్లవారిన దాక ఆ దంపతుల ఉత్సాహాలు ఎక్కడా ఆగిపోకుండా అభివృద్ధి చెందుతూనే ఉన్నాయి. ఆ నిగనిగలాడే ముఖం మీద చెల్లాచెదరుగా ఉన్న వెంట్రుకలు ఎంత బాగున్నాయో కదా! ఆయనగారు మాములు పతి(భర్త) కాదు. లోకానికి మొత్తానికి అధిపతి. అటువంటి శ్రీవారి మనస్సును వశం చేసుకొనే ప్రయత్నాలలో మా అమ్మ చాలా శ్రమ పడింది.అందుకే పగలైనా ఇంకా లేవలేదు.

మా అమ్మ కళ్ల చివర మెరుపు చూసారా! (నిద్ర పోతుంటే ఎలా చూస్తామయ్యా అని దబాయించకండి.చూసిన అన్నమయ్యని నేను చెబుతున్నాను. మీరు వినాల్సిందే.) ఆ ఎరుపు ఎలా వచ్చిందనుకొన్నారు! అమ్మ కళ్లు ఎర్రటి కలువల్లాంటివని నువ్వే చెప్పావు కదా! అందుకే ఎర్రగా ఉన్నాయేమోనని అనకండి. అసలు కారణం వేరే ఉంది. మన్మథుడికే పాఠాలు చెప్పే మా అయ్య వేంకటేశునితో అలసిపోయింది. అందుకే ఆ కళ్ల చివర సింగారాల ఎరుపు.

ఇంకోటి గమనించారా! అమ్మ బంగారు ఛాయలో మెరిసిపోతూ పడుకొంది ఎక్కడనుకొన్నారు! బంగారు మేడలో! ఆ మేడలో ఆ ముత్యాల దిండు మీద–తెచ్చిపెట్టుకొన్న నటనలు– మురిపాలు –ఇవన్నీ ఉంటాయి కదా! వాటన్నింటినీ ప్రదర్శిస్తూ, పరవశిస్తూ, పరవశింపచేస్తూ, మా అయ్య కౌగిటిలో సన్నటి చెమటలతో కలసిపోయింది. అందుకే పువ్వు మీద ఉండే మా అమ్మ (అలమేలుమంగ) నలిగిపోయి సగం పువ్వయింది.

*****

అన్నమయ్య భావం చదివిన వెంటనే తెలియని ఆనందంతో, మనసులో ఏ మూలో పులకింత పెదాల మీదికి కాసింత నవ్వును సరఫరా చేయాలని చూస్తున్నా, మనలో కొందరికి తెచ్చిపెట్టుకొన్న మాటలు–'అబ్బా! ఏంటండి.. మరీను.. ఇలా ఇంత పచ్చిగా ..అమ్మవారి మీద రాస్తాడా!' అంటూ పెదవుల మూలనుంచి జారతాయి.ఇలాంటి ప్రశ్నలు మనం వేస్తామని భక్తిలో ఇహలోకం మరచి పోయి పాడుకొన్న అన్నమయ్య అనుకోడు కాని , వేంకటేశుడు మనలాంటి సందేహాల రాయుళ్ల కోసం 'జగదేకపతి'అంటూ

ఒక చక్కటి పదాన్ని అన్నమయ్య చేత ఈ కీర్తనలో రాయించుకొన్నాడు.

'స్త్రీ ప్రాయమితరం జగత్' అని ప్రసిద్ధ వాక్యం. ఈ లోకంలో పురుషుడనే వాడు ఒక్క విష్ణువే.మిగతా వాళ్లంతా స్త్రీలే అని ఆవాక్యానికి అర్థం. అన్నమయ్య , మీరాబాయి వీళ్లంతా దీనిని బాగా నమ్మినవాళ్లు. అందుకే ఈ కీర్తనలో జగదేక పతిలో ఐక్యమైన ముచ్చట్లు శృంగార రూపంలో అన్నమయ్య చెప్పాడని భావించాలి.

తియ్యగా మాట్లాడుకొందాం..తియ్యటి మాటలు విందాం..(మధు వదిష్యామి..)అంటూ మన సంప్రదాయం తీపికి జీవితంలో పెద్ద పీట వేసింది. అందుకే సంప్రదాయపు బాటలో పలుకుల్లో తియ్యటి తేనెలున్న తల్లి అని అలమేలు మంగను అన్నమయ్య కీర్తించాడు.

అంగజహరుడు (మన్మథున్ని హరించినవాడు)అని శివుడికి పేరు.దీనికి సరిజోడిగా అంగజగురుడు (మన్మథునికే గురువు) అని అన్నమయ్య విష్ణువుకి పేరు పెట్టాడు.మన్మథుడు స్వామివారి దగ్గర పాఠాలు నేర్చుకొన్నాడంటే –ఇక గురువుగారి గొప్పతనం వేరే చెప్పనవసరంలేదు.అద్భుతమైన ఉక్తి వైచిత్రి.

బతుకులోని శృంగారపు తీపిని పంచుతున్నట్టు పైకి కనబడినప్పటికీ, స్వామిలో ఐక్యం కావాలని , అందుకు ప్రయత్నించాలనే లోపలి సందేశంతో –బతుకుపై తీపిని పోగొట్టడానికి ప్రయత్నించే కీర్తన ఇది.ప్రతి చరణంలో ముందు రెండు పాదాలలో ఫలితం చెప్పి , తరువాత రెండు పాదాలలో దానికి కారణం చెప్పే ఒక అందమైన రీతి ఈ కీర్తనలో కనబడుతుంది.

తేనె మధురం.దానికంటే అమృతం మధురం. దానికంటే కవి వాక్కులు మధురం. ..అని చంద్రాలోక కర్త –పలుకు తేనెల తల్లి లాంటి కీర్తనలు రాసిన అన్నమయ్యలాంటి కవులను చూసి చెప్పి ఉంటాడు.

41. పిడికిటి తలబాల పెండ్లికూతురు

పిడికిటి తలబాల పెండ్లికూతురు కొంత
పెడమరలి నవ్వీనె పెండ్లి కూతురు

పేరుగల జవరాలె పెండ్లి కూతురు – పెద్ద
పేరుల ముత్యాల మెడ పెండ్లికూతురు
పేరంటాండ్ల నడిమి పెండ్లికూతురు విభు
బేరు కుచ్చసిగ్గు వడీ బెండ్లి కూతురు

బిరుదు పెండెము వెట్టె పెండ్లికూతురు నెర
బిరుదు మగని కంటె బెండ్లికూతురు
పిరిదూరినప్పుడె పెండ్లికూతురు పతి
బెరరేచి నిదివో పెండ్లికూతురు

పెట్టెనె పెద్ద తురుము పెండ్లికూతురు నేడె
పెట్టెడు చీరలు గట్టె బెండ్లికూతురు
గట్టిగ వేంకటపతి కౌగిటను వడి
వెట్టిన నిధానమైన పెండ్లికూతురు

ముఖ్యపదార్థం :

పెడమరలి	=	వెనకకి తిరిగి
జవరాలు	=	యౌవనము గల స్త్రీ
పేరుల	=	హారముల
పెండెము	=	బిరుదుగా కాలి యందు ధరించు అందె
పతి బెరరేచీ	=	భర్తను ప్రేరేపించింది
పెద్ద తురుము	=	పెద్ద కొప్పు
వడివెట్టిన	=	మెలిపెట్టిన
నిధానము	=	నిధి

భావం :

అలిమేలుమంగ పెండ్లికూతురైనప్పటి ముచ్చటలను తలపోసి, మధురపు వర్ణనల

బ్రహ్మముడుల మధ్య, అక్షర తలంబ్రాలను అన్నమయ్య ఈ సంకీర్తనలో కురిపించాడు.

పిడికిలిలో తలంబ్రాలను పట్టుకొన్న పెండ్లికూతురు కొంత వెనక్కి తిరిగి నవ్వింది. ఆమె చక్కటి కీర్తి ప్రతిష్ఠలున్న జవరాలు. పెద్దవైన ముత్యాల హారములతో నిండిన మెడ కలది. ముత్తయిదువులు భర్తను పేరు పెట్టి పిలిచారో, ఆమెను చెప్పమన్నారో మొత్తానికి సిగ్గుల మొగ్గయింది పెండ్లికూతురు.

పెండ్లికూతురు కాలికి పెద్ద గండపెండేరము పెట్టింది. మంగళసూత్రము మెలిపెట్టేటప్పుడు భర్తను ప్రేరేపించిందంటే సాధారణమైన సమర్థురాలు కాదు. ఆమె పెద్ద కొప్పు పెట్టింది.
పెండ్లి సందర్భంగా పెట్టే పెట్టుడు చీరలు ధరించింది. ఆ పిమ్మట శ్రద్ధతో,
వేంకటేశ్వరుని కౌగిట్లో చేరిన మా అలమేలుమంగమ్మ అను పెండ్లి కూతురు కొలిచిన వారికి మెలిపెట్టిన నిధి.

*****

పెళ్లిళ్లు – అందునా తెలుగువారి పెండ్లిండ్లు మనోహరాలు. అందం, ఆనందం పెండ్లి లోగిలిలో తాము కలిసిపోతూ వధూవరులను కలుపుతాయి.

ప్రాలు అంటే బియ్యం. వివాహకాలంలో వధూవరుల దోసిళ్లతో ఒకరి తలపై ఒకరు పోసికొను నానుడు బియ్యం తలంబ్రాలు అన్నమయ్య భాషలో తలబాలు అయింది. మొట్టమొదటి పెండ్లి కొడుకు ఆచారం ప్రకారం "నేను కోరిన సంతానం సమృద్ధిగా కలుగుగాక" అనే అర్థం వచ్చే మంత్రం (ప్రజామే...) చదివి, వధువు నెత్తిన తలంబ్రాలు పోశాడు. ఆ మంత్రార్థం తెలిసిన పెండ్లికూతురు రెండవసారి తాను తలంబ్రాలు పోస్తూ, మంత్రం చదువుతూ సంతానం ప్రసక్తి తెచ్చిన అయ్యవారి మొగం చూడటానికి సిగ్గేసి, కొంత వెనకకి తిరిగి నవ్విందని కవి ఊహ కావచ్చు. ఎందుకంటే ఆమె తలంబ్రాలు పోస్తూ చెప్పే వశవో... మంత్రంలో కూడా కోరికలను వృద్ధి పొందించమని ఉంది.

శూరులు, కవులు తమ తమ గొప్పతనాన్ని చాటే విధంగా ధరించే కాలినగ లేక అందెను గండపెండెము అంటారు. అమ్మకంటే శూరులెవరున్నారు? అందుకే పెండ్లి అలంకరణలో భాగమైన అందెను బిరుదు పెండెముతో పోల్చాడు భక్తుడు. "నెరబిరుదు మగని కంటే పెండ్లి కూతురు" అని మహాకవి మాట. మనమందరం వేంకటేశ్వరస్వామి అందరికంటే గొప్ప వాడని భావిస్తాం. ఇక్కడ అన్నమయ్య అమ్మవారు, అయ్యవారి కంటే గొప్పవారని ప్రతిపాదిస్తున్నారు... ఇదెలాగ? వేంకటేశ్వరుడికి అలమేలుమంగకు మధ్య తేడా తెలియనంత భక్తి పారవశ్యం ఆయనకు ఉంది. అందుకే అలమేలుమంగ మీద

శతకం రాస్తూ వేంకటేశ్వరా అని సంబోధన చేశాడు. ఈ హెచ్చుతగ్గుల కొట్లాట మనకు కాని బ్రహ్మమొకటే అన్న అన్నమయ్యకు లేదు. అందుకే అయ్య కంటే అమ్మ ఎక్కువ అన్నచోట వాళ్ళిద్దరూ ఒకటే అన్న సమన్వయం కావాలి. నిర్ధారణ కాదు.

పిరి దూరటం అంటే మంగళసూత్రాన్ని పసుపుతాడులో దూర్చటం. అన్నమయ్య పిరి దూరటం తర్వాత పాదంలో పేరరేచి (= ప్రేరేపించి) అని ప్రయోగించాడు కనుక క్రియాన్వయం కోసం మంగళ సూత్రాన్ని పెండ్లికొడుకు మెలిపెట్టినప్పుడే అను భావార్థాన్ని ఈ వ్యాఖ్యానంలో గ్రహించటం జరిగింది. పెండ్లికొడుకైన వేంకటేశ్వరుడు తాళి కడుతూ చేసిన చేష్టకు పెండ్లి కూతురు నుండి ప్రేరేపణ వచ్చిందన్నాడు కవి. ఏమిటా ప్రేరేపణ అంటే వివరణకందని, వివరించకూడని, ఎవరికి వారే అనుభవించవలసిన మధురమైన శృంగారరసానుభూతి. బాపుగారు ఒక చలన చిత్రంలో "శ్రీకారం చుట్టుకొంది పెళ్ళిపుస్తకం" అను గీతాన్ని వధూవరుల వివాహ సన్నివేశాలపై రమ్యాతిరమ్యంగా చిత్రించారు. పెండ్లి కొడుకు పెండ్లికూతురు మెడలో తాళి కడుతూ ఎవరికీ కనబడకుండా చిన్నగా మెడ మీద చక్కిలిగింత పెట్టి ఏమీ తెలియనివాడిలా మొగం పెట్టి కూర్చుంటాడు. ఇదే సన్నివేశపు పొడిగింపు ఈ పెరరేచి పాదంలో మనం చూడవచ్చు. ఇంకో పెండ్లికూతురు కీర్తనలో "మా పెండ్లి కూతురు సంకోచిస్తోంది. చిత్తగించి నీవైన చెయి పట్టవయ్య" అని స్వామిని వేడుకొన్నాడు అన్నమయ్య. ఒకచోట ప్రేరేపించిన పెండ్లికూతురు ఇంకోచోట సంకోచించింది. మన విశ్వనాథ వారన్నట్లు అంతా "కవి ప్రతిభలోన దాగియుండు".

వేంకటాధ్వరి అనే మహాకవి లక్ష్మీ అమ్మవారిని సౌందర్య నిధి అన్నాడు. అన్నమయ్య దానికి మెలి పెట్టాడు. (మెలి పెట్టిన నిధి). ఆ మెలిని విప్పటానికి. ఆ తల్లి అనుగ్రహం అనే నిధిని పొందటానికి కావలసిన భక్తిని తన మధుర భక్తి కీర్తనల ద్వారా మనకు ప్రసాదించాడు.

42. పుడమినిందరిబట్టె భూతము

పుడమినిందరిబట్టె భూతము
బొడవైన నల్లని భూతము

కినిసి వోడ మింగెడి భూతము
పునుక వీపు పెద్ద భూతము
కనలి కవియు చీకటి భూతము
పొనుగు సోమపు మోముభూతము

చేట కాళ్ళ మించిన భూతము
పోటుదారల పెద్ద భూతము
గాటపుజడల బింకపు భూతము
జూటరి నల్లముసుగు భూతము

కెలసి బిత్తలే తిరిగేటి భూతము
పొలుపు దాంట్ల పెద్ద భూతము
బలుపువేంకటగిరి పయి భూతము
పులుగు మీది మహా భూతము

ముఖ్యపదార్థం :

కినిసి	=	కోపంతో
పునుక	=	పుర్రె
కనలి	=	కోపించి
కవియు	=	వ్యాపించిన
పొనుగు	=	విజృంభించు
సోమపు	=	పరాక్రమంతో
గాటపుజడల	=	ఎక్కువ జడలతో
కెలసి	=	విజృంభించి
బిత్తలే	=	నగ్నంగా
పొలుపు	=	అందము

దాంట్ల = ఎగురుటలు
పులుగు = పక్షి

భావం:

ఈ కీర్తనలో అన్నమయ్య దశావతారాలను వేంకటేశుడనే భూతానికి అన్వయించి చెబుతున్నాడు. వేంకటేశుడనే భూతం భూమిలో అందరికీ పట్టింది. ఇది బాగా ఎత్తైన భూతం.

ఈ భూతం కోపంతో ఓడలను మింగేసింది (మత్స్యావతారం). దీనికి వీపు మీద ఒక పెద్ద ఎముక చిప్ప (కూర్మం). కోపించి చీకటితో నల్లటి రూపంతో వ్యాపించింది (వరాహం). విజృంభించే పరాక్రమం గల ముఖం గలది (నరసింహ). చేటల్లా పెద్దవైన కాళ్ళు కలది (వామన) బాగా పరాక్రమం ఉన్న పోటుదారు (పరశురామ). దట్టమైన జడలతో పొగరైనది (రామ). నల్లటి ముసుగును ధరించింది. (బలరామ). నగ్నంగా తిరిగేది (బుద్ధ). అందమైన ఎగురుటలు కలది (కల్కి). ఈ భూతం వేంకటగిరిపై వేంకటేశ్వరుని రూపంలో ఉంది. గరుత్మంతుడనే పక్షిమీద ఉంది.

*****

స్వామిని భూతంతో (= దయ్యంతో) పోల్చటం అన్నమయ్యకే చెల్లింది. దయ్యం పట్టినవాడు దయ్యం చెప్పినట్టే వింటాడు. దాని అధీనంలో ఉంటాడు. ఈ లోకమంతా స్వామి అధీనంలో ఉందని చెప్పటానికి మాత్రమే అన్నమయ్య భూత శబ్దం వాడాడు. అన్నమయ్య స్వామిని భూతం అన్నాడేమిటని ఉలిక్కి పడక్కరలేదు.

వ్యాసుడు విష్ణు సహస్ర నామ ప్రారంభంలోనే స్వామిని 'భూతకృత్ '(భూతాలని సృష్టించినవాడు) అన్నాడు. భూత శబ్దాన్ని సత్యం, ప్రాణి, పంచ భూతాలు – ఇలా రకరకాల అర్థాలలో వాడతారు. ఆ భూతాత్ముడిని (జీవులలో అంతర్యామిగా ఉండేవాడు) భక్తుడైన అన్నమయ్య భూతమని స్వామివారి పట్ల చనువుతో అన్నాడు.

నూరు యోజనాలు పొడవు కల చేప తిమి. తిమిని మింగే చేప తిమింగిల గిలం. తిమింగిల గిలమును మింగే చేప తిమింగిలగిల గిలం. అన్నమయ్య వర్ణించిన భూతం ఈ తిమింగిల గిలగిలమే. శ్రీమన్నారాయణీయమ్‌లో శ్రీమన్నారాయణుడు లక్ష యోజనాల విస్తీర్ణంలో గల మత్స్యావతారం ధరించాడని వర్ణన. ప్రళయ కాలంలో సృష్టికోసం మూల బీజాలను పదిలపరచిన ఒక ఓడను స్వామి మత్స్యావతారంలో ఒంటి కొమ్ముతో సముద్రంలో లాగాడు. దీనిని అన్నమయ్య ఓడను మింగిన భూతం అన్నాడు. "నిన్ను మింగేస్తానురా!" అంటే నీ శక్తి సామర్థ్యాలను నేను గ్రహిస్తాను అని అర్థం.

నిజంగా మింగటం కాదు. ఆ రకంగానే ఓడను మింగేశాడంటే ఓడను గ్రహించాడని అర్థం తీసుకోవాలి.

చేటిగోళ్ల బోటి (చేటల వంటి గోళ్ళు కలది) శూర్పణఖ. అన్నమయ్య ఇటు వంటి పదాన్ని వామనుడికి పర్యాయంగా సృష్టించాడు. భూమ్యాకాశాలను ఆక్రమించిన వామనుడి పాదాలు చేటలవంటివని (=బాగా పెద్దవని) ఊహ చేసి చేట కాళ్లతో భూమ్యాకాశాలను మించిన వాడని "చేటకాళ్ల మించిన భూతం" అన్నాడు.

పోటుదారులంటే శూరులు. ఇక్కడ లక్ష్యార్థంలో పరశురాముని తండ్రిని చంపిన రాజులు. తను లేని సమయంలో తండ్రిని చంపిన పెద్ద పోటుదారులయిన రాజులను వేటాడి వేటాడి చంపి, తర్వాత, భూమండలం మీద రాజనే శబ్దం లేకుండా 21 మార్లు తిరిగి తిరిగి రాజులను చంపినవాడు పరశురాముడు. వాల్మీకి రామాయణంలో భరతుడు అరణ్యంలో ఉన్న రాముడిని కలిసే సందర్భములో "ఇదివరలో ఈ రాముడు తన తలమీద అనేక విధాలైన పూలను ధరించేవాడు. ఇప్పుడు ఈ జడల భారాన్ని ఎలా మోస్తున్నాడో" అనుకొన్నట్లుంది. అన్నమయ్య గాటపుజడల వాడని రాముని వర్ణించటానికి మూలమిదేనేమో!

బలరామునికి నీలవసనుడని, నల్లవలువ తాలుపని, నీలాంబరుడని రకరకాల పేర్లున్నాయి. అందుకే అతని అవతారాన్ని పేర్కొంటూ అన్నమయ్య నల్ల ముసుగు భూతము అన్నాడు. దిగంబరంగా చరించింది జైనులు కాని, బౌద్ధులు కారని కొందరు చెబుతున్నా విష్ణుపురాణంలో బౌద్ధులు నగ్నంగా తిరిగారని ఉంది. అందుకే అన్నమయ్య బుద్ధుడిని దిగంబరుడన్నాడు.

మన ఇష్టం లేకుండా మామూలు దయ్యం పట్టుకొంటుంది. మన ఇష్టంతో స్వామి అనే భూతం మనలని పట్టుకొంటుంది. అయినా వెంకటగిరి మీద భూతం మనలని వదలకుండా పట్టుకోవాలంటే అన్నమయ్య అంతటి గొప్పవాళ్లం కావాలి. అందుకోసం ఇటువంటి కీర్తనలను స్మరిస్తూ ఉండాలి.

43. పెరిగినాడు చూడరో పెద్ద హనుమంతుడు

పెరిగినాడు చూడరో పెద్ద హనుమంతుడు
పరగి నానా విద్యల బలవంతుడు

రక్కసుల పాలికి రణరంగ శూరుడు
వెక్కసపు యేకాంగ వీరుడు
దిక్కులకు సంజీవి దెచ్చిన ధీరుడు
అక్కజమైనట్టి యాకారుడు

లలిమీరిన యట్టి లావుల భీముడు
బలు కపికుల సార్వ భౌముడు
నెలకొన్న లంకానిర్ధూమ ధాముడు
తలంపున రామునాత్మారాముడు

దేవ కార్యముల దిక్కు వరేణ్యుడు
భావింపగ దపఃఫల పుణ్యుడు
శ్రీవేంకటేశ్వర సేవాగ్రగణ్యుడు
సావధానుడు సర్వ శరణ్యుడు

భావం :

భక్తులారా! చూడండి. అందరికీ పెద్ద వాడు హనుమంతుడు పెరిగినాడు. అతడు అనేక విద్యలలో బలం ఉన్నవాడు.

యుద్ధంలో రాక్షసులు సహింపలేని పరాక్రమం ఉన్నవాడు. శత్రువులు భరించలేని (= వెక్కసపు) ఏకాంగ వీరుడు. అవసరమైనప్పుడు దిక్కులకు వెళ్ళి సంజీవని ఓషధిని తెచ్చిన ధైర్యవంతుడు. పండితుడు. ఆశ్చర్యకరమైన (= అక్కజమైనట్టి) రూపం కలవాడు.

ఉత్సాహంతో (= లలి) విజృంభించే (= మీరిన) సాహసాలు గల (= లావుల) పరమేశ్వరుడు. పెద్దదయిన (= బలు) కోతుల వంశంలో సార్వభౌముడు. తన తోకకు నిప్పంటించిన లంకను బాగా ధూమ్ ధామ్ (= నాశనం) చేసినవాడు. ఎప్పుడూ తన ఆలోచనలలో రాముని స్మరిస్తూ ఉండేవాడు.

దేవతలకు ఇష్టమైన పనులలో దిక్కుగా నిలిచినవాడు. శ్రేష్ఠుడు (=వరేణ్యుడు) ఆలోచింపగా తపస్సు యొక్క ఫలితంగా లభించే పుణ్యరూపం కలిగినవాడు. శ్రీ వేంకటేశ్వరుని కొలిచే వారిలో ఉత్తముడు. శ్రద్ధ, ఆదరములు కలవాడు. అందరినీ రక్షించే సమర్థుడు.

*****

సూర్యబింబాన్ని పండనుకొని తినటానికి ఆకాశంలో ఎగురుతుంటే , ఆంజనేయుని మీద ఇంద్రుడు వజ్రాయుధం ప్రయోగించాడు. కోమలమైన దవడలు దెబ్బతిన్నాయి కనుక ఆంజనేయునికి ఆ రోజు నుంచి హనుమంతుడని పేరు వచ్చింది.

హనుమంతుడు శారీరకంగాను, బుద్ధిలోను రకరకాల సందర్భాల్లో పెరిగాడు.

1. సముద్రాన్ని దాటే సందర్భంలో మూడు లోకాలు ఆక్రమించిన వామనుడిలా హనుమంతుడు పెరిగాడు.

2. సురస అనే రాక్షసి 100 యోజనాల విస్తీర్ణంతో నోరు విప్పింది. ఆంజనేయుడు బొటన వేలంత చిన్నవాడై ఆవిడ నోటిలోకి వెళ్ళి, మళ్ళీ బయటికి వచ్చాడు. ఇది బుద్ధిలో హనుమంతుడు పెరిగిన సందర్భం;

3. నీడని బట్టి లాగే సింహిక అనే భూతం పెరుగుతున్నకొద్దీ తానూ పెరిగి, దాని నోట్లోకి సూక్ష్మరూపంలో ప్రవేశించి, చంపాడు;

4. చిన్న శరీరం నీది. నన్నెట్లా మోసుకెళతావని లంకలో సీతమ్మ అడిగినప్పుడు, ఆవిడకి నమ్మకం కలిగించటానికి హనుమంతుడు పెరిగాడు;

5. రాక్షసులు తన తోకకి నిప్పంటించినప్పుడు పెరిగాడు;

6. సీతని వెతికే సందర్భంలో శరీరాన్ని పిల్లిలాగా కుదించుకొన్నాడు. వీటన్నింటినీ కలిపి "పెరిగినాడు చూడరో" అంటున్నాడు కవి.

హనుమంతునికి రాని విద్య లేదు. వేదాలు, వ్యాకరణాలు; కావలసిన రూపాన్ని ధరించే కామ రూప విద్య, ప్రపంచం నలుమూలల తిరిగి రాగలిగిన కామగమన విద్య, ఎదుటివారిని నొప్పించకుండా ఒప్పించే విద్య – ఇలా ఆయన బలవంతుడని (= గట్టి పట్టు ఉన్నవాడు) కవి మాట.

ఈ కీర్తనలో 1. ఏకాంగ వీరుడు 2. లంకానిర్ధూమ ధాముడు 3. కపి కుల సార్వభౌముడు అను విశేషణాలు విలక్షణంగా ఉన్నాయి. మిత్రుడు, కుమారుడు, భార్య

మొదలైన వారి సంబంధం లేకుండా దేవుని సేవే జీవితపు పరమ ప్రయోజనమని నమ్మి, శరీరాన్ని, ప్రాణాన్ని తృణప్రాయంగా భావించేవాడిని ఏకాంగుడంటారు (వావిళ్ళ). హనుమంతుడు ఇటువంటి ఏకాంగుడైన వీరుడు. ఎదురులేని వీరుడు. తోక అనే ఏకాంగంతో శత్రువులను భయభ్రాంతులకు గురిచేసే వీరుడు – ఇలా ఇతర అర్థాలున్నాయి.

పూర్వకాలంలో వంటలు చేసేటప్పుడు ఇళ్లలో పొగ వస్తుండేది.లంకని సర్వనాశనం చేశాడు ఆంజనేయుడు. ఇక వంటలు, పొగలకు ఆస్కారమేది? కనుక లంక అనే ధామం (= నివాసం) నిర్ధూమం (= పొగ లేనిది) అవుతుంది. లంకని పొగ లేనిదిగా చేశాడు కనుక ఆంజనేయుడు లంకానిర్ధూమ ధాముడని ఒక అర్థం. లంకకి నిప్పెట్టి. ధూమ్ ధామ్ (= నాశనం) చేశాడు కనుక లంకా నిర్ధూమధాముడు అని ఇంకో అర్థం.

మూడో విశేషణం కపికుల సార్వభౌముడు. ఆంజనేయుడు సుగ్రీవునికి మంత్రి. సీతను వెతకటానికి దక్షిణ దిక్కుగా వానర సైన్యం వెళ్లినప్పుడు దానికి అంగదుడు నాయకుడు అయ్యాడు కాని ఆంజనేయుడు కాలేదు. ఒక చిన్నపాటి గుంపుకే నాయకుడు కాని వాడికి అన్నమయ్య సార్వభౌముడు అని ఎందుకన్నాడు? దీనికి అంతరార్థం వేరే ఉంది. చలించేదాన్ని సంస్కృతంలో కపి అంటారు. కోతి ఒకచోట స్థిరంగా నిలవలేదు. అటువంటి కపి కులంలో జన్మించి, హనుమంతుడు సార్వభౌముడయ్యాడు. భూమమంటే భగవంతుని తప్పించి ఇతర విషయాలు దేనినీ వినకపోవటం, తెలుసుకొనే ఆలోచన లేకపోవటం (ఛాందోగ్యోపనిషత్తు). భూమానికి సంబంధించింది భౌమం. ఇలాంటి భౌమం అంతటా వ్యాపించినవాడు సార్వభౌముడు.

అమితమైన బల పరాక్రమాలు తనకున్నప్పటికీ, తాను రామ బాణాన్ని అన్నాడు. రాముడికి దాసుడిని అన్నాడు. కాని ఎక్కడా రామ సముడిని అనలేదు. వైష్ణవంలో దేవుడి ముందు నైచ్యానుసంధానం (= తనను తాను తక్కువ చేసుకోవటం) లోకంలో గొప్ప వాడిని చేస్తుంది. ఈ పాఠాన్ని ఆచరించి చూపిన హనుమ లోకానికి గురువయ్యాడు.

రావణాసురుడు ప్రయోగించిన శక్తితో లక్ష్మణుడు మూర్ఛపోయాడు. అప్పుడు సుషేణుడనే వైద్యుడు ఓషధి పర్వతానికి వెళ్ళి సంజీవని మొదలైన అయిదు ఓషధులను తీసుకురమ్మన్నాడు. దిక్కులకు వెళ్లి దానిని సాధించిన హనుమంతుని అన్నమయ్య ధీరుడు అన్నాడు. ధీరుడంటే మంచి బుద్ధిని గ్రహించేవాడని ఇంకో అర్థం (అమర కోశం) ఓషధులు గుర్తించలేక ఆలస్యం చేస్తే లక్ష్మణునికి అపాయమని ఒక్క నిమిషం ఆలోచించాడు. కొండని పెకిలించి తీసుకువెళ్లటమే మంచిదనుకునే బుద్ధిని గ్రహించాడు. అందుకే హనుమంతుడు ధీరుడు.

రాముడన్నా, వేంకటేశ్వరుడన్నా అన్నమయ్యకు ఒకటే కనుక రాముని సేవలో తరించిన హనుమంతుని వేంకటేశ్వర దాసుడన్నాడు. ఆంజనేయుడి విశ్వరూపాన్ని వర్ణించటానికి మాటలు చాలవు. అన్నమయ్య వాడిన ఆంజనేయుని విశేషణాలను వ్యాఖ్యానించటానికి ఎన్ని పుటలైనా చాలవు.

44. పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము
నెడయకవయ్య కోనేటిరాయడా!

కోరి మమ్ము నేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు
చేరువ జిత్తములోని శ్రీనివాసుడా

భావింపగైవసమైన పారిజాతమా, మమ్ము
చేవదేరగాచినట్టి చింతామణీ
కావించి కోరికలిచ్చే కామధేనువా, మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా

చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా, రోగా
లడచి రక్షించే దివ్యౌషధమా
బడిబాయక తిరిగే ప్రాణబంధుడా, మమ్ము
గడియించినట్టి శ్రీవేంకటనాథుడా

భావము :

ఓ అయ్యా! విష్ణు రూపమైన (= పురుషోత్తమా) శ్రీ వేంకటేశ్వరా! మిమ్మల్ని చూశాము (= పొడగంటిమి). నిన్ను చూసే ఆనందాన్ని మాకు దూరం చేయకు. పుష్కరిణి అనే కోనేరుకు ప్రభూ (= కోనేటిరాయడా)! మమ్మల్ని ఎప్పుడు విడవకయ్యా (=ఎడయకవయ్య)!

మా కులానికి దేవుడివి నువ్వు. ఏరికోరి మమ్మల్ని పాలిస్తున్నావు (= ఏలినట్టి). ఎంతో నేర్చుకొన్న మా పెద్దలు 'ఒరేయ్! ఈ స్వామి నిధి (= నిధానమా)' అని మాకు నిన్ను ఇచ్చిపోయారు. ఆ నల్లటి మేఘం నీటిని ఇచ్చి మా దాహాన్ని తీరుస్తుంది. స్వామీ! నువ్వు కూడా ఆ నల్లటి మేఘం (= కాలమేఘమా) లాంటివాడివి. మమ్మలిని ఆదరించి (= గారవించి) మా విజ్ఞాన దాహాన్ని పోగొడుతున్నావు. శ్రీనివాసుడా! నువ్వు ఎదురుగా దగ్గరగా (= చేరువ) ఉన్నావు. మా మనస్సులలో కూడా ఉన్నావు. ఎంత అదృష్టవంతులమయ్యా!

స్వామీ! ఆ స్వర్గలోకంలో ఎవరేది అడిగినా అది ఇచ్చే పారిజాతం (= సముద్రం వలన పుట్టింది) ఉంటుందట కదా! మేమందరం కలిసి ఆలోచించి (= భావింప) ఒక తీర్మానానికి వచ్చాము. మా అధీనంలో ఉన్న (= కైవసమైన) పారిజాతానివి నువ్వే! ఆ దేవలోకంలో ఉన్న చింతామణి అనే మణి దుఃఖాలను పోగొడుతుందట. మా చింతలన్నింటిని పోగొట్టి మాకు శక్తి ఇచ్చి రక్షించిన (= గాచినట్టి) చింతామణివి నువ్వే! మా పనులన్నింటిని పూర్తిచేసి (= కావించి) మా కోరికలన్నీ తీర్చే కామధేనువువి నువ్వే!

'శ్రీ వేంకటేశాయ నమః' భక్తితో ఈ మంత్రాన్ని జపిస్తే చాలు! చెడు అనేది కలగనే కలగదు (= చెడనీక). ఎటువంటి కష్టాన్నైనా పోగొట్టి బతికించి అన్ని లాభాలు కలిగించే మంత్రం అది (= సిద్ధమంత్రమా). ఆ సిద్ధ మంత్రానివి నువ్వే. మామూలు రోగాలు పోవటానికి (= అడచి) వైద్యుడి రూపంలో నిలిచి ఔషధం (= మందు) ఇస్తావు. భవరోగాలు (= సంసారము) పోవటానికి కూడ నిన్ను శరణు కోరటమనే గొప్ప మందును (= దివ్యౌషధం) ఇచ్చి మమ్మల్ని రక్షించావు. ఎప్పుడు మమ్మల్ని విడవక మా వెంట ఉండి మాతోటే తిరుగుతుండే (= బడిబాయక) మా ప్రాణ సమానమైన చుట్టానివి (= ప్రాణ బంధుడా) నువ్వే. మమ్మలిని కల్పించిన (= గడియించినట్టి) శ్రీ వేంకటగిరి పర్వత రాజువి (= శ్రీ వేంకటనాథుడా) నువ్వే!

*****

'నాన్నగారు' అంటే గౌరవం. మనస్సుకు కొంచెం దూరం. అయ్య అంటే మనస్సుకు చాలా దగ్గర. అయ్య అని పిలవవలసిన తీరులో పిలిస్తే, ఎదుటివాడి శరీరంలో రక్తం కాసేపు ప్రవహించటం మానేసి, ఆత్మీయత ఉరకలెత్తుతుంది. ఆ ప్రేమశక్తిని గ్రహించిన అన్నమయ్య – జగాలను కన్న తండ్రిని 'అయ్య' అని పిలిచాడు.

నిధానము (= నిధి), నిధనము (= మరణము) దగ్గర సంబంధమున్న పదాలు. ధనసంబంధం దేనిలో పోతుందో అది నిధనం. దేనిలో ఉంటుందో అది నిధానం. అసలైన ధనం మనమనుకొనే ఆస్తులు కాదు. స్వామి అనుగ్రహం అనేది ఒక నిధి అని పెద్దలు నేర్చుకొని, తరతరాలకు తరగని నిధిలా దానిని మనకు ఇచ్చిపోయారట. నిధనము వచ్చేలోగా స్వామి అనుగ్రహం కోసం తాపత్రయ పడమని కవి ఉపదేశిస్తున్నాడు.

మనస్సులను ప్రేరేపిస్తుంది. కాబట్టి నలుపు రంగుకు కాలమని ఇంకొక పేరు. తడిపేది మేఘం. నల్లగా ఉన్న స్వామి అన్నమయ్యకు కాలమేఘమయ్యాడు. ఆర్తుడు, జ్ఞానుల్లో సామాన్యమైన లక్షణం తహతహ. ఇది దాహానికి సంకేతం. 'ఈ దాహాన్ని పోగొట్టే నల్లటి మేఘం నీ ఎదురుగా ఉంది. ఇతర దాహాలు పెంచుకో! తప్పకుండా ఆ కాలమేఘం ఆదరించి (= గారవించి) దాహాన్ని పోగొడుతుం' దని కవి అభయం.

మందారం, పారిజాతం, సంతానం, కల్పవృక్షం, హరిచందనం అని అయిదు దేవతావృక్షాలున్నాయి. ఎవరేది అడిగినా, అది ఇచ్చే ఆ పారిజాతం ఇంద్రుడి అధీనంలో ఉంటుంది. కాని మన అధీనంలో ఉన్న పారిజాతం స్వామి అని కవి చమత్కారం.

వరాహావతారంలో స్వామి భూమిని మోశాడు. అందుకే ఆయన ధరణీధరుడు. తిరుమలలో స్వామివారు ఉండటానికి స్థానాన్నిచ్చింది. వరాహస్వామి. అందుకు ప్రతిఫలంగా మొదటి దర్శనం వరాహస్వామి పొందాడు. తిరుమల వెళ్ళినవారు వరాహస్వామిని చూడకుండా వేంకటేశ్వరదర్శనం చేసుకోకూడదు. ఇద్దరూ ఒకటే అని జ్ఞాపకం చేస్తూ, 'తావై' అన్నమాటలో వరాహస్వామి విశిష్టతను కవి తెలియజేశాడు.

వైద్యోనారాయణో హరిః అంటుంది మన సంప్రదాయం. అన్నమయ్య కూడ స్వామివారిని వైద్యునితో పోల్చి ఆయన ప్రసాదించిన శరణం అనే ఔషధాన్ని భక్తితో సేవించమన్నాడు.

ప్రీతిని కలిగించేవాడు బంధువు. వేంకటేశ్వరస్వామి ప్రాణ బంధువు. మనకున్న పంచప్రాణాలలో ఒకటి వాక్కు అనే ద్వారంలో ఉంటుంది. (నాగం). రెండోది కంటి రెప్పలలో ఉంటుంది. (కూర్మ). మూడవది ముక్కులో ఉంటుంది. (కృకరం). నాలుగవది కంఠం అనే ద్వారంలో ఉంటుంది. (దేవదత్తం) అయిదవది శరీర మంతటా ఉంటుంది. చనిపోయిన తర్వాత కూడా చాలాసేపటి వరకు శరీరానికి బలం ఇస్తుంది. (ధనంజయం) ఈ ప్రాణాలు ప్రతి జీవికి చాలా చాలా ఇష్టమైన బంధువులు. ఈ అయిదు ప్రాణ వాయువులలో ఏ ఒక్క బంధువు తన దగ్గరనుంచి వెళ్లటానికి జీవి ఇష్టపడదు. మనలిని విడవకుండ ఉండే ఈ ప్రాణాలంటే ఎంత ఇష్టపడతామో, స్వామి అంటే కూడ అంతే ఇష్టపడాలని అన్నమయ్య ఆయనని ప్రాణబంధువన్నాడు.

'ఓం నమో వేంకటేశాయ' సిద్ధమంత్రం. అంటే ఏది కావాలన్నా ఆ సిద్ధిని కలిగించే మంత్రం. పరమేశ్వరుడు మన కంటికి కనిపించే విగ్రహ రూపంలో, మంత్ర రూపంలో, యంత్ర రూపంలో ఉంటాడు. 'చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా'అనే పాదంలో మంత్ర రూపంలో ఉన్న స్వామిని అన్నమయ్య కీర్తించాడు.

45. ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా

ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా-
కేలీ విహార లక్ష్మీనారసింహా

ప్రళయ మారుత ఘోర భస్త్రికా ఫూత్కార
లలిత నిశ్వాస డోలా రచనయా
కులశైల కుంభినీ కుముద హిత రవిగగన
చలన విధి నిపుణ నిశ్చల నారసింహా

వివర ఘన వదన దుర్విధ హసన నిష్ఠ్యూత
లవ దివ్య పరుష లాలా ఘటనయా
వివిధ జంతువ్రాత భువన మగ్నీకరణ
నవనవ ప్రియ గుణార్ణవ నారసింహా

దారుణోజ్జ్వల ధగద్ధగిత దంష్ట్రా నల వి
కారస్ఫులింగ సంగ క్రీడయా
వైరి దానవ ఘోర వంశ భస్మీకరణ-
కారణ ప్రకట వేంకట నారసింహా

భావం :

హిరణ్య కశిపుడు స్తంభాన్ని పగుల గొట్టినప్పుడు, అతనిని చంపటానికి బయటికి వచ్చిన నరసింహస్వామి వర్ణన అన్నమయ్య ఈ కీర్తనలో చేస్తున్నాడు.

లక్ష్మీదేవితో కూడిన నరసింహస్వామీ! నీ నుదుట ఉన్న అగ్ని (= ఫాలనేత్రానల) నుండి, వృద్ధి పొందే (= ప్రబల) మెరుపులతో (= విద్యుల్లతా) ఆటలాడుకొనే వాడివి (=కేలీ విహార).

నరసింహస్వామీ! నీ నిట్టూర్పులో (= నిశ్వాస) ప్రళయ కాలానికి సంబంధించిన గాలి (= మారుత) ఉంది. భయంకరమైన కొలిమి తిత్తిలో నిప్పు రాజేయటానికి ఊదే ఫూత్కారముంది. నీ నిట్టూర్పు ఉయ్యాలలా మారి ఏడుకుల పర్వతాలను (ఉదయ, అస్త, హిమ, వింధ్య, మేరు, త్రికూట, లోకాలోక పర్వతాలు). భూమిని (= కుంభినీ), చంద్రుడిని (=కుముద హిత), సూర్యుడిని, ఆకాశాన్ని ఒక ఊపు ఊపుతోంది. నువ్వు మాత్రం నిశ్చలంగా ఉన్నావు.

నరసింహస్వామి! నీ గొప్పదయిన నోటిని (= ఘన వదన) తెరిచావు (= వివర) దుర్మార్గులను (= దుర్విధ) చూసి అట్టహాసం (= హసన) చేస్తున్నావు. నీవు వేసిన (= నిష్ఖాత) ఉమ్మి (= లాలాజలం) దివ్యమైనది. తీవ్రమైనది. ఆ ఉమ్మితో అనేక జీవ సమూహాలు ఉన్న (= వివిధ జంతువ్రాత) లోకాలను (= భువన) నాశనం చేయగల (= అగ్నీకరణ) సమర్థుడివి. స్వామీ! నువ్వు ఎప్పటికప్పుడు కొత్త కొత్త గుణాలకు సముద్రం లాంటి వాడివి (= నవ నవ ప్రియ గుణార్ణవ).

నరసింహస్వామీ! మా వేంకటేశ్వరుడివి నువ్వే! నీ కోర పల్లు (=దంష్ట్రా) భయంకరంగా, ధగధగ లాడుతూ ప్రకాశిస్తున్నాయి. వికృతమైన (= వికార) శత్రువులైన భయంకర రాక్షసవంశాలను భస్మం చేయటం కోసం (= భస్మీకరణ) పటపటలాడుతూ ఒరుసుకొంటున్న నీ పళ్ల మధ్య నిప్పురవ్వలు స్నేహం చేస్తున్నాయి (= స్ఫులింగ సంగ క్రీడయా). వేంకటేశ్వరా! నువ్వే ఆ నరసింహుడివి.

*****

అన్నమయ్య దృష్టిలో శివుడు, విష్ణువు, ఇద్దరూ ఒక్కటే. 'బ్రహ్మమొక్కటే... పరబ్రహ్మ మొక్కటే' అన్న విశాలమైన సమదృక్పథం ఉన్నవాడు. 'ఎంత మాత్రమున ఎవ్వరు దలిచిన అంత మాత్రమే నువ్వు' అని వేంకటేశ్వరునిలో అందరు దైవాలనూ చూసిన సంస్కారి.

అహోబిలం కింద నుంచి కొండపైన ఉన్న అహోబిలానికి వెళ్ళేటప్పుడు దారిలో కారంజ నరసింహస్వామి విగ్రహం కనబడుతుంది. ఈ స్వామికి శివుడిలా నుదుట కన్ను, ఒక చేతిలో బాణం, ఇంకోచేతిలో చక్రం కనబడతాయి. హనుమంతుల వారు ఈ కారంజ వృక్షం (= కానుగు చెట్టు) కింద రాముల వారి కోసం తపస్సు చేస్తూ కూర్చుంటే, నరసింహస్వామి ప్రత్యక్షమై నేనే రాముడిని అన్నాడట. నువ్వు నా రాముడివి కాదని హనుమంతుడు తిరస్కరిస్తే అప్పుడు నరసింహుడు 'నేనే విష్ణువుని, నేనే రాముడిని, శివుడిని' అంటూ శివుడిలా నుదుట కన్ను, రాముడిలా చేతిలో బాణం, విష్ణువులా చేతిలో చక్రంతో కనిపించాడని ఇక్కడ స్థల పురాణం. అన్నమయ్య శివకేశవాభేద దృష్టికి కారంజ నరసింహస్వామి సాక్ష్యం పలుకుతాడు.

నవ నరసింహులలో ఈ కారంజ నరసింహుడు కూడ ఒకడు. మిగతావాళ్ళు భార్గవ, యోగానంద, ఛత్రవట, అహోబిల, వరాహ, మాలోల, జ్వాలా, పవన నరసింహులు. అన్నమయ్య 'నవ నవప్రియ నారసింహ' అనే సంబోధనలో నవనరసింహుల ప్రసక్తిని తెచ్చాడు.

ఈ కీర్తనలో లక్ష్మీనరసింహ సంబోధన ప్రత్యేకంగా చేయటానికి ఒక కారణముంది.

యోగ నారసింహుడు అపారమైన జ్ఞానాన్ని, శాంత గుణాన్ని తనను కొలిచే భక్తులకు ప్రసాదిస్తే లక్ష్మీ నరసింహుడు అపారమైన దయను ప్రసాదిస్తాడు. దయలో సంపద. మోక్షం. ఆపద నుంచి రక్షించటం మొదలైన అన్ని గుణాలుంటాయి. అందుకే 'లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్' (నరసింహస్వామీ! నీ చేతుల రక్షణ నాకు ప్రసాదించు) అని శంకర భగవత్పాదులు లక్ష్మీ నరసింహుని వేడుకొన్నారు.

నరసింహుడు జడలను అటు ఇటు కదల్చటం వల్ల గాలి మంచి వేగంగా పుట్టింది. ఆ వేగానికి ఆకాశంలో పోతున్న విమానాలు ఉయ్యాల ఊగుతున్నాయన్నాడు పోతన (7-285). స్వామి బలంగా వదిలిన నిట్టూర్పుకే అన్నీ అల్లకల్లోలమై ఉయ్యాల ఊగుతున్నాయన్నాడు అన్నమయ్య.

నరసింహుడు పళ్ళు పటపట కొరికినప్పుడు పుట్టిన నిప్పురవ్వలు శత్రురాజుల వంశాలను కాల్చివేస్తాయనే అద్భుతమైన ఊహ వర్ణనలకు నిధియైన ఎర్రన కూడా చేయలేకపోయాడు. (నృసింహపురాణం 5-82).

వంశమంటే వెదురు అని ఇంకొక అర్థముంది. నిప్పు సోకిన వెంటనే చాలా కాలం ఎండిన వెదురు భగ్గుమంటుంది. రాక్షస వంశాలు కూడా చాలాకాలం నుంచి ప్రజలను బాధ పెడుతున్నాయి. అవి కూడా స్వామివారి పళ్ల పటపటలలో పుట్టిన అగ్ని జ్వాలలకు వెంటనే భగ్గుమంటాయని అందమైన ఇంకో అర్థం వస్తోంది. గోత్రం కులం - ఇలాంటి ఇతర పర్యాయపదాలు వాడకుండా, వెదురు అని మరో అర్థం వచ్చేటట్లుగా వంశం అని సరియైన పదాన్ని ప్రయోగించి రసానందాన్ని కలిగించిన అన్నమయ్యను పొగడకుండా ఉండలేం.

విష్ణుమూర్తి ఎత్తిన ఇతర అవతారాలలో చాలా మటుకు భూలోకంలో మానవుడు మొదలైన రూపాలలో ఎక్కువ కాలం ఉన్నాయి. కాని నరసింహావతారపు నిడివి తక్కువ. ప్రభావం ఎక్కువ. - అన్నమయ్య కీర్తనలానే.

46. బ్రహ్మ గడిగిన పాదము

బ్రహ్మ గడిగిన పాదము
బ్రహ్మము దానె నీ పాదము

చెలగి వసుధ గొలిచిన నీ పాదము
బలి తల మోపిన పాదము
తలకక గగనము తన్నిన పాదము
బలరిపు గాచిన పాదము

కామిని పాపము గడిగిన పాదము
పాము తల నిడిన పాదము
ప్రేమపు శ్రీపతి పిసికెడి పాదము
పామిడి తురగపు బాదము

పరమ యోగులకు బరిపరి విధముల
వరమొసగెడి నీ పాదము
తిరు వేంకటగిరి తిరమని చూపిన
పరమపదము నీ పాదము

భావం :

ఓ వేంకటేశ్వరా! నీ పాదాన్ని వామనావతారంలో బ్రహ్మంతటివాడు కడిగాడు. నీ పాదమే బ్రహ్మం.

నీ పాదం వామనావతారంలో భూమిని కొలిచింది. బలి తలని అణగదొక్కింది. ఆకాశాన్ని తన్నింది. (ఆక్రమించింది). ఇంద్రుడిని రక్షించింది. నీ పాదం రామావతారంలో అహల్య పాపాన్ని కడిగింది. కృష్ణావతారంలో కాళిందుని తలపై నాట్యమాడింది. నీ పాదాన్ని ప్రేమతో శ్రీలక్ష్మి ఒత్తుతుంది. కల్కి అవతారంలో నీ పాదం అడ్డం లేకుండా, తన ఇష్టం వచ్చినట్లు తిరిగే గుర్రం మీద ఉంటుంది. నీ పాదం గొప్పవారైన యోగులను అనేక రకాలుగా రక్షించి వరాలిచ్చింది. నీ పాదం నువ్వంటున్న వెంకటగిరి స్థిరమైనదని, మోక్షాన్నిస్తుందని అందరికి తెలియజేస్తోంది.

*****

బలిచక్రవర్తి మూడు అడుగులు వామనునికి దానమిస్తానన్నాడు. వెంటనే వామనుడు విశ్వరూపం ధరించాడు. ఆ విశ్వరూపంలో ఆ స్వామి పాదం తలకక (= జంకు లేకుండా) ఆకాశాన్ని ఆక్రమించింది. ఆ సమయంలో బ్రహ్మ తన కమండలంలోని నీటితో వామనుడి పాదాన్ని కడిగాడు. ఆ కడిగిన నీరే ఆకాశగంగ అయిందని ఒక కథ (భాగవతం -21). బ్రహ్మ కడిగిన పాదము అంటే బ్రహ్మ విష్ణువును పూజించాడు అని అర్థం. భూలోకం, చంద్ర సూర్యులు ఉండే స్థలమంతా వామనునికి ఒక అడుగయింది. దీనినే చెలగి (= అతిశయించి) భూమిని వామనుని పాదం కొలిచిందని కవి రాశాడు.

"బలి చక్రవర్తీ! మూడు అడుగులు ఇస్తానన్నావు. భూలోకం ఒక అడుగైంది. స్వర్గం లోకం ఒక అడుగైంది. మూడో అడుగుకు చోటు ఎక్కడ?" అని వామనుడు అడిగాడు. ఆడిన మాట తప్పని బలి తన తలమీద మూడవ అడుగు తీసుకోమన్నాడు. దీన్నే బలి తలమోపిన పాదం అన్నాడు అన్నమయ్య.

బలరిపుడంటే ఇంద్రుడు. బలమైన శత్రువులు కలవాడు బలరిపుడు. బలి చక్రవర్తికి భయపడి ఇంద్రుడు స్వర్గలోకాన్ని విడిచిపెట్టి పారిపోయాడు. అటువంటి ఇంద్రునికి మరలా రాజ్యాధికారాన్ని - బలి చక్రవర్తిని అణచివేసి - వామనుడు ఇచ్చాడు. దీనిని కవి సొగసుగా 'బలరిపు గాచిన (= రక్షించిన) పాదము' అన్నాడు. ఇంద్రుడనటానికి పాకశాసనుడు, సురపతి - ఇలా రకరకాల పదాలున్నాయి. కాని - ఇంద్రునికి బలి చక్రవర్తి లాంటి బలమైన శత్రువులున్న సందర్భంలో - కావాలని అర్థవంతంగా ఇంద్రునికి బలరిపుడు అని కవి ప్రయోగించాడు.

ఏ ఒక్కటి తెలిస్తే అంతా తెలుస్తుందో ఆ ఒక్కదాన్ని బ్రహ్మం అంటారు. సాలెపురుగు తనలోనుంచి ఒక రకమైన జిగురును బయటికి తెచ్చి గూడు అల్లుతుంది. మళ్లీ ఆ గూడు దారాన్ని తనలోకి లాగేసుకుంటుంది. అలాగే ఆ పరబ్రహ్మం (పరమాత్మ) కూడా ఈ సృష్టిని సృష్టించి, నిలిపి, నాశనం చేస్తున్నాడు. (ముండకోపనిషత్తు) ఆ పరబ్రహ్మమే వేంకటేశ్వరస్వామి అని అన్నమయ్య మనకు బోధిస్తున్నాడు. బ్రహ్మం అంటే, పాదం కలిగిన పరమాత్మ అని అర్థం.

కామిని (= ప్రియుని కలియుటంలో బాగా ఆసక్తి కలది) పాపము కడిగిన పాదములో అన్నమయ్య లోకంలో ప్రసిద్ధమైన ఆధ్యాత్మ రామాయణాన్ని అనుసరించాడు. వాల్మీకి రామాయణంలో అహల్య రాయిగా మారినట్లు లేదు. (బాల. 48-30 శ్లో) కాని ఆధ్యాత్మ రామాయణంలో శిలగా ఉన్న అహల్యను శ్రీరాముడు తన పాదముతో తాకగా ఆమెకు రూపం వచ్చినట్లుంది. (బాల 5-3 6వ శ్లో) ఇంద్రుడొక్కడే కాదు - అహల్య

కూడా గౌతముని వేషంలో ఉన్న ఇంద్రుని కోరుకొన్నట్లుగా విశ్వనాథ తమ కల్పవృక్షంలో రాశారు. అహల్యకు అన్నమయ్య వాడిన కామిని విశేషణాన్ని విశ్వనాథ తన రామాయణంలో సమర్థించారు.

కాళియుడు అనే పాము యొక్క పడగలనే విశాల మంటపం మీద, కృష్ణుడు అనే ప్రఖ్యాత నర్తకుడు ఎక్కి, నృత్యం చేశాడు. యవరేఖ, అంకుశ రేఖ మొదలైన ఉత్తమమైన కృష్ణ పాదాల గుర్తులు ఆ పాము తలమీద పడ్డాయని "పాము తలను ఇడిన (=ఉంచిన) పాదము"లో వివరించాడు.

అస్థిరమైన ఈ లోకములో తిరమైన (= స్థిరమైన) పరమ పదము (= మోక్షాన్నిచ్చేది) వేంకటగిరి అని – శ్రీ వేంకటేశ్వరుని పాదము చెబుతోంది. కొండమీద స్థిరంగా ఉన్న స్వామిని నమ్ముకొమ్మని కవి భావం.

పామిడి తురగవు పాదమునకు పెద్దలు చెప్పిన రకరకాల అర్థాలు ఇవి. 1. పాములకు శత్రువైన గరుత్మంతుడు వాహనముగా గల విష్ణుపాదము 2. కల్కి అవతారంలో ఏది అడ్డం లేకుండా భయంకరంగా తిరిగే గుర్రం గల పాదం 3. గుర్రాన్ని పామెడి (= రుద్దు, పాము) పాదం. ఇందులో భయంకరంగా తిరిగే గుర్రంగల పాదం అనే సముద్రాల వారి అర్థం కీర్తనలోని మొత్తం భావానికి దగ్గరగా ఉంది. "ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము"లో తొమ్మిది రకాల భక్తులతో ఒకటైన పాద సేవనాన్ని (పాదాలను సేవించడం) అన్నమయ్య సూచించాడు. మనం లోకంలో డబ్బు (లక్ష్మి) కోసం వెంపర్లాడుతుంటాం. ఆ లక్ష్మి వేంకటేశ్వరున్ని కొలుస్తుందనే వర్ణనలో – భౌతిక సంపదల కోసం పాకులాడకుండా ఆధ్యాత్మిక తత్వాన్ని అలవర్చుకొమ్మనే సందేశం ఉంది.

తిరుమలలో ప్రధాన దేవాలయానికి దగ్గరగా ఉన్న శ్రీవారి పాదాలు దర్శించిన వెంటనే అన్నమయ్య కీర్తన గుర్తుకు వస్తుంది. ఈ పాదాల దగ్గర ఉన్న శిలాతోరణం గుండా నడుచుకుంటూ స్వామి ఆనంద నిలయంలోకి వెళ్ళాడట. ఆ పాదాల దగ్గర నిలబడితే చల్లటిగాలి హృదయాన్ని తాకుతుంది. అది చల్లటి గాలా? అన్నమయ్య రాసిన బ్రహ్మ కడిగిన కీర్తనా? నిర్ధారించటం కష్టం.

47. భావయామి గోపాల బాలం

భావయామి గోపాల బలం మన-
స్సేవితం తత్పదం చింతయేహమ్ సదా

కటి ఘటిత మేఖలా ఖచిత మణి ఘంటికా-
పటల నినదేన విభ్రాజమానం
కుటిల పద ఘటిత సంకుల శింజితానతం
చటుల నటనా సముజ్జ్వల విలాసం

నిరత కర కలిత నవనీతం బ్రహ్మాది-
సుర నికర భావనా శోభిత పదం
తిరు వేంకటాచల స్థితమనుపమం హరిం
పరమ పురుషం గోపాలబాలం

యశోదమ్మ దగ్గర పారాడుతూ, నడుస్తూ, నృత్యం చేస్తున్న చిన్నికృష్ణయ్యని అన్నమయ్య ఈ కీర్తనలో మనోహరంగా వర్ణిస్తున్నాడు.

చిట్టి పొట్టి అడుగులు వేస్తూ ముద్దు కన్నయ్య నడుస్తుంటే మొలతాడుకు ఉన్న చిరుగంటలు అందంగా మోగుతున్నాయి. అసలు మన హృదయాలు గంటలుగా మారాయేమో! అదుగో మనలని అనుగ్రహించటానికి కృష్ణుడు నృత్యం చేస్తున్నాడు. అటు, ఇటు కాలు అటు వేసి, అందెలు ఘల్లు ఘల్లు అంటుంటే మా బాల కిట్టయ్య ఎంత చక్కటి నృత్యం చేస్తున్నాడో కదా! ఆ విలాసం ఇంకెవరికయినా ఉంటుందా!

అదుగో! అమ్మ ఎప్పుడు పెట్టిందో చేతిలో వెన్నముద్దతో వెన్నదొంగ మురిసిపోతూ మెరిసిపోతున్నాడు. కృష్ణుడు ముద్దుముద్దుగా నడుస్తుంటే, ఆ అడుగులకు అందరూ మురిసిపోతున్నారు. ఆ అడుగులతో బ్రహ్మ మొదలైన దేవతల ఆలోచనలు మెరిసిపోతున్నాయి. అలా తమ భావాలను మెరిపిస్తున్న కృష్ణున్ని తలుచుకుంటూ దేవతలందరూ తాము అదృష్టవంతులమనుకొంటున్నారు. ఎవ్వరితో పోలిక లేనివాడు, పరమ పురుషుడు గోపాలబాలుడు. ఆ చిన్ని కృష్ణుడు వేంకటేశునిగా వేంకటాచలంలో ఉన్నాడు. ఆ ఆవులు కాసే బాలుడిని, నన్ను రక్షించమని ధ్యానిస్తాను.

*****

స్వామివారు భూలోకంలో ఉన్నది సరిగ్గా 125 సంవత్సరాలని ఒక లెక్క. ఈ 125 సంవత్సరాల జీవిత కాలంలో పెద్దరికపు చేష్టల కంటే శ్రీకృష్ణుని బాల్య క్రీడలు కవులకు అధికంగా మనస్సేవితాలయ్యాయి. మనస్సేవితమనేది ఒక అద్భుతమైన పద బంధం. చేతులు, కాళ్ళు భగవంతుని సేవలో యాంత్రికంగా నిమగ్నమవుతాయి. కాని, మనస్సు సేవించటమనే విషయం మానవులలో తక్కువగా జరుగుతుంది. రాగ ద్వేషాలకు అతీతులై, భగవంతునికి మనస్సేవ చేయమని అన్నమయ్య సందేశం. భాగవతంలో కర్దమ మహాముని చూసిన స్వామి మనస్స్పర్శస్మితేక్షణుడు (మనస్సును తాకే చిరునవ్వుల చూపుల వాడు). ఆ చిన్నికృష్ణుడిని మనస్సేవితునిగా చేసిన అన్నమయ్య ధన్యుడు.

మర్కట కిశోర న్యాయం, మార్జాల కిశోర న్యాయం – అని రెండు పద్ధతులు భక్తి ప్రపంచంలో ఉన్నాయి. ఒక కొమ్మ నుంచి ఇంకో కొమ్మకు దాటేటప్పుడు తల్లి కోతిని – పిల్ల కోతి గట్టిగా పట్టుకొని ఉంటుంది. ఇక్కడ తల్లికి రక్షణ బాధ్యత లేదు. పిల్లకే బాధ్యత. ఈ విధానంలో భక్తుడిదే బాధ్యత. జీవుడు తన రక్షణకు తాను ప్రయత్నాలు చేస్తుంటాడు. మార్జాల కిశోర న్యాయం దీనికంటే ప్రత్యేకమైనది. పిల్లి తన పిల్లలని తానే రక్షిస్తుంది. ఆహారం అందిస్తుంది. ఒకచోట నుంచి ఇంకోచోటికి తానే తీసుకువెళుతుంది. ఇక్కడ తల్లిదే రక్షణ బాధ్యత. పిల్లకి సంబంధం లేదు. అన్నమయ్య లాంటి మహాభక్తులు అనుసరించిన శరణాగతి మార్గం ఇదే. స్వామికే సర్వం సమర్పణ చేయాలి. తన రక్షణ బాధ్యతలు అన్నీ స్వామికే అప్పజెప్పే ఈ ఉత్తమ భక్తి విధానంలో వేలాది కీర్తనలు అన్నమయ్య రాశాడు.

ఈ భావయామి కీర్తనలోన సదా (= ఎల్లప్పుడు) అనే పదం కీలకమైంది. సర్వకాల సర్వావస్థల్లోనూ స్వామిని ధ్యానించాలి. శరణు కోరాలి. ఈ కీర్తన ఇచ్చే సందేశం ఇదే. చింతయేయమ్‌కు బదులు 'చింతయేహమ్' అను పాఠమే మనం గ్రహించాలి. ముత్తుస్వామి దీక్షితులవారు కూడా చింతయేహమ్ అని శివ సంకీర్తనలలో తరచూ ప్రయోగించారు.

అమ్మ భావనాగమ్య (భావించటం చేత తెలియదగినది – లలితాసహస్రం). కృష్ణయ్య కూడా భావనాగమ్యుడు. కేవలం మనకే కాదు. బ్రహ్మ మొదలైన దేవతల భావనలకు – చిన్ని కృష్ణుడు శోభనిస్తాడని అన్నమయ్య చెబుతున్నాడు. అంటే మనం కృష్ణయ్యను ఒక్కసారి భావిస్తే చాలు, ఆ ఊహలు వెలిగిపోతాయి. అతడు బ్రహ్మాది భక్తుల భావాల వెలుగుతో ప్రకాశించే పదాలు కలవాడని కవి మాట.

పదాలకు రంగు, రుచి, వాసన ఉంటాయంటే కవులలాగే చెబుతారని అనుకొనే వాళ్ళు, ఈ అన్నమయ్య భావనాశోభ చూసి "పదాలకు రుచి ఉంటుంది. నిజమేస్మీ" అనకుండా ఉంటారా?

ఈ కీర్తనలోని నిరత కరకలిత నవనీతం (చేతిలో ఉంచుకొన్న కొత్తగా తీసిన వెన్నముద్ద కలిగినవానిని) పాదాన్ని విన్న వెంటనే, "చేత వెన్నముద్ద చెంగల్వపూదండ" అనే పద్యం గుర్తుకు వస్తుంది. ఆ మాటకొస్తే అమ్మ చేతిముద్దలాంటి కమ్మనైన ఈ పద్యం కూడా అన్నమయ్యదే అని కొందరు విమర్శకుల భావన.

ఇంతకీ వెన్నముద్దకి, కృష్ణుడికి సంబంధం ఏమిటి? ఆయనకి ఇంకేం పనిలేనట్టు అస్తమాను ఈ వెన్న దొంగతనాలు ఏమిటి? వెన్నముద్దలు చేతిలో పెట్టుకోవటమేమిటి? ఈ ప్రపంచం నీళ్ల వంటిది. మనస్సు పాల వంటిది. నీళ్లలో పాలను కలిపితే – స్వచ్ఛమైన పాల ఉనికి మనకు కనిపించదు. అదే పాలను పెరుగుగా మార్చి చిలికితే వెన్న వస్తుంది. ఆ వెన్నముద్దను నీళ్లలో ఉంచితే, అది నీళ్లలో కలవదు. తేలుతుంది. మన జీవుల మనస్సు వెన్న కావాలని కృష్ణయ్య సందేశం. నీళ్ళ లాంటి ప్రపంచంలో ఉంటున్నాం – ప్రాపంచిక బంధాలు అంటుకోకూడదు. ఇది చెప్పినంత తేలిక కాదు. పాలలాంటి మనస్సు వెన్నగా మారాలంటే కృష్ణమూర్తి అనుగ్రహం జీవుడికి అవసరం. నన్ను ఆశ్రయించండి. స్మరించండి. మిమ్మల్ని నా చేతుల్లో పెట్టుకొని చూసుకొంటానని స్వామి వెన్నముద్దను చేతిలో ధరిస్తున్నాడు. ఇది అర్థం చేసుకొన్న అన్నమయ్య లాంటి మహాభక్తులు సదా ఆయనను స్మరించి తరించారు. అన్నమయ్య కీర్తనలు చదివి ఆనందించాలి. ఆయన మార్గాన్ని అనుసరించి తరించాలి.

48. ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీఁడు
తిద్దరాని మహిమల –దేవకీ సుతుడు

అంతనింత గొల్లెతల – అరచేతి మాణికము
పంతమాడే కంసుని – పాలి వజ్రము
కాంతుల మూడు లోకాల – గరుడపచ్చ పూస
చెంతల మాలోనున్న – చిన్ని కృష్ణుడు

రతికేళి రుక్మిణికి – రంగు మోవి పగడము
మితి గోవర్ధనపు గో – మేధికము
సతమై శంఖచక్రాల – సందుల వైడూర్యము
తియై మమ్ము – గాచేటి కమలాక్షుడు

కాళింగుని తలలపై – కప్పిన పుష్యరాగము
ఏలేటి శ్రీ వేంకటాద్రి ఇంద్రనీలము
పాల జలనిధిలోన పాయని దివ్యరత్నము
బాలుని వలె తిరిగీ – పద్మనాభుఁడు

ముఖ్య పదార్థం :

ముద్దుగారే	=	అందంగా ఉండే
ముంగిటి ముత్యము	=	ఎదుటవున్న ముత్యం
తిద్దరాని	=	వంకలు పెట్టడానికి వీల్లేని
అంతనింత	=	అక్కడ
గొల్లెత	=	గోపిక
పంతమాడే	=	ఎదురు తిరిగే
మోవి	=	పై పెదవి
మితి	=	నిశ్చయముగా
సతమై	=	నిత్యంగా

కమలాక్షుడు	=	తామరల వంటి కన్నులు గలవాడు
పాల జలనిధి	=	పాల సముద్రము
పాయని	=	విడువని
దివ్య రత్నము	=	చింతామణి
పద్మనాభుడు	=	పద్మము నాభి యందు గలవాడు

భావం :

అందంగా ప్రకాశించే బాలకృష్ణుడు రేపల్లె వీధుల్లో ఆడుకుంటున్న దృశ్యం అన్నమయ్య ఊహలలో మెరిసింది. రత్నాలు పొదిగిన ఆ ఊహని ఈ కీర్తనలో అన్నమయ్య మధురాతి మధురంగా చిత్రించాడు.

వీడు – ఈ బాలకృష్ణుడు – మనసు దొంగ. యశోదమ్మ ఎదుట ముత్యం. ఈ దేవకీదేవి బిడ్డ ఎదురులేని గొప్పతనాలు ఉన్నవాడు.

దగ్గరగా మాలో ఒకడిగా ఉన్న చిన్ని కృష్ణుడు గోపికల అరచేతిలో కెంపు. తగాదాలాడే కంసుణ్ని నాశనంచేసే వజ్రం. మూడు లోకాల్లో ఆకుపచ్చ రంగున్న మాణిక్యం.

మమ్మల్ని రక్షించే ఈ కృష్ణుడు రుక్మిణి అందమైన పెదవిపై పగడం. గోవర్ధన పర్వతాన్ని చిటికెన వేలితో ఎత్తే సమయంలో పసుపురంగున్న గోమేధికం. శాశ్వతంగా ఉండే శంఖ చక్రాల మధ్యలో వైడూర్యం రత్నం.

బాలుడిలా తిరిగే ఈ విష్ణువు కాళీయుడనే పాముమీద పుష్యరాగమణి. శ్రీ వేంకట పర్వతము మీద ఉండి మమ్మల్ని శాసించే వేంకటేశ్వరుడు (కృష్ణుడు) నీలమణి. ఈ చిన్నికృష్ణుడు పాల సముద్రములో చింతామణి .

*****

తెలుగు సంస్కృతీ సంప్రదాయాల్లో కలిసిపోయిన అందమైన మాట ముత్యం. 'అతడు ఆణి (శ్రేష్ఠమైన) ముత్యం', 'వీడు జాతి ముత్యం'... ఇలాంటి మాటలు మనం తరచూ వింటూంటాం. ఈ ముత్యాల జాతీయంతో అన్నమయ్య తన భాషకు వేసిన ముత్యాల పందిరి ఈ కీర్తన.

ఇద్దరు తల్లుల ముద్దుల బిడ్డ కృష్ణయ్య. ఇద్దరు తల్లుల దగ్గర మహిమల ప్రదర్శించాడు. మహిమ అని గ్రహించేలోపే అంతులేని పుత్ర ప్రేమను ప్రదర్శించి వారిని

సర్వం మరిచేట్లు చేశాడు. "మొత్తం సృష్టి అంతా నీలో కనబడుతోందయ్యా" అని కృష్ణయ్య మహిమను గుర్తించి, నోరారా పొగిడింది దేవకి. (భాగవతం, దశమస్కంధం). యశోద కూడా మట్టి తిన్న సందర్భములో "నువ్వే మా అందరికీ ప్రభువు" అని కృష్ణుణ్ని కీర్తించింది. అయినా – తానెవరో, దేవకీదేవి గత జన్మలేమిటో వివరించి తన ఎదురులేని మహిమని మొదటగా కృష్ణుడు ప్రదర్శించినది దేవకీదేవి దగ్గర. అందుకే కాబోలు 'తిద్దరాని మహిమల యశోదా సుతుడు' అనకుండా, 'తిద్దరాని మహిమల –దేవకీ సుతు' డని అన్నమయ్య చెప్పాడు.

రవి మొదలైన నవగ్రహాలు జాతకరీత్యా చెడు స్థానాల్లో ఉన్నప్పుడు వాటిని శాంతింపజేయటానికి నవరత్నాలు ధరించాలని పెద్దలు చెబుతారు. రవికి మాణిక్యం, చంద్రుడికి ముత్యం, కుజుడికి పగడం, రాహువుకు గోమేధికం, గురువుకు పుష్యరాగం, శనికి నీలం, బుధునికి పచ్చ, కేతువుకు వైడూర్యం,శుక్రుడికి వజ్రం ధరించాలి. ఈ రత్నాలని శ్రీకృష్ణ వర్ణనలో మంచికి, చెడుకి – రెండింటికి అన్నమయ్య వాడటం గమనించదగినది.

'కరతలామలకం' – మన తెలుగులో ప్రసిద్ధి పొందిన జాతీయం. తెలుగులో ప్రసిద్ధి పొందిన జాతీయం. అరచేతిలో ఉందంటే దానిని పట్టుకోవడం సులభం. భక్తి ఉన్న గోపికలకు కృష్ణుడు సులభంగా పట్టుబడేవాడు కదా! అందుకే అన్నమయ్య కృష్ణుడిని – గోపికల 'అరచేతి మాణికం' అన్నాడు. ఇంకొక విశేషం కూడా ఇక్కడ ఉంది. తామర పువ్వు వంటి ఎరుపు కలిగినది కెంపు. గోపికల అరచేతులు ఎరుపు. వారి అరచేతుల్లో నల్లనయ్య ఎర్రని కెంపు కావడములో ఆశ్చర్యమేముంది?

వజ్ర శబ్దాన్ని ఉపయోగించుటలో కవి ప్రతిభ ఉంది. వజ్రమంటే (=1. రత్నం, 2. వజ్రాయుధం) అడ్డం లేకుండా పోయేది.అని అర్థం. దుష్టుడైన కంసునిపై దాడి చేసి అతనిని హతమార్చిన కృష్ణుడు అతని పాలిటి వజ్రమే కదా!

1. గారుత్మతము (= గరుత్మంతుని వల్ల పుట్టింది) 2. మరకతము (= దీనితో మరణాన్ని గెలుస్తారు) 3. హరిన్మణి (= పచ్చని మణి) – అని పచ్చలకు మూడు రకాల పేర్లు. 'కాంతుల మూఁడు లోకాల – గరుడపచ్చ పూస' – అని అన్నమయ్య చెప్పటంలో మూడు శబ్దాలకి సంబంధించిన చమత్కారం (లోకాలకి, పచ్చలకి సంబంధించి) కనబడుతుంది.

బాలకృష్ణుడు రత్నాలుగా ఎక్కడెక్కడ ఉన్నాడో వర్ణించి, చిట్టచివరగా 'పాల జల

నిధిలోన పాయని దివ్య రత్నము' (చింతామణి) అనటం చక్కటి భావన. కృష్ణుడు రత్నాలతో ప్రకాశించేవాడు మాత్రమే కాదు. కోరిన రత్నాలు మొదలైనవి ఇచ్చే చింతామణి అని చెప్పటం గొప్పగా ఉంది. వేంకటేశుడు నల్లటివాడు. అందుకే స్వామికి అన్నమయ్య వాడిన పదము 'ఇంద్రనీలం' (నల్లటి మణి). రత్నాలలోని ఏ పుష్యరాగమో, కెంపో – ఇక్కడ ప్రయోగిస్తే అన్నమయ్య సాధారణ కవి అయ్యేవాడు. నీలమణి ప్రయోగించి మహాకవి అయ్యాడు.

కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపిలో మూలవిరాట్ బాలకృష్ణుడు. ఆయనకి ఒక చేతిలో ఆవులను అదలించే కర్ర, ఇంకొక చేతిలో ఆవులను రాటకు కట్టే తాడు ఉన్నాయి. రుక్మిణికి ఇష్టమైన రూపమట ఈ బాలకృష్ణుడి రూపం. అందువలన విశ్వకర్మను ఆ విధంగా తన రూపాన్ని చేయమని శ్రీకృష్ణులవారు ఆదేశించారని ఒక కథ. కృష్ణుడు రుక్మిణి అందమైన పెదవిపై పగడం అని అన్నమయ్య అనటంలో అందం ఇప్పుడు భావించుకోవచ్చు.

"ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము" అనే వాక్యంలో 'ముద్దుగారే' విశేషణం యశోదకు సంబంధించినది కాదు. శ్రీకృష్ణుడికి సంబంధించినది. అన్నమయ్య పదాలలో ఇదొక చమత్కారం.

రత్నాలకు నాయికకి అన్వయిస్తూ ఇంకో కీర్తనలో అన్నమయ్య ఇలా అంటాడు. "ఆమె మాట్లాడితే మాణిక్యాల జల్లు. అలా చూసిందంటే చాలు మంచి నీలాలు పుట్టుకొస్తాయి. ఆమె యవ్వనంలో పచ్చలు కమ్ముకుంటాయి. నడిస్తే వైడూర్యాలు, నవ్వితే వజ్రాలు, ఆమె తీపి తేనె మాటల్లో పుష్కరాగాలు, గోటి గాయాలలో గోమేధికాలు, చెమటల్లో ముత్యాల సరాలు ఉంటాయి. వేంకటేశ్వరా! ఒకసారి ఆమెవైపు చూడవయ్యా!" అని కవి భావన. ఇందాకటి కృష్ణుడి వర్ణనలో రత్నాలు నాయికను వర్ణించేటప్పుడు ఇంకొక రకంగా మారాయి. ప్రతిభ కలిగిన కవికి భావ దారిద్ర్యం ఉండదు.

49. మూసిన ముత్యాలకేలే మొరగులు

మూసిన ముత్యాలకేలే మొరగులు
ఆసల చిత్తానకేలే అలవోకలు

కందులేని మోముకేలే కస్తూరి
చిందు నీ కొప్పునకేలే సేమంతులు
మందయానమునకేలే మట్టెల మోత
గందమేలే పై పై కమ్మని నీ మేనికి

భారపు గుబ్బలకేలే పయ్యెద నీ
బీరపు జూపులకేలే పెడమోము
జీరల బుజాలకేలే చెమటలు నీ
గోరంట గోళ్లకేలే కొన వాడ్లు

ముద్దుల మాటలకేలే ముదములు
యద్ధపు జెక్కులకేలే అరవిరి
వొద్దిక మాటలకేలే వూర్పులు నీకు
నద్దమేలే తిరువేంకటాద్రీశు గూడి

ముఖ్య పదార్థం :

మొరగులు	=	మోసాలు
కందు	=	దోషం
చిందు	=	నాట్యం
చేమంతులు	=	స్త్రీలు నెత్తిమీద పెట్టుకొనే ఆభరణాలు
బీరము	=	బిగువు
పెదమోము	=	ఇష్టంలేక వెనుకకు తిరిగిన ముఖం
కొనవాడ్లు	=	చివరి పదునులు
మదములు	=	సంతోషాలు
అరవిరి	=	సగము వికసించిన పువ్వు

ఒద్దిక = స్నేహం

ఊర్పు = ఊపిరి

భావం :

ఒక చెలి అలవేలుమంగని ఇలా ఆట పట్టిస్తోంది.

అలవేలుమంగా! ఇప్పటిదాకా పెట్టెలో మూసిన తళుకు తగ్గని ముత్యాలు నువ్వు ధరించావన్న విషయం నాకు తెలుసులే. వాటికేదో తళుకులు పెడుతున్నట్లుగా మోసాలెందుకే? స్వామికోసం ఆశలుపడే నీ మనస్సుకు అల్పమైన తేలిక విషయాలెందుకే? ఎటువంటి దోషం లేని నీ ముఖంలో ఆ కస్తూరి మచ్చలెందుకే? అటు ఇటు కదిలే ఆ కొప్పుమీద ఆ చేమంతుల ఆభరణాలెందుకే? అందంగా మెల్ల మెల్లగా నడిచే నీకు నలుగురికీ తెలిసేటట్టు ఆ మట్టెల మోతలు ఎందుకే? సహజంగానే నీ ఒళ్లంతా గుమాయిస్తుంది. ఇంకా నీ శరీరం మీద గంధాలెందుకు? బరువైన వాటిమీద తేలికైనవి ఉండటం చాలా కష్టం తల్లీ! అందుకే బరువైన వాటిమీద ఆ పైట ఎందుకు చెప్పు? అందవైన నీ బిగువు చూపులు మమ్మల్ని చూడనీయ్. వెనక్కి ముఖం తిప్పుకొంటావెందుకు? మా స్వామిని గురించి లోలోపల ఏవేవో ఆలోచిస్తున్నావు కదూ! లేకపోతే చీరలున్న నీ భుజాలకు అటు ఇటు ఆ చెమటలు ఎందుకు? గోరింటాకు పెట్టిన ఎరుపుతో నిగనిగలాడే నీ గోళ్లకు వాడిగా పదును పెట్టావెందుకే?

స్వామి ఏవో ముద్దుల మాటలు చెప్పినట్లున్నాడు. అంత సంతోషాలేమిటే? అవునే! అసలు కథ ఏమిటో చెప్పు! నీ అద్దాల్లాంటి చెక్కిళ్ల మీద సగము వికసించిన పువ్వులు అక్కడక్కడ ఉన్నాయి. ఏం జరిగింది. అయ్యవారేదో ప్రేమతో స్నేహపు మాటలు నాలుగు మాట్లాడి ఉంటారు. అంత మాత్రాన ఏం ఉద్రేకం వచ్చిందే? ఆవేశాలతో కూడిన ఆ ఉచ్ఛ్వాసనిశ్శ్వాసాలేమిటే? అసలే నువ్వు అందగత్తెవి. మా వేంకటేశ్వరునితో సుఖాలు అనుభవించిన తర్వాత అద్దం ఎందుకే?

*****

మొలస్కా జాతికి చెందిన ముత్యపు చిప్పలలో సహజ ముత్యాలు తయారవుతాయి. కొన్ని ఇసుక రేణువులు ముత్యపు చిప్పలోకి వచ్చి ఒక చలనం కలిగించిన తర్వాత. ముత్యపు చిప్ప వాటి పైకి ఒక ద్రవ పదార్థాన్ని విడుదల చేస్తుంది. అది గట్టిపడి ఆనక ముత్యంగా మారుతుంది. కాబట్టి ఒక రకంగా చెప్పాలంటే ముత్యం మూసి ఉన్న చిప్పలో తయారయ్యేది కాబట్టి ముత్యానికే ఇంకొక పేరుగా మూసిన ముత్యం అని చమత్కారంగా చెప్పుకోవచ్చు.

మొలస్కా జాతికి చెందిన ముత్యపు చిప్పలలో సహజ ముత్యాలు తయారవుతాయి. కొన్ని ఇసుక రేణువులు ముత్యపు చిప్పలోకి వచ్చి ఒక చలనం కలిగించిన తర్వాత. ముత్యపు చిప్ప వాటి పైకి ఒక ద్రవ పదార్థాన్ని విడుదల చేస్తుంది. అది గట్టిపడి ఆనక ముత్యంగా మారుతుంది. కాబట్టి ఒక రకంగా చెప్పాలంటే ముత్యం మూసి ఉన్న చిప్పలో తయారయ్యేది కాబట్టి ముత్యానికే ఇంకొక పేరుగా మూసిన ముత్యం అని చమత్కారంగా చెప్పుకోవచ్చు.

మూసిన ముత్యమంటే 'తెలిసియూ తెలియనట్లు నటించేవాడు' అనే అర్థముంది. ఏలే అనే పదాన్ని ఊత పదంగా తీసుకొని తెలిసియూ తెలియనట్లు నటించేవారికి మోసాలు, ఆశలు పడే మనస్సుకు స్వేచ్ఛలు – ఒకదానికొకటి చక్కగా సరిపోతాయని ఇలా అన్ని పాదాలకు అర్థాలు సమాలంకారంలో చెప్పుకోవచ్చు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే ఒక మహానుభావుడు వసుచరిత్ర పద్యానికి 70 అర్థాలు చెప్పాట్ట. మూసిన ముత్యాల కీర్తనకు కూడా ఇలా ఆలోచించుకుంటూ పోతే ఎన్నో రకాల అర్థాలొస్తాయి. మహాకవుల భావాలకు ఇక్కడితో విరామం అని చెప్పలేం.

కలయిక అనంతరం తన చిక్కులు పడిన జుట్టుకి కారణమైన ప్రియుడిని అద్దంలోంచి ప్రియురాలు చూస్తోందని ('తల దువ్వుకొంటోందావిడ – అద్దంలోంచి అలవోగ్గా చూస్తూ) ఆధునిక ప్రసిద్ధ కవి స్మైల్ వర్ణించాడు. ప్రణయంలో తన పక్కన ఉన్నవారిని అద్దంలోంచి చూడటంలో ఉన్న రమ్యభావ చిత్రాన్ని కొన్ని వందల యేండ్ల క్రితం "అద్దమేలే తిరువేంకటాద్రీశు గూడి" అంటూ అన్నమయ్య తన కీర్తనలో పొందుపరిచాడు.

మధుర భక్తి మార్గంలో ఈ పాదానికి ఇంకో పార్శ్వం కూడా గమనించవచ్చు. అద్దం మనల్ని మనకి కొత్తగా చూపిస్తుంది. అందం మీద వ్యామోహాన్ని పెంచుతుంది. నలుగురిలోనూ ప్రత్యేకంగా కనబడాలని, నలుగురి కంటే గొప్పగా ఉండాలనే అహంకారాన్ని పెంచుతుంది. ఈ శరీరం నాది. దానిని నలుగురిలో మురిపించాలని, మెరిపించాలని ఆశలు రేపుతుంది. వేంకటేశ్వరుడిని నీ మనస్సన్నిధిలో కలుపుకొన్న తర్వాత ఇంకా ఈ అద్దం – (వ్యామోహం, అహంకారం) ఎందుకు? అని అన్నమయ్య ప్రశ్నతో కూడిన బోధ మనకు చేస్తున్నాడు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే వేంకటేశ్వరుడిలో (పరమాత్మ) కలవాలంటే జీవుడు వ్యామోహాన్ని వదులుకోవాలని అన్నమాచార్యుని ప్రబోధం.

50. రాముడు లోకాభిరాముడు వీడిగో

రాముడు లోకాభిరాముడు వీడిగో
వేమారు మొక్కుచు సేవించరో జనులు

చెలువపు రూపమున జిత కాముడు
మలసీ బిరుదున సమర భీముడు
పొలుపైన సాకేతపుర ధాముడు
యిలలో బ్రజలకెల్లా హిమధాముడు

ఘన కాంతుల నీల మేఘ శ్యాముడు
అనిశము నుతుల సహస్ర నాముడు
కనుపట్టు కపినాయక స్తోముడు
తనునెంచితే దేవతా సార్వభౌముడు

సిరుల మించిన తులసీ దాముడు
కరుణానిధియైన భక్త ప్రేముడు
వురుతర మహిమల నుద్దాముడు
గరిమల శ్రీ వేంకటగిరి గ్రాముడు

భావం :

ఓ జనులారా! ఇదుగో! లోకానికి అభిరాముడు (= ప్రియమైనవాడు) శ్రీరాముడు – వేంకటేశ్వరస్వామి రూపంలో మన ఎదుట ఉన్నాడు. అనేక సార్లు నమస్కరిస్తూ సేవించండి.

శ్రీరాముడు చెలువము (= కాంతి) గల తన రూపంతో మన్మథుని కంటే అందగాడు. విజృంభించు పరాక్రమంతో (= మలసీ బిరుదున) యుద్ధరంగంలో భయంకరమైన వాడు. అందమైన అయోధ్యానగర నివాసి. భూమిలోని ప్రజలందరికీ చల్లని హిమధాముడు (= చంద్రుడు)

దట్టమైన కాంతులు కలిగిన నల్లటి మేఘము వంటి రంగు కలవాడు. ఎప్పుడూ భక్తులు చేసే పొగడ్తల్లో వేయి పేర్లు ఉన్న వాడు. కోతుల గుంపు కలవాడు. (= స్తోముడు). తనను భావించిన దేవతలకు పెద్ద.

సంపదలను మించిన తులసీ దాముడు (= దండ కలవాడు) దయకు నిధియై భక్తుల మీద ప్రేమ కలవాడు. మహిమలతో ఉద్దాముడు (= అధికుడు). గంభీరుడు. గొప్పతనములందు శ్రీ వేంకట పర్వతముపై పెద్ద (గ్రాముడు).

*****

'రాముడు లోకాభిరాముడు' అను ప్రయోగం వాల్మీకిది (2-45). ముచ్చటైన ఈ పదాలను అన్నమయ్య ఈ కీర్తనలో అనుసరించాడు. 'శ్రీరామ జయ రామ జయ జయ రామా' అను మహామంత్రం (13 అక్షరాలు) 13 లక్షలసార్లు జపిస్తే శ్రీరామచంద్రుడు కనబడతాడని, రామదాసుకు రాముడు ఇలాగే కనబడ్డాడని ఒక నమ్మకం. కవి వాడిన వేమారు అనే పదంలో ఈ నామజపం చేయండనే సూచన ఉంది. 'మన్మథుని కంటే కాంతి కలవాడు' అని మిగతా కవులు రాస్తే, అన్నమయ్య 'మన్మథున్ని మించిన కాంతిగలవాడు' అని ఒక మెట్టు పెంచాడు. "శ్రీరాముని నుదుటిమీద కదిలే అందమైన కురులను చూస్తూ విశ్వామిత్రుడు ఎంత పొంగిపోయాడో (అలకలల్లలాడ)" అన్నాడు త్యాగయ్య.

యుద్ధంలో పద్నాలుగు వేలమంది రాక్షసులను 14 బాణాలతో చంపిన మహాభయంకరుడు రాముడు .యుద్ధంలో అతడు మాట్లాడే మాటలు కూడా చాలా వ్యంగ్యంగా, భయంకరంగా ఉంటాయి. ఉదాహరణకు కుంభకర్ణుడితో "రా! కుంభకర్ణా! రా! ఏం విచారించకు. నేను యుద్ధానికి సిద్ధంగా ఉన్నాను. క్షణంలో నిన్ను చావుకు దగ్గరగా చేర్చే రాముడిని నేనే! ఏం బాధపడకు" అన్నాడు. ఒక పక్కేమో "ఏం విచారించకు!" అంటున్నాడు. ఇంకో పక్క "చంపేస్తానంటు"న్నాడు. ఈ రకంగా మాట్లాడటం కూడా భయంకరమే. అందుకే అతడు మాటలలోను, చేతలలోను సమర భీముడు.

భండార్కర్ దృష్టిలో సాకేతమంటే కోసల దేశపు ఇంకో రాజధాని (జియోగ్రాఫికల్ డాటా ఫ్రమ్ బుద్ధిస్ట్ లిటరేచర్ - పే 17). కాని సాకేతమంటే కోసల దేశపు ఏకైక రాజధాని అయోధ్యా పట్టణంగా ప్రసిద్ధి. అయోధ్య అంటే యోధులకు జయించటానికి శక్యం కానిది. అంటే స్వామి జయించుటకు ఆశక్యుడని కవి భావం.

పుట్టింది సూర్య వంశంలోనైనా రామ సూర్యుడని ఎవరూ పిలవరు. 'రామచంద్ర' అని ఆప్యాయంగా పిలుస్తారు. పాలనలో ప్రజలకు రాముడు చల్లని చంద్రుడి లాంటి వాడని అన్నమయ్య వ్యాఖ్యానం.

అందరికీ తెలిసిన 'శుక్లాంబరధరం' శ్లోకంలో రాముని మూల రూపమైన విష్ణుమూర్తి రంగు తెలుపని ఉంది (శశివర్ణం = చంద్రుని వంటి రంగు కలవాడు). కాని

పోతన రాముణ్ని 'నల్లని వాడు' అన్నాడు అసలు రంగు తెలుపే కాని, విష్ణుమూర్తి అనే మేఘం ఎప్పుడూ మన మీద దయ అనే వర్షాన్ని కురిపిస్తోంది కాబట్టి, నల్లగా మనకు కనబడుతుంటుందని అప్పయ్య దీక్షితుల చమత్కారం. ఇదే ధోరణిలో రాముని (విష్ణుమూర్తి) రంగు గొప్ప కాంతులు వెదజల్లే నలుపని కవి చెప్పాడు. స్వామి వారికి వేయి నామాలు (విష్ణు, వేంకటేశ సహస్రనామాలు) ఉన్నాయి. వీటికి సంకేతంగా రాముడికి 'సహస్ర నాముడు' అని అన్నమయ్య చెప్పాడు.

కపి అంటే చలించేది అని అర్థం. కోతులు ఒకచోట కుదురుగా ఉండలేవు. ఇటువంటి కోతుల గుంపులకు నాయకులు సుగ్రీవుడు మొదలైనవారు. వీళ్లందరితో కనిపించేవాడు రాముడని కవి మాట. అంటే స్థిరంగా ఉండని కోతుల చేత స్థిరంగా యుద్ధం చేయించిన ఘన పురుషుడని వ్యంగ్యంగా పొగడ్త. ఇంతగా కోతుల విషయంలో రాముని పొగిడిన అన్నమయ్య "అయ్యా! ఇతరులు చేస్తే పాపం. నువ్వు చేస్తే పుణ్యం. అన్నదమ్ములు కొట్లాడుకుంటుంటే తమ్ముని (సుగ్రీవుని) సమర్థించావు" అని ఇంకొక కీర్తనలో స్వామివారితో కోతుల విషయంలో ఆత్మీయంగా పోట్లాడాడు.

రామ నామమనే మణిదీపాన్ని నాలుక అనే ద్వారపు గడపపై ఉంచితే నీవు కోరి నట్లుగా లోపలికి, వెలుపలికి వెలుగు లభిస్తుందని తులసీదాసు అంటాడు. ఆ వెలుగును వేంకటేశునిలో చూసిన ఆనందంతో అన్నమయ్య – 'అతడు మామూలు వాడు కాదు. దేవతల్లో మొదటి స్థానం అతనికే ఇవ్వాలి. అతడు దేవతా సార్వభౌముడు' అన్నాడు. సిరులను మించిన సిరి వైరాగ్య సంపద. తులసి వైరాగ్యానికి, పవిత్రతకి ప్రతీక. రాముని తులసీ మాలధారణ వెనుక ఈ వైరాగ్య ప్రబోధం ఉందని కవి మాట.

జటాయువుకి రాముడు మోక్షం ప్రసాదించాడు. అనేక సందర్భాల్లో మానవాతీతమైన మహిమలు చూపించాడు కనుక రాముడు అధికుడన్నాడు (ఉద్దాముడు) అన్నమయ్య.

ఆ రాముడిని చూడలేదనే బాధెందుకు? కళ్లెదురుగా ఉన్న వేంకటేశుడే రాముడని, అతనిని సేవించమనే కవి మాటను పాటించి తరిద్దాం.

51. రావే కోడల రట్టడి కోడల

రావే కోడల రట్టడి కోడల
పోవే పోవే అత్తయ్యా పొందులు నీతో జాలును

రంకెలు వేయుచు రాజులెదుట నీవు
కొంకు గొసరు లేని కోడల
పంకజముఖి నీవు పలుదొడ్డవారింట్ల
అంకెలదిరిగేవు అత్తయ్యా

ఈడాడ నలుగురు నేగురు మొగలతో
కూడి సిగ్గులేని కోడల
వాడకు బదుగురి వలపించుకొని నీవు
ఆడాడ దిరిగేవు అత్తయ్యా

బొడ్డున బుట్టిన పూపనికే నిన్ను
గొడ్డేరు తెస్తినే కోడల
గుడ్డము పయినున్న కోనేటి రాయని
నడ్డగించుకొంటివత్తయ్యా

భావం :

లక్ష్మి, సరస్వతులు అత్తాకోడళ్లు. వారి మధ్య జరిగిన సంభాషణని, జానపద శైలిలో అన్నమయ్య రాశాడు.

లక్ష్మి : పెద్దగా ధ్వని (= రట్టడి) చేసే సరస్వతి కోడలా! ఇలా రావే! నీ సంగతి చెబుతా.

సరస్వతి : లక్ష్మి అత్తయ్యా! నీలాంటి వాళ్లను చాలా మందిని చూశానులే! పోపోవమ్మా! సమానమైన స్థాయి ఉన్నవారితో స్నేహాలు చేయాలి! నీతోటి నాకు స్నేహాలు (= పొందులు) చాలు చాలు.

లక్ష్మి: భయం, సందేహం (=కొంకు గొసరు) లేనిదానా! రాజులను, అధికారులను మెప్పించటం కోసం కవిత్వాలతో అరుపులు అరుస్తావే (=రంకెలు వేయుచు) నువ్వు.

సరస్వతి : ఓ పద్మం లాంటి ముఖం కలదానా (= పంకజముఖి)! నీవు మాత్రం తక్కువదానివా! అనేక మంది పెద్ద వాళ్ల ఇండ్లలో (= దొడ్డవారిండ్ల) దగ్గర దగ్గరగా తిరుగుతుంటావు కదా (= అంకెలదిరిగేవు)!

లక్ష్మి : ఓ కోడల! ఎవరికైనా ఒక్క మొగుడు. అవ్వా! నీవు ఇక్కడ, అక్కడ (= ఈడాడ) అనేకమంది మొగుళ్లతో కలిసి ఉంటావు. నువ్వు సిగ్గు లేనిదానివే!

సరస్వతి : అత్తయ్యా! నువ్వు నాలాంటి దానవే! నీకు వాడకు పదిమంది ప్రేమికులు. నీవు వాళ్ల దగ్గరలో (= ఆడాడ) తిరుగుతావు.

లక్ష్మి: మా ఆయన విష్ణువు బొడ్డున బుట్టిన పిల్లవాడు (= పూపనికే) బ్రహ్మ జీవితం బాగుండాలని నిన్ను గుత్తకు తెచ్చాను (= గొడ్డేరు తెస్తినే) పొరపాటయింది కోడల!

సరస్వతి : అత్తయ్యా! నువ్వు చేసిన పని ఏమిటి? కొండ (= గుడ్డము) పైన ఉన్న పుష్కరిణి అధిపతి (= కోనేటి రాయని) వేంకటేశ్వరుని పూర్తిగా నీ వశం చేసుకొన్నావు (= అడ్డగించుకొంటివి) కదే! తల్లీ!

*****

లక్ష్మి ఉన్నచోట సరస్వతి ఉండదని, సరస్వతి ఉన్నచోట లక్ష్మి ఉండదని, దానికి కారణం, వాళ్ళిద్దరూ అత్తాకోడళ్ళు కావటమని జానపదుల తీర్మానం. ఆ జానపదుల ఒరవడిలో వచ్చిన అన్నమయ్య గీతం ఇది.

ఈ కీర్తనలో నిందాస్తుతి ఉంది. పైకి తిడుతున్నట్లు ఉంటుంది. ఆలోచిస్తే పొగడ్త కనిపిస్తుంది. 'ఓ గంగా! పాపాత్ములకు కూడ నువ్వు స్వర్గమిస్తున్నావు. నీకు వివేకమెక్కడుందే!' అని ఒక శ్లోక భావం.

ఈ కీర్తనలోని నిందలలో కూడ ఇటు వంటి పొగడ్తలు ఉన్నాయి.

సరస్వతి ఎవరిని అనుగ్రహిస్తుందో వారికి రచనలో కాని, మాట్లాడటంలో కాని భయ సందేహాలు రానే రావు. భక్తుల లక్షణాన్ని కవి సరస్వతికి ఆపాదించాడు. రంకె అంటే ధ్వని అని ఇంకో అర్థం. ధ్వన్యాలోకం అని ఆనందవర్ధనుడు ఒక గొప్ప పుస్తకం రాశాడు. రచనలో ధ్వని అందరినీ మెప్పిస్తుంది. సరస్వతీదేవి తనను నమ్ముకొన్నవారికి అలా ధ్వనిపూర్వకంగా అందరినీ మెప్పించే రచనారీతులను ప్రసాదిస్తుందని అన్నమయ్య 'రంకెలు వేయుచు' అనే పద బంధంలో ధ్వని పూర్వకంగా చెప్పాడు.

లక్ష్మి గొప్పవాళ్ళ ఇళ్లలో తిరుగుతుందని కవి మాట. గొప్పవాళ్ళు అంటే గుణాలలో పెద్దవాళ్ళు. గుణాలు లేనివారి దగ్గర లక్ష్మి ఉండవచ్చు. కాని అది అశాశ్వతం. వ్యాధి, ప్రమాదం – రూపాల్లో వాళ్ల దగ్గరినుంచి సెలవు తీసుకొంటుంది. లలితాసహస్రనామ ఫలశ్రుతిలో 'చంచలత్వం లేని లక్ష్మి మా ఇంట్లో ఉండుగాక!' అని ఉంది. దీనినే 'వాడకు బదుగురి వలపించుకొని' అనే నిందలో కవి చెప్పాడు.

పుస్తకాన్ని అంకితం తీసుకొన్నవాడిని కృతి భర్త అంటారు. కృతి సరస్వతీరూపం. ఈ ప్రపంచంలో పుస్తకాలను అంకితం తీసుకొనే కృతి 'భర్త'లు అనేకమంది. 'అనేక మంది మొగుళ్లతో కలిపి ఉంటావు' అనే నిందలోని అసలు అర్థం ఇది.

'అవునూ! నువ్వు విద్వాంసుల దగ్గర ఎందుకుండవు?' అని లక్ష్మిని అడిగాడట విష్ణువు. 'అగస్త్యుడు మా నాన్నని (సముద్రాన్ని) తాగాడు. భృగువు నిన్ను తన్నాడు. ప్రతిరోజూ వాళ్లు నా పోటీదారు అయిన సరస్వతిని ఆరాధిస్తుంటారు. అందువల్ల వాళ్ల దగ్గర ఉండను' అని లక్ష్మి జవాబిచ్చిందట. (చాణక్య నీతి) ఇందులో మనం చమత్కారాన్ని మాత్రమే ఆస్వాదించాలి.

'గుడ్డం' అంటే 'చేను' అని శబ్దరత్నాకర అర్థం. అన్నమయ్య గీతంలో ఈ అర్థం పొసగటం లేదు. గుడ్డం అంటే కొండ అని భావార్థంగా మనం గ్రహించాలి.
'బొడ్డు పల్లెను గొడ్డేరి మోసపోతి' అని శ్రీనాథుని చాటువులో 'గొడ్డేరి' ఉంటే ఈ గీతంలో 'గొడ్డేరు' ఉంది రెండింటికి ఒకటే అర్థం.

శ్రీచక్ర పూజలో లక్ష్మిని జ్ఞానశక్తిగా, సరస్వతిని ఇచ్ఛాశక్తిగా వర్ణిస్తారు. సరస్వతి అనే పదానికి అర్థం అన్నింటా ఉండేది. లక్ష్మి అనే పదానికి అర్థం అన్నింటినీ చూసేది (అమరకోశం) ఈ పదాలు వేరు కావు.– అన్నింటా ఉండే – ఆ శక్తులు వేరు కావు. అలాంటప్పుడు వాళ్ళు మాట్లాడే పదాలు ఎందుకు 'వేరుగా' తగాదాపూర్వకంగా ఉంటాయి.!?

అలాంటప్పుడు ఇంత గొప్ప దేవతల మధ్య అన్నమయ్య ఎందుకు విరోధం కల్పిస్తూ పాట రాశాడు? అని ప్రశ్న.జానపదులు స్వామి నామాన్ని, స్వామి శక్తులని (లక్ష్మి, సరస్వతులు) ఏదో రకంగా జపించి, పాడి తరించాలి. అందుకే వాళ్లకు నచ్చిన అత్తాకోడళ్ల వైరాన్ని అన్నమయ్య నిందాస్తుతితో రాశాడన్నది జవాబు.

52. వాడల వాడల వెంట వాడెవో-వాడెవో

వాడల వాడల వెంట వాడెవో – వాడెవో
నీడ నుండి చీరలమ్మే నేత బేహారి

పంచ భూతములనెడి – పలువన్నె నూలు
చంచలపు గంజితోడ చరిచేసి
కొంచెపు కండెల నూలి గుణములనేసి
మంచి మంచి చీరలమ్మే మారు బేహారి

మటుమాయముల దన మగువ పసిడి నీరు
చిటిపొటియలుకల జిలికించగా
కుటిలంపుజేతలు కుచ్చులుగా గట్టి
పటవాళి చీరలమ్మే బలుబేహారి

మచ్చిక జీవులనేటి మైల సంతల లోన
వెచ్చపు కర్మ ధనము విలువ చేసి
పచ్చడాలుగా గుట్టి బలు వేంకటపతి
ఇచ్చకొలదుల నమ్మే ఇంటి బేహారి

భావం :

శ్రీ వేంకటేశ్వరుని అన్నమయ్య ఈ కీర్తనలో చీరలమ్మే నేత వ్యాపారితో పోలుస్తున్నాడు.

అదుగో! చూస్తున్నారా! ప్రతి వీధి వీధిలో తిరుగుతూ, నీడలో చీరలమ్మే నేత వ్యాపారి అదుగో!

ఆ వ్యాపారి భూమి, నీరు అగ్ని, గాలి, ఆకాశం – ఈ అయిదు పంచభూతాలను తన రంగురంగుల నూలుగా చేసుకొన్నాడు. ఆ నూలుని ఒకచోట నిలవకపోవటం అనే గంజితో గట్టిపరుస్తున్నాడు. సత్త్వం. రజస్సు, తమస్సు అనే మూడు గుణాల కండెలతో చక్కటి చీరలు నేసి మారు బేరాలు చేస్తూ అమ్మే వ్యాపారి వాడు.

ఆ వ్యాపారిగారికో భార్య. ఆమె మాయల మరాఠి. అప్పుడప్పుడు కొన్ని చిన్ని

తగాదాలు భర్త గారితో పెట్టుకొంటోంది. అలా అని పనిచేయటం మానటం లేదు. ఆ వ్యాపారి చీరలు నేసేటప్పుడు బంగారు నీరు చిలికిస్తూ, చీరలకు రంగు వేస్తోంది. ఆ వ్యాపారి వంకరగా ఉన్న చేష్టలను చీర కుచ్చులుగా కట్టి నిలువుగా, అడ్డంగా పట్టెలున్న పటవాళి చీరలు అమ్ముతున్నాడు.

ఒక్కోసారి ఆ వ్యాపారి మైల సంతలలో కూర్చుంటాడు. అతని బేరాలకి అలవాటు ఉన్న జీవులు అతనిని వెతుక్కుంటూ ఆ సంతల దగ్గరికి వెళతారు. జీవులు చేసుకొన్న కర్మని ధనంగా స్వీకరించి, చీరలుగా కుట్టి, ఆ ఇంటి బేరగాడు తన ఇష్టమొచ్చినట్టు అమ్ముతున్నాడు.

*****

వేదాంతంలో నాలుగు రకాలైన వస్త్రాల ప్రస్తావన ఉంది.

1. శుభ్ర వస్త్రం : బొమ్మ వేయటానికి పట్టుకొచ్చినది (చిత్తు)

2. ఘటిత వస్త్రం : గుడ్డ గట్టిపడటానికి గంజి పెట్టేది (అంతర్యామి)

3. లాంఛిత వస్త్రం : గంజి పెట్టిన వస్త్రం మీద రంగులు గుర్తుపెట్టడం (సూత్రాత్మ)

4. రంజిత వస్త్రం : గుర్తుల ప్రకారం ఆకృతులకి రంగులు పూయటం (విరాట్)

అన్నమయ్య ఈ వేదాంతాన్ని ప్రజలకి తేలిక భాషలో అర్థం అయ్యేట్టు చెప్పాలనుకొన్నాడు. స్వామిని చీరల వ్యాపారిగా చేశాడు.

స్వామి లేని చోటు అంటూ ఏమీలేదు. అందుకే వాడల వాడల అంటే అన్నిచోట్లా ఉన్నాడన్నాడు. స్వామి మన కళ్లెదురుగా ఉండి, ఈ సృష్టి చేయడు. నీడలో ఉంటాడు. అంటే మరుగున ఉండటం. చీరలమ్మటం, నేయటం అంటే సృష్టి చేయటం అని భావార్థంగా స్వీకరించాలి.

నేత వ్యాపారికి సృష్టి చేయటానికి రంగు రంగుల దారం కావాలి. ఈ సృష్టిలో ప్రతి దాంట్లోను భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం అనే పంచభూతాల ధర్మాలుంటాయి. వీటినే దారాలుగా స్వామి చేసుకొన్నాడని కవి చమత్కరించాడు. పోగులని గట్టిగా బంధిస్తాయి. దారపు కండెలు. సత్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలు జీవులని దేహంలో బంధిస్తాయి. అందుకే త్రిగుణాలను దారపు కండెలుగా కవి పోల్చాడు. దారాలు సరిచేసి అవి గట్టిపడటానికి నేత నేసేవాళ్ళు గంజి పెడతారు. జీవుల మనస్సు ఒకచోట నిలవదు. ఈ చంచల గుణం స్వామి అనే నేతగాడు వేసిన గంజి.

పడుగు అంటే చీర నేతలో నిలువుగా ఉన్న నూలు. పేక అంటే అడ్డంగా ఉన్న నూలు. ఈ రెండు కలిస్తే చీర. పంచభూతాలు, త్రిగుణాలు కలిస్తే సృష్టి.

వస్త్రం ఇతరులు కొనాలంటే రంగుల అద్దకం కావాలి. ఈ సృష్టిలో కూడ మాయ ఉంటుంది. ఈ మాయ రూపిణిని భగవంతుని ఇల్లాలైన లక్ష్మితో పోల్చాడు కవి. ఆ మాయ స్వామి చేసే సృష్టిలో బంగారపు నీరు చిలకరిస్తుందట. అంటే సంపదలు మొదలైన వాటి మీద వ్యామోహాన్ని సృష్టిలో కలుపుతోందని భావం. జీవులకు వ్యామోహం కలిగినందు వల్లే స్వార్థం వస్తోంది. ఇతరులకు దక్కకూడదు.తనకు మాత్రమే ఉండాలనే స్వార్థం జీవుల చేత చేయరాని వంకర పనులు చేయిస్తోంది. ఈ వంకర పనులచే కవి ' కుటిలంపు చేతలు' అన్నాడు. వీటిని కుచ్చులుగా స్వామి కడతాడని కవి అంటున్నాడు. అంటే వారి వారి మంచి పనులకు, వంకర పనులకు తగిన కర్మ శరీరాలను ఇస్తున్నాడని రెండో చరణంలోని విశేషం.

జీవులందరూ ఈ సృష్టికి మచ్చిక అయ్యారు. అంటే వేల జన్మలెత్తటానికి అలవాటు పడ్డారు. ఎప్పుడూ అలవాటు అయినవారి దగ్గర కొంటుంటారు. అది ఈ జీవుల సహజ స్వభావం. ఆ రకంగానే అలవాటుగా దేవుడనే వ్యాపారి దగ్గరికి జీవులు చేరతారు. వాళ్ళు చేసిన కర్మ అనే ధనాన్ని ఆ చీరల వ్యాపారికి అందజేస్తారు. వారిచ్చిన కర్మను అనుసరించి, చీరలు తయారుచేసి, వాళ్ళకు స్వామి అమ్ముతుంటాడు. పుణ్య పాపాలను అనుసరించిన జన్మలు ప్రసాదిస్తుంటాడని మూడో చరణంలోని విశేషం.

స్వామి మారు బేహారి, బలు బేహారి, ఇంటి బేహారి. భక్తుడు ఏది సమర్పిస్తే, దానికి తగినట్లుగా స్వామి అనుగ్రహిస్తాడని మారు బేహారి అన్నాడు. పక్షపాతం లేదు. ద్వేషం లేదు. అందరి యందు సమానమైన బుద్ధి. స్వామికంటే పెద్ద మనిషి, పెద్ద వ్యాపారి ఎవరుంటారు? అందుకే ఆయన బలు (= పెద్ద) వ్యాపారి. ప్రతి జీవి హృదయం ఒక ఇల్లు. ఆ ఇంట్లో నివాసమున్న స్వామిని ఇంటి బేహారి అన్నాడు కవి.

నిర్మలమైన జ్ఞానాసక్తిని కలిగించేది సత్వం. మమకారం కలిగించేది రజోగుణం. అజ్ఞానం, సోమరితనం కలిగించేది తమోగుణం. పరమాత్మ అనుగ్రహం సంపూర్ణంగా పొందాలంటే ఈ మూడు గుణములకు అతీతుడు కావాలంటోంది భగవద్గీత. (14-26) ఆ లెక్కన ఇవి తక్కువయిన గుణములే కాబట్టి, వాటిని కొంచెపు కండెలన్నాడు కవి.

'మాయపు దనుజులవైరి' అనే పాటలో కూడ 'వీడెవో రాముని బంటు' అని కవి ప్రయోగించాడు. 'వీడెవో'కు బదులుగా వాడివో అని, 'వీడెవో'కు బదులుగా 'వీడివో' అని పాఠాంతరాలు ఉన్నాయి. ఇది అన్నమయ్య ప్రత్యేక భాష. చెవులకు వినటానికి హాయిగా ఉంటుందని 'వాడెవో', 'వీడెవో' పదాలను పెద్దలు ఎక్కువ మంది వాడుతున్నారు.

53. వినరో భాగ్యము విష్ణు కథ

వినరో భాగ్యము విష్ణు కథ
వెనుబలమిదివో విష్ణు కథ

ఆది నుండి సంధ్యాది విధులలో
వేదంబయినది విష్ణు కథ
నాదించీనిదె నారదాదులచే
వీదివీధులనే విష్ణు కథ

వదలక వేదవ్యాసులునుడిగిన
విదిత పాపనము విష్ణు కథ
సదనంబైనది సంకీర్తనయై
వెదకిన చోటనే విష్ణు కథ

గొల్లెతలు చల్లగొనకొని చిలుకగ
వెల్లివిరియాయ విష్ణు కథ
యిల్లిదె శ్రీ వేంకటేశ్వరు నామము
వెల్లిగొలిసె నీ విష్ణు కథ

భావం :

భక్తులారా! విష్ణు కథను వినండి. అది మన అదృష్టం. వెన్నెముక ఎంత బలాన్నిస్తుందో, విష్ణు కథ కూడ ఈ జీవితంలో బలహీనతల వైపు వంగిపోని బలాన్ని ఇస్తుంది.

సంధ్యావందనం మొదలైన కార్యక్రమాల్లో ప్రసిద్ధి అయినది. తెలియదగినది (= వేదంబైనది) విష్ణు కథ.

మిగతా గ్రంథాలు ఎన్ని రాసినా, ఆవేదన తగ్గని వేదవ్యాసుడు విష్ణు కథలున్న భాగవతాన్ని వదలకుండా చెప్పాడు (= నుడిగిన). భక్తులారా! మీరు వెదకిన చోట ఒక పీఠంగా, సంకీర్తనగా ఉండేది విష్ణు కథ.

గొల్లభామలు మజ్జిగ చిలుకుతుండగా విష్ణు కథ నాలుగుపక్కలా ఉప్పొంగింది. ఇదుగో (= యిల్లిదె) ఆ విష్ణు కథల్లో చెప్పిన విష్ణువు శ్రీవేంకటేశ్వరుడనే పేరుతో

అవతరించాడు. ఆయన పేరుతో విష్ణు కథ పరంపరంగా తరతరాల నుంచి ఆనందాన్ని ఇస్తోంది (= వెల్లిగొను)

*****

పూర్వం విష్ణువనే పేరు తన చెవుల్లో పడకుండ, చెవులకు గంటలు కట్టుకొన్న ఒక మహానుభావుడు ఉన్నాడు. వాడి పేరు ఘంటాకర్ణుడు. అలా ఘంటాకర్ణులు కావద్దని 'వినరో వినరో' అంటున్నాడు అన్నమయ్య.

'నారాయణ దాసులు' చెప్పగలిగిన రీతిలో చెబితే, విష్ణుమూర్తి గురించిన కథలు ఎప్పటికప్పుడు కొత్త కోణాలను ఆవిష్కరిస్తాయి. విష్ణుమూర్తి కథల్లోని ఆ పారవశ్యాన్ని అనుభవించిన కవి, ఈ గీతంలో పదే పదే విష్ణు కథ, విష్ణు కథ అంటూ ఆనందాన్ని ప్రకటించాడు. విష్ణుమూర్తి మంత్రమైన అష్టాక్షరీ మంత్రంలో (ఓం నమో నారాయణాయ) మొత్తం ఎనిమిది అక్షరాలు. ఈ అన్నమయ్య గీతంలో విష్ణు కథ అని పలికిన మంత్రాక్షర సందర్భాలు మొత్తం ఎనిమిది.

సంధ్యలో దేవునికి చేసే నమస్కార క్రియ సంధ్యావందనం. ఉదయం మధ్యాహ్నం, సాయంత్రం – ఈ సంధ్యావందనాన్ని 'కేశవాయ స్వాహా' అని విష్ణుదేవుని స్మరణతో ప్రారంభమై, 'మనం చేసే అన్ని దేవతల నమస్కారాలు కేశవునికి చెందుతాయి' అనే శ్లోకంతో పూర్తవుతుంది. ఈ సంప్రదాయ విధుల్లో విష్ణు ప్రసక్తి లేకుండా ఉండదు. లోపల, బయట వ్యాపించి ఉన్నవాడు విష్ణువు. ఆయన పేరు అన్ని చోట్ల కవి చెప్పినట్లుగా వేదంబైనది – తెలుస్తూ ఉండేది. కాకపోతే, మన మనస్సును ఆయనకి నైవేద్యం చేస్తే, తెలిసి కూడ తెలియనట్టు ఉండే ఆయన పట్టుబడతాడు.

మనకు దక్కనిది దక్కితే భాగ్యం. మంచిగా దక్కినది మనలని వదిలిపోకుండా కలకాలం ఉండటం కూడా భాగ్యమే.ఇటువంటి భాగ్యం – విష్ణుదేవుని కథలున్న విష్ణుపురాణం, భాగవతం, శ్రీకృష్ణకర్ణామృతం మొదలైన పుస్తకాలు భక్తితో చదివితే వస్తుందని అన్నమయ్య అభయం. వెనుబలం అంటే వెనకాల బలం. అదే వెన్నెముక. వెన్నెముక శరీరాన్ని వంగిపోనీకుండా శరీరాన్ని నిలిపే బలం కలిగి ఉంటుంది. సాధకులకు అది శ్రీచక్ర రహదారి.

ఒక జ్ఞాని తనకు తెలిసిన దానిని ఎవరికీ చెప్పకుండా మరణిస్తే, వాడు బ్రహ్మరాక్షసుడవుతాడని ఆముక్తమాల్యదలోని ఒక విష్ణు కథ చెబుతుంది. ఇతరుల అజ్ఞానాన్ని తొలగించటానికి, విష్ణుదేవుని గొప్పతనాన్ని తెలియజేయటానికి నిరంతరం స్వామిని కీర్తిస్తూ నారదుల వంటి మహాపురుషులు సంచరిస్తూనే ఉంటారు. 'నీవు చెప్పిన

కొలది నశించని వేద నిధివి' అని మాఘకావ్యంలో నారదుడిని పొగుడుతూ కృష్ణుడు అంటాడు (1–28). భాగవతం, రామాయణం అను రెండు మహాగ్రంథాలు పుట్టడానికి కారకుడు నారదుడు. అంత గొప్పవాడయిన నారదునికి భక్తుల్లో ప్రథమ పీఠం వేశాడు అన్నమయ్య.

వేదవ్యాసుడు భారతాన్ని అష్టాదశ పురాణాలను రాసిన తర్వాత కూడ దుఃఖం ఆయనిని వదల్లేదు. వదలకుండా ఉన్న ఆ దుఃఖాన్ని వదిలించుకోవటానికి విష్ణు కథల కిరీటమైన భాగవతాన్ని తలదాల్చి, నేటికీ భక్తులందరూ దానిని తలదాల్చేట్టు చేశాడు. కవి ప్రయోగించిన 'వదలక' అనే పదంలో ఉన్న విశేషం అది. శబ్దం సరిగ్గా అన్నాడా– వ్యాకరణం సరిగ్గా ఉందా– ఇవన్నీ స్వామి పట్టించుకోడు. తన కీర్తనలు మధుర భావాలతో ఉన్న విష్ణు కథల సారాంశాలని, భక్తితో పాడుకోమని కవి (సదనంబైనది సంకీర్తనయై) మనకు ఉపదేశిస్తున్నాడు.

పాలలో నేయిలాగ భగవంతుడు అన్ని చోట్లా వ్యాపించి ఉన్నాడని ఉపనిషత్తు చెబుతోంది. మనసును పాలలా స్వచ్ఛంగా చేసుకో. భగవంతుని భక్తుల సన్నిధిని 'తోడు' చేసుకో. నీ మనస్సు 'పెరుగు' తుంది. 'చల్ల'గా మారుతుంది. విష్ణు కథ అనే కవ్వంతో దానిని మథించు. జ్ఞానమనే వెన్న లభిస్తుంది. వెన్న నేయిగా మారుతుంది. అంటే జ్ఞానం స్వామితో 'నెయ్యం'గా మారుతుంది. చల్లని చిలుకుతుంటే విష్ణు కథ ప్రకాశమవుతుంది అనే మాటలో అంతరార్థం ఇది.

ఎనిమిది రకాల భక్తులున్నారు. దేవుని భక్తులను ప్రేమించేవాడు. దేవుడిని కొలిచేవారిని చూసి సంతోషించేవాడు, భగవంతుణ్ని పూజించేవాడు, ఎటువంటి ఆడంబరాలు లేకుండా దేవుని కొలిచేవాడు, దేవుడి కథలు వినేవాడు, దేవుడు అంటే ఒళ్ళు పులకరించేవాడు, దేవున్ని ఎప్పుడూ స్మరిస్తుండేవాడు, దేవుని వియోగాన్ని భరించలేనివాడు. ఒక భక్తునిలోనే పై లక్షణాలన్నీ ఉండవచ్చు. ఈ వరుసలో దేవుడి కథలు వినే భక్తులకు శ్రవణమనే వారి గొప్ప భక్తి లక్షణానికి – కవి కీర్తనలో పెద్ద పీట వేశాడు.

'ఇల్లిదె' తాళ్లపాక వారి ప్రత్యేకమైన పలుకుబడి. 'హరి నీవు విషయాల జిక్కించితే / ఇల్లిదే నిన్ను దలచి (తాళ్లపాక వారి పలుకుబళ్లు – 98 పే) అని 'ఇల్లిదె'కు సంబంధించిన మరొక అన్నమయ్య ప్రయోగం. ఇక్కడ కూడ 'ఇదుగో'అని ఎదుటివారిని పిలిచే సందర్భంలో వాడిన ప్రయోగంలా 'ఇల్లిదే' అనిపిస్తుంది.

54. విన్నపాలు వినవలె వింత వింతలు

విన్నపాలు వినవలె వింత వింతలు
పన్నగపు దోమ తెర పైకెత్త వేలయ్యా

తెల్లవారె జామెక్కె దేవతలు మునులు
అల్లనల్ల నంతనింతనదివో వారె
చల్లని తమ్మి రేకుల సారస్యపు కన్నులు
మెల్లమెల్లనె విచ్చి మేలుకొన వేలయ్యా

గరుడ కిన్నెర యక్ష కామినులు గములై
విరహపు గీతముల వింత తాళముల
పరిపరి విధముల రాగాల బాడేరు నిన్నదిగో
సిరి మొగము దెరచి చిత్తగించవేలయ్యా

పొంకపు శేషాదులు తుంబురు నారదాదులు
పంకజ భావాదులునీ పాదాల జేరి
అంకెలనున్నారు లేచి అలమేలుమంగను
వేంకటేశుడా రెప్పలు విచ్చి చూచి లేవయ్యా

భావం :

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామిని నిద్రనుండి మేలుకొలుపుతున్నాడు. వేంకటేశ్వరుడా! వింత వింతలైన మా మనవులు వినాలి. శేషుడనెడి దోమ తెరను కొంచెం పైకెత్తవయ్యా! (పైకెత్తు వేళ ఇది)

తెల్లవారు జామయింది. అదిగో! దేవతలు, మునులు వచ్చారు. నీ చల్లని తామరపువ్వు రేకుల వంటి (= తమ్మి రేకుల) సరసపు (= సారస్యపు) కన్నులు మెల్లమెల్లగా విప్పి మేలుకో స్వామీ!

అదిగో! గరుడ కిన్నెర యక్ష జాతులకు సంబంధించిన స్త్రీలు గుంపులు గుంపులుగా (= గములై) అనే రకాల వింత తాళాలతో, (= పాడేటప్పుడు చేతులతో చరిచే చరుపులు) రాగాలతో విరహ గీతాలు పాడుతున్నారు. కాంతిగా ఉండే నీ కళ్ళు (= సిరి మొగము) తెరచి వాటిని వినవయ్యా!

అందంగా, పొందికగా (= పంకజ భవాదులు) నీ పాదాల దగ్గరగా జేరి, సమీపంలో ఉన్నారు (= అంకెలనున్నారు). అదుగో అలమేలుమంగ. నీ కోసం ఎదురు చూస్తోంది. ఒక్కసారి ఆమెను చూడటానికైనా కళ్లు తెరవయ్యా స్వామీ!

*****

'మాకు రకరకాల కోరికలు ఉన్నాయి. అవి వినటానికి లేవవయ్యా స్వామీ' అని అన్నమయ్య కోరటం లేదు. వింత వింతలైన కోరికలు ఉన్నాయంటున్నాడు. తనకి ఉద్యోగం రావాలనుకోవటంలో తప్పులేదు. తనని బాధ పెట్టే అధికారి ఉద్యోగం పోవాలనుకోవటం వింత కోర్కె.

పల్లవిలో ఉన్న వింత పదబంధం 'పన్నగపు దోమ తెర' .ఆదిశేషుడనే పామును దోమ తెరగా కవి భావిస్తున్నాడు. 'ఆదిశేషుడు స్వామివారికి ఆసనం. పాద రక్ష, వస్త్రం, దిండు, గొడుగు' అని యామునాచార్యులవారు స్తోత్ర రత్నాకరంలో భావిస్తే, అన్నమయ్య ఒక అడుగు ముందుకు వేసి ఆయనని దోమ తెర చేశాడు. అంతటితో ఆగలేదు. ఇదే కీర్తనలోని మూడో చరణంలో ఆయనని స్వామివారి పక్కన నిలబెట్టి సేవచేయించాడు. ఆదిశేషుడు లక్ష్మణునిగా స్వామివారికి సేవలు చేశాడు. బలరామునిగా స్వామివారి చేత సేవలు చేయించుకొన్నాడు. పతంజలి మహర్షిగా అవతరించి, వ్యాకరణానికి మహాభాష్యం రాశాడు. భూమిని మోస్తూ ఉంటాడు. ఇలా ఎన్నో అవతారాలెత్తిన ఆదిశేషుడు, స్వామివారి పక్కన ఇంకో అవతారంలో ఉండటంలో ఆశ్చర్యం లేదు.

'స్వామి నిద్రపోతాడా? ఆయనకి సుప్రభాతం ఎందుకు' అనే సందేహం మనలాంటి సామాన్యులకి వస్తుంది. 'సు' అంటే మంచి. 'ప్రభాతం' అంటే వేకువ. ఈ వేకువజామున నిద్ర లేవగానే దేవుణ్ని స్మరిస్తే, అంతా మంచి జరుగుతుందని ఒక రుజువైన నమ్మకం. మన బతుకులో ఎన్నో సౌకర్యాలు ఏర్పాటు చేసిన స్వామిని కృతజ్ఞతతో స్మరించటమే సుప్రభాతం. స్వామిని మేలుకొలుపుతున్నట్లుగా పాడుతూ, ఆ ఉత్తమ గుణాల వైపు మన మనస్సును మళ్లించే ప్రయత్నమే అన్నమయ్య లాంటి కవులు పాడే సుప్రభాతాలు.

తెల్లవారుజామంటే సుమారుగా మూడు నుంచి ఆరు గంటల వరకు ఉండే సమయం. ఈ సమయంలో చీకటి రంగు నలుపు మీద తెలుపు ప్రవహిస్తుంటుంది. (తెల్ల + పారు = తెల్లవారు). తెల్లవారుజాములో నాలుగు నుంచి అయిదు గంటల వరకు ఉండే సమయాన్ని బ్రహ్మ ముహూర్తం అంటారు. దైవ శక్తి అంతటా నిండి ఉండే ఈ సమయంలో చేసే ప్రార్థనలు తప్పకుండా నెరవేరుతాయి. అందుకే కవి తెల్లవారుజామును ప్రత్యేకంగా పేర్కొన్నాడు.

సూర్యుడిని చూస్తే పద్మాలు వికసిస్తాయని ఒక కవి సమయం. 'నీ కనురేకులనే పద్మాలు మూసేయటం తగునా స్వామీ! అదుగో! సూర్యోదయమవుతోంది. నీ కనులనే పద్మాలు వికసించక తప్పదని, అంటే – నువ్వు కళ్లు తెరవక తప్ప'దని కవి చమత్కరించాడు. వాల్మీకి రామాయణంలో దశరథుడు విశ్వామిత్రునితో 'పద్మాల్లాంటి కళ్లున్న మా రాముడిని (రాజీవలోచన), నీతో నిశాచరుల (రాక్షసులు) దగ్గరికి పంపలేనంటాడు. రాత్రుళ్ళు తిరిగే నిశాచరుల దగ్గరికి తీసుకెళితే, మా రాముడి పద్మాల్లాంటి కళ్ళు వాడిపోతాయి. చిన్నపిల్లాడు' అనే భావాన్నంతా 'రాజీవలోచన' అనే పదంలో వాల్మీకి ఇమిడ్చాడు. వాల్మీకి లాంటి అందమైన 'పద్మ ప్రయోగం' అన్నమయ్యది.

అన్నమయ్య అనే కవిలో కొంటెతనం ఉన్నట్లుగా మూడో చరణంలోని మూడు నాలుగు పంక్తులు చదివిన తర్వాత మొదట మనం భ్రమపడతాం. ఆదిశేషుడు, తుంబురుడు మొదలైన వాళ్లంతా నీ పాదాల దగ్గరికి చేరి, తరువాత సమీపంలో ఉన్నారు అన్నాడు. అంతవరకు బాగానే ఉంది. 'నువ్వు రెప్పలు విచ్చి వాళ్లను చూడవయ్యా' అంటే, ఒక పద్ధతిలో ఉంటుంది. కాని, అన్నమయ్య పద్ధతి వేరు. 'నువ్వు రెప్పలు విచ్చి అలమేలు మంగను చూడవయ్యా' అంటున్నాడు. దీని వెనకాల ఒక పరమార్థం ఉంది. ఒక్కసారి తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగ విజయాలు నాటకం గుర్తుకు తెచ్చుకొందాం. కృష్ణుడు నిద్ర లేవగానే అర్జునుడిని ముందుగా పలకరిస్తాడు. ఎందుకంటే అర్జునుడు పాదాల దగ్గర ఉన్నాడు కనుక.

అలమేలుమంగ కూడ పాదాల దగ్గరే ఉంటుంది. అందుకే స్వామి మొదటి చూపు ఆమె వైపు. తుంబురుడు మొదలైన వాళ్లంతా కొద్దిసేపు పాదాల దగ్గర ఉన్నా, మళ్ళీ స్థలం మారారు (అంకెలనున్నారు). కాని లక్ష్మీదేవి స్థానం మారదు. అందుకే ఆవిడకే ప్రథమ తాంబూలం. మన చూపు స్వామి పాదాల వైపు ఉంటే, ఆయన చూపు మన ఉన్నత జీవితం వైపు ఉంటుంది. ఇది చెప్పటానికే అమ్మవైపు రెప్పలు విప్పి చూడమని అయ్యకు కవి సిఫార్సు చేశాడు.

స్వామివారికి ప్రతిరోజూ జరిగే సేవలలో సుప్రభాత సేవ (మేలుకొలుపు) మొదటిది. ఇప్పటికీ అన్నమయ్య వంశానికి చెందిన ఒకరు తంబురా పట్టుకొని, బంగారు వాకిలి దగ్గర మేలుకొలుపు పాడుతుంటారు. అన్నమయ్య మేలుకొలుపు అంటే స్వామికి చాలా ఇష్టం. స్వామికి ఇష్టమైన అన్నమయ్య కీర్తనంటే మనకు చాలా ఇష్టం.

55. వేడుకొందామా

వేడుకొందామా
వేంకటగిరి వేంకటేశ్వరుని

ఆమటి మొక్కుల వాడే ఆదిదేవుడే వాడు
తోమని పళ్యాల వాడే దురిత దూరుడే

వడ్డీకాసుల వాడే వనజనాభుడే పుట్టు
గొడ్డాంద్రకు బిడ్డలిచ్చే గోవిందుడే

ఎలమికోరిన వరాలిచ్చే దేవుడే వాడు
అలమేల్మంగా శ్రీ వేంకటాద్రినాథుడే

భావం :

జానపద శైలిలో ఒకరితో ఒకరు మాట్లాడుకొంటున్నట్లుగా అన్నమయ్య ఈ గీతం రాశాడు.

ఏమే! ఇలా రండి. అయ్యో! నీకేదో కష్టం వచ్చినట్టుంది. ఏం భయపడకు. వేంకట పర్వతం మీద ఉన్న (= వేంకటగిరి) వేంకటేశ్వరుని వేడుకొందాం. అన్ని కష్టాలు తొలగిపోతాయి.

స్వామి ఎటువంటి వాడనుకొన్నావు! 'నా కష్టం ఇదని, తీర్చవయ్యా' అని మొక్కుకొంటే చాలు, ఆ కష్టాన్ని దూరం చేస్తాడు. (= ఆమటి మొక్కులవాడే). వాడు దేవుళ్లలో మొట్టమొదట లెక్కించవలసిన దేవుడు (= ఆది దేవుడే). వాడు తన దగ్గర నివేదనకి ఒకసారి వాడిన ఏ పళ్లాన్నయినా మళ్ళీ తోమివాడతామంటే ఒప్పుకోడు. ఎప్పటికప్పుడు కొత్త పళ్ళెం తేవలసిందే (= తోమని పళ్యాల వాడే). వాడు మన పాపాలన్నీ దూరం చేసే వాడు (= దురిత దూరుడే).

మనమెంత ముడుపు చెల్లిస్తే, దానిని వడ్డీతో సహా తిరిగి మనకు ప్రసాదించేవాడు. (= వడ్డీ కాసులవాడే). వాడి నాభిలో పద్మం ఉందటే (= వనజనాభుడే)! ఏమక్కా! పిల్లలు లేరని బాధపడద్దు. ఇక ఏ రకంగాను పిల్లలు పుట్టరని తీర్మానించిన వాళ్లకు కూడ (= పుట్టు గొడ్డాంద్రకు) బిడ్డలిచ్చే గోవిందుడే వాడు. నువ్వొక్కసారి స్వామికి మొక్కుకో! తప్పనిసరిగా నీకు పిల్లలు కలుగుతారు.

ప్రేమతో (= ఎలమి) కోరిన వరాలు ఇచ్చే దేవుడే వాడు. శ్రీ వేంకటేశ్వరుడు ఎవడనుకొంటున్నావు. మన చల్లని తల్లి అలమేల్మంగ లేదూ! ఆమెకి భర్త.

*****

ఈ 'వేడుకొందామా' కీర్తన తాళ్లపాక వంశానికి చెందిన శేషాచార్యులవారి రాత ప్రతిలో ఉన్న ప్రసిద్ధమైన అన్నమయ్య కీర్తన. ఇంకా ముద్రితం కాలేదు. సుమారు 200కు పైగా ఉన్న ఈ రాత ప్రతిలోని ఇటువంటి అందమైన కీర్తనలు, త్వరలో ముద్రణకు నోచుకోవాలని అన్నమయ్య ఆరాధకులు అందరూ తిరుమల తిరుపతి దేవస్థానం వారిని వేడుకొంటున్నారు.

దమ్మిడీలు, కాసులు – ఇదివరకటి రోజుల్లో వాడే నగదుకు సంబంధించిన పదాలు. దమ్మిడీలు ఇప్పుడు వాడటం లేదు కాని, దానికి సంబంధించిన అందమైన జాతీయం (=దమ్మిడీకి కొరగావు) మన తెలుగులో నిల్చిపోయింది. అయిదు కాసుల నాణెం దమ్మిడి. కాసు అంటే దమ్మిడీలో ఐదవ వంతు.

'వడ్డీకాసులవాడు' అను పేరు వెనక ఒక చిన్న కథ ఉంది. స్వామివారు పద్మావతి దేవిని పెండ్లి చేసుకొనే సమయంలో, పెండ్లి ఖర్చుల కోసమని కుబేరుడి దగ్గర అప్పు తీసుకొన్నాడట. 'కోరికలు నెరవేరిన నా భక్తులు, నా దర్శనానికి వచ్చినప్పుడు, హుండీలో వేసేవన్నీ నువ్వు వడ్డీగా తీసుకోవయ్యా!' అని స్వామి కుబేరుడికి హామీ ఇచ్చాడట. అదుగో – అప్పటి నుంచి స్వామి వారికి 'వడ్డీకాసులవాడు' అని పేరు వచ్చింది.

స్వామివారికి 'గోవిందా' ఇష్టమైన పదం. ఇది కృష్ణావతారాన్ని, వరాహావతారాన్ని సూచించే పదం. అందుకే అన్నమయ్య గోవిందున్ని ఈ గీతంలో స్మరించాడు.

'వేడుకొందామా' అంటే శరణు వేడటం. ఈ శరణం చాలా నమ్మకంతో ఉండాలి. ఒక పెద్దాయన స్వామి దర్శనం కోసం కొండ ఎక్కి తిరుమల వెళుతుంటే, దారిలో పాము కరిచింది. ఆయన శిష్యులందరూ ఆందోళన పడుతున్నారు. 'ఒకవేళ నేను ఈ పాము విషం వల్ల మరణిస్తే విరజానదిలో స్నానం చేసి, హాయిగా వైకుంఠం చేరి స్వామిని అక్కడ సేవించుకొంటాను. ఒకవేళ ఇంకా నాకు బతకాలని రాసిపెట్టి ఉంటే, ఈ పాము విషం నామీద పనిచేయదు. మీతో పాటే తిరుమలకి వచ్చి పుష్కరిణిలో స్నానం చేసి, శ్రీ వేంకటేశ్వరున్ని సేవించుకొంటాను. ఏదయినా రెండు చోట్లా స్వామిని సేవించుకొంటాను. నాకు ఏది జరిగినా ఆనందమే' అని ఆ పెద్దాయన అన్నాడు. నిజమైన శరణాగతి – వేడుకోవటమంటే ఇది.

అలమేలుమంగ, పద్మావతి, లక్ష్మి, వ్యూహలక్ష్మి. కరవీర లక్ష్మి – ఇలా రకరకాల

పేర్లు వింటుంటాం. స్వామివారి వక్షస్థలంలో ఉండే లక్ష్మిని వ్యూహలక్ష్మి అంటారు. భృగుమహర్షి విష్ణు వక్షస్థలాన్ని తన్నినప్పుడు, అలిగిన లక్ష్మి కొల్హాపురం చేరి కరవీర లక్ష్మి అయింది. తొలి జన్మలో వేదవతిగా ఉండి, మరు జన్మలో ఆకాశరాజు కూతురిగా జన్మించి, స్వామిని వివాహమాడిన లక్ష్మిని పద్మావతి అంటారు. ఈమె పద్మంపై ఉన్న దేవి కాబట్టి అలరుమేల్ మంగ – అలమేలుమంగ అను పేరుతో పిలువబడి, తిరుచానూరులో కొలువబడుతోంది. ఈ లక్ష్ములందరూ వేరు వేరు కారు. ఒకరే.

దురితం అంటే ఇతరులు నిందించే ప్రవర్తన. పాపానికి ఉన్న రకరకాల పేర్లలో దురితం కూడా ఒకటి. పాపాలను నాశనం చేసేవాడి కంటే ఆ పాపాలవైపు పోనీకుండ మన మనస్సును వాటికి దూరంగా ఉంచేవాడు ఇంకా గొప్పవాడు. వేంకటేశ్వరుడు అటువంటి పాపదూరుడు అని అన్నమయ్య కీర్తిస్తున్నాడు.పాపాలు మన వెంట్రుకలను ఆశ్రయించుకొని ఉంటాయి. మన కేశాలను గ్రహించి, మన నుండి పాపాలను స్వామి దూరం చేస్తుంటాడు.

'నువ్వు స్వామిని గురించి ఎంత మననం చేసినా ఆయన లభించడు. ఎంతగా విన్నా ఆయన నీకు దొరకడు. ఆ దేవునికి ఎవడి మీద ఇష్టం ఉందో వాడినే తన దగ్గరకు చేర్చుకొంటాడు' అని కఠోపనిషత్‌లో ఒక మంత్రం. మరి స్వామికి మన మీద ఇష్టం ఎలా వస్తుంది. అంటే ప్రేమ ద్వారా అది సాధ్యమని పెద్దలు చెబుతున్నారు.

'అలమేల్మంగా శ్రీ వేంకటాద్రి నాథుడే' అనే వాక్యాన్ని అలమేల్మంగా నాథుడు (అలమేలుమంగకు భర్త), శ్రీ వేంకటాద్రినాథుడు (వేంకట పర్వతానికి ప్రభువు) అని మనం విడగొట్టుకొని చదువుకోవాలి. అన్నమయ్య భాషలో ఇలాంటి సొగసులు ఉంటాయి. వేలాదిగా ఉన్న అన్నమయ్య కీర్తనలన్నీ అర్థ తాత్పర్యాలతో వెలుగులోకి రావాలని మనం కూడ స్వామిని 'వేడుకొందామా!'

56. శరణు శరణు సురేంద్ర సన్నుత

శరణు శరణు సురేంద్ర సన్నుత
శరణు శ్రీసతి వల్లభా
శరణు రాక్షస గర్వ సంహర
శరణు వేంకట నాయకా

కమలధరుడును కమలమిత్రుడు
కమలశత్రుడు పుత్రుడు
క్రమముతో మీ కొలుపుకిప్పుడు కాచినారెచ్చరికయా

అనిమిషేంద్రులు
మునులుదిక్పతు లమర కిన్నర సిద్ధులు
ఘనతతో రంభాది కాంతలు కాచినారెచ్చరికయా

ఎన్నగల బ్రహ్లాద ముఖ్యులు
నిన్ను గొలువగ వచ్చిరి
విన్నపము వినవయ్య తిరుపతి వేంకటాచల నాయకా

భావం :

భజన పద్ధతిలో సాగిన అన్నమయ్య ప్రసిద్ధమైన కీర్తన ఇది.

ఓ వేంకటేశ్వర స్వామీ! దేవేంద్రుని చేత (= సురేంద్ర), పొగడ్తలందుకొనేవాడా (= సన్నుత)! లక్ష్మీదేవికి ఇష్టమైనవాడా (= సతి వల్లభా)! రాక్షసుల గర్వాలను పోగొట్టినవాడా (= సంహర)! నిన్ను శరణు కోరుచున్నాను.

పద్మాన్ని ధరించిన బ్రహ్మ (పద్మంలోంచి పుట్టినవాడని భావం), పద్మాన్ని వికసింపజేసి దానికి మిత్రుడైన సూర్యుడు, పద్మాన్ని ముడుచుకుపోయేటట్టు చేసిన చంద్రుడు, కుమారస్వామి (= పుత్రుడు) క్రమంగా నీ సేవ చేయటానికి ఏకాగ్రతతో ఉన్నారు. వాళ్లలాగే నిన్ను శరణు కోరుతున్న నన్ను రక్షించు.

రెప్పలు పడని కన్నులు గల దేవతా శ్రేష్ఠులు (= అనిమిషేంద్రులు), మునులు, ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్ఋతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశానుడు అనే ఎనిమిది మంది దిక్పాలకులు, దేవతలు, గుర్రపు ముఖం కలిగి మనుష్య ఆకారం కలిగిన కిన్నరులు, అణిమ మొదలైన ఎనిమిది రకాల సిద్ధులు కలిగిన సిద్ధ పురుషులు, రంభ మొదలైన అందమైన అప్సరసలు నీ సేవ చేయటానికి ఏకాగ్రతతో కాచుకొని ఉన్నారు.

పొగిడే (= ఎన్నగల) ప్రహ్లాదుడు మొదలైన భక్తాగ్రేసరులు నిన్ను కొలవటానికి వచ్చారు. వేంకటాద్రి పర్వతం మీద ఉన్న వేంకటేశ్వరుడా! మా అందరి మనవి (= విన్నపము) వినవయ్యా! విని రక్షించవయ్యా!

*****

ఇల్లు ,రక్షించేవాడు రెండింటికి శరణమని పేరుంది. ఎండ, చలి మొదలైన వాటి నుంచి ఇల్లు రక్షిస్తుంది. రక్షకుడు వేంకటేశ్వరుడు కూడ అనేక కష్టాల నుంచి మనల్ని రక్షిస్తాడు.

వైష్ణవం శరణాగతికి పెద్ద పీట వేస్తుంది. రక్షించమని కోరటం శరణు కోరటం. ఇది ఆరు రకాలని పెద్దలు చెబుతారు.

1. అనుకూల్య సంకల్పం : దేవుడి విషయాలలో మాత్రమే శ్రద్ధ కలిగి ఉండటం.
2. ప్రాతికూల్య వర్జనం : దేవుడికి సంబంధించని విషయాలను వదిలివేయటం.
3. విశ్వాసం : దేవుడు రక్షిస్తాడనే నమ్మకం
4. గోప్తృత్వ వరణం : ఇంకెవ్వరినీ నమ్మకుండా దేవుడిని మాత్రమే రక్షకుడిగా ఎంచుకోవటం.
5. ఆత్మ నిక్షేపం : తనకున్న బరువంతా స్వామికే సమర్పించటం.
6. కార్పణ్యం : దీనుడిలాగా మారి 'నాకు నువ్వే దిక్కని స్వామికి మొర పెట్టుకోవటం'

అన్నమయ్య 'ఎన్నగల' అనే విశేషణాన్ని ప్రహ్లాదునికి ప్రయోగించాడు. కీర్తనలో పేర్కొన్న మిగతా వారికంటే స్వామిని త్రికరణ శుద్ధిగా నమ్మినవాడు ప్రహ్లాదుడు. పైన మనం పేర్కొన్న ఆరు శరణాగతుని లక్షణాలు సంపూర్ణంగా కలిగినవాడు ప్రహ్లాదుడు.

హిరణ్యకశివుని చంపిన తర్వాత నరసింహుడు తీవ్రమైన ఉగ్రరూపంతో ఉన్నాడు. ఆయన దగ్గరికి వెళ్లటానికి లక్ష్మితో సహా అందరూ సందేహపడుతున్నారు. అప్పుడు బ్రహ్మదేవుడు ప్రహ్లాదునికి స్వామి కోపాన్ని తగ్గించే భారం పెట్టాడు. ప్రహ్లాదుడు స్వామి దగ్గరకు వెళ్ళి సాష్టాంగదండ ప్రణామం చేశాడు. స్వామి మనస్సులో కరుణారసం ఉప్పొంగి

తన చేతితో ప్రహ్లాదుని తల నిమిరాడు. నిండు మనసుతో శరణుకోరినవారికి స్వామి అలా – తప్పకుండా దయతో అనుగ్రహిస్తాడు. అందుకే శరణాగతులందరిలోను పేర్కొనదగినవాడు, అనుసరించ తగినవాడని మనందరికి తెలియజేస్తూ అన్నమయ్య ప్రహ్లాదుని 'ఎన్నదగిన' వానిగా పేర్కొన్నాడు.

మనస్సుకు సంతోషం కలిగించేవాడు వల్లభుడు. స్వామిని 'శ్రీసతి వల్లభా' అని అన్నమయ్య పేర్కొనటంలో ఒక అంతరార్థముంది. ఇతరమైన వాటి నుంచి మనస్సును మరల్చి స్వామివారి మీదే ప్రేమ కలిగి ఉంటే దానిని అనన్య ప్రేమ అంటారు. ఇది అమృత స్వరూపమని నారద భక్తి సూత్రాల్లో ఉంది. దేవునికి, భక్తునికి మధ్య దూరాన్ని ప్రేమ తగ్గిస్తుంది. లక్ష్మీదేవి' స్వామిని ప్రేమించినట్లుగా, జీవుడు స్వామిని శరణు కోరుతూ అంతలా ప్రేమించాలని అన్నమయ్య 'శ్రీసతి వల్లభా' అన్నాడు.

రామాయణంలోని ఏడు కాండలను ఏడు కొండలతో శ్రీ భాష్యం అప్పలాచార్యులవారు పోల్చారు. అందులో వేంకటాచలాన్ని యుద్ధ కాండతో పోల్చారు. రామాయణంలోని యుద్ధ కాండలో పాపాత్ములు నశించి, పుణ్యాత్ములు మిగిలారు. వేం అంటే పాపం. కట అంటే పోగొట్టేది. వేంకటాచలాన్ని స్మరిస్తే పాపాలన్నీ నశించిపోతాయి. అందుకే తాను రాసిన వేలాది కీర్తనల్లో అన్నమయ్య వేంకటాచలాన్ని పదే పదే స్మరించాడు.

పురందర దాసు కీర్తన 'శరణు శరణు సురేంద్ర వందిత' అన్నమయ్య కీర్తన రూపంలో సాగుతుంది. పురందర దాసు అన్నమయ్య కీర్తనను అనుసరించి రాశారని వేటూరి ప్రభాకరశాస్త్రి అభిప్రాయం (అ.చ.పీఠిక 63 పే.)

ఎచ్చరిక అంటే ఏకాగ్రత (ఆం.ప.కో. 38 పే.) నేను తెలుసుకోవలసినది ఒకటే అని నమ్ముతూ, దానిమీద దృష్టి పెట్టటం ఏకాగ్రత. 'నీవే తప్ప ఇతఃపరంబెరుంగ' అనే గజేంద్రుని ఏకాగ్రత శరణు కోరటంలో ప్రధాన పాత్ర వహిస్తుంది.

'స్వామీ! ఈ సంసారం బరువు బాధ్యతలు మోయలేకపోతున్నాను. ఒక పక్క ఈ బరువు మోస్తూ దైవాన్ని స్మరించుకోలేకపోతున్నాను' అని ఒక భక్తుడు రమణ మహర్షి దగ్గర బాధపడితే ఆయన నవ్వుతూ, 'నువ్వు రైలులో ప్రయాణం చేస్తున్నప్పుడు, నీ బరువును నీ నెత్తిమీద పెట్టుకోవు కదా! నిన్ను, నీ బరువును రెండింటిని రైలు మోస్తుంది. అలాగే అన్నింటిని స్వామికి సమర్పించు' అన్నారట. ఈ భావనతోనే జీవితంలో మనం ప్రయాణం చేయాలి. అన్నమయ్య ఈ కీర్తనలో పేర్కొన్న' 'ఎచ్చరిక'లో మనందరికి ఈ హెచ్చరిక ఉంది.

57. శిరుత నవ్వుల వాడు

శిరుత నవ్వుల వాడు శిన్నెకా వీడు
వెరపెరగడు సూడవే సిన్నెకా

పొలసు మేనివాడు బోర వీపు వాడు
సెలసు మోర వాడు సిన్నెకా
గొలసుల వంకల కోరలతో బూమి
వెలసినాడు సూడవే సిన్నెకా

మేటి కురుచ వాడు మెడమీది గొడ్డలి
సీటకాలవాడు సిన్నెకా
ఆటదాని బాసి అడవిలో రాకాశి
వేటలాడి సూడవే సిన్నెకా

బింకపు మోతల పిల్ల గోవి వాడు
సింక సూపుల వాడు సిన్నెకా
కొంకక కలికి యై కొసరి కూడె నన్ను
వేంకటేశుడు సూడవే సిన్నెకా

భావం :

చిన్నక్కా! చూడవే! వీడు (=వేంకటేశుడు) చిరు నవ్వుల వాడు. భయమనేది ఎరగడు. మత్స్యావతారంలో పొలసు (= చేపమీది పొట్టు) శరీరము మీద ఉన్నవాడు. కూర్మావతారంలో మందర పర్వతానికి ఆధారమైన బోర (= వీపు) కలవాడు. వరాహావతారంలో సెలసు(= ఒక చెట్టు) వంటి ముట్టె కలవాడు. నరసింహ అవతారంలో గొలుసుల్లా వంకరలైన కోరలతో ఈ భూమిలో జన్మించాడు.

ఓ చిన్నక్కా! ఈ వేంకటేశుడు వామనావతారంలో సమర్థుడైన పొట్టివాడు. పరశురామావతారంలో రాజుల మెడమీద గొడ్డలి లాంటివాడు. బలరామావతారంలో సీటకాలవాడు (= నాగలి కలవాడు). రామావతారంలో ఆటదాని బాసి (= సీతకు దూరమై) రాక్షసుల వేటలతో విహారాలు చేశాడు.

ఓ చిన్నక్కా! వీడు అందమైన జింక వంటి చూపులు కల కృష్ణావతారంలో బింకపు

మోతలు (= అందమైన చప్పుళ్ళు) వచ్చే పిల్లన గ్రోవి కలవాడు. కల్కి అవతారంలో అసలు ఏ మాత్రం భయపడని వాడు. వీడు కోరి కోరి నన్ను కలిశాడు.

*****

చిరునవ్వన్నా – చిరుత నవ్వన్నా ఒకటే. స్వామిని చి (శి)రుత నవ్వులవాడు అన్నాడు అన్నమయ్య. చిరుత నవ్వు అని భీమఖండంలోను, రంగనాథ రామాయణంలోను ప్రయోగాలుండగా అన్నమయ్య 'శిరుత నవ్వు' అని ప్రయోగించాడు.

మమకారమే తమ రూపంగా మార్చుకొన్న జానపదుల పిలుపుల్లోని 'చిన్నక్కా' పిలుపును – వాళ్లలో కలిసిమెలిసి తిరిగిన అన్నమయ్య తన పాటలో సంబోధనగా మార్చాడు. భాషలో మార్పు సహజం కనుక చిన్నక్కా – శిన్నెక్కా – సిన్నెకాగా – మారి ఉండవచ్చు. చిన్నెక్కా అంటే వగలాడి అని ఇంకొక అర్థం చెప్పుకోవచ్చేమో కాని దాని కంటే 'చిన్నక్కా' అంటేనే బాగుంటుంది.

వాడు 'బోర (రొమ్ము) విరుచుకొన్నాడు' అని వ్యవహారం ఉంది. కాని ఈ కీర్తనలో 'బోర వీపు' అంటే సందర్భానుసారంగా విశాలమైన వీపు అనే అర్థం చెప్పుకోవాలి. దేవతలు, రాక్షసులు అమృతం కోసం పాలసముద్రాన్ని మధించే సందర్భంలో మందర పర్వతాన్ని మోయటానికి పెద్ద వీపు కలిగిన తాబేలు అవతారం వచ్చింది.

నరసింహస్వామి కోరలు 'శరత్కాలంలో మేఘాల మధ్య మెరిసే మెరుపు తీగల్లాగా ఉన్నా'యని పోతన భావిస్తే నరసింహస్వామి పళ్ళు 'వంకరలు తిరిగిన గొలుసుల్లా ఉన్నా'యని అన్నమయ్య భయంకరత్వాన్ని పెంచాడు.

వామనుడిని వర్ణిస్తూ, 'పొట్టివాడు, గట్టి వాడు' అనే రెండు పదాలను కలిపాడు కవి. స్వామివారు పొట్టివాడిగా జన్మించటానికి ప్రత్యేకమైన కారణముందా అని ఆలోచిస్తే రెండు కారణాలు తోస్తాయి. 1 దశావతారాల్లో మొట్టమొదటి మానవుని అవతారం వామనుడు. అందుకే పరిణామ క్రమంలో పొట్టితనం 2. ఒకరి కింద చేయి చాచేటప్పుడు ఎంత పెద్దవాడైనా చిన్నవాడవుతాడు. లోకానికి ఈ సత్యాన్ని నేర్పటానికి పొట్టివానిగా స్వామి మారాడు.

పరశురాముడు గొడ్డలి ధరిస్తాడు. అది చెప్పటం లేదు అన్నమయ్య. భూలోకంలోని రాజుల 'మెడమీద గొడ్డలి'గా పరశురాముడిని వర్ణిస్తున్నాడు. 'పక్కలో బల్లెం'లా, 'మెడమీద గొడ్డలి'ని అందంగా కవి సృష్టించాడు. పరశువు అంటే శత్రువులను హింసించునది (గొడ్డలి). పరశువును ధరించిన పరశురాముడు శత్రువులను హింసించే కార్యక్రమం చేశాడు. ఇలా వ్యక్తికీ ఆయుధానికీ జోడీ కుదిరిన సందర్భాలు తక్కువ.

దుర్యోధనుడి కూతురు లక్షణని యాదవుడైన సాంబుడు ప్రేమించాడు. ప్రేమికులిద్దరూ పారిపోతుంటే కౌరవులు బంధించారు. ఆ సమయంలో బలరామునికి కోపం వచ్చి తన ఆయుధమైన నాగలిని పైకెత్తి కౌరవుల రాజధాని హస్తినాపురపు చిట్ట చివరి భాగంలో చొప్పించాడు. ఆ పట్టణాన్ని మొత్తం పెకలించి యమునలో కలపబోతుంటే–అందరూ వచ్చి శరణు వేడారు. బలరాముడు చేస్తున్న పని ఆపాడు. ఇటువంటి అద్భుతాలు చేసిన బలరాముడి నాగలికి ఇంకొకపేరు సీకరం. సీకరం కలవాడు సీకరాల వాడు. ఈ 'సీకరాల వాడు' కాలక్రమేణా 'సీటకాలవాడు' అయి ఉండవచ్చు. నాగలితో దున్నేటప్పుడు భూమి మీద ఏర్పడే గీత సీతకం. ఈ సీతకం – సీటకంగా మారి – బలరాముడు సీటకాల వాడయ్యాడని శోభారాజుగారి అభిప్రాయం.

అందంగా అటు ఇటు కదిలే జింక చూపులను ఆడవాళ్ళ చూపులతో మన పాతతరం కవులందరూ పోల్చారు. అందమైన మగాడి చూపులతో జింక చూపులను అన్నమయ్య పోల్చాడు. ఇది అరుదుగా కనిపించే ప్రయోగం.

ఈ కీర్తనలో స్వామిని నాయిక – ఎత్తి పొడుస్తూ – ఒక ఆట ఆడించింది. 'ఆయన గారి ఒళ్లంతా పొట్టు. వీపు మరీ వెడల్పు. ఇక ముఖం – ఆ సెలసు చెట్టులా పొడుగు. పోనీ దంత సౌభాగ్యం చూద్దామా అంటే ఆ పళ్ళు గొలుసుల లెక్కన ఉన్నాయి. ఇక ఎత్తు చూద్దామా అంటే పొట్టి. ఆ మెడమీద షోగ్గా కండువా వేసుకోకుండా ఒక గొడ్డలి. చేతిలో పువ్వులాంటిది పట్టుకోకుండా నాగలి. జింకలాగా కంగారు పడే కళ్ళు. అయినా అదేమిటో స్వామిని చూట్టంతోటే అందాల నైవేద్యాలు కొసరి కొసరి వడ్డించాను" ఈ నాయిక తిట్లలో ప్రేమ జిలేబీలు ఉన్నాయని మాటలు పడేవాడికి తెలుసు. వినేవారికి తెలుసు.

తెలుగు భాషలోని జీవనాడిని ఆవిష్కరించిన అన్నమయ్యకు 'దండమయ్యా' అనకుండా ఉండలేం.

58. సకల హేసఖి జానామి తత్

సకలం హేసఖి జానామి తత్
ప్రకట విలాసమ్ పరమం దధసే

అలిక మృగమదమయ మషీకలనో
జ్జ్వలతాం హేసఖి జానామి
లలితం తవ పల్లవిత మనసి ని
శ్చల తర మేఘ శ్యామం దధసే

చారు కపోల స్థల కరాంచిత వి
చారం హేసఖి జానామి
నారాయణమహినాయక శయనం
శ్రీరమణం తవ చిత్తే దధసే

ఘనకుచ శైలాగ్ర స్థిత విధుమణి
జననం హేసఖి జానామి
కనదురసా వేంకటగిరిపతే
ర్వినుతభోగ సుఖ విభవం దధసే

భావం :

ప్రియునితో క్రీడించి అలసిన ఒక నాయికను వేరొక చెలికత్తె మాటలతో ఆటపట్టిస్తున్నది.

ఓ స్నేహితులారా! అంతా నాకు తెలుసులేవే! ఆ ప్రకటించిన విలాసాలతో ప్రధానమైనవాడిని నువ్వు ధరిస్తున్నావు. నీ నుదుటిమీద కస్తూరి నల్లగా మెరిసేట్టు ఎందుకు పెట్టావో నాకు తెలుసులేవే! నీ మనస్సులో నల్లని మేఘమువంటి రంగుకల వేంకటేశ్వరుడు వ్యాపించి చలించక ఉన్నాడని చెప్పటానికి నీ నుదుటి మీద కస్తూరి నల్లగా మెరిసేట్టు ధరిస్తున్నావు.

అందమైన నీ చెక్కిలిమీద చేయెందుకు పెట్టావో నాకు తెలుసులేవే! ఆదిశేషుడనే పాన్పుమీద చెక్కిలిపై చేతిని ఉంచి పడుకొన్న – శ్రీలక్ష్మీదేవికి ఇష్టుడైన నారాయణుని – నీ మనసులో తలుస్తున్నదానికి గుర్తుగా ఆ చెక్కిట చేతి ముద్రను ధరిస్తున్నావు.

ఉన్నతమైన నీ స్తనపర్వతాలపైన ఉన్న చంద్రుడనే మణిపుట్టుకలు ఎందుకో నాకు తెలుసులేవే! ప్రకాశించు వక్షస్థలంతో వేంకటేశ్వరుని యొక్క సంభోగ సుఖ వైభవానికి గుర్తుగా చంద్రాకారంలో ఉన్న నఖక్షతాలు ధరిస్తున్నావు.

*****

నాయిక కళ్ళు ఇంకా మీదిమీదికి వ్యాపిస్తున్నాయేమోనని మన్మథుడికి బెంగ వచ్చిందట. (కళ్ళు విశాలంగా ఉన్నాయని చమత్కారం)అందుకని కళ్లు ఇంకా వ్యాపించకూడదని ఒక అడ్డుకట్ట పెట్టాలనుకున్నాడట. చెక్కిలి మీదికి చెమటతో జారిన కస్తూరి బొట్టు అదేనని పెద్దన్న భావన. (మను 2-32) పెద్దన్న అలా కస్తూరిని అడ్డుకట్ట చేస్తే అన్నమయ్య కస్తూరిని ఏకంగా స్వామివారి గుర్తుగా ఈ కీర్తనలో మార్చాడు.
"రాధికా కృష్ణా రాధికా" అను అష్టపదిలో జయదేవుడు "త్యజతి న పాణితలేన కపోలం" (రాధ తన చెక్కిలి మీద చేర్చిన చేయి ఎంతసేపటికి తీయటం లేదు) అన్నాడు. అన్నమయ్య కూడా జయదేవుని ప్రభావంతో "చారు కపోల స్థలకరాంచిత విచారం" (చెక్కిట చేతి ముద్ర ఉంచి విచారం చెందుట) అన్నాడు.

ప్రియుని చూసిన వేళ నాయికకు ముఖంలోను, చూపుల్లోను కలిగే అందమైన మార్పులను విలాసమంటారు. అన్నమయ్య వర్ణించిన ఈ కీర్తనలో నాయిక దగ్గర ప్రియుడు లేదు. అయినా "నీ ముఖంలో విలాసాల సంగతి నాకు తెలుసులేవే!" అని సఖి ఆట పట్టిస్తోంది. నాయకుడు దగ్గర లేకపోయినా అతను ఎదురుగా ఉన్నట్లు భావించుకొని నాయిక పరవశిస్తోందనే మనోహరమైన వ్యంగ్యభావాన్ని అన్నమయ్య ఇక్కడ చెప్పాడు.

సీతను చూశానని హనుమంతుడు చెప్పిన వెంటనే చలికాలంలో కోతులు ఆయన మీద కోపగించుకున్నాయని ఒక కవి రాశాడు. మంచి వార్తే కదా ఆయన చెప్పింది. కోపమెందుకని మనకు అనిపిస్తుంది. సీత కనబడనంతవరకు రాముడు విరహంలో ఉన్నాడు. ఆ విరహపు వేడిలో కొండ గుహలన్నీ వేడెక్కి ఉండటం వల్ల కోతులకు వెచ్చగా అనిపించి హాయిగా ఉన్నాయి. ఎప్పుడయితే హనుమంతుడు సీతను చూశానని చెప్పాడో రాములవారి విరహం తగ్గింది. కొండగుహలలో వేడి తగ్గింది. అందుకని వెచ్చదనం కోల్పోయిన కోతులు హనుమంతుడిమీద కోపగించుకొన్నాయని భావం. ఇటువంటి మనోహరమైన వ్యంగ్యార్థం అన్నమయ్య విలాసభావంలో కనబడుతుంది.

"జయజయ సర్వేశ" అను నృసింహ కీర్తనలో కూడా అన్నమయ్య 'అహినాయక' శబ్దాన్ని వాడాడు. ప్రస్తుత కీర్తనలో 'అహినాయక శయనం' అంటే అక్కడ 'అహినాయక సింహాసన రాజిత' అన్నాడు.

విష్ణువు అహినాయకుని(ఆదిశేషుడు) మీదే ఎందుకు పడుకొన్నాడనేది ఒక ప్రశ్న. స్వామి పడుకొన్న ఆదిశేషుడు కాలానికి ప్రతీక. శేషమంటే మిగిలినది అని అర్థం. కాలం కూడా ఎప్పుడూ మిగిలే ఉంటుంది. దానికి అంత లేదు. 'అంతంలేని కాలం నా అధీనంలోనే ఉంద'ని చెప్పటానికి స్వామి దానిని వశపరచుకొని దాని మీద శయనిస్తున్నాడు.

ఈ శృంగార కీర్తన వెనుక ఆధ్యాత్మిక వాతావరణం ఉంది. సఖి అనేది ఒక గురువుకు సంకేతం జీవాత్మ నాయిక. పరమాత్మ నాయకుడు. జీవాత్మకి పరమాత్మకి మధ్య సయోధ్య చేసేవాడు గురువు. ఈ కీర్తనలోని సఖి అటువంటి గురువుకి ప్రతీక. ఉత్తమ గురువుకి ఈ ప్రపంచంలో తెలియనిది ఏమీ లేదు. "అతడు బ్రహ్మవేత్త. జిజ్ఞాసువు. అందుకే అతనిని శరణు వేడాలంటో"ంది శ్రీమద్భాగవతం (తస్మాద్ గురుం... 11-3-21). 'స గురుమేవాభిగచ్ఛేత్' (ఉత్తమ గురువును చేరండి) అని ఉపనిషత్తు. అటువంటి గురువుకి సకలం తెలుసునని అన్నమాచార్యుడు 'సకలం హేసఖి జానామి' అని మరోమారు మనకి ప్రబోధిస్తున్నాడు.

లోతును అర్థం చేసుకొన్న వారికి సకలం తెలుస్తుంది. లేదా - కొద్దిపాటి శృంగార భావాలతో తృప్తి పడతారు.

స్వామిని ధరించటం, స్వామిని తెలిపే కస్తూరి బొట్టును ధరించటం, స్వామిని అనుకరిస్తూ చెక్కిట చేయి చేర్చటం - ఇటు వంటి నాయికా చేష్టలన్నీ పరమాత్మనుద్దేశించి జీవుని సకల వ్యవహారాలు ఉండటమనే సంబంధాన్ని తెలుపుతాయి. భగవంతుడి పేరైన తత్‌శబ్దం కూడా వాడటం (తత్ ప్రకట విలాసం) కూడా ఈ కీర్తనలోని ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది. కీర్తనలో దధసేకు బదులు 'ధత్సేఅని యుండబోలు'నని టీటీడీ ప్రచురణలో ఉంది. (5వ సం. - 22కీ)

ఉత్తమ కవితా ప్రపంచంలో పదకవితా పితామహుడు అన్నమయ్య అంటే భావుకులకు వేంకటేశుడి చిరునవ్వుగా తోస్తాడు. ఆ చిరునవ్వు సుగంధాల పూలతోట ఈ కీర్తన.

59. సత్యభామ సరసపు నగవు

సత్యభామ సరసపు నగవు
నిత్యము హరి మదినె నెలవాయె

రుకుమిణి దేవికి రూప యవ్వనికి
సకల విభవముల సౌఖ్యతలు
చికురాంబరమున జెదరిన యలకలు
వికచాబ్జ ముఖము వెయివేలాయ

తొడవుల శ్రీ సతి తొలు మెరుగులమై
నడపుల మురిపెపు నగుమోము
తడయక వారిధి తచ్చిన హరికిని
బడలిక వాపను పరమంబాయ

అనుదినమును నీ యలమేలు మంగ
కనుగవ జంకెన గర్వములు
దినదినంబులును తిరు వేంకటపతి
చనవుల సాబగుల సంపదలాయ

ముఖ్య పదార్థం :

సౌఖ్యతలు	=	సుఖాలు
చికురాంబరము	=	నుదురు (భావార్థం)
అలకలు	=	వెంట్రుకలు
వికచాబ్జ ముఖము	=	వికసించిన పద్మము వంటి ముఖం
వెయివేలాయ	=	లెక్కలేనన్ని
తొడవుల	=	అలంకారాల
శ్రీ సతి	=	లక్ష్మీదేవి
తొలి మెరుగుల	=	మొదటి కాంతుల
మై	=	తోడ
వారిధి	=	సముద్రం

తచ్చిన = ప్రవేశించిన
జంకెన గర్వములు = బెదిరింపు గర్వాలు

భావం :

ఈ కీర్తనలో సత్యభామ, రుక్మిణీదేవి, శ్రీలక్ష్మి, అలమేలుమంగ – అను నలుగురు కథానాయికల విలాస చేష్టలు, వేంకటేశ్వరుడికి సంపదలు ఇచ్చాయని అన్నమయ్య వర్ణిస్తున్నాడు.

సత్యభామ పరిహాసపు నవ్వు, నిత్యం హరి మనస్సులో కదలకుండా అలాగే ఉంది. అందంగా, వయస్సులో ఉన్న రుక్మిణీదేవికి అన్ని సంపదలతోపాటు సుఖాలు (శారీరక, మానసిక) లభిస్తుంటే, నుదుటిపై చెదరిన ముంగురులతో – ఆమె వికసించిన పద్మంలాంటి ముఖం లెక్కలేనన్ని అందాలతో ఉంది. సహజంగా, కాంతిగా ఉన్న అలంకారాలతో, నడకల కులుకులతో ప్రకాశించే శ్రీలక్ష్మి నవ్వు ముఖం, వరాహావతారంలో రాక్షసుడిని చంపి అలసిపోయిన శ్రీహరికి, శ్రమ పోగొట్టింది. ప్రతిరోజూ అలమేలుమంగమ్మ కళ్ల చివర మెరిసే సరసాల బెదిరింపు గర్వాలు వేంకటేశ్వరుడి అనురాగాలలో అందాల సంపదలయ్యాయి.

*****

పేర్లు వేరు వేరు. రూపం మాత్రం ఒక్కటే. సత్యభామ, రుక్మిణీ, శ్రీలక్ష్మి, అలమేలుమంగ – ఇలా పేర్లు వేరు వేరు. అందరూ ఒకటే. లక్ష్మి వేంకటేశ్వరుని వక్షస్థలంలో ఉన్నప్పటికీ, రెండు కళ్లతో ఆయన అందాన్ని పూర్తిగా అనుభవించినప్పటికీ, తృప్తి పడలేదుట. అందుకే ఆయన కుడి ఎడమలలో, ఎప్పుడూ విడిచిపెట్టకుండా ఉండే లక్ష్మీదేవి, భూదేవులుగా మారింది. ఇంకా తృప్తి తీరక, నీలాదేవిగా మారింది. ఇలా మూడు అవతారాలు గ్రహించి, ఆరు కండ్లతో వేంకటేశ్వరుని సౌందర్య రసాయనాన్ని (= అందమనే తృప్తి పరచే పదార్థాన్ని) అనుభవిస్తోందని మన ప్రాచీనుల మాట (శ్రీ వేంకటాచల మహాత్మ్యం 2-2, 3, 4, 5 శ్లో). అమ్మవారికే తృప్తి లేనప్పుడు, వర్ణనలు చేసే కవిగారికి తృప్తి ఎలా ఉంటుంది? అందుకే అలమేలు మంగ ఈ కీర్తనలో నాలుగు రూపాలతో కనిపిస్తుంది.

'సత్యభామ ఏడుపు మా బాగా ఉంటుందని – ఆ ఏడుపు పద్యం రాసిన ముక్కు తిమ్మన ముద్దుముద్దుగా ఏడ్చాడు' అని ఒక ధ్రువపత్రం కూడా మనవాళ్ళు ఇచ్చేశారు. ఆవిడ సరసాల నవ్వును అన్నమయ్య ఈ కీర్తనలో శాశ్వతం చేశాడు.

"వాని సరసము లేని నవ్వేల? వాడు వినని మాటలేల?", "నీ గుణాలు కొనియాడు

కొంటాను, నాముందర సెలవుల నవ్వు నవ్వేని" (అయ్యవారి గుణాలు స్మరిస్తూ నాయికామణి పెదవుల చివరగా దాహంతో నాలుక పిడచకట్టేట్టు ఒక నవ్వు నవ్వింది) అంటూ అన్నమయ్య నాయికలు రకరకాలుగా అయ్యవారి సరసాలను స్మరించుకొంటారు. ఇలా నాయికల నవ్వులను అందంగా రాసే అన్నమయ్య ఈ గీతంలో సత్యభామ నవ్వులో సరసముందన్నాడు. సరసమంటే రుచి, తడి, ప్రేమ, అందం, వికాసం, సారం, ఊట – ఇలా అర్థాలున్నాయి. వీటిల్లో ఏ అర్థాన్ని తీసుకోవాలంటే రసికుడి ఇష్టం. కవులు చెప్పరు. పాఠకులకి వదిలేస్తారు.

మహాప్రళయ సమయంలో పాతాళంలోకి చేరిన భూమిని ఉద్ధరించటానికి శ్రీమహావిష్ణువు సముద్రంలోకి ప్రవేశించాడు. ఆ వేగానికి తట్టుకోలేక సముద్రుడు అలలు అనే చేతులు పైకెత్తి 'నన్ను రక్షించు స్వామీ!' అని వేడుకొన్నాడు. అంతగా సముద్రంలో వేగంగా తిరిగి భూమిని పైకి తీసుకువచ్చాడు. ఆ సమయంలో వరాహావతారంలో ఉన్న స్వామి తెల్లని కోరపై నున్న భూమి – లక్ష్మీదేవి పూసిన కస్తూరి పంకంలా ఉందని పోతన అందంగా రాస్తే – అన్నమయ్య ఇంకో మెట్టు ముందుకు పోయాడు. హిరణ్యాక్షుడితో యుద్ధం చేసిన తర్వాత స్వామికి బడలిక వచ్చిందట. ఆ బడలికను అమ్మవారి నవ్వు పోగొట్టిందని మనోహరంగా రాశాడు.

లక్ష్యం వేంకటేశుడు. మార్గం మధుర భక్తి. మధుర భక్తిలో సరసాలు, నవ్వులు శృంగార సుగంధ ద్రవ్యాలు. వాటిని ఆస్వాదిస్తూ స్వామివారిని ఆత్మకు సన్నిహితం చేసుకోవాలి.

60. క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని

క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయకును నీరాజనం

జలజాక్షి మోమునకు జక్కువ కుచంబులకు
నెలకొన్న కప్పురపు నీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబులకు
నిలువు మాణిక్యముల నీరాజనం

చరణ కిసలయములకు సకియ రంభోరులకు
నిరతమగు ముత్తేల నీరాజనం
అరిది జఘనంబునకు నతివ నిజనాభికిని
నిరతి నానా వర్ణ నీరాజనం

పగటు శ్రీవేంకటేశు పట్టపురాణియై
నెగడు సతి కళలకును నీరాజనం
జగతినలమేల్మంగ చక్కదనములకెల్ల
నిగుడు నిజ శోభనపు నీరాజనం

భావం :

లక్ష్మీదేవి అవతారమైన అలమేల్మంగమ్మకు అన్నమయ్య ఈ కీర్తనలో మంగళ హారతి ఇస్తున్నాడు.

పాలవంటి నీళ్ళు కలిగిని సముద్రం క్షీరాబ్ధి. ఆ పాల సముద్రపు కుమార్తెకి మంగళహారతి. ఎవరిచేత సర్వం చూపబడుతుందో ఆమె లక్ష్మి. అటువంటి గొప్పదైన లక్ష్మికి, పద్మమే ఇల్లుగా కలిగిన దేవికి మంగళ హారతి.

పద్మాల్లాంటి కన్నులు కల లక్ష్మీదేవి ముఖానికి, చక్రవాక పక్షుల్లాంటి గుండ్రని స్తనాలకి, సుఖాన్నిచ్చే కర్పూరపు హారతి. తుమ్మెద వంటి జుట్టుగల అమ్మ కొప్పుకి, చేతులకి పొడుగైన మాణిక్యాల మంగళ హారతి.

శ్రీ వేంకటేశ్వరుని స్నేహితురాలైన లక్ష్మీదేవి చిగురుటాకుల్లాంటి కాళ్లకి, అరటి

చెట్టుల్లాంటి తొడలకి ఆసక్తి కలిగిన ముత్యాలహారతి. అపూర్వమైన పిరుదులకి, స్పష్టమైన బొడ్డుకి అనేక రంగులుండే మంగళ హారతి.

కాంతితో పాటు వ్యాపించే గుణాలు కలిగిన లక్ష్మీదేవి– స్వామి పట్టపురాణి. ఆమె కళలకి మంగళహారతి. అలమేల్మంగ చక్కదనాలకి శుభాలు కలిగించే మంగళ హారతి.

*****

దేవత చుట్టూ తిప్పిన హారతి కాంతిని కళ్లకు అద్దుకోమంటారు. తద్వారా మన లోపల ఉన్న పరంజ్యోతి హత్తుకోవటానికి ప్రయత్నించాలని సందేశం. హారతి దేవత చుట్టూ తిప్పటంలో, 'స్వామీ! కర్పూరంలా నీకోసం జ్వలించిపోతున్న నా మనస్సును నీ చుట్టూ తిప్పుకోవయ్యా' అనే ఉద్దేశం ఉంది.

దేవుని ఒక్కొక్క అవయవంలో నుంచి సృష్టిలోని ఒక్కో విభాగం జన్మించిందని మన వేద గ్రంథాలు చెబుతున్నాయి. ఒక్కో అవయవానికి మంగళ హారతి పడుతున్నామంటే, సృష్టిలోని సర్వ జీవరాశికి శుభం కలగాలనే ఉదాత్తమైన భావన ఉంది.

దేవాతాస్త్రీలను వర్ణించేటప్పుడు జుట్టు మొదలుకొని, పాదాల వరకు వర్ణన గల తరతరాల సంప్రదాయాన్నే అన్నమయ్య ఈ గీతంలో పాటించాడు.

'కామేశ్వర ప్రేమ రత్నమణి ప్రతిపణ స్తనీ' (తన స్తన రత్నాలను అమ్మి, కామేశ్వరుని ప్రేమరత్నం కనుక్కొన్నది) 'కామేశ జ్ఞాత మార్దవోరు ద్వయాన్వితా' (కామేశ్వరునికి మాత్రమే తెలియదగిన సొగసు, మృదుత్వం గల తొడలు కలది) అంటూ పరమ పవిత్రమైన లలితా సహస్రనామాలు మొదలైన వాటిల్లో కూడా అమ్మవారి కుచోరు వర్ణనలు కనబడతాయి.

ఈ వర్ణనల వెనుక ఉన్న అసలు విషయం ఇది. శరీరం అంటే శ్రీచక్రం. బిందువు– బ్రహ్మ రంధ్రం. త్రికోణం – తల ముందు భాగం. అష్టారం – లలాటం. అంతర్దశారం– భూ మధ్యం. బహిర్దశారం – కంఠం. చతుర్దశారం– హృదయం. నాభి – అష్టదళం. కటి – షోడశ దళం. వృత్తాలు – ఊరువులు. భూపురం – పాదాలు. మహాకవుల దేవీ శరీరవర్ణనల్లో ఇటువంటి శ్రీచక్రార్చన అంతర్గతంగా ఉంటుంది.

సిద్ధిని కలిగించే బీజాక్షరాలను రచనల్లో పొదగటం మహాకవుల ప్రత్యేకత. వాల్మీకి తన రామాయణంలో గాయత్రీ మంత్రం బీజాక్షరాలను నిక్షేపించాడు. మొత్తం మంత్రం ఎక్కడ పుడుతుందో దానిని బీజం అంటారు. 'ఈం' లక్ష్మీ బీజాక్షరం. ఆ 'ఈం' కారాన్ని 'నీరాజనం' అనే పదంలో అన్నమయ్య వచ్చేట్టు రాసి, మనందరినీ ధన్యులుగా చేశాడు.

దేవతలు, రాక్షసులు చేసిన పాల సముద్రమథనంలో లక్ష్మీదేవి పుట్టింది. అందువల్ల సముద్రానికి కూతురుగా – క్షీరాబ్ధి కన్యకగా పేరుపొందింది.

అన్నమయ్య 'పగటు' (= కాంతి) అనే పదాన్ని అమ్మవారికి కావాలనే విశేషణంగా వాడాడు. ఆమె చిరునవ్వు కాంతి దుఃఖాన్ని తొలగిస్తుంది. సృష్టిని వెలిగిస్తుంది అన్నది భాగవతం. సూర్య చంద్రుల కాంతులను చిరు దీపాలుగా భావించే అమ్మకు 'పగటు' అనే విశేషణం సార్థకం.

సాధారణంగా రాజు – రాణిని చూసి నచ్చితే తన పట్టపురాణిగా చేసుకొంటాడు. కాని లక్ష్మీదేవి అనే రాణి విష్ణుమూర్తి అనే రాజుగారిని చూసి 'ఇతడే నా భర్త అని ఎంచుకొని, అతని పట్టపురాణి అయింది. 'తమితో శ్రీవేంకటేశు తానె వచ్చి పెండ్లాడె' అని అన్నమయ్య ఇదే విషయాన్ని 'చూడరమ్మ' కీర్తనలో కూడా చెప్పాడు.

లక్ష్మీదేవికి భర్తగారైన విష్ణుమూర్తి అంటే చాలా ప్రేమ. అందుకే తన భక్తుల దగ్గర ఎక్కువసేపు. ఉండలేక, మాటి మాటికి భర్త దగ్గరకు వచ్చేస్తుంటుంది. ఇది తెలియని వాళ్ళు లక్ష్మీదేవిని చంచల అన్నారు. ఇక్కడ భర్తమీద ఉండే ప్రేమ అనే గుణం దోషకారణమయిందని శ్రీమన్నారాయణీయంలో భట్టాత్రి చమత్కారం (అనువాదం తాడేపల్లి పతంజలి. పే 5). అందుకే ఆమె చంచల కాదు. సత్కళావతి అని చెబుతూ, ఆ సత్కళలకు అన్నమయ్య మంగళ హారతి ఇచ్చాడు. శుభం భూయాత్.

ఆప్త వాక్యం

మీ అన్నమయ్య అన్నమాట చదివాను. ఆనందించాననటం పునరుక్తి.తాళ్లపాక కవుల కావ్య రచనల్లోని కొత్త విశేషాలను మీరు చక్కగా చెప్పగలుగుతున్నారు.'ముఖే ముఖేసరస్వతి' అనిపించింది.ఒకమాట.సమర్థకాలైన ప్రయోగాంతరాలను పరిశీలించి వెడ్డువెట్టు.... వంటి పదాలకు మరింత తృప్తికరమైన అన్వయార్థాలను భావించదగునేమో యోచించండి.

-ఆచార్య వేటూరి ఆనందమూర్తి (ప్రముఖ అన్నమయ్య పరిశోధకులు)

కీర్తనల్లో అన్నమయ్య వాడిన ఎన్నో అచ్చతెలుగు పదాలు నేడు ప్రచారంలో లేనందున ఆ పాటల్ని అర్థం చేసికొనేందుకు ప్రత్యేకమైన కృషి కావాలి.ఈ విషయంలో డా.తాడేపల్లి పతంజలి కృషి మెచ్చుకోదగింది.సాక్షి దినపత్రిక ఆదివారం అనుబంధం(ఫన్‌డే) లో అన్నమయ్య పాటల అర్థం, పరమార్థం వివరిస్తున్న వారివ్యాస పరంపర ప్రతి ఒక్కరు తప్పక చదవాలి.

-వసుంధర(ప్రముఖ కథారచయిత), అక్షరజాలం బ్లాగు నుండి

నాయనా! పతంజలీ! గొప్ప సేవ చేస్తున్నావు.సంతోషం

-ఆచార్య పప్పు వేణుగోపాలరావు

(ప్రముఖ అన్నమయ్య పరిశోధకులు) 28-02-2010

రట్టడి అంటే శబ్దమా?

అక్టోబర్ 31 సంచికలోని అన్నమయ్య అన్నమయ్య మాటగురించి ఈ ఉత్తరం రాస్తున్నాను.రట్టడి అంటే పెద్దధ్వని అని శబ్దరత్నాకరంలోగాని, సూర్యరాయాంధ్ర నిఘంటువులోగాని లేదు.సూర్యరాయాంధ్ర నిఘంటువు శేషమైన శ్రీహరి నిఘంటువులో ఆ శబ్దమే లేదు. మొదటి రెండింటిలో ఆశబ్దానికిచ్చిన అర్థాలు నింద్యము.(శ.ర.) గ్రామాధికారి, నింద, ఆగ్రహము, నింద్యుడు, నింద్యము, దుష్టుడు, దుష్టురాలు, వ్యర్థము(సూ). సంకీర్తనలో నింద్యము అనే అర్థమే సరిపోతుంది. తిట్టదగిన కోడలా అని. రట్టు అంటే శబ్దమన్న అర్థమే లేదు. ప్రజల వద్ద పన్నులు వసూలు చేయటానికి శబ్దమన్న అర్థమే లేదు. ప్రజల వద్ద పన్నులు వసూలు చేయటానికి నియమింపబడిన ఉద్యోగిని రట్టడి అనేవారట. గ్రామాధికారిలో ఈ విషయం సూచింపబడింది.

నా ఉద్దేశం: రట్టుచేసి, నిందించి డబ్బు వసూలు చేయువాడు రట్టడి అయినాడని, ఈ పదం పూర్వ రూపం 'రాఠోడ్' అనీ, అందులోంచే రెడ్డి (అప్పటి ఉద్యోగము, నేటి కులము) ఉద్భవించిందనీ విన్నాను. చదువుకొన్నవారు నిర్ధారించిన విషయమది.

-శ్రీ వి.ఎ.కె.రంగారావు (ప్రముఖ అన్నమయ్య పరిశోధకులు)

రచయిత స్పందన

పెద్దలు వి.ఎ.కె.రంగారావుగారి స్పందనకు ధన్యవాదములు.'రట్టడి' అంటే పెద్దధ్వని అనే అర్థం ప్రముఖ పండితులు పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి రచించిన ఆంధ్ర పదకోశము (పే.359)లో ఉంది. రట్టు అంటే 'రట్టడి' అనే అర్థం కూడ అదే పేజీలో ఉంది.(ప్రచురణ సం.1981; ప్రథమ ముద్రణ) రంగారావుగారు రట్టడికిచ్చిన వివరణను కాదనే సాహసం నాకు లేదుకాని, సందర్భోచితంగా 'పెద్దధ్వని' అనే అర్థం బాగుందనిపించి ప్రామాణికమైననిఘంటువునుంచి , ఆ అర్థాన్ని స్వీకరించానని మాత్రమే మనవి చేసుకొంటున్నాను.

-డా॥ తాడేపల్లి పతంజలి

(నవంబర్21,2010 సాక్షి -ఫన్‌డే స్పందనలో ప్రచురితం)

పతంజలిగారూ! మీ వ్యాసం(కంటి శుక్రవారం) బాగుంది.

-శ్రీ గొల్లపూడి మారుతీరావు (ప్రముఖ రచయిత, నటుడు)

06-06-2010

మీరు సాక్షి ద్వారా అందించిన అన్నమయ్య సంకీర్తన షష్టి విపుల వ్యాఖ్యానం అపారమైన జ్ఞానాన్ని అందించింది.కృతజ్ఞ తలు. మీరన్నట్లు ఆ స్వామియే మీ చేత రాయించుకొన్నాడు. మీ జన్మ ధన్యమైనదని నాభావన. అన్నమయ్య పదంలోని అనంతమైన శక్తి మీ అర్థాల్లో నాకు సాక్షాత్కారమైంది. మీ జ్ఞానాన్ని అందరికి పంచి దానిని నిధానంగా మార్చారు. మరోమారు ధన్యవాదములు-

-శ్రీ జి.బి.శంకరరావు, (ప్రముఖ అన్నమయ్య పరిశోధకులు)

Regarding your series on Annamaiah in Funday, I am reading it with keen interest.You are covering all the related matters in a simple way. It is

very difficult to relate a poem of those times with the present. You are also highlighting certain elements very sensitively. Todays people dont know the meaning of many words and practices. I wonder how you are explaining them. They are not mere dictionary meanings.I hope many readers are following it keenly like me.In fact, I am not competent to speak about such a topic. Nevertheless, I will try to express my feelings now and then.Thank you for giving us such a nice feature

-**Dr.K.V.Ramanarao,** (story writer)

Dear Mr Patanjali Garu,

I have read some of the explanations to Annamaiah' kirtanas in Funday. Firstly we congratulate you and also the catalyst and enabler ' Puduri Rajareddy , our beloved Ram and the management of Sakhshi . It is an excellent analysis and very high intellectual and with Bhavaprapti . We are greatly indebted to you. I am a kannadiga with a passion for Telugu and more so for Karnatak sangeet.I wish and pray to Almighthy to extend your narration to other kirtanas of Annamaiah garu and try to do for other Pitamahas like Purandara dasa , Kanaka das etc. I request you to send me whether you have composed these narrations in a book form and if so the name of the book and its avaialability. Also keen to know your other publications etc.Once again we are grateful and indebted to you for an excellent narratory skills and with a spirit of the composer itself. May the Almighty gives you enough spirit , courage for extending this voyage to other streams of our other Samrats of our culture and music.

With humble gratitude.

Dwarakaanatha aacarya
09177771574

(ఇలా ఎంతో మంది ఆప్తులు, శ్రేయోభిలాషులు,పెద్దలు అన్నమయ్య అన్నమాట ప్రచురణ సమయంలోను, తర్వాత –ఆప్త వాక్యాలు పంపించారు. సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి వంటి పెద్దలు ముఖతః, ఫోనులోను. అశీర్వదించారు. అందరికి పేరు పేరునా ధన్యవాదములు. స్థలాభావం వలన అందరి అభిప్రాయాలు ప్రచురించలేకపోతున్నందుకు మన్నించండి.

–డా॥ తాడేపల్లి పతంజలి)

అన్నమయ్య అన్నమాట

ఏదైన సమాచారం కొరకు